

'ప్రజల రుణం తీర్చుకునేందుకు ఎంతటి కృషికైనా సిద్ధంగా ఉండాలి'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16 వెల: ₹ 5.50

సంపుటి: 18 సంచిక: 108

బుధవారం 9-7-2025

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL




అతడు వదిలి వెళ్లిన పాఠాలు

దర్శకుడు గురుదత్ శత జయంతి సందర్భంగా ప్రత్యేక కథనం -13లో



సబలెంకా శ్రమించి...

వింబుల్డన్ టోర్నీలో మూడోసారి సెమీస్ చేరిన బెలారస్ స్టార్ -14లో



ఉగ్రవాదంపై ఒక్కటే మాట

'ఉగ్రవాదాన్ని సహించబోం. ఆ భూతంపై పోరులో మాది ఒకే బాట, ఒకే మాట' అని భారత్, బ్రెజిల్ బ్రిక్స్ వేదికగా ప్రకటించాయి.

వివరాలు 6లో ▸



మహిళలకు 35% రిజర్వేషన్

బిహార్‌లో ప్రభుత్వ ఉద్యోగాలన్నింటిలోనూ మహిళలకు 35% రిజర్వేషన్లు కల్పించనున్నట్లు సీఎం నితీశ్ ప్రకటించారు.

వివరాలు 6లో ▸



స్కూల్ వ్యాన్‌ను ఢీకొట్టిన రైలు

తమిళనాడులో పట్టాలు దాటుతున్న స్కూల్ బస్సును రైలు ఢీకొన్న ఘటనలో ముగ్గురు విద్యార్థులు చనిపోయారు.

వివరాలు 6లో ▸



ధ్వంసం చేస్తూ..

స్వదేశీ పరిజ్ఞానంతో దేశవాళీ శతఘ్నిని తయారుచేసినట్లు రక్షణ పరిశోధనాభివృద్ధి సంస్థ (డీఆర్‌డీవో) ప్రకటించింది.

వివరాలు 6లో ▸

న్యూస్‌రీల్

ఫరఖ్ పడింది...



తెలంగాణలో పాఠశాల విద్య కొంత మెరుగు పడిందని రాష్ట్రీయ సర్వేక్షణ్-పరఖ్ -2024 (న్యాస్) జాతీయ సర్వేలో తేలింది. ప్రాథమిక విద్యలో 2021లో దేశంలో 36వ స్థానంలో ఉన్న తెలంగాణ, ఇప్పుడు 26వ స్థానానికి ఎగబాకింది.

- వివరాలు 12లో▶

కోర్టులకు బాంబు బెదిరింపు



'ట్యూస్‌డే బ్లాస్ట్: నాలుగు ఆర్డీఎక్స్ బేస్డ్ ఇంప్రూవైజ్డ్ ఎక్స్‌ప్లోజివ్ డివైజ్‌లు సివిల్ కోర్టులో, జడ్జీల చాంబర్స్‌లో, జింఖానా క్లబ్‌లో పెట్టాం' అంటూ తెల్లవారుజామున వచ్చిన ఈ-మెయిల్ పోలీసులను ఉరుకులు పరుగులు పెట్టించింది.

- వివరాలు 3లో▶

కోటా పెంచండి

యూరియా సరఫరాపై కేంద్రమంత్రి నడ్డాకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వినతి

- యూరియా సకాలంలో సరఫరా కాకపోవడంతో ఇబ్బందులు
- జూలై కోటా ఇప్పటివరకు 29 వేల టన్నులే సరఫరా అయ్యింది
- కేంద్రమంత్రి పీయూష్ గోయల్‌తోనూ భేటీ
- పారిశ్రామిక కారిడార్‌ను ఏరో-డిఫెన్స్ కారిడార్‌గా మంజూరు చేయాలని వినతి



మంగళవారం ఢిల్లీలో కేంద్రమంత్రి నడ్డాతో భేటీ అయిన సీఎం రేవంత్‌రెడ్డి. చిత్రంలో ఎంపీ మల్లు రవి

సాక్షి, న్యూఢిల్లీ

దేశీయంగా ఉత్పత్తి అయిన యూరియా కోటా పెంచాలని కేంద్ర ఆరోగ్య, సంక్షేమ, రసాయనాల శాఖ మంత్రి జేపీ నడ్డాకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. తెలంగాణ అవసరాలకు కేటాయించిన యూరియాను సకాలంలో సరఫరా చేయాలని కోరారు. రెండురోజుల పర్యటనలో భాగంగా ఢిల్లీలో ఉన్న సీఎం.. మంగళవారం నడ్డాతో పాటు మరో కేంద్రమంత్రి పీయూష్ గోయల్‌తో వేర్వేరుగా వారి అధికారిక నివాసాల్లో భేటీ అయ్యారు. ఎంపీలు మల్లు రవి, చామల కిరణ్‌కుమార్ రెడ్డి, ప్రభుత్వ సలహాదారు (క్రీడలు) ఏపీ జితేందర్ రెడ్డి, ముఖ్యమంత్రి ప్రత్యేక కార్యదర్శి అజిత్‌రెడ్డి, కేంద్ర పథకాల సమన్వయ కార్యదర్శి గౌరవ్ ఉప్పల్, వ్యవసాయ శాఖ కార్యదర్శి రఘునందన్‌రావు ఆయన వెంట ఉన్నారు. కాగా యూరియా, ఏరో-డిఫెన్స్ కారిడార్, వరంగల్ విమానాశ్రయానికి ఆర్థిక సహాయం వంటి అంశాలపై ఇద్దరు మంత్రులతో వేర్వేరుగా సీఎం చర్చించారు.

రైల్వే రేక్‌లు పెంచండి..

రాష్ట్రంలో ప్రాజెక్టులకు నీరు వచ్చి, సాగు పనులు జోరుగా సాగుతున్నందున యూరియా సరఫరాలో ఆటంకాలు తలెత్తకుండా చూడాలని కేంద్ర మంత్రి నడ్డాను రేవంత్ కోరారు. వర్షాకాలం సీజన్‌కు సంబంధించి ఏప్రిల్-జూన్ మాసాల మధ్య 5 లక్షల మెట్రిక్ టన్నులకు గాను కేవలం 3.07 లక్షల మెట్రిక్ టన్నులు మాత్రమే సరఫరా చేశారని తెలిపారు. జూలైలో దేశీయంగా ఉత్పత్తి అయిన యూరియా 63 వేల టన్నులు, విదేశాల నుంచి దిగుమతి అయిన యూరియా 97 వేల మెట్రిక్ టన్నులు రాష్ట్రానికి సరఫరా చేయాల్సి ఉండగా.. కేవలం 29 వేల మెట్రిక్ టన్నుల యూరియా మాత్రమే సరఫరా చేయడం వలన రైతులు ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. దేశీయంగా ఉత్పత్తి అవుతున్న యూరియా కోటాను పెంచాలని కోరారు. యూరియా సరఫరాకు

మిగతా 12వ పేజీలో ▶

బోధకులు లేరు.. రోగులు ఉండరు!

రాష్ట్రంలోని పలు ప్రైవేటు వైద్య కళాశాలల్లో అధ్వాన పరిస్థితులు

- విద్యార్థుల నుంచి రూ. కోట్లలో ఫీజులు గుంజుతున్నా కక్కుర్తి.. ఇంటర్న్‌షిప్ చేసే విద్యార్థులకు స్టైపెండ్ ఎగ్గొడుతున్న వైనం
- ఆరోగ్య విశ్వవిద్యాలయ ఆకస్మిక తనిఖీల్లో విస్తుగొలిపే వాస్తవాలు
- 8 కళాశాలల్లో నిబంధనల ఉల్లంఘన.. వాటిలో నాలుగింటిలో మరీ అధ్వానం
- చల్మెడ, ఎంఎన్ఆర్, రాజరాజేశ్వర, మహేశ్వరి కాలేజీలకు షోకాజ్ నోటీసులు

2 లో



రాజరాజేశ్వర బోధనాస్పత్రిలో రోగులు లేక ఖాళీగా ఉన్న బెడ్లు

చర్చ జరగాల్సింది అసెంబ్లీలో..



- అక్కడ లెక్కలతో సహా అన్నీ వివరిస్తాం
- ప్రెస్‌క్లబ్‌కు వచ్చి సవాల్ అంటే ఎట్లా?
- సీఎం సవాల్ విసిరింది పెద్దమనిషి కేసీఆర్‌కు

12లో

డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

వైఎస్సార్ పేరుతో అభ్యుదయ రైతులకు అవార్డులు

10 లో

- అందుకోసం వైఎస్సార్ ఫౌండేషన్ ఏర్పాటుచేసే యోచన.. వైఎస్సార్ వచ్చే వర్ధంతి నాటికి ఫౌండేషన్ ఏర్పాటు
- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క వెల్లడి
- దివంగత సీఎంను స్మరించుకున్న కాంగ్రెస్ నేతలు

ఎమర్జెన్సీని తలపించేలా..

సీఎం రేవంత్‌రెడ్డి పాలనపై కేటీఆర్ ఫైర్

- కాంగ్రెస్ పాలన ఆనాటి ఎమర్జెన్సీని తలపిస్తోంది
- రాష్ట్రంలో చంద్రబాబు చెప్పినట్టు కోవర్టు పాలన సాగిస్తున్నాడు.. ఆయనకు రచ్చ తప్ప చర్చ చేతకాదని తేలిపోయిందని ఎద్దేవా
- ప్రెస్‌క్లబ్‌లో సీఎంకు కుర్చీ వేసి వేచి చూసిన కేటీఆర్

12 లో



నైపుణ్యమే 'ఉన్నతం'..!

- ఉన్నత విద్యలో ఈ ఏడాది నుంచి కీలక మార్పులు
- పల్లె నుంచి పట్నం దాకా విద్యార్థులకు నైపుణ్య ప్రణాళిక
- ఓపెన్ నాలెడ్జ్ సెంటర్‌గా ఉన్నత విద్యామండలి వెబ్‌సైట్
- ఉన్నత విద్యామండలి చైర్మన్ బాలకిష్టారెడ్డి

2 లో

మళ్లీ మొబైల్ బిల్లుల మోత!

- ఈసారి 12% వరకు టారిఫ్‌లు అప్
- డేటా వినియోగం ఆధారంగా బహుళ స్థాయిల్లో పెంపు
- ఈ ఏడాది ఆఖరుకి అమలు

15 లో

పోషకాహార లోపాన్ని ఏఐ పట్టేస్తుంది

- పిల్లల ఎత్తు, బరువునూ ఇట్టే కొలుస్తుంది
- ఆరోగ్య సమస్యను ముందే గుర్తించే అవకాశం
- కచ్చితత్వంతో సత్ఫలితాలిస్తున్న ప్రాజెక్టులు
- హెల్త్‌కేర్ రంగాన్ని మారుస్తున్న సాంకేతికత

- వివరాలు 2లో▶










క్లుప్తంగా...

'నవోదయ' నోటిఫికేషన్‌పై వివరణ ఇవ్వండి

కేంద్ర ప్రభుత్వాన్ని ఆదేశించిన హైకోర్టు



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో జిల్లాకో నవోదయ పాఠశాలను కేంద్రం ఏర్పాటు చేసేలా ఆదేశించాలంటూ బీఆర్‌ఎస్ మాజీ ఎంపీ బి.వినోద్‌కుమార్ దాఖలు చేసిన పిల్‌పై వివరణ ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది. తదుపరి విచారణను వారంపాటు వాయిదా వేసింది. ఈ పిటిషన్‌పై తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సుజోయ్ పాల్, జస్టిస్ రేణుకా యారా ధర్మాసనం మంగళవారం విచారణ చేపట్టగా పిటిషనర్ తరఫున మాజీ ఏఏజీ రామచందర్‌రావు వాదించారు. రాష్ట్రంలో ప్రస్తుతం 9 నవోదయ విద్యాలయాలే పనిచేస్తున్నాయని.. మరో 7 విద్యాలయాల ఏర్పాటుకు కేంద్రం ఆమోదించినా పూర్తిస్థాయిలో అందుబాటులోకి రాలేదన్నారు. ఫలితంగా నవోదయ విద్యాలయ సమితి 2026–27 విద్యాసంవత్సరానికి విద్యాలయాల్లో 6వ తరగతికి ప్రవేశాల కోసం రాష్ట్రాలవారీగా ఇచ్చిన నోటిఫికేషన్‌లో తెలంగాణకు సంబంధించి 9 పాఠశాలలనే పేర్కొందని నివేదించారు. దీనివల్ల రాష్ట్రం 560 సీట్లు కోల్పోయిందన్నారు. ఈ నేపథ్యంలో తెలంగాణకు కొత్తగా మంజూరు చేసిన 7 విద్యాలయాల్లోనూ ప్రవేశాలకు అవకాశం కల్పిస్తూ కొత్త నోటిఫికేషన్ ఇచ్చేలా ఆదేశించాలని కోరారు.

ట్రాన్స్‌కో జేఎండీగా కిషన్



సాక్షి, హైదరాబాద్: తెలంగాణ విద్యుత్ సరఫరా సంస్థ (టీజీ ట్రాన్స్‌కో) జేఎండీగా బోనాల కిషన్‌ను ప్రభుత్వం నియమించింది. ప్రస్తుతం ఈ పోస్టు ఖాళీగా ఉంది. కిషన్ ఇప్పటి వరకూ వరంగల్‌లో అడిషనల్ డీసీపీగా పనిచేశారు. గతంలో సీఐగా ఉన్నప్పుడు ట్రాన్స్‌కోలో విజిలెన్స్ విభాగంలో పని చేసిన అనుభవం కూడా ఆయనకు ఉంది. కిషన్‌ది కరీంనగర్ జిల్లా. తాను ఆసక్తితోనే ఈ పోస్టును కోరుకున్నానని, త్వరలో బాధ్యతలు చేపడతానని ఆయన 'సాక్షి'కి తెలిపారు.

వ్యవసాయ వర్సిటీలో డిప్లొమా కోర్సుల కౌన్సెలింగ్ ప్రారంభం

సాక్షి, హైదరాబాద్: రాజేంద్రనగర్‌లోని ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిధిలో 2025–26 విద్యా సంవత్సరానికి సంబంధించిన వివిధ డిప్లొమా కోర్సుల్లో ప్రవేశాలకు సంబంధించిన కౌన్సెలింగ్ మంగళవారం ప్రారంభమైంది. మొదటి సీటు కేటాయింపు పత్రాన్ని రిజిస్ట్రార్ జీఈసీహెచ్ విద్యాసాగర్.. శ్రీవర్ధన్ అనే విద్యార్థికి అందజేశారు. కార్యక్రమంలో డీన్ ఆఫ్ అగ్రికల్చర్, డైరెక్టర్ ఆఫ్ పాలిటెక్నిక్ ఝాన్సీరాణి, డీన్ ఆఫ్ పీజీ స్టడీస్ కేబీ ఈశ్వరి, డీన్ ఆఫ్ అగ్రికల్చర్ ఇంజనీరింగ్ కేవీ రమణారావు, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ మల్లారెడ్డి, ఆఫీసర్ ఆన్ స్పెషల్ డ్యూటీ శ్రవణ్ కుమార్ పాల్గొన్నారు.

ఇదండీ సంగతి



టెక్సాస్‌లో వరదలొచ్చాయని, పుతిన్ మాట వినడం లేదనే కోపంతో ఇతర దేశాలపై సుంకాలు విధించడం కరెక్ట్ కాదేమో సార్!


సాక్షి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షి బదులుగా ఇతర దినపత్రికలు వేస్తున్నా.. మా టోల్ ఫ్రీ నెంబర్‌కు ఉ. 7.00 గం.ల నుండి రా. 8.00 గం.ల లోపు తెలుపగలరు. వెంటనే తగిన చర్యలు తీసుకుంటాం.
టోల్ ఫ్రీ నెం
1800 425 9899

పోషకాహార లోపాన్ని.. ఏఐ పట్టేస్తుంది

- పిల్లల ఎత్తు, బరువునూ ఇట్టే కొలుస్తుంది
- ఆరోగ్య సమస్యను ముందే గుర్తించే అవకాశం
- కచ్చితత్వంతో సత్ఫలితాలిస్తున్న ప్రాజెక్టులు
- హెల్త్‌కేర్ రంగాన్ని మారుస్తున్న సాంకేతికత

దేశంలో అయిదేళ్లలోపు పిల్లల్లో 50 శాతంపైగా పోషకాహార లోపంతో బాధపడుతున్నారు. బిడ్డ పుట్టిన తొలి ఆరు వారాలు కీలక సమయం. చాలా మంది శిశువులకు ఈ సమయంలో ఆరోగ్య సంబంధ తనిఖీలు చాలా తక్కువగా ఉంటున్నాయి. ముఖ్యంగా గ్రామీణ, పేదలుండే ప్రాంతాలలో పరిస్థితి ఇంకా తీవ్రంగా ఉంది. ఎదుగుతున్న తీరు, ఎత్తుకు తగ్గ బరువు ఉన్నదీ లేనిదీ సరైన సమయంలో గుర్తించి సమస్యను పరిష్కరించలేకపోవడంతో శిశువులు పోషకాహార లోపం బారిన పడుతున్నారు. దీనికి విరుగుడుగా పలు సంస్థలు కృత్రిమ మేధ (ఏఐ) ఆధారిత పరిష్కారాలతో రంగంలోకి దిగాయి. వీటిలో ఐఐఐటీ హైదరాబాద్ కూడా ఉంది. ఈ పైలట్ ప్రాజెక్టులు విజయవంతమై, పూర్తి స్థాయిలో కార్యరూపంలోకి వస్తే ఆరోగ్య రంగంలో పెద్ద అడుగు పడినట్టే.

\- సాక్షి, స్పెషల్ డెస్క్



శిశువులు పుట్టినప్పుడు 2.5 కిలోల కంటే తక్కువ బరువు ఉండటం.. బాల్యంలో అత్యంత తీవ్రమైన ఆరోగ్య సమస్యల్లో ఒకటిగా పరిగణిస్తారు. ఈ శిశువులు ఎదుగుదల నిలిచిపోవడం, తరచుగా ఇన్ఫెక్షన్లు, ప్రాణాంతక పోషకాహార లోపం వంటి సమస్యలను ఎదుర్కొంటున్నారు. వీరిలో కేలరీల లోపం వల్ల సన్నబడడం; ప్రొటీన్ లోపం వల్ల కాళ్లు, పాదాల్లో వాపు వంటి సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. తద్వారా కాలేయం దెబ్బతినడం, రోగనిరోధక శక్తిని కోల్పోతున్నారు. ఈ సమస్యలను గుర్తించడం ఆలస్యం అయితే ప్రాణాలకే ప్రమాదం. శిశువు పుట్టిన మొదటి ఆరు వారాలలో తరచూ పర్యవేక్షణ చేపట్టడం వల్ల సమస్య ఏదైనా ఉంటే.. ఆలస్యం కాకముందే సరిచేయడానికి అవకాశం ఉంటుంది. ఇందుకు ఏఐ తన వంతు సాయం చేస్తోంది.

ఐఐఐటీ హైదరాబాద్ సైతం..

నవజాత శిశువులు మొదలుకుని అయిదేళ్లలోపు పిల్లల వరకు ఏఐ సాంకేతిక సాయంతో బరువు, పొడవు, ఎత్తు.. అలాగే తల, ఛాతీ కొలతల ఆధారంగా వారి ఆరోగ్య స్థితిని అంచనా వేసి.. వారిని ఆరోగ్యవంతంగా ఎదిగేలా చేయాలన్నది ఈ ప్రాజెక్టుల లక్ష్యం. పిల్లల ఎత్తు, బరువు కొలిచేందుకు సంప్రదాయ సాధనాల అవసరం లేకుండా తక్కువ సమయంలో, కచ్చిత సమాచారాన్ని అందించడంలో ఈ ప్రాజెక్టులు సత్ఫలితాలను ఇస్తున్నాయి. ప్రభుత్వం తరఫున క్షేత్ర స్థాయిలో పనిచేసే హెల్త్ వర్కర్లకు పని భారం సైతం తగ్గుతుండడం కలిసి వచ్చే అంశం. వాధ్వానీ ఇన్‌స్టిట్యూట్ ఫర్ ఏఐ, రెవల్యూషనైజ్, వెల్ట్ హంగర్ లైఫ్ / మైక్రోసాఫ్ట్‌తో పాటు ఐఐఐటీ హైదరాబాద్ సైతం ఈ ప్రాజెక్టులు చేపట్టిన సంస్థల జాబితాలో ఉంది.

శిశు మాపన్: వాధ్వానీ ఇన్‌స్టిట్యూట్ ఫర్ ఏఐ శాస్త్రవేత్తలు ఈ యాప్‌ను రూపొందించారు. 42 రోజుల లోపు వయసున్న నవజాత శిశువుల బరువు, పొడవు, తల, ఛాతీ చుట్టుకొలతను ఈ యాప్ ద్వారా తెలుసుకుంటారు. ఈ యాప్‌ను ఇంటర్నెట్ లేకపోయినా వాడొచ్చు. శిశువును ఓ వస్త్రంపై పడుకోబెట్టి, పక్కన స్కేల్ ఉంచి షార్ట్ వీడియో తీస్తే చాలు.. వివరాలు యాప్‌లో ప్రత్యక్షం అయిపోతాయి. సాధారణ ఆండ్రాయిడ్ ఫోన్, తక్కువ వెలుతురులోనూ ఇది పనిచేస్తుంది. డామన్–డయ్యూలో 2024 నుంచి ఈ పైలట్ ప్రాజెక్టు కొనసాగుతోంది. ఇప్పటికే 30,000 పైచిలుకు పిల్లల కొలతలను తీసుకున్నారు. గృహ – ఆధారిత నవజాత శిశువుల సంరక్షణ కార్యక్రమంలో భాగంగా ఆశ కార్యకర్తలు ఇంటికే వచ్చి పిల్లల ఎదుగుదలను పర్యవేక్షిస్తారు. పోషకాహార లోపం గుర్తిస్తే ప్రభుత్వ పోషకాహార కార్యక్రమాలతో తల్లులను అనుసంధానిస్తారు.

ఎంపీఏపీ: పోషకాహార లోపం అంచనా, కార్యాచరణ ప్రణాళిక పేరుతో రెవల్యూషనైజ్ అనే కంపెనీ రాజస్తాన్‌లో చేపట్టిన పైలట్ ప్రాజెక్టులో భాగంగా 6 నెలల నుంచి అయిదేళ్ల వయసున్న పిల్లల ఎత్తును అంచనా వేయడానికి, పోషకాహారలోప ప్రమాదాలను గుర్తించడానికి స్మార్ట్‌ఫోన్‌తో తీసిన ఫొటోలను ఉపయోగిస్తారు. ఎత్తు, పోషకాహార స్థాయికి తగ్గట్టుగా ఏ ఆహారం తీసుకోవాలో సూచిస్తారు. దీనికి కూడా ఇంటర్నెట్ అవసరం లేదు. ఆరోగ్య కార్యకర్తలు మారుమూల పల్లెల్లో కూడా వెళ్లి పోషకాహార లోపంతో బాధపడే పిల్లలను గుర్తించేందుకు ఈ యాప్ సాయపడుతుంది. ప్రభుత్వ వైద్య శాఖలకు ఈ యాప్‌ను ఉచితంగా అందజేస్తామని కంపెనీ చెబుతోంది.

ఐఐఐటీ–హైదరాబాద్: నవజాత శిశువులతో పాటు అయిదేళ్లలోపు పిల్లలు.. వెయింగ్ మెషీన్, హైట్ చార్టుల వద్ద ఉన్నప్పుడు ఫొటోలు తీస్తారు. వాటిని యాప్‌లో అప్‌లోడ్ చేస్తారు. ఆ ఎత్తు, బరువులు ఆరోగ్యకరమైనవి ఉన్నాయా లేదా అని విశ్లేషిస్తారు. ఈ యాప్‌ను ఐ–సాక్షమ్ సహకారంతో తెలంగాణలో పరీక్షిస్తోంది. ప్రొటోటైప్ ప్రస్తుతం పైలట్ దశలో ఉంది.



వెల్ట్ హంగర్ లైఫ్ /మైక్రోసాఫ్ట్: ఈ సంస్థలు అభివృద్ధి చేసిన చైల్డ్ గ్రోత్ మానిటర్ ఐదు సంవత్సరాల కంటే తక్కువ వయసున్న పిల్లల ఎత్తు, బరువు, శరీర కొలతల కోసం 3డీ ఇన్‌ఫ్రారెడ్ కెమెరాలను ఉపయోగిస్తుంది. మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, రాజస్తాన్‌లో ఈ పైలట్ ప్రాజెక్టు చేపట్టారు. ఇప్పటికే 10,000కు పైచిలుకు స్కాన్స్ పూర్తి చేశారు. గ్రోత్ మానిటర్ ఫలితాల్లో కచ్చితత్వం ఉంది. హార్డ్‌వేర్ ఖరీదు కావడం, సెన్సార్లపై ఆధారపడి పని చేస్తుండడంతో క్షేత్ర స్థాయిలో వినియోగాన్ని పరిమితం చేస్తోంది.

నైపుణ్యమే 'ఉన్నత'ం!

ఉన్నత విద్యలో ఈ ఏడాది నుంచి కీలక మార్పులు

- పల్లె నుంచి పట్నం దాకా విద్యార్థులకు నైపుణ్య ప్రణాళిక
- ఓపెన్ నాలెడ్జ్ సెంటర్‌గా ఉన్నత విద్యామండలి వెబ్‌సైట్
- విద్యార్థులకు అందుబాటులోకి 13,500 వెబ్ జర్నల్స్
- బ్రిటన్, ఆస్ట్రేలియా, జర్మనీ, ఫ్రాన్స్ నిపుణులతో సమన్వయం
- ఇంజనీరింగ్‌లో కోర్ గ్రూపులకే ఇక భవిష్యత్
- ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ వి.బాలకిష్టారెడ్డి



సాక్షి, హైదరాబాద్: ఇంజనీరింగ్, డిగ్రీ సహా ఉన్నత విద్యలో ఈ విద్యా సంవత్సరం నుంచి గుణాత్మక మార్పులు చోటుచేసుకోబోతున్నాయని ఉన్నత విద్యా మండలి చైర్మన్ ప్రొఫెసర్ వి బాలకిష్టారెడ్డి తెలిపారు. గ్రామీణ ప్రాంతాల నుంచి రాజధాని వరకు ప్రతి విద్యార్థికి నైపుణ్యంతో కూడిన మాడ్యూల్స్ అందించబోతున్నట్టు చెప్పారు. సెల్‌ఫోన్‌కు కనెక్ట్ అయినా అంతర్జాతీయ విద్యా ప్రమాణాలు అందిపుచ్చుకునే వెసులుబాటు ఉండబోతోందని పేర్కొన్నారు. నైపుణ్యాల కోసం రూ.లక్షలు వెచ్చించి కోచింగ్ కేంద్రాలకు వెళ్లాల్సిన అవసరం ఇకపై ఉండదని చెప్పారు. 2025–26 విద్యా సంవత్సరం మొదలవుతున్న నేపథ్యంలో మంగళవారం ఆయన 'సాక్షి'కి ప్రత్యేక ఇంటర్వ్యూ ఇచ్చారు. నాణ్యమైన విద్యే ప్రామాణికంగా ఉన్నత విద్యలో తీసుకొస్తున్న సంస్కరణలను వివరించారు. ఆ వివరాలు ఆయన మాటల్లోనే..

ఈ–లైబ్రరీ రెడీ

ఉన్నత విద్యా మండలి వెబ్‌సైట్‌ను ఆధునీకరించాం. ఇప్పుడు దీనిని 1.5 లక్షల మంది చూస్తున్నారు. ఇందులో సమాచారం మొత్తం ఉంది. గ్రీవెన్స్ సెల్ కూడా పెట్టాం. సమస్యలు, సూచనలు వెబ్ ద్వారానే పంపొచ్చు. ఫీడ్‌బ్యాక్‌గా దీన్ని తీసుకుంటున్నాం. మార్పులు చేసుకుంటున్నాం. మండలి న్యూస్ లెటర్ వెబ్‌సైట్‌లో లభిస్తుంది. వివిధ రంగాల నిపుణుల రీసెర్చ్ ఆర్టికల్స్‌తో ఉన్న జర్నల్‌ను అందుబాటులోకి తెచ్చాం. ఒక్కపైసా ఖర్చు లేకుండా 13,500 జర్నల్స్‌ను వెబ్‌సైట్‌లో చూడొచ్చు. అంతర్జాతీయ నైపుణ్య మెళకువలు ఇందులో లభిస్తాయి. మారుమూల ప్రాంతాల విద్యార్థులు కూడా డిజిటల్ లైబ్రరీ ద్వారా నాలెడ్జ్ పెంచుకోవచ్చు.

పారిశ్రామిక 'విద్య'

గ్రాడ్యుయేషన్‌లో మార్కులు ప్రామాణికం కానేకాదు. నైపుణ్యాన్నే పరిశ్రమలు పరిగణనలోనికి తీసుకుంటున్నాయి. అందుకే అకడమిక్ విద్యతో పరిశ్రమలను లింక్ చేస్తున్నాం. బల్క్‌డ్రగ్ మాన్యుఫ్యాక్చరింగ్ అసోసియేషన్, బీడీఎంఏ, బీఎస్ఎఫ్ఐ... ఇలా అనేక సంస్థలతో ఒప్పందం చేసుకున్నాం. ఇవన్నీ గ్రాడ్యుయేషన్ స్థాయిలోనే నైపుణ్యం అందిస్తాయి. ఇప్పటికే 400 మంది ఇంటర్న్‌షిప్ కూడా చేస్తున్నారు. పుస్తకాల జ్ఞానమే కాదు.. పారిశ్రామిక స్కిల్స్ అవసరం. అప్పుడే ఉపాధి లభిస్తుంది. టీ–శాట్ ద్వారా ఓపెన్ లెక్చర్స్ ఇప్పిస్తున్నాం. రీసెర్చ్‌లో నాణ్యత పెరగాలి. ప్రపంచంతో పోటీ పడేలా ఉండాలి. బ్రిటన్, ఆస్ట్రేలియా, జర్మనీ, ఫ్రాన్స్ సంస్థలను రంగంలోకి దించాం. ఉన్నత విద్య సంస్థలతో ఇవి భాగస్వామ్యమవుతాయి. విద్యార్థులకు ఆన్‌లైన్ ద్వారా అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ అందిస్తాయి.

కోర్ సబ్జెక్టులకే భవిష్యత్

విద్యార్థులు మూస ఆలోచనలకు స్వస్తి చెప్పాలి. ఇంజనీరింగ్‌లో కంప్యూటర్ కోర్సులు చదివితేనే ఉద్యోగాలు వస్తాయనే భ్రమ వీడాలి. సివిల్, మెకానికల్, ఎలక్ట్రికల్ కోర్సుల్లో ప్రవేశాలు తగ్గుతున్నాయి. విద్యార్థుల అవగాహన లోపమే దీనికి కారణం. సాఫ్ట్‌వేర్ వైపే వెళ్లాలనుకుంటే ఏ కోర్సు చేస్తే ఏం? ఉదాహరణకు మెకానికల్ తీసుకుని, మైనర్ కోర్సుగా కంప్యూటర్స్ కోర్సు తీసుకోవచ్చు. అప్పుడు సాఫ్ట్‌వేర్ ఉద్యోగం రాదా? చాలా మంది ఓ విషయాన్ని తెలుసుకోవాలి. సివిల్, మెకానికల్ అన్నింటికీ సాంకేతికత తోడవుతుంది. సిలబస్‌ను ఈ విధంగా రూపొందించాం. డిగ్రీ, ఇంజనీరింగ్‌లో ఈ ఏడాది నుంచే 20 శాతం స్కిల్ సబ్జెక్టులు ఉంటాయి. కంప్యూటర్ పరిజ్ఞానంతో చాప్టర్లు ఉంటాయి. నాలెడ్జ్ ఉంటేనే ఇవన్నీ సాధ్యం అని వివరించారు.

వైఎస్సార్ సేవలు చిరస్మరణీయం: సీఎం రేవంత్

ఉమ్మడి ఏపీ అభివృద్ధిపై చెరగని ముద్ర అని నివాళులు



వైఎస్.రాజశేఖరరెడ్డి చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి. మల్లు రవి, చామల కిరణ్, రోహిన్‌రెడ్డి

సాక్షి, న్యూఢిల్లీ: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో అభివృద్ధి, సంక్షేమం పరంగా దివంగత మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్.రాజశేఖర్‌రెడ్డి చెరగని ముద్ర వేశారని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రశంసించారు. వైఎస్సార్ జయంతి సందర్భంగా న్యూఢిల్లీలోని తన అధికారిక నివాసంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి సీఎం ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ ఇందిరమ్మ ఇళ్లు, రైతు రుణమాఫీ, జలయజ్ఞం, ఔటర్ రింగ్ రోడ్, పింఛన్ పెంపు వంటి పథకాలతో ప్రజల మనసుల్లో వైఎస్సార్ శాశ్వతంగా నిలిచిపోయారని చెప్పారు. 'రాహుల్ గాంధీని దేశ ప్రధాని చేయాలని వైఎస్సార్ కలలు కన్నారు. ఆయన ఆశయ సాధన దిశగా కాంగ్రెస్ పార్టీ కృషి చేస్తుంది'అని రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. అలాగే, మాజీ ప్రధాని చంద్రశేఖర్ వర్ధంతి సందర్భంగా ఢిల్లీలోని సీఎం అధికార నివాసంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ రెండు కార్యక్రమాల్లోనూ సీఎంతో పాటు ఎంపీలు మల్లు రవి, చామల కిరణ్‌కుమార్ రెడ్డి, పార్టీ నేతలు ఏపీ జితేందర్ రెడ్డి, రోహిన్‌రెడ్డి పాల్గొన్నారు.

మెడికల్ కాలేజీలకు ప్రిన్సిపాల్స్.. ఆస్పత్రులకు సూపరింటెండెంట్లు

44 మంది సీనియర్ ప్రొఫెసర్లకు ఏడీఎంఈలుగా పదోన్నతి

- ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ మెడికల్ కాలేజీలు, బోధన ఆస్పత్రులకు రెగ్యులర్ విధానంలో ప్రిన్సిపాల్స్, సూపరింటెండెంట్లను ప్రభుత్వం నియమించింది. ఇందుకోసం అర్హత గల 44 మంది సీనియర్ ప్రొఫెసర్లకు అడిషనల్ మెడికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్లు (ఏడీఎంఈ)గా పదోన్నతులు కల్పించింది. ఈ మేరకు ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో 34 ప్రభుత్వ వైద్య కళాశాలలతోపాటు అనుబంధ బోధన ఆస్పత్రులకు పాలనాధికారుల నియామకం పూర్తయ్యింది. జాతీయ మెడికల్ కమిషన్ నిబంధనల ప్రకారం ఏడీఎంఈ హోదా కలిగిన వారిని మాత్రమే మెడికల్ కళాశాలలకు ప్రినిపాల్స్‌గా, బోధన ఆస్పత్రులకు సూపరింటెండెంట్లుగా నియమించాల్సి ఉంటుంది. అయితే ఈ హోదా ఉన్నవారు కొందరే ఉండగా, వారు పాత కళాశాలల్లో కొనసాగుతున్నారు. మరికొందరు రిటైర్ అయ్యారు. కొత్త కాలేజీలకు కొరత ఏర్పడింది. ఈ నేపథ్యంలో ఇటీవల సీఎం రేవంత్‌రెడ్డితో సమావేశం సందర్భంగా వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనరసింహ, వైద్యాధికారులు పరిస్థితిని వివరించారు. కొన్నేళ్లుగా పదోన్నతులు లేకపోవడంతో తలెత్తిన ఈ సమస్యను సీఎం దృష్టికి తీసుకెళ్లగా, కొత్తగా అసిస్టెంట్ ప్రొఫెసర్ ఉద్యోగాలను భర్తీ చేయడం ద్వారా ఆపైన హోదాలకు ప్రమోషన్లు ఇవ్వాలని నిర్ణయించారు. ఈ మేరకు 607 మంది అసిస్టెంట్ ప్రొఫెసర్ల పోస్టులను నేరుగా భర్తీ చేసేందుకు ఇటీవల మెడికల్ అండ్ హెల్త్ సర్వీసెస్ రిక్రూట్‌మెంట్ బోర్డు నోటిఫికేషన్ జారీ చేసింది. ఇవిగాక సుమారు మరో 714 పోస్టుల భర్తీకి ఆర్థికశాఖ ఆమోదం తెలిపింది. ఈ పోస్టులను సైతం త్వరలోనే భర్తీ చేయనున్నారు. కొత్త నియామకాల నేపథ్యంలో ఇప్పటికే అసిస్టెంట్ ప్రొఫెసర్లుగా పనిచేస్తున్న 231 మందికి అసోసియేట్ ప్రొఫెసర్లుగా పదోన్నతి కల్పించాలని నిర్ణయించింది. అసోసియేట్ ప్రొఫెసర్లుగా పనిచేస్తున్న 278 మందికి ప్రొఫెసర్లుగా పదోన్నతి కల్పించనున్నారు. అందులో భాగంగానే సీనియర్ ప్రొఫెసర్లు 44 మందికి ఏడీఎంఈలుగా పదోన్నతి కల్పించారు. ఏడీఎంఈల పోస్టింగ్ ప్రక్రియ పూర్తయిన నేపథ్యంలో ప్రొఫెసర్లుగా ప్రమోట్ అయిన వారికి కూడా ప్రభుత్వం త్వరలో పోస్టింగ్స్ ఇవ్వనుంది. ఈ ప్రమోషన్లతో అన్ని కాలేజీల్లో ప్రొఫెసర్ల కొరత, డిపార్ట్‌మెంట్ హెచ్ఓడీల సమస్య తీరనున్నట్టు వైద్యారోగ్య వర్గాలు తెలిపాయి.

బీసీ కోటాపై చిత్తశుద్ధి ఉంటే అమలు చేయండి

రాహుల్‌గాంధీకి కవిత డిమాండ్



సాక్షి, న్యూఢిల్లీ: రాజ్యాంగాన్ని చేతబట్టుకొని సామాజిక న్యాయమంటూ దేశమంతా తిరుగుతున్న ప్రధాన ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీకి నిజంగా చిత్తశుద్ధి ఉంటే తెలంగాణలో రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలయ్యేలా చూడాలని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత డిమాండ్ చేశారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 243(డి)ప్రకారం 42 శాతం రిజర్వేషన్లతోనే ఎన్నికలు నిర్వహించేందుకు వీలుగా ప్రభుత్వం జీఓ ఇచ్చేలా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి ఆదేశాలివ్వాలని రాహుల్‌కు సూచించారు. స్థానిక సంస్థల్లో 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని హామీ ఇచ్చి రెండేళ్లు కావొస్తున్నా వాటిని అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందన్నారు. బీసీ రిజర్వేషన్ల బిల్లుపై మంగళవారం ఢిల్లీలోని కాన్‌స్టిట్యూషన్ క్లబ్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో కవిత మాట్లాడారు. రాష్ట్రంలో తక్కువ.. ఢిల్లీలో ఎక్కువగా ఉండే ఆయన ఈ నెల 10న జరిగే కేబినెట్ భేటీలో రిజర్వేషన్ల అమలుపై నిర్ణయం తీసుకోవాలన్నారు. రైల్‌రోకో కేవలం ట్రైలర్ మాత్రమేనని, బిల్లును ఆమోదించకపోతే భవిష్యత్‌లో నిరవధికంగా రైల్‌రోకోను నిర్వహిస్తామన్నారు.

విద్యార్థుల చూపంతా ఆప్షన్ల వైపే

- స్పీడ్ పెరిగిన ఇంజనీరింగ్ కౌన్సెలింగ్
- ధ్రువపత్రాల పరిశీలనకు బారులు తీరుతున్న విద్యార్థులు



మాసబ్ ట్యాంకులోని సాంకేతిక విద్య క్యాంపు కార్యాలయంలోని కేంద్రం వద్ద విద్యార్థులు

సాక్షి, హైదరాబాద్: ఇంజనీరింగ్ కౌన్సెలింగ్ స్పీడ్ పెరిగింది. తొలి విడత ఆప్షన్ల గడువు 10వ తేదీతో ముగుస్తుంది. దీంతో విద్యార్థులు ధ్రువపత్రాల పరిశీలనకు బారులు తీరుతున్నారు. విద్యార్థుల సౌకర్యాన్ని దృష్టిలో ఉంచుకుని వీలైనంత వరకూ సమీపంలోనే పరిశీలన చేపడుతున్నామని క్యాంప్ ఆఫీసర్ శ్రీనివాస్ తెలిపారు. చాలామంది విద్యార్థులు మొదట్లో రిజిస్ట్రేషన్ చేసుకోలేదు. రిజిస్ట్రేషన్ చేసుకున్న ప్రతీ విద్యార్థి ధ్రువపత్రాల పరిశీలనకు తేదీలను ఆన్‌లైన్‌లోనే వెల్లడిస్తారు. ఇప్పటి వరకు 97,533 మంది రిజిస్ట్రేషన్లు చేసుకున్నారు. వీరిలో 85,695 మంది సర్టిఫికెట్ వెరిఫికేషన్‌కు హాజరయ్యారు. ఈ ప్రక్రియ పూర్తి చేసుకున్న వారిలో 21,258 మంది మాత్రమే వెబ్ ఆప్షన్లు ఇచ్చినట్టు అధికారులు తెలిపారు. కోర్సులు, కాలేజీల వివరాలపై ముందుగా కసరత్తు చేస్తున్నారు. కొన్నేళ్లుగా ఏ ర్యాంకుకు ఎక్కడ సీటు వచ్చిందనేది ప్రామాణికంగా తీసుకుని వెబ్ ఆప్షన్లు ఇస్తున్నారు. కేంద్రాల్లో కనీస వసతులు కూడా లేవని విద్యార్థులు వాపోతున్నారు.

బోధకులు లేరు.. రోగులు ఉండరు!

రాష్ట్రంలోని పలు ప్రైవేటు వైద్య కళాశాలల్లో అధ్వాన పరిస్థితులు

- విద్యార్థుల నుంచి రూ. కోట్లలో ఫీజులు గుంజుతున్నా కక్కుర్తి
- ఇంటర్న్‌షిప్ చేసే విద్యార్థులకు స్టైపెండ్ ఎగ్గొడుతున్న వైనం
- ఆరోగ్య విశ్వవిద్యాలయ ఆకస్మిక తనిఖీల్లో విస్తుగొలిపే వాస్తవాలు
- చల్మెడ, ఎంఎన్ఆర్, రాజరాజేశ్వర, మహేశ్వరి కాలేజీలకు షోకాజ్ నోటీసులు



చల్మెడ ఆనందరావు వైద్యకళాశాలలో..

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని పలు ప్రైవేటు వైద్య కళాశాలలు అడుగడుగునా జాతీయ వైద్య కమిషన్ (ఎన్ఎంసీ) నిబంధనల ఉల్లంఘనకు పాల్పడుతున్నట్లు కాళోజీ నారాయణరావు ఆరోగ్య విశ్వవిద్యాలయం చేపట్టిన ఆకస్మిక తనిఖీల్లో బట్టబయలైంది. ఆయా కళాశాలల్లో ప్రొఫెసర్లు, వాటికి అనుబంధంగా ఉన్న బోధనాస్పత్రుల్లో నర్సింగ్, ఇతర పారామెడికల్ సిబ్బంది ఎవరూ లేరనే విషయం వెల్లడైంది. దీంతో నిబంధనలు అతిక్రమించిన కాలేజీలకు వర్సిటీ షోకాజ్ నోటీసులు జారీ చేసింది.

గతానికి భిన్నంగా తనిఖీలతో..

ఎన్ఎంసీ నిబంధనల ప్రకారం వైద్య కళాశాలలను ఏటా రెన్యువల్ చేయాల్సి ఉంటుంది. ప్రభుత్వ వైద్య కళాశాలలను ఎన్ఎంసీ అధికారులే తనిఖీ చేస్తే ప్రైవేటు వైద్య కళాశాలలను సంబంధిత ఆరోగ్య విశ్వవిద్యాలయం తనిఖీ చేసి నివేదికను ఎన్ఎంసీతో పాటు రాష్ట్ర ప్రభుత్వానికి పంపిస్తుంటుంది. అయితే గతంలో ప్రైవేటు కళాశాలలకు ఫలానా తేదీన తనిఖీలకు వస్తున్నట్లు సమాచారం ఇవ్వడం వల్ల యాజమాన్యాలు అప్పటికప్పుడు రోగులను, వైద్యులను, సిబ్బందిని సమకూర్చుకొని 'షో'చేసేవి. కానీ ఈసారి వీసీ నందకుమార్‌రెడ్డి నేతృత్వంలో 'సీన్'మారింది. తనిఖీలకు వెళ్లడానికి కేవలం అరగంట ముందే కళాశాలలకు వస్తున్నట్లు సంబంధిత యాజమాన్యాలకు సమాచారం ఇచ్చారు. స్వయంగా వీసీతోపాటు డీఎంఈ నరేంద్రకుమార్, వర్సిటీ సీనియర్ ప్రొఫెసర్లు, సూపర్ స్పెషలిస్టులు బృందాలుగా ఏర్పాటై 8 వైద్య కళాశాలలు, బోధనాస్పత్రుల్లో తనిఖీలు చేయగా, ప్రైవేటు యాజమాన్యాల నిజస్వరూపం బహిర్గతమైంది. రెండు కళాశాలల్లో క్షేత్రస్థాయి పరిస్థితిని చూసి వీసీ, డీఎంఈ విస్తుపోయారు.


ఖాళీ బెడ్లు... నిరుపయోగంగా యంత్రాలు

హైదరాబాద్ సమీపంలోని రాజరాజేశ్వర ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్‌కు అనుబంధంగా ఉన్న బోధనాస్పత్రిలో కార్పొరేట్ హాస్పిటల్ తరహాలో పడకలు, అధునాతన పరికరాలను ఏర్పాటు చేసినా అందులో ఒక్క రోగి కూడా లేడు. ఆయా పరికరాలను నిర్వహించే సిబ్బంది సైతం కనిపించలేదు. వార్డుల్లో డాక్టర్లు, నర్సులు కూడా లేరు. కరీంనగర్‌లోని చల్మెడ ఆనందరావు వైద్య కళాశాల ఆస్పత్రిలోనూ ఇదే పరిస్థితి నెలకొంది. గత నెల 30న ఈ ఆసుపత్రిలో తనిఖీలు జరపగా పిల్లల విభాగం, సర్జికల్ వార్డు, మహిళా విభాగం, పురుషుల వార్డుతోపాటు తనిఖీలు నిర్వహించిన కె.ఎల్.ఎం. వార్డులన్నీ ఖాళీగానే ఉన్నాయి. సంగారెడ్డిలోని ఎంఎన్ఆర్ వైద్య కళాశాల, మహేశ్వరి వైద్య కళాశాలల్లోనూ పరిస్థితి ఇందుకు భిన్నంగా ఏమీ లేదు.పారిశుద్ధ్య సిబ్బంది కూడా లేకపోవడంతో అత్యంత అధ్వానంగా ఆస్పత్రులు ఉన్నట్లు తనిఖీ చేసిన అధికారులు 'సాక్షి'కి తెలిపారు. తనిఖీలు జరిపిన మరో నాలుగు కళాశాలల్లో వీటికన్నా కొంత మెరుగైన పరిస్థితి ఉన్నట్లు ఆరోగ్య విశ్వవిద్యాలయం భావించింది.

నాలుగున్నరేళ్ల కోర్సుకు ఐదేళ్ల ఫీజు

నాలుగున్నరేళ్ల ఎంబీబీఎస్ కోర్సుకు దాదాపు అన్ని ప్రైవేటు వైద్య కళాశాలల్లో ఐదేళ్ల కోర్సు ఫీజు వసూలు చేస్తున్నట్లు తనిఖీల్లో తేలింది. ఒక్కో విద్యార్థి నుంచి రూ. 4 లక్షల నుంచి రూ. 6 లక్షల వరకు అదనంగా వసూలు చేస్తున్నట్లు నిర్ధారణ అయింది. అంటే ఈ లెక్కన ఒక్కో కళాశాల సీట్లను బట్టి ఏడాదికి రూ. 6 కోట్ల నుంచి రూ. 12 కోట్లు అదనంగా వసూలు చేస్తోంది. దీనికితోడు ఇంటర్న్‌షిప్ చేసే విద్యార్థికి కళాశాల యాజమాన్యం నెలకు రూ. 25 వేల వరకు స్టైపెండ్ చెల్లించాల్సి ఉండగా తనిఖీలు జరిగిన కాలేజీల్లో ఏ కాలేజీ కూడా దాన్ని చెల్లించట్లేదు. స్టైపెండ్ అడిగిన పాపానికి ఇటీవల చల్మెడ మెడికల్ కళాశాల 60 మంది విద్యార్థులను సస్పెండ్ చేసింది.

ఇక తరచూ తనిఖీలు



ఈసారి ప్రైవేటు వైద్య కళాశాలల్లో పకడ్బందీగా తనిఖీలు నిర్వహిస్తున్నాం. ఇప్పటికి 8 కళాశాలల్లో తనిఖీలు జరిపాం. నిబంధనలను పూర్తిగా కాలరాస్తున్న చల్మెడ, ఎంఎన్ఆర్, రాజరాజేశ్వర, మహేశ్వరి కళాశాలలకు షోకాజ్ నోటీసులు జారీ చేశాం. 48 గంటల్లోగా వివరణ కోరాం. తనిఖీలు ఏడాదికోసారి కాకుండా తరచూ నిర్వహించాలని నిర్ణయించాం. నిబంధనలు పాటించని కళాశాలలపై పూర్తిస్థాయి నివేదికను ఎన్ఎంసీకి, రాష్ట్ర ప్రభుత్వానికి పంపిస్తాం. పరిస్థితి మారకపోతే వారిపై తప్పనిసరిగా చర్యలు ఉంటాయి.

\- కాళోజీ నారాయణరావు ఆరోగ్య విశ్వవిద్యాలయ వీసీ నందకుమార్‌రెడ్డి

క్లుప్తంగా...

కొత్త నేర చట్టాల అమల్లో తెలంగాణ పోలీసు భేష్

కేంద్ర హోంశాఖ బృందం ప్రశంసలు

సాక్షి, హైదరాబాద్: తెలంగాణలో నూతన నేర చట్టాల అమలు అంశంపై కేంద్ర హోంశాఖ కార్యదర్శి గోవింద్ మోహన్‌తో కూడిన ప్రతినిధి బృందం సమీక్షించింది. కొత్త క్రిమినల్ చట్టాలను సజావుగా అమలు చేయడం, మాదకద్రవ్యాలను అరికట్టడానికి ఇతర ప్రయత్నాలపై రాష్ట్ర పోలీసుల ప్రయత్నాలను ఈ బృందం ప్రశంసించింది. ఈ మేరకు మంగళవారం బంజారాహిల్స్‌లోని కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో నిర్వహించిన సమావేశంలో ఎన్‌సీఆర్‌బీ, బీపీఆర్ అండ్ డీ సహా పలు కేంద్ర విభాగాలతో పాటు సీఎస్ కె.రామకృష్ణారావు, రాష్ట్ర హోంశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రవి గుప్తా, పాల్గొన్నారు. డీజీపీ జితేందర్ మాట్లాడుతూ శాంతిభద్రతల నిర్వహణ, శాంతిభద్రతల సమస్యలకు సంబంధించిన పలు అంశాలను తెలంగాణ పోలీసులు ఏవిధంగా నిర్వహిస్తున్నారు, ఇతర భద్రతా పరమైన సవాళ్లు ఎలా అధిగమిస్తున్నారో తెలిపారు. కొత్త క్రిమినల్ చట్టాలను అమలు చేయడంలో జాయింట్ వర్కింగ్ గ్రూప్ ఎలా పనిచేస్తోందన్న వివరాలను రాష్ట్రస్థాయి కమిటీ.. కేంద్ర హోంశాఖ కార్యదర్శికి వివరించింది. సమీక్షలో హైదరాబాద్ సీపీ సీవీ ఆనంద్, శాంతిభద్రతల అడిషనల్ డీజీ మహేశ్ భగవత్,సీనియర్ ఐపీఎస్ అధికారులు పాల్గొన్నారు.

57 కిలోల బంగారం తిరిగి ఇప్పించండి

హైకోర్టులో గాలి జనార్దన్‌రెడ్డి పిటిషన్

సాక్షి, హైదరాబాద్: ఓఎంసీ కేసులో సీబీఐ తన ఇంటి నుంచి 2011లో స్వాధీనం చేసుకున్న 57 కిలోల బంగారు నగలతోపాటు రూ.5 కోట్ల విలువైన బాండ్లను తిరిగి ఇచ్చేలా ఆదేశించాలంటూ గాలి జనార్దన్‌రెడ్డి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై జస్టిస్ కె.లక్ష్మణ్ మంగళవారం విచారణ చేపట్టారు. పిటిషనర్ తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ 2011 సెప్టెంబర్ 5న సీబీఐ స్వాధీనం చేసుకున్న 105 బంగారు నగలు, కార్లు తదితరాలను జప్తు చేయాలని సీబీఐ కోర్టు ఆదేశించిందన్నారు. కేసు నమోదుకు ముందే పిటిషనర్ కుటుంబ ఆదాయంతో వాటిని కొనుగోలు చేశారన్నారు. ఆ ఆదాయంపై ఐటీ రిటర్న్‌లు కూడా చూపారన్నారు. నగలు తిరిగి అప్పగించాలన్న విజ్ఞప్తిని 2016లో సీబీఐ కోర్టు నిరాకరించిందని చెప్పారు. హైకోర్టులో అప్పీల్ చేయగా విచారణ పూర్తయితేగానీ నగలు నేరపూరిత సొమ్ముతో కొన్నవో కాదో తేలదంటూ పిటిషన్‌ను కొట్టివేసిందన్నారు. ఇప్పుడు విచారణ పూర్తయినందున బంగారం విడుదలకు ఆదేశాలివ్వాలని కోరారు. దీనిపై కౌంటర్ దాఖలుకు సమయం కావాలని సీబీఐ తరఫు న్యాయవాది కోరడంతో న్యాయమూర్తి తదుపరి విచారణ ఈ నెల 23కు వాయిదా వేశారు.

కాల్‌కేయులు!



పెరుగుతున్న ఉత్తుత్తి బెదిరింపు కాల్స్, ఈ-మెయిల్స్ సంఖ్య

ఆకతాయితనంతోనో, శాడిజంతోనో వికృత చేష్టలు

- పోలీసులు, బాంబు స్క్వాడ్‌కు తప్పని ఉరుకులు, పరుగులు
- విమానాశ్రయాలు, స్కూళ్లు, ఆస్పత్రులు టార్గెట్
- ఏ ఒక్క కాల్‌నూ తేలిగ్గా తీసుకోలేని పరిస్థితి
- గత ఏడాది దేశవ్యాప్తంగా 997 ఘటనలు..13 మంది అరెస్టు
- తెలంగాణలోనూ అడపాదడపా ఉత్తుత్తి కాల్స్, ఈ-మెయిల్స్

సాక్షి, హైదరాబాద్: 'నాన్నా పులి..'సామెతను గుర్తు చేస్తున్నాయి కొందరి చేష్టలు. బాంబులు పెట్టారంటూ బెదిరింపు ఫోన్‌కాల్స్, ఈ-మెయిల్స్‌తో బెదరగొట్టడం.. పోలీసులు, బాంబ్ స్క్వాడ్ ఆఘమేఘాల మీద ఉరుకులు, పరుగులు పెట్టడం ఇటీవలి కాలంలో పెరిగిపోతోంది. వీటిల్లో చాలావరకు ఆకతాయితనంతోనో, శాడిజంతోనో చేసే కాల్స్ అయినా సరే..ప్రజా భద్రత దృష్ట్యా ఈ తరహా ఏ ఒక్క ఫోన్‌కాల్‌ను కానీ, ఈ-మెయిల్‌ను కానీ పట్టించుకోకుండా వదిలేసే పరిస్థితి ఉండదు. ఒకవేళ నిజంగానే బాంబు పేలుడు లాంటివి సంభవిస్తే ప్రాణ నష్టం భారీగా జరిగేందుకు అవకాశం ఉంటుంది. ప్రధానంగా విమానాశ్రయాలు, ఆసుపత్రులు, పాఠశాలలు, ప్రభుత్వ కార్యాలయాలకు ఈ తరహా నకిలీ బాంబు బెదిరింపు కాల్స్ పెరుగుతున్నాయి. తాజాగా మంగళవారం హైదరాబాద్‌లోని రాజ్‌భవన్, పాతబస్తీలోని సిటీ సివిల్ కోర్టు, జింఖానా క్లబ్, సికింద్రాబాద్ సివిల్ కోర్టుల్లో బాంబు పెట్టినట్టు గుర్తు తెలియని వ్యక్తి నుంచి ఈ-మెయిల్ రావడంతో కాసేపు గందరగోళం నెలకొంది. నిందితులు తాము చిక్కకుండా సాంకేతికతను ఉపయోగించి ఈ తరహా ఫోన్‌కాల్స్, ఈ-మెయిల్ చేస్తున్నట్టు పోలీసులు దర్యాప్తులో తేలుతోంది.

ఐదేళ్లలో పెరిగిన కాల్స్, ఈ-మెయిల్స్

గత ఐదేళ్లలో (2020-2025) దేశంలో బాంబు బెదిరింపు కాల్స్ సంఖ్య గణనీయంగా పెరిగినట్టు గణాంకాలు చెబుతున్నాయి. ఈ తరహా ఘటనల్లో ఎక్కువగా వీపీఎన్ (వర్చువల్ ప్రైవేట్ నెట్‌వర్క్) ఉపయోగించి విదేశాల నుంచి ఈ-మెయిల్స్ పంపుతున్నట్టు తెలుస్తోంది. గతంలో ఇలాంటి వారు ఫోన్ కాల్స్ చేసేవారు, కానీ ఇటీవల ఈ-మెయిల్‌లు సోషల్ మీడియాకు మారడం, వీపీఎన్ వాడకంతో నేరస్తులను గుర్తించడం పోలీసులకు సవాలుగా మారింది. 2024లో దేశవ్యాప్తంగా ఇలాంటి బెదిరింపు కాల్స్ చేసిన వారిలో 13 మందిని అరెస్టు చేయగా.. అందులో తెలంగాణలో ఒకరిని అరెస్టు చేశారు.

దేశవ్యాప్తంగా బాంబు బెదిరింపు కాల్స్ ఇలా..

- 2020-2021లో కోవిడ్ మహమ్మారి, లాక్‌డౌన్ కారణంగా ఇలాంటి కాల్స్ సంఖ్య తక్కువగా ఉంది.
- 2022లో దేశవ్యాప్తంగా ఉన్న విమానాశ్రయాలకు సుమారు 100కు పైగా బాంబు బెదిరింపు కాల్స్ వచ్చినట్లు అధికారిక నివేదికలు వెల్లడిస్తున్నాయి. వీటిలో చాలావరకు నకిలీవిగా గుర్తించారు. హైదరాబాద్ సహా పలు నగరాల్లోని సీఆర్‌పీఎఫ్ ఆధ్వర్యంలో నడిచే పాఠశాలలకు ఈ తరహా బెదిరింపు కాల్స్ వచ్చాయి.
- 2023లో బాంబు బెదిరింపుల సంఖ్య మరింత పెరిగింది. ఢిల్లీలోని స్కూళ్లు, ఆసుపత్రులు, మెట్రో స్టేషన్లకు బెదిరింపు కాల్స్, ఈ-మెయిల్స్ వచ్చాయి. ఈ ఏడాదిలో 500కు పైగా బెదిరింపు కాల్స్, ఈ-మెయిల్స్ నమోదయ్యాయి. వీటిల్లోనూ చాలావరకు ఉత్తుత్తివిగా తేలాయి.
- 2024లో 997 బాంబు బెదిరింపు కాల్స్ నమోదయ్యాయి. 2024 జూన్‌లో ఒక్క రోజులోనే ఢిల్లీ, ముంబై, చెన్నై, హైదరాబాద్ వంటి నగరాల్లో కలిపి 50కి పైగా విమానాశ్రయాలు, 40కి పైగా ఆసుపత్రులకు బెదిరింపు ఈ-మెయిల్స్ వచ్చాయి. అక్టోబర్‌లో రెండు వారాల్లోనే 500 విమానాలకు ఈ తరహా బాంబు బెదిరింపు కాల్స్ వచ్చాయి.
- 2025 మొదటి ఆరు నెలల్లో దేశవ్యాప్తంగా వందలాది బెదిరింపు కాల్స్, ఈ-ఇమెయిల్స్ నమోదయ్యాయి. జనవరిలో ఢిల్లీలోని 15కి పైగా ఆసుపత్రులు, పలు విమానాశ్రయాలకు బెదిరింపు ఈ-మెయిల్స్ వచ్చాయి.

తెలంగాణలో ఇలా..

- 2022లో హైదరాబాద్‌లోని కొన్ని షాపింగ్ మాల్స్, స్కూళ్లకు బెదిరింపు ఈ-మెయిల్స్ వచ్చాయి. దర్యాప్తు తర్వాత ఇవి నకిలీవిగా తేలాయి.
- 2023లో హైదరాబాద్‌లోని పలు స్కూళ్లు, కొన్ని ప్రభుత్వ కార్యాలయాలకు బెదిరింపు ఈ-మెయిల్స్ వచ్చాయి. వీటిల్లో ఎక్కువగా విదేశీ సర్వర్ల నుంచి వచ్చిన ఈ-మెయిల్స్ ఉన్నాయి.
- 2024లో హైదరాబాద్‌లోని స్కూళ్లు, కాలేజీలు, రాజీవ్‌గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయానికి బెదిరింపు ఈ-మెయిల్స్ వచ్చాయి. అక్టోబర్ 22న హైదరాబాద్‌లోని ఒక సీఆర్‌పీఎఫ్ స్కూల్‌కు బాంబు బెదిరింపు కాల్ వచ్చింది. అదేవిధంగా మేలో ప్రజాభవన్, నాంపల్లి కోర్టులో బాంబు పెట్టినట్టు నకిలీ బెదిరింపు కాల్ చేసిన ఒక వ్యక్తిని హైదరాబాద్ సిటీ పోలీసులు అరెస్టు చేశారు.
- 2025లో మంగళవారం సిటీ సివిల్ కోర్టు సహా పలు చోట్ల బాంబులు పెట్టినట్టు బెదిరింపు ఈమెయిల్ వచ్చింది.

కోర్టులకు బాంబు బెదిరింపు

- సిటీ సివిల్ కోర్టు, జింఖానా గ్రౌండ్స్‌కు మెయిల్స్
- రాజ్‌భవన్ పేరు ప్రస్తావనతో పోలీసుల ఉరుకులు పరుగులు
- అబ్దియా-అబ్దుల్లా పేర్లతో పంపిన గుర్తుతెలియని వ్యక్తి
- నాలుగు చోట్ల మూడు గంటలపాటు బాంబ్‌స్క్వాడ్ తనిఖీలు
- నిందితుల కోసం రంగంలోకి నాలుగు ప్రత్యేక బృందాలు



కోర్టు బయట ఆందోళనలో న్యాయవాదులు, ఉద్యోగులు

సాక్షి, హైదరాబాద్: 'ట్యూస్‌డే బ్లాస్ట్: నాలుగు ఆర్డీఎక్స్ బేస్డ్ ఇంప్రూవైజ్డ్ ఎక్స్‌ప్లోజివ్ డివైజ్‌లు (బాంబులు) సివిల్ కోర్టులో, జడ్జీల చాంబర్స్‌లో, జింఖానా క్లబ్‌లో పెట్టాం'అంటూ మంగళవారం తెల్లవారుజామున వచ్చిన ఈ-మెయిల్ పోలీసులను ఉరుకులు పరుగులు పెట్టించింది. సదరు మెయిల్‌లో రాజ్‌భవన్ ప్రస్తావన ఉండటంతో అధికారులు మరింత అప్రమత్తమయ్యారు. రాజ్‌భవన్, పాతబస్తీలోని సిటీ సివిల్ కోర్టు, బంజారాహిల్స్‌లోని జింఖానా క్లబ్, సికింద్రాబాద్ కోర్టులో దాదాపు మూడు గంటలపాటు తనిఖీలు నిర్వహించి అది బెదిరింపు మెయిల్‌గా తేల్చారు. ఈ పని చేసిన నిందితులను పట్టుకునేందుకు నాలుగు ప్రత్యేక పోలీస్ బృందాలను రంగంలోకి దింపారు. అబ్దియా-అబ్దుల్లా హాట్ మెయిల్.కామ్ ఐడీ నుంచి మంగళవారం తెల్లవారుజామున సిటీ సివిల్ కోర్టుల చీఫ్ జడ్జితోపాటు జింఖానా క్లబ్ అధికారిక మెయిల్ ఐడీలకు ఓ ఈ-మెయిల్ వచ్చింది. తెల్లవారుజామున 3.43 గంటలకు వచ్చిన ఈ సందేశాన్ని ఉదయం సంబంధిత సిబ్బంది, అధికారులు గుర్తించారు. సిటీ సివిల్ కోర్టుతో పాటు జడ్జీల చాంబర్లు, జింఖానా క్లబ్‌లో నాలుగు బాంబులు పెట్టినట్లు మెయిల్‌లో దుండగులు పేర్కొన్నారు. తమిళనాడులో జరిగిన ఓ రాజకీయ వివాదాన్ని ఎత్తిచూపుతూ పలు ఆరోపణలు చేసిన ఈ మెయిల్‌లో ప్రశాంత్ కిషోర్‌తో పాటు సునీల్ కనుగోలు పేర్లను ప్రస్తావించారు. కోర్టు నుంచి కక్షిదారులతోపాటు న్యాయవాదులు, జడ్జీలను ఖాళీ చేయించాలని హెచ్చరించారు. ఇక్కడ బాంబు పేలుళ్ల జరిగిన 23 నిమిషాల తర్వాత జింఖానా క్లబ్‌లో పేలుతుందని బెదిరించారు. తన మెయిల్‌లో ఓ సందర్భంలో రాజ్‌భవన్ పేరును ప్రస్తావించడంతో పోలీసులు మరింత అప్రమత్తమయ్యారు. సిటీ సివిల్ కోర్టు, జింఖానా క్లబ్, రాజ్‌భవన్‌లో తనిఖీలు చేపట్టారు. సికింద్రాబాద్ కోర్టుకూ ముప్పు ఉండే అవకాశం ఉందని అక్కడి అధికారులు పోలీసులకు సమాచారం ఇవ్వటంతో అక్కడా బాంబ్ స్క్వాడ్‌తో తనిఖీలు చేశారు. మూడు గంటలపాటు క్షుణ్ణంగా తనిఖీ చేసినా ఎలాంటి అనుమానాస్పద వస్తువులు లభించకపోవటంతో అది బెదిరింపు మెయిల్ అని తేల్చారు. ఆ మెయిల్‌లో తమిళనాడు అంశాలు ప్రస్తావించడం, అన్నా యూనివర్సిటీ అలోమీలం అని ప్రస్తావించడంతో పాటు ఆఖరులో మద్రాస్ టైగర్స్ అనే పదాన్ని వాడటంతో ఆ కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. 'ఆంధ్రప్రదేశ్‌లోని చిత్తూరు పేరునూ ప్రస్తావించారు. ఈ-మెయిల్ ఏ ఐపీ అడ్రస్ నుంచి వచ్చిందో తెలపాల్సిందిగా హాట్ మెయిల్ సంస్థకు లేఖ రాశాం. నిందితులను గుర్తించి పట్టుకోవడానికి నాలుగు బృందాలు పని చేస్తున్నాయి'అని ఓ పోలీస్ ఉన్నతాధికారి తెలిపారు.

'పోలీస్' అభ్యర్థులపై కేసు చెల్లదు

- నిరసనకారులపై ఎఫ్‌ఐఆర్ కొట్టేసిన హైకోర్టు

సాక్షి, హైదరాబాద్: పోలీస్ రిక్రూట్‌మెంట్‌లో అక్రమాలు జరిగాయని ఆరోపిస్తూ నిరసన చేపట్టిన అభ్యర్థులపై బంజారాహిల్స్ పోలీసులు నమోదు చేసిన క్రిమినల్ కేసు చెల్లదని హైకోర్టు స్పష్టం చేసింది. ఈ వ్యవహారంలో కోర్టును ఆశ్రయించిన 10 మందికి ఊరటనిస్తూ వారిపై ఎఫ్‌ఐఆర్‌ను కొట్టేసింది. ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్ (ఐసీసీసీ) వద్ద ఆందోళనకు దిగినందుకు బంజారాహిల్స్ పోలీసులు 2023 ఫిబ్రవరి 3న 16 మందిపై కేసు నమోదు చేశారు. అయితే ఈ కేసును కొట్టేయాలని కోరుతూ రంగారెడ్డి జిల్లా సరూర్‌నగర్‌కు చెందిన కొంగరి మహేశ్ సహా పలువురు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై జస్టిస్ కె.లక్ష్మణ్ విచారణ చేపట్టారు. ఐసీసీసీ భవనం సమీపంలో 16 మంది చట్టవిరుద్ధంగా సమావేశమై అనుమతి లేకుండా ప్రాంగణంలోకి ప్రవేశించడానికి ప్రయత్నించారని ప్రభుత్వ న్యాయవాది వాదనలు వినిపించారు. రోడ్డుపై నినాదాలు చేస్తూ ట్రాఫిక్‌ను అడ్డుకున్నారన్నారు. అందువల్ల దర్యాప్తును కొనసాగించేలా పిటిషన్‌ను కొట్టేయాలని కోరారు. అనంతరం పిటిషనర్ల తరఫు న్యాయవాది వాదిస్తూ పరుగు పందెం, లాంగ్ జంప్, షాట్‌పుట్ విభాగాల్లో అప్పటి వరకు ఉన్న కొలతలను మార్చి, పెంచారని ఆరోపిస్తూ శాంతియుతంగా అభ్యర్థులు నిరసనకు దిగారన్నారు. వారు చట్ట ఉల్లంఘనకు పాల్పడలేదని.. పోలీసులు తప్ప స్వతంత్రులెవరూ సాక్షులుగా వాంగ్మూలం ఇవ్వలేదని చెప్పారు. వాదనలు విన్న న్యాయమూర్తి ఇది చట్ట ప్రక్రియను దుర్వినియోగం చేయడమేనని పేర్కొంటూ 10 మంది పిటిషనర్లపై కేసును రద్దు చేస్తూ తీర్పునిచ్చారు. అయితే పిటిషనర్లకు మాత్రమే ఈ ఊరట లభిస్తుందని.. మిగతా వారిపై దర్యాప్తు కొనసాగుతుందని స్పష్టం చేశారు.

నేటి దేశవ్యాప్త సమ్మెకు సంపూర్ణ మద్దతు

- టీజీఈజేఏసీ వెల్లడి

సాక్షి, హైదరాబాద్: కేంద్ర కార్మిక విధానాలకు వ్యతిరేకంగా బుధవారం కేంద్ర, రాష్ట్ర, కార్మిక సంఘాలు తలపెట్టిన దేశవ్యాప్త సమ్మెకు సంపూర్ణ మద్దతు తెలుపుతున్నట్లు టీజీఈజేఏసీ చైర్మన్ మారం జగదీశ్వర్, ప్రధాన కార్యదర్శి ఏలూరి శ్రీనివాసరావు తెలిపారు. సమ్మెకు మద్దతుగా టీజీఈజేఏసీ హైదరాబాద్ కేంద్రం, అమరవీరుల స్తూపం (గన్ పార్కు) వద్ద బుధవారం మధ్యాహ్నం ఉద్యోగులతో కలిసి నిరసన ప్రదర్శన నిర్వహించనున్నామని మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.





తగిన సమయాలలో ధర్మ చర్చ చేయడం ఉత్తమమైన మంగళం.
– బౌద్ధ ధర్మం

సాక్షి
బుధవారం, 9 జూలై 2025

థాక్రే సోదరుల యుగళం

రాజకీయాల్లో ఏ నిర్ణయం ఎటువైపు లాక్కెళుతుందో చెప్పటం కష్టం. మహారాష్ట్రలో నిరుడు నవంబర్‌లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో 288 స్థానాలకు 235 గెల్చుకుని అధికారంలోకొచ్చిన బీజేపీ నేతృత్వంలోని మహాయుతి కూటమి... అంతా సవ్యంగా ఉందనుకున్న వేళ హిందీని ప్రాథమిక విద్య స్థాయిలో ఒకటో తరగతి నుంచి తృతీయ భాషగా నేర్చుకు తీరాలని జీవో తీసుకొచ్చి కష్టాల్లో పడింది. అటు తర్వాత రాష్ట్రంలో క్రమేపీ హిందీ వ్యతిరేక, మరాఠీ ఆత్మగౌరవ ఉద్యమం బలపడుతుండటాన్ని గమనించి గత్యంతరం లేక దాన్ని వెనక్కు తీసుకుంది. కానీ ఇలా వచ్చి, అలా పోయిన ఆ జీవో చేసిన చేటు అంతా ఇంతా కాదు. రక్త సంబంధాన్ని కూడా బేఖాతరు చేసి గత రెండు దశాబ్దాలుగా పరస్పరం కత్తులు నూరుకుంటున్న రెండు దాయాది వర్గాలను అది ఏకం చేసింది. మహాయుతికి రాజకీయంగా తగని తలనొప్పి తెచ్చిపెట్టింది. బాల్ థాక్రే వున్న రోజుల్లోనే అన్నదమ్ముల పిల్లలైన రాజ్ థాక్రే, మాజీ సీఎం ఉద్ధవ్ థాక్రే కయ్యానికి దిగారు. వీరిలో ఉద్ధవ్, బాల్ థాక్రే కుమారుడు. శివసేనపై ఎవరి ఆధిపత్యం ఉండాలన్న అంశంలో అన్నదమ్ములు తగువు పడ్డారు. అవసాన దశలో బాల్ థాక్రే రాజీకి ఎంతగానో ప్రయత్నించినా ఇద్దరికిద్దరూ పట్టుదలకు పోయారు. చివరకు 2005లో ఉద్ధవ్‌ను బాల్ థాక్రే తన వారసుడిగా ప్రకటించటంతో శివసేన నుంచి రాజ్ నిష్క్రమించారు. మహారాష్ట్ర నవనిర్మాణ్ సేన (ఎంఎన్‌ఎస్) పేరిట పార్టీ స్థాపించారు. మధ్యలో ఒకటి రెండుసార్లు కుటుంబీకంగా కలిసిన సందర్భాలుండొచ్చుగానీ ఒకే వేదికను పంచుకున్నది లేదు. రాజకీయాల్లో కలిసి పనిచేస్తామని చెప్పింది లేదు. కానీ ఆ పని మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడణవీస్ చేయగలిగారు. తప్పనిసరి హిందీ జీవోతో వారిని సన్నిహితం చేశారు.

బీజేపీకి అధికారమే పరమావధి కాదు. దాని ఎజెండా దానికుంది. దేశవ్యాప్తంగా ఎప్పటికైనా హిందీని జాతీయ స్థాయిలో అధికార భాష చేసి తీరాలన్న సంకల్పం అందులో ఒకటి. అసెంబ్లీ ఎన్నికలప్పుడు ఎన్ని వాగ్దానాలైనా ఇవ్వొచ్చుగానీ హిందీకి ప్రాముఖ్యమీయటం దాని ప్రచ్ఛన్న సంకల్పం. ఈమధ్య కేంద్ర హోంమంత్రి అమిత్ షా ఇంగ్లిష్ మాట్లాడేవారంతా సిగ్గుపడే రోజొకటి వస్తుందని ప్రకటించటం యాదృచ్ఛికం కాదు. ఆ మాటెలావున్నా బీజేపీకీ, థాక్రే సోదరులకూ రెండు అంశాల్లో ఏకీభావం వుంది. అవి ఒకటి – హిందూ, రెండు – హిందూస్తాన్. కానీ హిందీ విషయంలోనే ఆ సోదరులకు బీజేపీతో పేచీ. అధికార పంపకం సమస్య సరేసరి. ఏదేమైనా అసాధ్యమనుకున్నది జరిగిపోయింది. సోదరులిద్దరూ ఏకమయ్యారు. హిందీ జీవోను వెనక్కి తీసుకున్న సందర్భాన్ని పురస్కరించుకుని ముంబైలో శనివారం విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. రాజ్ థాక్రే భవిష్యత్తు కార్యాచరణ గురించి చెప్పటానికి కొంత మొహమాట పడ్డారుగానీ ఉద్ధవ్ థాక్రే నేరుగా చెప్పారు. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో రెండు పార్టీల మధ్యా పొత్తు ఉంటుందని ప్రకటించారు. బాల్ థాక్రే కాలంలో ముంబైలో శివసేన తిరుగులేని పక్షంగా ఉండేది. తిరిగి ఆ వైభవాన్ని తీసుకురావాలన్నది ఉద్ధవ్ ఉద్దేశం.

కానీ అదంత సులభమేమీ కాదు. నాయకులిద్దరూ కలిసినంత మాత్రాన శ్రేణులు అంత తేలిగ్గా ఏకమవుతాయా అన్నది ప్రశ్నార్థకం. ఎందుకంటే గత ఇరవైయ్యేళ్లుగా ఆ పార్టీల మధ్య దాయాది పోరు నడుస్తోంది. అదీగాక ఉద్ధవ్ నేతృత్వంలోని శివసేన (యూబీటీ) ఎన్సీపీ, కాంగ్రెస్‌లతో ఇప్పటికే మహావికాస్ అఘాదీ(ఎంవీఏ)లో భాగస్వామిగా ఉంది. సోదరులిద్దరూ ఏకమైతే ఎంవీఏ కూటమి అయోమయంలో పడుతుంది. ఉద్ధవ్ ఆ రెండు పార్టీలతో కలిసి ప్రయాణించగలుగుతున్నారు. కానీ రాజ్ అందుకు సిద్ధపడతారా లేక వారిద్దరూ కలిసి ఇక ఎంవీఏ కథ ముగిస్తారా అన్నది చూడాల్సి ఉంది. కానీ ఈ కలయిక రాజకీయాల్లో ఒక కొత్త దూకుడును ప్రవేశపెట్టింది. ముంబైలో బతకడానికొచ్చినవారు మరాఠీ నేర్చుకు తీరాలని విజయోత్సవ ర్యాలీలో రాజ్ ప్రకటించారు. ఇక శ్రేణులు రెచ్చిపోవటంలో వింతేముంది? నిజానికి ఆ ప్రకటనకు ముందే ముంబైలో ప్రముఖ ఇన్వెస్టర్ సుశీల్ కేడియా 'మరాఠీ నేర్చుకొనేది లేదం'టూ ట్విటర్‌లో ప్రకటించాక ఈ నెల 3న ఎంఎన్‌ఎస్ శ్రేణులు ఆయన కార్యాలయంపైబడి విధ్వంసానికి పూనుకున్నాయి. దీన్ని రాజ్ ఖండించకపోగా 'మరాఠీ మాట్లాడనంత మాత్రాన ఎవరినీ కొట్టనవసరం లేదు. కానీ అనవసర డ్రామాకు దిగేవారి కర్ణభేరికి కింద తగిలేలా కొట్టండ'ని పిలుపునిచ్చారు.

భాషాధిపత్యం తగువు ఈనాటిది కాదు. దేశానికి జాతీయ భాష అవసరమనీ, అది హిందీ అయితీరాలనీ జాతీయోద్యమ కాలంలో కాంగ్రెస్ నేతలు వాదించారు. వారిపై వినాయక్ దామోదర్ సావర్కర్, ఆరెస్సెస్‌ల ప్రభావం ఉంది. కానీ తమిళనాడు ద్రవిడ ఉద్యమ నాయకులతోపాటు ప్రఖ్యాత తెలుగు రచయిత శ్రీపాద సుబ్రహ్మణ్య శాస్త్రి వంటి వారు హిందీ వ్యతిరేకతను చాటారు. స్వాతంత్ర్యం వచ్చాక హిందీని జాతీయ భాషగా చేయబోమని హామీ ఇస్తేనే కాంగ్రెస్‌తో కలిసి నడవాలని ఆయన పిలుపునిచ్చారు. ప్రస్తుత ఎన్డీయే పాలకులు మాత్రమే కాదు... యూపీఏ ఏలుబడిలో సైతం హిందీ ఆధిపత్యాన్ని నిలపాలని శతథా ప్రయత్నించారు. దక్షిణాదిన అందుకు ప్రతిఘటన వస్తూనే ఉంది. భాషా సంస్కృతులు సున్నితమైనవి. ప్రజామోదం లేకుండా వాటి జోలికి పోకపోవటం ఉత్తమం. ప్రస్తుతానికి రాజకీయంగా అయోమయంలో ఉన్న థాక్రే సోదరులకు మరో ఆర్నెల్లలో జరగబోయే స్థానిక ఎన్నికలకు హిందీ జీవో అందివచ్చిందన్నది వాస్తవం. ప్రజల మనోభావాల్ని బేఖాతరు చేస్తే అధికార కూటమికి చేటు వచ్చే అవకాశం కూడా లేకపోలేదు.

జీఎస్టీ చిక్కుముళ్లు వీడేనా?

విశ్లేషణ



డా॥ ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు



ఎట్టకేలకు కేంద్ర ప్రభుత్వం జీఎస్టీపై ఎన్నో ఏళ్లుగా పట్టిన మంకుపట్టు సడలించి పేద, మధ్య తరగతి వర్గాలకు ఊరట కల్పించేందుకు వస్తు సేవల పన్ను (జీఎస్టీ)లో కొన్ని మార్పులు తేవడానికి సమాయత్తం అయింది. ప్రస్తుతం 12% శ్లాబులో ఉన్న నిత్యావసర వస్తువులపై పూర్తిగా పన్నును తొలగించడం లేదా చాలా వస్తువులను 5% పరిధిలోకి తీసుకొచ్చే అంశాన్ని పరిశీలిస్తున్నట్లు కేంద్ర ప్రభుత్వ వర్గాలు పేర్కొంటున్నాయి. ఈ నెలఖరులో జరగనున్న జీఎస్టీ కౌన్సిల్ 56వ సమావేశంలో ఈ మేరకు తుది నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది.

ప్రజల వినియోగ సామర్థ్యాన్ని పెంచడానికి జీఎస్టీ తగ్గింపు నిర్ణయం తీసుకుంటున్నట్లు అర్థం అవుతున్నది. వస్తువుల ధరలు తగ్గితే విక్రయాలు పెరగడం వల్ల ఉత్పత్తి రంగం కళకళలాడే అవకాశం ఉంది. గత కొన్నేళ్లుగా జీఎస్టీకి సంబంధించి ఎవరేమి మాట్లాడినా సమాధానం ఇవ్వకుండా మిన్నకుండిపోయిన ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఇటీవల దేశంలో వినిమయ సంస్కృతిని మరింత పెంచడానికి కేంద్రం కట్టుబడి ఉందని చెబుతున్నారు. పరోక్షంగా ప్రజల కొనుగోలు శక్తిని పెంచడానికి నిత్యావసర వస్తువులపై విధిస్తున్న జీఎస్టీని హేతుబద్ధీకరిస్తున్నట్లు చెప్పకనే చెప్పినట్లయింది.

సరళతరం కాకపోగా చిక్కులు

8 ఏళ్ల క్రితం 'ఒకే దేశం ఒకే పన్ను' అన్నది లక్ష్యంగా, చక్కని సరళతరమైన పన్ను (గుడ్ అండ్ సింపుల్ టాక్స్)గా చెప్పబడిన 'జీఎస్‌టీ' (గూడ్స్ అండ్ సర్వీసెస్ టాక్స్) క్రమంగా తన అర్థాన్ని మార్చుకొంది. 2017 జూలై 1న ఎన్డీఏ ప్రభుత్వం అమలులోకి తెచ్చిన జీఎస్టీ చిన్న, సన్నకారు వ్యాపారుల సమస్యలను తీర్చకపోగా వారికి అనేక చిక్కుముళ్లను తెచ్చి పెట్టింది. నిజానికి, గత 8 ఏళ్లుగా జీఎస్టీపై జరిగినంత చర్చ, వాదోపవాదాలు మరే అంశం మీదా జరగలేదు.

జీఎస్టీ అమలులోకి వచ్చాక దేశంలో పన్ను వసూళ్లు గణనీయంగా పెరిగిన మాట వాస్తవం. ఏటా దాదాపు 8 నుంచి 11 శాతం పైబడి జీఎస్టీ వసూళ్లలో వృద్ధిరేటు కనబడుతోంది. అయితే, జీఎస్టీ అమలు కారణంగానే పన్ను ఎగవేతలు తగ్గాయనీ, 'పన్ను ఉగ్రవాదం' సమసిపోయిందనీ చెప్పడం అర్ధ సత్యమే. జీఎస్టీ వల్ల అనేక సమస్యలు ఉత్పన్నం అవుతున్నాయని పలు వర్గాల వారు గగ్గోలు పెడుతున్నారు. పన్ను రేట్లు, వివిధ శ్లాబులలోకి వచ్చే వస్తువులు, సేవల విషయంలో కేంద్రం, రాష్ట్రాల నడుమ ఇంకా ఏకాభిప్రాయం కుదరకపోవడం గమనార్హం. ముఖ్యంగా, రాష్ట్రాలకు అతిపెద్ద ఆదాయ వనరులుగా ఉన్న పెట్రోల్, డీజిల్, మద్యం వంటి వాటిని జీఎస్టీ పరిధిలోకి చేర్చడాన్ని మెజారిటీ రాష్ట్రాలు వ్యతిరేకిస్తున్నాయి. ఇప్పటికి 55 సమావేశాలు జరిపినప్పటికీ జీఎస్టీ మండలి భేటీలలో పలు అంశాలపై ఏకాభిప్రాయం కుదరడం లేదు.

జీఎస్టీ చిక్కుళ్లలో పన్ను రేట్ల హేతుబద్ధీకరణ ప్రధానమైనది. 5, 12, 18, 28 శాతాలుగా పన్ను రేట్లు ఉన్నాయి. 1,400కు పైబడిన వస్తువులు, 500 రకాల సేవలను ఈ నాలుగు శ్లాబులలో సర్దుబాటు చేశారు. భారీ కసరత్తు అనంతరం రేట్లను ఖరారు చేశామని చెప్పారుగానీ అందులో హేతుబద్ధత, మానవత్వం కనుమరుగయ్యాయన్న విమర్శల్ని సాక్షాత్తూ బీజేపీ నేతలే చేస్తున్నారు.

ఉదాహరణకు జీవిత బీమా, ఆరోగ్య బీమా ప్రీమియంలపై 18% జీఎస్టీ వసూలు చేయడాన్ని వ్యతిరేకిస్తూ కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ తన సహచర మంత్రి నిర్మలా సీతారామన్‌కు బహిరంగ లేఖ సంధించడం కలకలం రేపింది. సామాన్యులకు అవసరమైన జీవిత బీమా, ఆరోగ్య బీమాలపై ఇంత మొత్తం జీఎస్టీ వేయడం వల్ల... వారు జీవిత, ఆరోగ్య రక్షణకు దూరం అవుతారని గడ్కరీ తన లేఖలో పేర్కొన్నారు. వ్యక్తిగత ఆరోగ్య బీమా పాలసీలపై 5% జీఎస్టీ విధించినా కొంతవరకు అర్థం ఉందిగానీ... ఏకంగా 18% పన్ను వేయడం అన్యాయమని పాలసీదారుల అసోసియేషన్ సైతం కేంద్రానికి విన్నవించినప్పటికీ సానుకూల స్పందన రావడం లేదు.

నిత్యావసరాలపై ఇంతా?

ఇక, శ్లాబుల విషయంలో స్పష్టత లోపించడం వల్ల చెల్లింపుదారులకు, వివిధ ప్రభుత్వ విభాగాలకు మధ్య వివాదాలు తలెత్తి చివరకు అవి న్యాయస్థానాలకు చేరుతున్నాయి. అలాగే, కోవిడ్ ప్రబలిన 2020, 2021 సంవత్సరాలలో రాష్ట్రాలకు అందించిన ఆర్థిక సహకారాన్ని తిరిగి రాబట్టుకొనేందుకు కేంద్రం 'సెస్సు' విధించి ప్రజలపై అదనపు భారాన్ని మోపింది. దీన్ని ఉపసంహరించు కోవాలన్న అభ్యర్థనను పెడచెవిన పెట్టింది.

ప్రజల ఆరోగ్యానికి సంబంధించిన ఉత్పత్తులపై, ప్రాణాలు నిలబెట్టే ఔషధాలపై 5% జీఎస్టీ మాత్రమే వేస్తామని చెప్పినప్పటికీ ఆచరణలో భిన్నంగా వ్యవహరించారు. వెన్న, నెయ్యి, పాలు వంటి పాల ఉత్పత్తులపై, ప్యాకింగ్ చేసిన కొబ్బరి నీళ్లు, పండ్ల రసాలపై 18% జీఎస్టీ విధించడం ఏ విధంగానూ సమర్థనీయం కాదు. చివరకు పెన్నులపైన కూడా జీఎస్టీ విధిస్తున్నారు. నిత్యావసర వస్తువులను మినహాయించి విలాస వస్తువుల పైననే పన్ను వేస్తామని చెప్పిన దానికీ, ఆచరణలో చేస్తున్న దానికీ పొంతన ఉండటం లేదు.

ప్రజల ఆరోగ్యానికి హాని కలిగించే పొగాకు ఉత్పత్తులు, శీతల పానీయాలపై 35 శాతం జీఎస్టీ విధించాలంటూ జీఎస్టీ రేట్ల హేతుబద్ధీకరణపై ఏర్పాటు చేసిన మంత్రుల బృందం జీఎస్టీ మండలికి ఓ నివేదిక అందించింది. పన్నులు పెంచితే ఆరోగ్య హానికర ఉత్పత్తుల వాడకాన్ని ప్రజలు మానేస్తారా అన్నది చర్చనీయాంశం. అదే నిజమైతే మద్యం మీద కూడా అధికంగా పన్నులు వేయాల్సి ఉంటుంది.

- జీఎస్టీ అమలు కారణంగానే పన్ను ఎగవేతలు తగ్గాయనీ, 'పన్ను ఉగ్రవాదం' సమసిపోయిందనీ చెప్పడం అర్ధ సత్యమే.
- ప్రజల ఆరోగ్యానికి సంబంధించిన ఉత్పత్తులపై 5% జీఎస్టీ మాత్రమే వేస్తామని చెప్పినప్పటికీ ఆచరణలో భిన్నంగా వ్యవహరించారు.
- జీఎస్టీ అమలులో హేతుబద్ధత లోపించడం వల్ల దెబ్బ తిన్న వాటిల్లో సూక్ష్మ, మధ్యతరహా పరిశ్రమల రంగం ఒకటి. 70% మేర ఉద్యోగ కల్పనకు దోహదం చేస్తున్న ఎంఎస్‌ఎంఇ రంగం జీఎస్టీ కారణంగా కుదేలయిందన్నది చేదు వాస్తవం.

ఎంఎస్‌ఎంఇలకు శరాఘాతం

జీఎస్టీ అమలులో స్పష్టత, హేతుబద్ధత లోపించడం వల్ల దెబ్బ తిన్న వాటిల్లో సూక్ష్మ, మధ్యతరహా పరిశ్రమల రంగం ఒకటి. దేశీయ తయారీ రంగంలో దాదాపు 70% మేర ఉద్యోగ కల్పనకు దోహదం చేస్తున్న ఎంఎస్‌ఎంఇ రంగం జీఎస్టీ కారణంగా కుదేలయిందన్నది చేదు వాస్తవం. చిన్న చిన్న వ్యాపారాలను జీఎస్టీ పరిధిలోకి తెచ్చాక... అవి చాలావరకు మూతబడ్డాయి. ముడి సరుకులపై పన్ను విధించడం, మళ్లీ అంతిమ ఉత్పత్తులపై పన్ను వేయడం వల్ల... దేశంలో దాదాపు 20 కోట్ల మంది ఆధారపడిన సూక్ష్మ, మధ్య తరహా పరిశ్రమలకు తీరని నష్టం కలిగింది. వాటి సప్లయ్ చెయిన్ తెగిపోయిందని ఆ రంగంపై ఏళ్లుగా జీవనం సాగిస్తున్నవారు మొత్తుకొంటున్నారు.

ఒకవైపు వస్తుసేవలను అంతిమంగా వినియోగించుకొనే వారే పన్ను చెల్లించాలని చెబుతూ, మరోవైపు బహుళ పన్నులు వేస్తున్న పరిస్థితి కొన్ని రంగాల్లో ఉంది. వివాదాలు ఏర్పడితే వాటిని పరిష్కరించుకోవడానికి జీఎస్టీ అప్పిలేట్ ట్రిబ్యునల్‌ను అందుబాటులోకి తెచ్చిన మాట నిజమే గానీ... చిన్న వ్యాపారులు ఎంతమంది దానిని ఆశ్రయించగలరు? స్థానిక ప్రజల ఆహారపు అలవాట్లకు అనుగుణంగా ఆయా ఉత్పత్తులపై పన్నులు విధించే హక్కు గతంలో రాష్ట్రాలకు ఉండేది. ప్రజలకు జవాబుదారీతనం ఎక్కువగా వహించేది రాష్ట్రాలే. కానీ, రాష్ట్రాలకు తమ ప్రాంత ప్రజల ప్రయోజనాలను పరిరక్షించే అవకాశం జీఎస్టీ వచ్చాక తగ్గిపోయింది.

జీఎస్టీ వసూళ్లల్లో కనబడుతున్న వృద్ధిని చూసి మురిసిపోవడమే తప్ప... ఎదురవుతున్న ఇబ్బందుల్ని సాధ్యమైనంత తొందరగా పరిష్కరించలేకపోవడం వైఫల్యంగానే పరిగణించాలి. పుట్టుకతోనే లోపాలు ఉన్న బిడ్డగా జీఎస్టీని కొందరు అభివర్ణించారు. మరికొందరు జీఎస్టీ వల్ల దేశానికి అసలైన ఆర్థిక స్వాతంత్ర్యం లభించిందంటున్నారు. వీటి మాటెలా ఉన్నా, అంతిమంగా ప్రజలకు మేలు జరుగుతున్నదా, లేదా అన్నదే కొలమానం.

వ్యాసకర్త ఆంధ్రప్రదేశ్ శాసన మండలి సభ్యులు, కేంద్ర మాజీ మంత్రి

సోషల్ మీడియా

ఇదెందుకు?



హోమియోపతి వైద్యులను అల్లోపతి ప్రాక్టీస్ చేసేట్టుగా మహారాష్ట్ర ప్రభుత్వం అనుమతించనుందనీ, దానికి ఆరు నెలల మోడర్న్ ఫార్మకాలజీ సర్టిఫికెట్ కోర్సు (సీసీఎంపీ) చేస్తే చాలనీ వార్త. హోమియోపతి వైద్యులు హోమియోపతిని నమ్మినప్పుడు, వాళ్లు ఆధునిక ఔషధాలను రాయాల్సిన అవసరం ఏముంది?
– కార్తీక్ బాలచంద్రన్, ఎండోక్రైనాలజిస్ట్

లాబీ చేయగలగాలి!



యూఎస్-ఇండియా వాణిజ్య ఒప్పందాన్ని ఆపుతున్న అంశాల్లో జన్యు మార్పిడి (జీఎం) ఆహారం ఒకటి. జీఎం ఆహారాన్ని ఇండియా ఒప్పుకొనేలా చేయాలని యూఎస్ మీద దాని వ్యవసాయ లాబీ ఒత్తిడి తెస్తోంది. కానీ (దీన్ని వ్యతిరేకించ గలిగే) లాబీయింగ్, పీఆర్ విషయంలో ఇండియా బలహీనంగా ఉంది.
– రాజీవ్ మల్హోత్రా, రచయిత

ఇది చవక కదా!



లక్ష రూపాయలకు మీకు యూకేకు పదేళ్ల వీసా వస్తుంది. వరుసగా ఆరు నెలలు అక్కడుండి, మళ్లీ కొన్ని నెలల తర్వాత తిరిగి వెళ్లొచ్చు. అలాంటప్పుడు దుబాయిలో ఉండటానికి 23 లక్షల రూపాయలు ఎందుకు చెల్లించాలి? – అనింద్యో చక్రవర్తి, ఆర్థికాంశాల జర్నలిస్ట్

ముందు జాగ్రత్త



అక్రమంగా ప్రవేశించే వారిని నిరోధించడానికి జర్మనీ, లిథువేనియాలతో ఉన్న సరిహద్దుల్లోకి పోలండ్ తన సైన్యాన్ని పంపుతోంది. అక్రమ వలసల మీద ఎట్టకేలకు చర్య మొదలైంది.
– పీటర్ స్వీడన్, జర్నలిస్ట్

స్వీయ మేలు



క్రమశిక్షణ అనేది స్వీయ గౌరవపు అత్యున్నత రూపం అని గుర్తించిన రోజున మీ యావజ్జీవితం మారిపోతుంది. ఇప్పటికిప్పుడు కావాల్సినది ఏమిటో కాకుండా మీకు అత్యంత ఎక్కువగా కావాల్సిందేమిటో తెలుసుకోవడం అది. మీ మాటను నిలబెట్టుకోవడం. మీ భవిష్యత్ రూపానికి మీరు సాయం చేసుకోవడం.
– సాహిల్ బ్లూమ్, ఇన్వెస్టర్

ఇన్ బాక్స్

దేశభక్తిలో విద్యార్థి శక్తి

విద్యార్థుల శక్తిని దేశ నిర్మాణానికి వినియోగించాలన్న గొప్ప లక్ష్యంతో ఏర్పడిన 'అఖిల భారతీయ విద్యార్థి పరిషత్' (ఏబీవీపీ) ఈ రోజు (జూలై 9) తన ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా జరుపుకొంటోంది. దేశవ్యాప్తంగా ఉన్న లక్షలాది విద్యార్థులు ఈ సంస్థ ద్వారా దేశభక్తి, జాతీయ ఐక్యత, సామాజిక బాధ్యత వంటి విలువలను అవలంబిస్తూ విద్యారంగంలో మార్పునకు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ప్రత్యేకంగా విద్యా నాణ్యత, ఉపాధ్యాయ నియామకాలు, రీజనల్ యూనివర్సిటీ అభివృద్ధి; బీసీ, ఎస్సీ, ఎస్టీ విద్యార్థుల కోసం ప్రత్యేక హాస్టల్స్, ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ వంటి వివిధ అంశాల కోసం ఏబీవీపీ చేస్తున్న కృషి అసాధారణమైనది. ప్రాంతీయ సమస్యలను జాతీయ దృక్పథంతో అనుసంధానం చేసి, విద్యార్థి సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పాటు పడుతోంది. సమాజంలోని సాంఘిక, ఆర్థిక సమస్యలపై చర్చకు వేదికగా ఉంటూ రాజకీయంగా బాధ్యతాయుతమైన నాయకత్వాన్ని తయారు చేస్తోంది.



ఏబీవీపీ స్థాపనకు మూలంగా ఉన్న ఆలోచనలు స్వాతంత్ర్యానంతర భారతదేశ విద్యా, సాంస్కృతిక సామాజిక పరిస్థితులకు స్పందనగా తలెత్తినవే! 1948లో ప్రారంభమై, 1949లో ఢిల్లీలో అధికారికంగా ఆవిర్భవించిన ఈ విద్యార్థి సంస్థ 'రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్'(ఆర్‌ఎస్‌ఎస్) సిద్ధాంతాల ఆధారంగా అభివృద్ధి చెందింది. 'జ్ఞానం, శీలం, ఏకత' ఏబీవీపీ నినాదం. 2024–25 నాటికి ఈ సంస్థకు 60 లక్షలకు పైగా సభ్యులు ఉండటం యువతలో దీని పట్ల ఉన్న విశ్వాసాన్ని తెలుపుతోంది.

విద్యార్థుల సమస్యలపై చురుకుగా స్పందిస్తూ విద్యా రుసుముల నియంత్రణ, ఉద్యోగ అవకాశాల పెంపుదల, హాస్టల్ సమస్యల పరిష్కారానికి ఉద్యమాలు చేపట్టడం ద్వారా ఈ సంస్థ విశ్వసనీయతను పెంచుకుంది. 1983లో జరిగిన 'సేవ్ అస్సాం' ఉద్యమంలో భాగంగా 'చలో గౌహతి', 1990లో జాతీయ ఏకత్వం కోసం నిర్వహించిన 'చలో కాశ్మీర్'లో పాల్గొంది. ఇటీవలి కాలంలో కోవిడ్ మహమ్మారి సమయంలో కూడా దేశవ్యాప్తంగా లక్షలాది మందికి ఆహారం, ఔషధాలు, ప్లాస్మా దానం వంటి సేవా కార్యక్రమాలను నిర్వహించి సేవలందించింది. ప్రస్తుత కేంద్ర హోం మంత్రి అమిత్ షా, కేంద్ర మాజీ మంత్రి అనురాగ్ ఠాకూర్, ప్రముఖ పార్లమెంటేరియన్ డా. సత్యపాల్ సింగ్, ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగీ ఆదిత్యనాథ్, భారత మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు వంటి నాయకులు ఈ సంస్థ ద్వారా రాజకీయ జీవితాన్ని ప్రారంభించినవారే. ఆంధ్రప్రదేశ్‌లో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన పీవీఎన్ మాధవ్, తెలంగాణ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా నియమితులైన రామచంద్రరావు కూడా ఏబీవీపీ నుంచి వచ్చినవారే. కులం, మతం, ప్రాంతం అనే ప్రామాణికతలకు అతీతంగా దేశాన్ని విశ్వగురువుగా తీర్చిదిద్దే దిశగా విద్యార్థి శక్తిని ఏబీవీపీ ఉపయోగిస్తోంది.

– డా॥ తారకేశ్వరరావు ఇప్పిలి । ఏబీవీపీ ఏపీ ఉపాధ్యక్షుడు
(నేడు ఏబీవీపీ ఆవిర్భావ దినోత్సవం)

నల్ల చట్టాలను విరమించుకోవాలి!

సందర్భం



జూలకంటి రంగారెడ్డి

139 సంవత్సరాల క్రితం కార్మికుల ప్రాణత్యాగాల ఫలితంగా ఎనిమిది గంటల పని దినాలు సాకారం అయ్యాయి. ఆ పని గంటలతో పాటు అనేక ఇతర కార్మిక ప్రయోజనాలూ నేటి పాలకుల నల్ల చట్టాల కారణంగా కనుమరుగయ్యే పరిస్థితి వచ్చింది. అమలులో ఉన్న 29 కార్మిక చట్టాలను కుదించి, వాటి స్థానంలో నాలుగు లేబర్ కోడ్‌లు కేంద్ర పాలకులు తీసుకువచ్చారు. ఈ నాలుగు లేబర్ కోడ్‌ల అమలు ఆ యా రాష్ట్రాల ఇష్టానికి వదిలి గెజిట్ విడుదల చేశారు. 2024 ఎన్నికల తర్వాత బీజేపీ కూటమి ప్రభుత్వాలు కొత్తగా కేంద్రం తెచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను అమలు జరుపుతున్నాయి. దీనిలో భాగంగా 10 నుంచి 12 గంటల పని దినాలు అమలు జరిపేందుకు ఇటీవల కాంగ్రెస్ నేతృత్వంలోని కర్ణాటక ప్రభుత్వం కూడా పచ్చ జెండా ఊపింది. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు క్యాబినెట్ దీనికి ఆమోదముద్ర వేసింది. ఫలితంగా ఏపీలో పనిదినాన్ని 9–10 గంటలుగా నిర్ణయించారు. మహిళలు రాత్రిపూట పనిచేయడానికి కూడా ఈ సవరణ అనుమతిస్తున్నది. చట్ట రూపంలో అమలు అయితే ఓవర్ టైమ్ కూడా 75 గంటల నుండి 144 గంటల వరకు ఇవ్వొచ్చు. ప్రభుత్వం మహిళలకు సమాన అవకాశాల పేరిట రాత్రిపూట పని చేయడానికి చేసే సవరణ వల్ల, అందుకు అంగీకరించని మహిళల ఉద్యోగ భద్రత ప్రమాదంలో పడుతుంది.



కేంద్ర ప్రభుత్వం తీసుకు వచ్చిన నాలుగు లేబర్ కోడ్‌ల వల్ల కార్మిక వర్గం హక్కులు ప్రమాదంలో పడతాయి.

ఆంధ్రప్రదేశ్ బాటలో తెలంగాణలో రేవంత్ రెడ్డి ప్రభుత్వం సైతం అధిక పని గంటలు అమలు జరిపేందుకు ఉత్తర్వులు జారీ చేసింది. దీని ప్రకారం వాణిజ్య సంస్థల కార్మికులు, ఉద్యోగులు రోజుకు 10 గంటలు పనిచేయాలి. అయితే వారానికి 48 గంటల కన్నా ఎక్కువ పని చేయడానికి వీలు లేదనీ, అంతకుమించి పనిచేస్తే ఓవర్ టైం వేతనాలు చెల్లించాలనీ... కార్మిక శాఖ ఉత్తర్వుల్లో ఉన్నప్పటికీ ఓవర్ టైం పనిచేయడానికి పరిస్థితులు సహకరించని వాళ్ళను పని నుంచి తొలగించే అవకాశాలు ఏర్పడతాయి. యాజమాన్యాలు తమ అధిక లాభాల కోసం ఓవర్ టైం చేయాలని కార్మికులు, ఉద్యోగుల మీద ఒత్తిడి చేసే అధికారం నూతన లేబర్ కోడ్‌లు ఇస్తున్నాయి.

కేంద్ర ప్రభుత్వం తీసుకు వచ్చిన 2020 పారిశ్రామిక సంబంధ నాలుగు లేబర్ కోడ్‌ల వల్ల కార్మిక వర్గం హక్కులు ప్రమాదంలో పడతాయి. ఈ కొత్త చట్టాల ప్రకారం కార్మికులు తమ హక్కుల కోసం సమ్మె చేయడానికి అనేక ఆటంకాలు ఉన్నాయి. 100 మంది కంటే తక్కువ మంది కార్మికులు పనిచేస్తున్న సంస్థల నుండి వారిని తొలగించడం యాజమాన్యాలకు సులభం అవుతుంది. కార్మిక సంఘాల ఏర్పాటు చేసుకోవడం క్లిష్టంగా తయారవుతుంది. 10 మంది కంటే తక్కువ కార్మికులు పనిచేసే కంపెనీలో వృత్తిపరమైన భద్రత, ఆరోగ్య సంక్షేమం వంటి హక్కులు కోల్పోతారు. నాలుగో లేబర్ కోడ్ అమలు ద్వారా కార్మికులకు ఈఎస్ఐ, పీఎఫ్, గ్రాట్యుటీ రక్షణ లేకుండా పోతుంది. కేంద్ర ప్రభుత్వ పరిధిలో పనిచేస్తున్న కోటి మందికి పైగా కార్మికులకు ఈ కోడ్ వల్ల ప్రయోజనం లేకుండా పోతుంది.

ఇప్పటికే వివిధ రాష్ట్ర ప్రభుత్వాల పరిధిలో కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్, పార్ట్ టైం వంటి రకరకాల పేర్లతో వివిధ ప్రభుత్వ శాఖల్లో లక్షలాది మంది ఉద్యోగులు పనిచేస్తున్నారు. యూనివర్సిటీలు కాలేజీలు, ఆదర్శ పాఠశాలలు, ఆశ్రమ పాఠశాలల్లో కూడా ఈ విధానం కొనసాగుతున్నది. ఏళ్ల తరబడి శాశ్వత ప్రాతిపదికన విధులు నిర్వహిస్తున్నప్పటికీ వారికి కాంట్రాక్ట్ ప్రాతిపదికన తక్కువ వేతనాలు చెల్లిస్తున్నారు. నాలుగు లేబర్ కోడ్‌లు దేశవ్యాప్తంగా పూర్తిస్థాయిలో అమలు జరిగితే వివిధ రంగాల కార్మికులు, ఉద్యోగుల జీవితాలు దుర్భరంగా దిగజారిపోతాయి.

రాజ్యాంగ విలువలకు తూట్లు పొడుస్తూ ప్రజల ప్రజాస్వామ్య హక్కులను పాతర వేసేందుకు బీజేపీ తహతహలాడుతున్నది. ఫెడరల్ స్ఫూర్తికి భంగం కలిగిస్తూ ఆ యా రాష్ట్రాలలో బీజేపీయేతర ప్రభుత్వాలను ఇరుకున పెట్టే చర్యలకు పాల్పడుతున్నారు. రాష్ట్రాలు స్వయం నిర్ణయాధికారం కలిగిన అంశాల్లో కూడా గవర్నర్ ద్వారా ఇబ్బందులు పెడుతున్నారు. జీఎస్టీ ద్వారా రాష్ట్రాలకు సముచితంగా అందాల్సిన వాటాను ఇవ్వకుండా నిరంకుశ పోకడలు అనుసరిస్తున్నారు. రాష్ట్రాల అధికారాల్లో వేలు పెడుతూ ఆ యా రాష్ట్రాలను స్థానిక సంస్థల స్థాయికి కుదించే విధంగా కేంద్రంలో బీజేపీ కూటమి ప్రభుత్వం వ్యవహరిస్తున్నది. ఈ దేశ ప్రజల భవిష్యత్తుని కార్పొరేట్లకు తాకట్టు పెట్టే పాలనకు వ్యతిరేకంగా ప్రజలు ఐక్యంగా పోరాడాలి. ఈ నేపథ్యంలో వామ పక్ష, ప్రజాతంత్ర, సెక్యులర్ పార్టీలూ, ప్రజాసంఘాలూ, కార్మిక–ఉద్యోగ సంఘాలూ జూలై 9న (నేడు) దేశ వ్యాప్త సార్వత్రిక సమ్మెకు పిలుపునిచ్చాయి. ఈ సమ్మెను జయప్రదం చేయడానికి అందరూ సహకరించాలి!

వ్యాసకర్త సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు, తెలంగాణ రాష్ట్ర కమిటీ

సాక్షి ఎడిటోరియల్ పేజీకి వ్యాసాలను, అభిప్రాయాలను యూనికోడ్‌లో పంపాలి. ఎక్కడా పరిశీలనలో లేనట్టు హామీపత్రం జతచేయాలి.
ఈ–మెయిల్: editpage@sakshi.com ఎడిట్ పేజీలో ప్రచురితమయ్యే వ్యాసాలను ఆ యా రచయితల వ్యక్తిగత అభిప్రాయాలుగా గమనించాలి.

కాపాడే దేవత



లంబాడీ గిరిజనులు ఎంతో పవిత్రంగా జరుపుకొనే పండుగే... 'సీత్లా భవాని' వేడుక. గిరిజన సంప్రదాయంలో లంబాడీలు చేసుకునే తొలి పండుగ కూడా ఇదే. ప్రకృతిని ఆరాధిస్తూ... పంటలను, పశు సంపదను, ఆయురారోగ్యాలను ప్రసాదించాలని వేడుకుంటారు. ఈ పండుగ, బోనాల వేడుకలు ఒకే కాలంలో రావడం గమనార్హం. వర్షాకాలంలో రకరకాల అంటువ్యాధులు ప్రబలే అవకాశం ఉంది కాబట్టి అటు హిందువులూ, ఇటు లంబాడీ గిరిజనులూ తమ తమ గ్రామదేవతలకు బోనాలు ఎత్తి పూజించి మొక్కులు చెల్లించుకుంటూ ఆ వ్యాధుల బారిన పడకుండా కాపాడమని వేడుకుంటారు.

సీత్లా భవాని కలరా వంటి మహమ్మారులు ప్రబలకుండా కాపాడుతుందని బంజారాల నమ్మకం. తండాలో ఉన్న పశువులు, గొర్లు, మేకలు, కోళ్లు, పశు సంపద పెరగాలనీ; దూడలకు పాలు సరిపోను ఉండాలనీ, తమ పశువులకు గడ్డి బాగా దొరకాలనీ, క్రూర మృగాల బారిన పడకుండా వాటిని కాపాడాలనీ, అటవీ సంపద తరగకూడదనీ సీత్ల తల్లికి మొక్కులు తీర్చుకుంటారు. ఈ పండుగను వివిధ తండాల్లో ఆ తండా ప్రజలు, పెద్ద మనుషులంతా కలిసి ఆషాఢ మాసంలో ఏదో ఒక మంగళవారం ఎంచుకొని జరుపుతారు. ప్రతి సంవత్సరం కేవలం మంగళవారం మాత్రమే జరపడం ఆనవాయితీ.

తండాల సరిహద్దుల్లోని పొలిమేర, కూడలి వద్ద సీత్ల భవాని సాధారణంగా ప్రతిష్ఠితమై ఉంటుంది. పురుషులంతా డప్పు వాయిద్యాలు వాయిస్తూ కోళ్లు, మేకలతో; మహిళలు బోనాలు ఎత్తుకుని నృత్యాలు చేసుకుంటూ అక్కడికి వెళ్తారు. ఈ క్రమంలో అందరూ కలిసి పాటలు పాడుతారు. ప్రత్యేక పూజలు చేస్తారు. అమ్మవారికి నైవేద్యంగా గుగ్గిళ్లు, లాప్సి పాయసం సమర్పిస్తారు. కోళ్లు, మేకలను బలి ఇచ్చి వాటి పైనుంచి పశువులను దాటిస్తారు. దేవతను పూజించే ప్రక్రియలో తండా పెద్ద మనిషి పూజారిగా వ్యవహరించి పూజా కార్యక్రమాలు నిర్వహించడం గమనార్హం.

– నరేష్ జాటోత్ । నల్గొండ

గ్రహం అనుగ్రహం

శ్రీ విశ్వావసు నామ సంవత్సరం, ఉత్తరాయణం, గ్రీష్మ ఋతువు, ఆషాఢ మాసం, **తిథి:** శు.చతుర్దశి రా.1.11 వరకు, తదుపరి పౌర్ణమి, **నక్షత్రం:** మూల తె.5.21 వరకు (తెల్లవారితే గురువారం), తదుపరి పూర్వాషాఢ, **వర్జ్యం:** ప.12.06 నుండి 1.50 వరకు, తదుపరి రా.3.37 నుండి 5.21 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.11.39 నుండి 12.31 వరకు, **అమృతఘడియలు:** రా.10.15 నుండి 11.53 వరకు; **రాహుకాలం:** ప.12.00 నుండి 1.30 వరకు, **యమగండం:** ఉ.7.30 నుండి 9.00 వరకు, **సూర్యోదయం:** 5.35, **సూర్యాస్తమయం:** 6.35.

హిడ్మా టార్గెట్‌గా ఆపరేషన్

- మావోయిస్టు కీలక నేత సమీపానికి వెళ్లగలిగిన భద్రతా దళాలు
- చివరి నిమిషంలో తప్పించుకున్న 'మోస్ట్ వాంటెడ్'?



సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ సభ్యుడు మడావి హిడ్మా అలియాస్ సంతోష్ మరోసారి వార్తల్లో నిలిచాడు. హిడ్మాను పట్టుకునేందుకు వేలాదిగా పోలీసు బలగాలు ఛత్తీస్‌గఢ్‌లోని ఇంద్రావతి నేషనల్ పార్క్‌ను 3 రోజులుగా గాలిస్తున్నాయి. అయితే భద్రతా దళాల కన్నుగప్పి ఆయన తప్పించుకున్నట్టు సమాచారం.

హిడ్మా లొంగిపో..

మడావి హిడ్మాతోపాటు పీపుల్స్ లిబరేషన్ గెరిల్లా ఆర్మీ బెటాలియన్ వన్ కమాండర్ బార్సే దేవా ఎక్కడ ఉన్నారనే అంశంపై కచ్చితమైన సమాచారం తమకు లభించిందని, వారి కోసం గాలింపు చర్యలు చేపడుతున్నామని బస్తర్ రేంజ్ ఐజీ సుందర్‌రాజ్ ఆదివారం ప్రకటించారు. ఆయుధాలు వదిలేసి లొంగిపోవాలని కూడా మావోయిస్టులకు ఆయన సూచన చేశారు. ఐజీ నుంచి ప్రకటన వెలువడ్డాక ఇంద్రావతి నేషనల్ రిజర్వ్ పార్క్‌లో గాలింపు చర్యలు ముమ్మరంగా సాగాయి. మరోవైపు ఇంద్రావతి నేషనల్ పార్క్‌లో జరుగుతున్న కూంబింగ్, ఫైరింగ్ ఆపేయాలని ప్రొఫెసర్ హరగోపాల్ డిమాండ్ చేశారు. దీంతో మంగళవారం ఈ ఆపరేషన్‌కు సంబంధించి కీలక సమాచారం వెలువడుతుందనే అంచనాలు నెలకొన్నాయి.

పది రోజులుగా గాలింపు..

మావోయిస్టు అగ్రనేతలు ఎక్కడున్నారు.. వారి కదలికలు ఎలా ఉన్నాయనే దానిపై పోలీస్ ఇంటెలిజెన్స్ విభాగం తీవ్రంగా శ్రమిస్తోంది. ఇందుకోసం మానవ వనరులతో పాటు ఆధునిక టెక్నాలజీని ఉపయోగిస్తోంది. ఈ క్రమాన అనేక మంది అగ్రనేతలకు సంబంధించిన జాడ తెలిసిన వెంటనే కూంబింగ్ మొదలుపెట్టారు. మావోలకు పట్టున్న ప్రాంతాల నుంచి వారిని బయటకు రప్పించేలా వ్యూహాత్మకంగా సెర్చ్ ఆపరేషన్లు చేపట్టారు. భద్రతా దళాలకు ప్రతికూల పరిస్థితులు తక్కువగా ఉండే చోటుకు మావోలు వచ్చాక కూంబింగ్ తీవ్రతరం చేశారు. ఈ ఏడాది అగ్రనేతలు చనిపోయిన ఎదురుకాల్పుల్లో ఈ తరహా వ్యూహాలనే ఎక్కువగా అమలు చేసినట్టు సమాచారం. ఇదే మాదిరి మడావి హిడ్మా, బార్సే దేవా విషయంలోనూ పది రోజుల కిందట ఆపరేషన్ మొదలైనట్టు తెలుస్తోంది.

హిడ్మా ప్రధాన అనుచరుడి ఎన్‌కౌంటర్ తర్వాత...

గత నెల చివరి వారంలో హిడ్మా జాడపై పోలీసులకు కీలక సమాచారం అందినట్టు తెలుస్తోంది. అయితే భద్రతా దళాలు లక్ష్యంగా అంబూష్ దాడులు చేయడంలో హిడ్మాకు ఉన్న ట్రాక్ రికార్డును దృష్టిలో ఉంచుకొని తొందరపడలేదని సమాచారం. ముందు జాగ్రత్తలో భాగంగా సెర్చ్ ఆపరేషన్‌ను రహస్యంగా కాకుండా బహిరంగపరిచారనే వాదనలు వినిపిస్తున్నాయి. జూన్ 29, 30వ తేదీల్లో 'భద్రతా దళాల రాడార్‌లో హిడ్మా.. ఏ క్షణమైనా దాడి జరగొచ్చు'అంటూ సోషల్ మీడియాలో జోరుగా సాగిన ప్రచారం ఆ ముందు జాగ్రత్తలో భాగమేనని తెలుస్తోంది. ఆ తర్వాత 'ఇంద్రావతి'ప్రాంతంలో ఈనెల 5న జరిగిన ఎదురు కాల్పుల్లో ఒక మావోయిస్టు చనిపోయాడు. సదరు వ్యక్తి మావోయిస్టు హిడ్మా ప్రధాన అనుచరుల్లో ఒకరని, పీఎల్‌జీఏ కంపెనీ-1లో స్నైపర్‌గా పని చేసేవాడని రెండు రోజుల తర్వాత బయటపడింది. దీంతో హిడ్మా బస చేసిన స్థావరం దగ్గరికి చేరినట్టుగా భద్రతా దళాలు అంచనా వేసి, గాలింపును మరింత ఉధృతం చేశాయి. ఈనెల 6 నుంచి 8 వరకు ఆ ప్రాంతంలో జల్లెడ పట్టినా హిడ్మా, దేవాల జాడ దొరకలేదు. వర్షాల కారణంగా చిక్కబడిన అడవి, కురుస్తున్న వర్షాలు, పొంగుతున్న వాగులు సైతం భద్రతా దళాల వేగానికి ప్రతిబంధకంగా మారినట్టు సమాచారం. ఇదే సమయాన యాంటీ నక్సల్స్ ఆపరేషన్‌లోని టీమ్‌ల కన్నుగప్పి హిడ్మా తప్పించుకున్నట్టు తెలుస్తోంది.

క్లుప్తంగా...

సాగర్‌పై మా బలగాలను అనుమతించండి

కృష్ణా బోర్డుకు తెలంగాణ ఈఎన్సీ లేఖ

సాక్షి, హైదరాబాద్: నాగార్జునసాగర్ ప్రాజెక్టు కుడిభాగంలోని మూడు సెక్యూరిటీ గార్డు పోస్టుల వద్ద తెలంగాణ స్టేట్ స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్ (టీజీఎస్పీఎఫ్) బలగాలను మోహరించడానికి అనుమతించాలని కృష్ణా నదీ యాజమాన్య బోర్డు (కేఆర్‌ఎంబీ)కు తెలంగాణ రాష్ట్రం విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు రాష్ట్ర నీటిపారుదల శాఖ ఈఎన్సీ (జనరల్) అంజాద్ హుస్సేన్ ఈ నెల 4న కృష్ణా బోర్డు చైర్మన్‌కు లేఖ రాశారు. ఏపీ ప్రభుత్వం 2023 నవంబర్ 30న ప్రాజెక్టు కుడిభాగాన్ని తమ పోలీసు బలగాల అధీనంలోకి తీసుకోవడంతో ఏపీ, తెలంగాణ మధ్య వివాదం నడుస్తోంది. ఈ నేపథ్యంలో ప్రాజెక్టు కుడిభాగంలో కేంద్రం సీఆర్‌పీఎఫ్ బలగాలను మోహరించింది.

'ద.మ. రైల్వే' సూపరింటెండెంట్‌పై అక్రమాస్తుల కేసు

సాక్షి, హైదరాబాద్: ఆదాయానికి మించిన ఆస్తులు కలిగి ఉన్నారన్న ఆరోపణలపై దక్షిణ మధ్య రైల్వేలోని సికింద్రాబాద్ డివిజన్ సంచాలన్ భవన్‌లో ఆఫీస్ సూపరింటెండెంట్‌గా పని చేస్తున్న ఏఆర్ రాజశేఖర్‌పై సీబీఐ అధికారులు సోమవారం కేసు నమోదు చేశారు. ఏఆర్ రాజశేఖర్, ఆయన భార్య నవనీతతోపాటు మరి కొందరు ప్రైవేటు వ్యక్తులను ఈ కేసులో నిందితులుగా చేర్చారు. 2017 నుంచి 2023 మధ్య రాజశేఖర్ తన పేరిట, భార్యపేరిట పలు స్థిర, చరాస్తులను కూడబెట్టినట్టు సీబీఐ అధికారులు ఆధారాలు సేకరించారు. మొత్తం రూ.1,54,75,309 విలువైన ఆస్తులు అక్రమంగా సంపాదించినట్టు గుర్తించారు. రాజశేఖర్‌పై ప్రివెన్షన్ ఆఫ్ కరప్షన్ యాక్ట్ సెక్షన్ 13 (2), 13 (1) కింద కేసు నమోదు చేసిన సీబీఐ అధికారులు, రాజశేఖర్ అక్రమార్జనపై దర్యాప్తు చేసేందుకు తెలంగాణ ప్రభుత్వం అనుమతి కూడా తీసుకున్నారు.

సిగాచి ప్రమాదం.. మరో ఇద్దరి మృతి

44కు చేరిన మృతుల సంఖ్య

పటాన్‌చెరు టౌన్ (హైదరాబాద్): పటాన్‌చెరు పాశమైలారం పారిశ్రామికవాడలోని సిగాచి ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్న వారిలో మంగళవారం ఇద్దరు మృతి చెందారు. దీంతో మొత్తం మృతుల సంఖ్య 44కు చేరింది. ధ్రువ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఉత్తర ప్రదేశ్‌కు చెందిన అఖిలేశ్వర్, పనేషియా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఆరిఫ్ మృతి చెందారు. మృతుల కుటుంబాలకు తక్షణ సహాయం కింద రూ.లక్ష అందజేశారు.

ఐసీఏఆర్ నిబంధనలకు విరుద్ధంగా నా బదిలీ

ఉద్యాన వర్సిటీ మాజీ వీసీ నీరజా ప్రభాకర్ వివరణ

సాక్షి, హైదరాబాద్: పదవీ విరమణకు ఏడాది కన్నా తక్కువ కాలం మిగిలి ఉండగా, నిబంధనలకు విరుద్ధంగా జగిత్యాల వ్యవసాయ కళాశాలకు అసోసియేట్ డీన్‌గా తనను బదిలీ చేసిన ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ విశ్వవిద్యాలయంపై న్యాయపరంగా పోరాడుతున్నట్లు శ్రీ కొండా లక్ష్మణ్ తెలంగాణ ఉద్యాన విశ్వవిద్యాలయం మాజీ వైస్‌చాన్సలర్, పీజేటీఎస్ఏయూ సీనియర్ ప్రొఫెసర్ బి.నీరజా ప్రభాకర్ తెలిపారు. మంగళవారం 'సాక్షి'లో ప్రచురితమైన 'వ్యవసాయ వర్సిటీలో కలకలం'వార్తపై ఆమె వివరణ ఇచ్చారు. 'పదవీ విరమణకు ఒక సంవత్సరం కన్నా తక్కువ కాలం మిగిలి ఉండగా నన్ను బదిలీ చేయడం బదిలీ విధానానికి, ఐసీఏఆర్ మార్గదర్శకాలకు, తెలంగాణ సాంకేతిక ఉన్నత విద్యాశాఖ నియమావళికి విరుద్ధం'అని ఆమె చెప్పారు. ప్రస్తుతం ఈ వ్యవహారం న్యాయ పరిధిలో ఉందని తెలిపారు.



సిరిసిల్ల గీతానగర్ స్కూల్‌లో గ్యాస్ స్టౌపై వంటలను ప్రారంభించిన కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా

గ్యాస్ స్టౌపై మధ్యాహ్న భోజనం

- కట్టెల పొయ్యి కష్టాలకు మోక్షం
- రాజన్న సిరిసిల్ల జిల్లాలో 458 స్కూళ్లలో అమలు
- రాష్ట్రంలోనే తొలిసారి శ్రీకారం
- సిరిసిల్ల స్కూల్‌లో ప్రారంభించిన కలెక్టర్ సందీప్ కుమార్ ఝా

సిరిసిల్ల: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు వడ్డించే మధ్యాహ్న భోజనాన్ని.. కట్టెల పొయ్యిపై కాకుండా గ్యాస్ సిలిండర్‌పై వండించాలని రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా నిర్ణయించారు. ఈ మేరకు జిల్లాలోని 458 ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనాన్ని వండేందుకు గ్యాస్ కనెక్షన్లు మంజూరు చేశారు. జిల్లా కేంద్రంలోని గీతానగర్ జెడ్పీ హైస్కూల్‌లో మంగళవారం గ్యాస్ స్టౌ వెలిగించి కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, విద్యార్థులకు కట్టెల పొయ్యిపై ఆహార పదార్థాలు వండవద్దని ఆదేశించారు. కట్టెల పొయ్యిలతో వాతావరణ కాలుష్యం, ఇతర ఇబ్బందులు ఎదురవుతున్నాయని పేర్కొన్నారు. జిల్లాలోని 458 ప్రభుత్వ ప్రాథమిక, ప్రాథమిక ఉన్నత, ఉన్నత పాఠశాలల్లో మధ్యాహ్న భోజనాన్ని గ్యాస్ స్టౌలపై సిద్ధం చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో సిరిసిల్ల ఏఎంసీ చైర్మన్ వెల్ముల స్వరూపారెడ్డి, ఎంఈవో దూస రఘుపతి, హెచ్ఎం ఎల్.శారద పాల్గొన్నారు.



సాగర్ వైపు కృష్ణమ్మ పరుగులు

- శ్రీశైలం ప్రాజెక్టు 4 గేట్లు ఎత్తి నీటి విడుదల

సాక్షి, హైదరాబాద్: నాగార్జునసాగర్ జలాశయంలో గంటగంటకు నీటిమట్టం పెరుగుతోంది. శ్రీశైలం ప్రాజెక్టు నాలుగు గేట్లు ఎత్తడంతో వరద సాగర్ వైపు పరుగులు తీస్తోంది. శ్రీశైలం జలాశయానికి నిలకడగా వరద కొనసాగుతోంది. మంగళవారం ఉదయం 6 గంటలకు 1,53,672 క్యూసెక్కుల వరద ఉండగా, జలాశయంలో నీటి నిల్వలు 881 అడుగుల్లో 196.56 టీఎంసీలకు చేరాయి. జలాశయం గరిష్ట నీటిమట్టం 885 అడుగులు, గరిష్ట నిల్వ సామర్థ్యం 215 టీఎంసీలు కాగా, నిల్వలు 199 టీఎంసీలకు చేరడంతో మధ్యాహ్నం 2 గంటల ప్రాంతంలో ప్రాజెక్టు 4 గేట్లను 10 అడుగుల మేర ఎత్తి 1,06,976 క్యూసెక్కుల వరదను కిందకి విడుదల చేశారు. అయితే మంగళవారం రాత్రి 8 గంటల సమయానికి శ్రీశైలం జలాశయానికి వరద ప్రవాహం 1.86 లక్షల క్యూసెక్కులకు పెరిగింది. నీటి మట్టం 882.2 అడుగులకు పెరిగింది. పోతిరెడ్డిపాడు హెడ్‌రెగ్యులేటర్ ద్వారా 20 వేల క్యూసెక్కులను ఏపీ, కల్వకుర్తి లిఫ్టు ద్వారా తెలంగాణ 1600 క్యూసెక్కులను తరలించుకుంటున్నాయి. మొత్తం 1.94 లక్షల క్యూసెక్కులు దిగువకు విడుదలవుతున్నాయి.

ఎగువ నుంచి స్థిరంగా వరద

ఎగువన ఆల్మట్టి, నారాయణపూర్ డ్యామ్‌లలోకి వరద ప్రవాహం స్థిరంగా కొనసాగుతోంది. ఆల్మట్టి డ్యామ్‌లోకి 1.08 లక్షల క్యూసెక్కులు చేరుతుండగా.. లక్షా 15 వేల క్యూసెక్కులను దిగువకు వదులుతున్నారు. నారాయణపూర్ డ్యామ్‌లోకి 1.14 లక్షల క్యూసెక్కులు చేరుతుండగా.. 1.17 లక్షల క్యూసెక్కులు కిందకు వదిలేస్తున్నారు. జూరాల ప్రాజెక్టులోకి 1.25 లక్షల క్యూసెక్కులు చేరుతుండగా.. గరిష్ట నిల్వ సామర్థ్యం 9.66 టీఎంసీలకు గానూ 7.95 టీఎంసీలను నిల్వ చేస్తూ 1.26 లక్షల క్యూసెక్కులను గేట్లు, విద్యుత్ కేంద్రం ద్వారా దిగువకు వదులుతున్నారు. తుంగభద్రలో వరద ఉధృతి కొనసాగుతోంది. డ్యామ్‌లోకి 52 వేల క్యూసెక్కుల నీరు చేరుతుండగా.. 61 వేల క్యూసెక్కులు దిగువకు వదిలేస్తున్నారు. శ్రీశైలం ప్రాజెక్టు నుంచి నాగార్జునసాగర్‌కు 1.94 లక్షల క్యూసెక్కుల వరద వస్తుండటంతో నిల్వలు క్రమంగా పెరుగుతున్నాయి. నీటిమట్టం 531.9 అడుగులకు చేరింది. సాగర్ గరిష్ట నిల్వ సామర్థ్యం 312.05 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 171.88 టీఎంసీలకు చేరింది.

మంగళవారం రాత్రి 8 గంటలకు ప్రధాన ప్రాజెక్టుల్లోకి వరద ప్రవాహాలు, నీటి నిల్వలు
సాక్షి ప్లస్ ఈ-పేపర్‌లో

భద్రాద్రి ఆలయ ఈఓపై దాడి

- పురుషోత్తపట్నం భూ ఆక్రమణదారుల దాష్టీకం
- తెలంగాణ అధికారులు ఏపీలోకి రావొద్దంటూ నినాదాలు



స్పృహతప్పి పడిపోయిన ఈఓ రమాదేవి

భద్రాచలంటౌన్: భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయ ఈఓ ఎల్.రమాదేవిపై ఏపీలోని పురుషోత్తపట్నం గ్రామస్తులు మంగళవారం దాడి చేశారు. గ్రామంలోని దేవస్థానం భూముల్లో కొందరు అక్రమంగా ఇళ్లు నిర్మిస్తున్నారని రెండు రోజుల క్రితం ఆలయ అధికారులకు సమాచారం అందగా, ఏఈఓ భవాని రామకృష్ణ సోమవారం వెళ్లి నిర్మాణాలు ఆపాలని చెప్పగా, స్థానికులు వాగ్వాదానికి దిగారు. దీంతో ఈఓ రమాదేవి మంగళవారం సిబ్బందితో కలిసి మళ్లీ ఆ గ్రామానికి వెళ్లారు. అప్పటికే అక్కడకు భారీసంఖ్యలో చేరుకున్న గ్రామస్తులు.. ఈఓతోపాటు ఆలయ సిబ్బందిపైనా దాడి చేశారు. ఈ భూములు తమవేనని, తెలంగాణ అధికారులు ఇక్కడకు రావొద్దని నినాదాలు చేశారు. కాగా, దాడిలో గాయపడిన ఈఓ స్పృహతప్పి కిందపడిపోగా, ఆమెను భద్రాచలంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం ఈఓ ఆరోగ్య పరిస్థితి నిలకడగానే ఉందని వైద్యులు తెలిపారు. ఈ ఘటనలో దేవస్థానం అటెండర్ వినీల్‌కు కూడా గాయాలయ్యాయి.

మంత్రి కొండా సురేఖ సీరియస్

ఈఓ రమాదేవిపై భూ ఆక్రమణదారులు దాడి చేసిన ఘటనపై దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ తీవ్రస్థాయిలో హెచ్చరిక జారీ చేశారు. ఆలయ అధికారులు, సిబ్బందిపై దాడి చేస్తే సహించేది లేదన్నారు. దేవుడి భూములు కబ్జా చేస్తే పీడీ యాక్ట్ నమోదు చేసి జైలుకు పంపిస్తామని హెచ్చరించారు. భద్రాద్రి రామయ్య ఆలయ భూముల సమస్యను పరిష్కరించాలని ఈ సందర్భంగా ఏపీ ప్రభుత్వాన్ని కోరారు.

దాడిని ఖండించిన ఉద్యోగుల జేఏసీ

- ఈవో రమాదేవిపై దాడిని తెలంగాణ ఉద్యోగ జేఏసీ తీవ్రంగా ఖండించింది.దాడి చేయడం హేయమైన చర్య అని జేఏసీ చైర్మన్ వి.లచ్చిరెడ్డి తెలిపారు. రమాదేవిపై దాడిని వివిధ సంఘాల నేతలు వంగ రవీందర్‌రెడ్డి, కె.గౌతమ్‌కుమార్, కె.రామకృష్ణ, ఎస్.రాములు, రమేశ్‌పాక, బాణాల రాంరెడ్డి, వి.భిక్షంలు కూడా వేర్వేరు ప్రకటనల్లో తీవ్రంగా ఖండించారు.
- ఈవో రమాదేవిపై జరిగిన దాడిని తెలంగాణ రాష్ట్ర సివిల్ సర్వీసెస్ ఎగ్జిక్యూటివ్ బ్రాంచి డిప్యూటీ కలెక్టర్ల సంఘం తీవ్రంగా ఖండించింది. అసోసియేషన్ అధ్యక్షుడు కె.చంద్రమోహన్ ,ప్రధాన కార్యదర్శి భాస్కర్‌రావు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ తో ఫోన్‌లో మాట్లాడి ఘటనకు సంబంధించిన వివరాలు తెలుసుకున్నారు.

ఎన్డీఎస్‌ఏ సూచనల మేరకే గ్రౌటింగ్

ఘోష్ కమిషన్‌కు ఈఎన్సీ అనిల్‌కుమార్ వివరణ

సాక్షి, హైదరాబాద్: నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ (ఎన్డీఎస్ఏ) నిపుణుల కమిటీ మధ్యంతర నివేదికలో చేసిన సిఫారసుల మేరకే కాళేశ్వరం ప్రాజెక్టులోని బరాజ్‌ల పరిరక్షణకు గ్రౌటింగ్ నిర్వహించినట్టు నీటిపారుదల శాఖ ఈఎన్సీ జి.అనిల్‌కుమార్ తెలిపారు. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బరాజ్‌లకు మరింత నష్టం జరగకుండా గతేడాది వరదల ప్రారంభానికి ముందే అత్యవసర మరమ్మతులు నిర్వహించాలని మధ్యంతర నివేదికలో కమిటీ సిఫారసు చేసిందని చెప్పారు. బరాజ్‌ల నిర్మాణంలో లోపాలు, అవకతవకలపై విచారణ నిర్వహిస్తున్న జస్టిస్ పినాకి చంద్రఘోష్ కమిషన్ ఎదుట మంగళవారం ఆయన హాజరై ఈ మేరకు వివరణ ఇచ్చారు. గతేడాది వరదల ప్రారంభానికి ముందే గ్రౌటింగ్ నిర్వహించడంతో బరాజ్‌లకు మరింత నష్టం జరగకుండా నిలువరించగలిగామని వివరించారు. గ్రౌటింగ్ వల్ల వాటి పునాదుల కింద భూగర్భంలోని పరిస్థితులు తారుమారై వాటి వైఫల్యానికి అసలు కారణాలు తెలుసుకునే అవకాశాన్ని కోల్పోయామని తుది నివేదికలో ఎన్డీఎస్ఏ కమిటీ తప్పుబట్టింది. ఈ నేపథ్యంలో గ్రౌటింగ్ ఎందుకు నిర్వహించారని జస్టిస్ ఘోష్ కమిషన్ నోటీసులు జారీ చేయడంతో ఈ మేరకు వివరణ ఇచ్చారు.



పంపిణీకి సిద్ధంగా ఉన్న సైకిళ్లు

నేటి నుంచి మోదీ కానుకగా 20 వేల సైకిళ్ల పంపిణీ

- కార్యక్రమానికి కేంద్రమంత్రి బండి సంజయ్ శ్రీకారం

సాక్షి ప్రతినిధి, కరీంనగర్: కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ కరీంనగర్ వేదికగా మరో వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల్లో పదోతరగతి చదివే విద్యార్థులకు బుధవారం నుంచి ఉచితంగా సైకిళ్లను అందించనున్నారు. మొత్తం 20 వేల సైకిళ్లను పంపిణీ చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ప్రారంభ కార్యక్రమానికి కరీంనగర్ అంబేడ్కర్ స్టేడియం వేదిక కాబోతోంది. తొలుత కరీంనగర్ టౌన్‌లో విద్యార్థులకు సంజయ్ బుధవారం ఉదయం 11 గంటలకు సైకిళ్లను అందజేయనున్నారు. కార్యక్రమానికి కేంద్రమంత్రితోపాటు కలెక్టర్ పమేల సత్పతి, పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం సహా పలువురు ఉన్నతాధికారులు, జిల్లా విద్యాశాఖ అధికారులు హాజరుకానున్నారు. కాగా, రెండేళ్ల కిందట సొంత ఖర్చుతో రూ.2 కోట్ల విలువైన మెడికల్ ఎక్విప్‌మెంట్‌ను సంజయ్ అందించారు. ఇటీవల వేములవాడ, హుజూరాబాద్, హుస్నాబాద్, జమ్మికుంట ఏరియా ఆస్పత్రుల్లో రూ.5 కోట్ల అధునాతనమైన మెడికల్ ఎక్విప్‌మెంట్స్‌ను అందజేశారు.

ఘట్‌కేసర్ మున్సిపల్ కౌన్సిల్ కార్యాలయము, మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా

Lr.No.E1/MCG/100/2025-26 **ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండరు ప్రకటన** తేది:08-07-2025

ఘట్‌కేసర్ మున్సిపల్ కౌన్సిల్‌లో మున్సిపల్ జనరల్ ఫండ్స్ క్రింద రూ.13.00 లక్షలతో అభివృద్ధి పనులు (03 పనులు) చేపట్టుటకు నమోదిత కాంట్రాక్టర్ల నుండి ఇ-ప్రొక్యూర్‌మెంట్ ప్లాట్‌ఫారం https://tender.telangana.gov.inపై ఆన్‌లైన్ టెండర్లు కోరబడుచున్నవి మరియు వాటి కొరకు దిగువ తెలిపిన షెడ్యూలు తేదీలలో సైట్‌ను చూడవచ్చును. 1) బిడ్ ప్రారంభ తేది: 09-07-2025న ఉ.10.00 గం.కు, 2) బిడ్ ముగింపు తేది: 14-07-2025న ఉ.11.00 గం.కు, 3) బిడ్ మూల్యాంకన తేది: 14-07-2025న ఉ.11.01 గం.కు. ఏవైనా ఇతర వివరాల కోసం మీరు దిగువ సంతకందారును కార్యాలయ పని వేళలలో సంప్రదించవచ్చును.

సం/- కమిషనర్, ఘట్‌కేసర్ మున్సిపాలిటీ

DIPR RO No.4742-PP/CL/ADVT/1/2025-26, Dt.:08-07-2025

సూపరింటెండింగ్ ఇంజినీర్ కార్యాలయం
తెలంగాణ రాష్ట్ర విద్య మరియు సంక్షేమ మౌలికసదుపాయాల అభివృద్ధి సంస్థ : హైదరాబాద్

టెండరు ప్రకటన నం.SE/TGEWIDC/HYD/NIT/319 to 333/2025-26, తేది: 07.07.2025

1) ZPHS మొగిలిగిద్ద (గ్రా.), ఫరూక్‌నగర్ (మం.), 2) లైబ్రరీ బిల్డింగ్, బోయిన్‌పల్లి, 3) DIET నేరేడ్‌మెట్, 4) కొండూర్గ్ లైబ్రరీ నిర్మాణం, మరమ్మతులు మరియు నిర్వహణ 5) యాదారం, 6) నజీబ్‌నగర్, MRCs 7) మోదు చింతలపల్లి, 8) దుండిగల్ గండిమైసమ్మ, 9) కాప్రా, 10) TGSWRSC/JC మరమ్మతులు కిస్మాపూర్, 11) GJC మొగిలిగిద్దపై ACR's, 12) కిస్మాపూర్‌లో మరమ్మతులు మరియు నిర్వహణ, 13) నుండి 15) రంగారెడ్డి జిల్లాలో స్కూళ్లలో ACR's కొరకు అర్హతగల కాంట్రాక్టర్ల అందరి నుండి టెండర్లు కోరబడుచున్నవి (**అంచనా వ్యయం** రూ.12.00 లక్షలు నుండి రూ.1000.00 లక్షలు మాత్రమే). క్ర.సం.1 నుండి 9 (1వ పిలుపు) మరియు క్ర.సం. 10 నుండి 15 రీకాల్. **ఆన్‌లైన్‌లో బిడ్ దాఖలుకు మరియు స్వీకరణకు చివరి తేది: 22.07.2025న సా.4.00 గం.** వరకు. పూర్తి వివరాల కోసం స్వయంగా సంప్రదించండి: సూపరింటెండింగ్ ఇంజినీర్ కార్యాలయం, TGEWIDC, 3వ బ్లాక్, 4వ అంతస్తు, రాజీవ్ విద్యా మిషన్ బిల్డింగ్, SCERT కాంపౌండ్, ఇ-సేవ ఎదురుగా, ఎల్బీ స్టేడియం, హైదరాబాద్, ఫోన్ నం. 040-29565991.

సం/- సూపరింటెండింగ్ ఇంజినీర్, TGEWIDC, హైదరాబాద్

DIPR RO No. 4739-PP/CL/Advt/1/2025-26, Dt. 08.07.2025

తల్లిని చంపాడన్న కోపంతో..

- భర్తను హత్య చేసిన ఇద్దరు భార్యలు
- జనగామ జిల్లాలో ఘటన



కనకయ్య (ఫైల్)

లింగాలఘణపురం: అతనికి ఇద్దరు భార్యలు. వారిద్దరూ తోబుట్టువులే. తమ తల్లిని చంపాడన్న పగతో ఉన్న ఆ ఇద్దరూ భర్తను గొడ్డలితో నరికి చంపారు. ఈ ఘటన జనగామ జిల్లా లింగాలఘణపురం మండలం పిట్టలోనిగూడెంలో చోటుచేసుకుంది. ఈ ఘటనకు సంబంధించి సీఐ శ్రీనివాస్‌రెడ్డి, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. పిట్టలోనిగూడేనికి చెందిన కాలియా కనకయ్యకు చొక్కమ్మ, గౌరమ్మలిద్దరూ భార్యలు. మే 18న కనకయ్య.. యాదాద్రి భువనగిరి జిల్లా గుండాల మండలం సుద్దాలలో అత్త జున్నుబాయిని (చొక్కమ్మ, గౌరమ్మల తల్లి) మామిడి తోటలో ఉండగా తాగిన మైకంలో గొడ్డలితో నరికి చంపాడు. మరో గ్రామంలో మామిడితోటలో ఉన్న తన ఇద్దరు భార్యలకు విషయం చెప్పకుండా వారిని తీసుకొని సిద్దిపేటకు పారిపోయాడు. తెల్లవారుజామున విషయం పోలీసులకు తెలిసి కేసు నమోదు చేశారు. దర్యాప్తులో భాగంగా కనకయ్య సిద్దిపేటలో ఉన్నాడన్న సమాచారం మేరకు పోలీసులు అక్కడకు వెళ్లి పట్టుకునేలోపు పారిపోయాడు. ఈ విషయం చొక్కమ్మ, గౌరమ్మలకు తెలియడంతో పిట్టలోనిగూడేనికి తిరిగివచ్చారు. అప్పటినుంచి కనకయ్య పోలీసులకు దొరకకుండా తప్పించుకుంటున్నాడు. ఈ నేపథ్యంలో సోమవారం రాత్రి పిట్టలోనిగూడెం వచ్చిన కనకయ్య భార్యలతో గొడవ పడ్డాడు. దీంతో గూడెంలోని ప్రజలంతా నిద్రలేచి అక్కడకు వచ్చారు. గొడవ తీవ్రంగా జరిగింది. దీంతో కోపోద్రిక్తులైన చొక్కమ్మ, గౌరమ్మలు.. వరుసకు సోదరులైన జనార్దన్, శ్రీనివాసులుతో కలిసి గొడ్డలితో కనకయ్యను హత్య చేశారు. మృతదేహాన్ని గ్రామంలో నుంచి కొద్ది దూరం తీసుకెళ్లి చెట్ల పొదల్లో పడేశారు. కనకయ్య తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్టు సీఐ చెప్పారు.

పీడ విరగడైంది..: నేర చరిత్ర కలిగిన కనకయ్య తాగిన మైకంలో ఏం చేస్తాడో తెలియదని, క్రూరమృగంలా ప్రవర్తించి.. మహిళలతో వావివరుసలు లేకుండా వ్యవహరిస్తాడని గ్రామస్తులు చెప్పుకొచ్చారు. మహిళలు ఇంట్లోనుంచి బయటకు రావాలంటే భయపడే పరిస్థితులు ఉండేవన్నారు. అతని చేష్టలపై గతంలో పంచాయితీలు పెట్టి పోలీసు స్టేషన్‌లో కూడా ఫిర్యాదు చేసినట్టు గ్రామస్తులు చెప్పారు.

తెలంగాణ ప్రభుత్వం - తెలంగాణ హౌసింగ్ బోర్డ్

తెలంగాణ హౌసింగ్ బోర్డ్, KPHB కాలనీలో తాకట్టు రుణభారాలు లేని ల్యాండ్ పార్శిల్ స్వంతం చేసుకొనుటకు అవకాశం కల్పిస్తోంది

ఇ-వేలం ప్రకటన నం. 09/e-Auction/Land Parcel/TGHB/2025, తేది:09.07.2025 — ల్యాండ్ పార్శిల్ కొరకు ఇ-వేలం షెడ్యూలు

క్ర. నం.	ప్రదేశం	జిల్లా	ల్యాండ్ పార్శిల్ విస్తీర్ణం	సర్వే నం.	రిజిస్ట్రేషన్ మరియు బయానా చెల్లింపుకు చివరి తేది	TGHB మీటింగ్ హాల్, 1వ అంతస్తు, గృహకల్ప, M.J. రోడ్, నాంపల్లి, హైదరాబాద్ వద్ద ప్రీ-బిడ్ సమావేశం	ఎకరానికి కనీస సర్కారు ధర కోట్లలో	ఎకరానికి కనీస బిడ్ పెంపుదల రూపాయలు కోట్లలో	బయానా మొత్తం కోట్లలో	ఇ-వేలం తేది
1.	KPHB కాలనీ కూకట్‌పల్లి	మేడ్చల్ - మల్కాజ్‌గిరి	ఎ.7-33 గుం.	1009	19.08.2025, సా.5.00 గం.వరకు	02.08.2025న మ.3.00 గం.కు	40.00	0.50	7.50	20.08.2025న మ.3.00 గం.కు

ఎవరు దరఖాస్తు చేయవచ్చు

- ఎవరైనా వ్యక్తి లేదా వ్యక్తుల సమూహం (18 సంవత్సరాల పై వయసు గల భారత పౌరులు), కంపెనీ (ప్రైవేట్/పబ్లిక్/లిమిటెడ్ లయబిలిటీ పార్ట్‌నర్‌షిప్), ప్రొప్రయిటరీ సంస్థలు, పార్ట్‌నర్‌షిప్ సంస్థలు/ LLPలు, ట్రస్ట్‌లు, నమోదిత సొసైటీలు, ఫైనాన్షియల్ ఇన్‌స్టిట్యూషన్లు, బ్యాంకులు, NBFCలు, రియల్ ఎస్టేట్ ఫండ్స్, రాష్ట్ర ప్రభుత్వ లేదా కేంద్ర ప్రభుత్వ, ప్రభుత్వ శాఖల యొక్క పబ్లిక్ & సెమీ-పబ్లిక్ అండర్‌టేకింగ్స్, జాయింట్ వెంచర్ కన్సార్టియం.
- బిడ్డరు భారతదేశంలో కమర్షియల్/ మల్టీ-పర్పస్ ప్రాపర్టీస్ నిర్మించుటకు/ స్వంతంగా కలిగియుండుటకు అర్హులై ఉండాలి మరియు కాంట్రాక్ట్ కుదుర్చుకొనుటకు అధికారం కలిగి ఉండాలి.
- DIP-GoI ప్రకారం ఆటోమ్యాటిక్ రూట్‌పై 100% వరకు FDI అనుమతించబడుతుంది.
- RBI, GoI/ FEMA/ FERA నిబంధనల ప్రకారం భారతదేశంలో బ్రాంచ్ ఆఫీస్ లేదా ఇతర వ్యాపార ప్రదేశాన్ని నెలకొల్పిన విదేశీ కంపెనీలు అట్టి కార్యకలాపాలు' చేపట్టుటకు అవసరమైనదో లేదా అనుషంగికమైనదో భారతదేశంలో ఏదైనా స్థిరాస్తిని సేకరించవచ్చును.

ముఖ్యాంశాలు

- TGHB/ ప్రభుత్వం స్వంతమైన క్లియర్ టైటిల్‌తో 100% తాకట్టు రుణభారాలు లేని ల్యాండ్ పార్శిల్
- ప్రతిపాదిత ల్యాండ్ పార్శిల్ KPHB కాలనీలో లోధా టవర్స్ మరియు టాటా ఇండీస్ టవర్స్‌కు ఎదురుగా ఉన్నది
- ఇ-వేలం కొరకు ప్రతిపాదించిన ల్యాండ్ పార్శిల్ హైటెక్ సిటీ సమీపాన పూర్తిగా అభివృద్ధి చెందిన ప్రధాన ప్రాంతంలో ఉన్నది.
- సదరు భూమి 100'-00" వెడల్పు ప్రతిపాదిత మాస్టర్ ప్లాన్ రోడ్‌కు అనుకొని ఉన్నందున బిడ్డర్లు హై రైజ్ భవనాలు నిర్మించవచ్చు.

MSTC సెషన్స్ ద్వారా TGHB ల్యాండ్ పార్శిల్ ఇ-వేలం కొరకు లాగాన్ చేయండి: https://www.mstcecommerce.com

లొకేషన్ కొరకు QR కోడ్ స్కాన్ చేయండి
ల్యాండ్ పార్శిల్ (KPHB కాలనీ)

నోటిఫికేషన్ తేది: 09.07.2025
రిజిస్ట్రేషన్ ఫీజు: 1,180/-
(వాపసు రాదు) GSTతో సహా

బ్రోచర్లు మరియు నియమ నిబంధనల వివరాలు వెబ్‌సైట్: tghb.cgg.gov.inలో లభిస్తాయి.

సైట్ సందర్శన మరియు విచారణల' కొరకు: TGHB:9849908954 / 9908523218లపై అన్ని పనిరోజులలో ఉ.10.00 గం. నుండి సా.6.00 గం. మధ్య సంప్రదించవచ్చు

TGHBపై తదుపరి వివరాల కొరకు tghb.cgg.gov.in కు లాగాన్ చేయవలెను.
వేలం వివరాలు మరియు పాల్గొనుట కొరకు www.mstcecommerce.com, www.mstcindia.co.in కు లాగాన్ చేయవలెను.



ధ్వంసం చేస్తూ.. దిశ మార్చుకుంటూ

వేగంగా దూసుకెళ్లే తొలి దేశవాళీ శతఘ్ని సిద్ధం

అహ్మద్‌నగర్: వేగంగా దూసుకెళ్తూ ఎప్పటికప్పుడు తన స్థానాన్ని మార్చుకుంటూ గురిచూసి లక్ష్యాలను ఛేదించే అధునాతన శతఘ్ని విభాగంలో భారత్ మరో ఘనత సాధించింది. తొలిసారిగా గరిష్టస్థాయి స్వదేశీ పరిజ్ఞానంతో దేశవాళీ శతఘ్ని (మౌంటెడ్ గన్ సిస్టమ్-ఎంజీఎస్)ని తయారు చేసినట్లు రక్షణ పరిశోధనాభివృద్ధి సంస్థ (డీఆర్‌డీఓ) ప్రకటించింది. తద్వారా శతఘ్నుల్ని వేగంగా మోహరించే అడ్వాన్స్‌డ్ టోవ్డ్ ఆర్టిలరీ గన్ సిస్టమ్(ఏటీఏజీఎస్)లో భారత్ మరో ముందడుగువేసింది. త్వరలో ఈ ఎంజీఎస్‌ను పూర్తిస్థాయి పరీక్షల కోసం భారత సైన్యానికి అప్పగించనున్నారు. దీర్ఘకాలంపాటు కొనసాగే ఈ పరీక్షల్లో ఎంజీఎస్ తన సత్తాను చాటితే ఆ తర్వాత దీనిని సైన్యంలో విలీనం చేస్తారు. బాలాసోర్, పోఖ్రాన్‌లో దీనిని విజయవంతంగా పరీక్షించి చూశామని వెహికల్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ ఎస్టాబ్లిష్‌మెంట్ (వీఆర్‌డీఈ) చీఫ్ జి.రామమోహనరావు చెప్పారు.

ఎమ్జీఎస్‌ ప్రత్యేకతలు

- 155ఎంఎం/52 కాలిబర్ మందుగుండును పేల్చే సామర్థ్యంతో ఈ అధునాతన శతఘ్నిని రూపొందించారు. డీఆర్‌డీఓకు చెందిన అహ్మద్‌నగర్‌లోని వీఆర్‌డీ దీనిని తయారు చేసింది.
- 85 సెకన్ల వ్యవధిలోనే వేగంగా విచ్చుకుని మందుగుండును లోడ్ చేసుకోగలదు. ఒక నిమిషంలో ఆరుసార్లు బాంబులను ప్రయోగించగలదు.
- మందుగుండును ప్రయోగించగానే తన జాడ శత్రువులకు తెలీకుండా ఉండేందుకు వేగంగా ముడుచుకుని వేరే చోటుకు ప్రయాణం సాగించగలదు. ఒక చోట ఉండి భిన్న దిశలో బాంబులను ప్రయోగించగలదు.
- ఇందులోంచి మందుగుండును పేల్చే గన్ బరువే ఏకంగా 30 టన్నులు.
- గరిష్టంగా 45 కిలోమీటర్ల దూరంలోని లక్ష్యాన్ని సైతం తుత్తునియలు చేయగలదు. దీని క్యాబిన్‌ను పూర్తిగా బుల్లెట్ ప్రూఫ్ కవచంతో నిర్మించారు. ఇందులో ఒకేసారి ఏడుగురు సైనికులు ప్రయాణించవచ్చు.
- ఈ శతఘ్నిలో దాదాపు 85 శాతం పరికరాలు భారత్‌లో తయారైనవే.
- దిగ్గజ ఫ్రాన్స్ సీజర్, ఇజ్రాయెల్ అటోమ్స్ 2000 సిస్టమ్‌ల తరహాలో ఈ శతఘ్నిని రూపొందించారు. ఒక్కో యూనిట్ ధర తో పోలిస్తే దీని తయారీ ఖర్చు తక్కువ.

ఉక్రెయిన్‌కు మరిన్ని ఆయుధాలిస్తాం: ట్రంప్

వాషింగ్టన్: ఉక్రెయిన్‌కు కీలకమైన ఆయుధ వ్యవస్థల సరఫరా నిలిపివేయాలంటూ ఆదేశించిన అమెరికా అధ్యక్షుడు ట్రంప్ కొద్ది రోజులకే మాట మార్చారు. రష్యాతో జరుగుతున్న యుద్ధంలో ఉక్రెయిన్‌కు సాయంగా మరిన్ని ఆయుధాలను పంపిస్తామని సోమవారం ప్రకటించారు. 'ఉక్రెయిన్‌పై తీవ్రంగా దాడులు జరుగుతున్నాయి. ఆ దేశం తనను తాను రక్షించుకోవాల్సి కదా. మేం పంపే వాటిలో గగనతల రక్షణ వ్యవస్థలు సహా ఆయుధాలు కూడా ఉంటాయి'అని ట్రంప్ వ్యాఖ్యానించారు. రష్యా అధ్యక్షుడు పుతిన్ వ్యవహారం తనకు నచ్చడం లేదన్నారు.

టెక్సాస్ వరద బీభత్సం... 104కు చేరిన మరణాలు

కెర్‌విల్లే: టెక్సాస్‌లో ఈ నెల 4న గ్వాడలుపె నదికి అకస్మాత్తుగా వచ్చిన వరదల్లో మరణించిన వారి సంఖ్య 104కు చేరుకుందని అధికారులు తెలిపారు. భారీ యంత్రాలతో నదిలోకి కొట్టుకుపోయిన చెట్లను, చెత్తాచెదారాన్ని తొలగించి గల్లంతైన వారి కోసం సహాయక బృందాలు గాలింపు కొనసాగిస్తున్నాయి.



వైట్‌హౌస్‌లో ట్రంప్‌కు ఓ కవర్ అందజేస్తున్న నెతన్యాహూ

నోబెల్‌కు ట్రంప్ పేరును ప్రతిపాదించా

ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహూ వెల్లడి

వాషింగ్టన్: నోబెల్ శాంతి బహుమతికి అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌ను నామినేట్ చేసినట్లు ఇజ్రాయెల్ అధ్యక్షుడు బెంజమిన్ నెతన్యాహూ ప్రకటించారు. ఈ మేరకు నోబెల్ కమిటీకి రాసిన సిఫారసు లేఖను ట్రంప్‌కు అందజేశారు. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ సోమవారం వైట్‌హౌస్‌లోని బ్లూరూంలో నెతన్యాహూతో సమావేశమయ్యారు. ఇరాన్ అణుకేంద్రాలపై ఇటీవల చేపట్టిన భారీ దాడులు, గాజాలో హమాస్‌తో 60 రోజుల కాల్పుల విరమణ ఒప్పందం ప్రతిపాదన వీరి మధ్య చర్చకు వచ్చాయి. ఇరు దేశాల ఉన్నతాధికారుల సైతం పాల్గొన్నారు. అనంతరం నెతన్యాహూ మీడియాతో మాట్లాడారు. దేశాలు, ప్రాంతాల మధ్య శాంతిని నెలకొల్పేందుకు ప్రయత్నిస్తున్నందున ట్రంప్ పేరును నోబెల్ శాంతి బహుమతికి ప్రతిపాదించానన్నారు. వైమానిక దాడులతో ఇరాన్ అణు కార్యక్రమాన్ని ధ్వంసం చేయాలంటూ ఇజ్రాయెల్ ఎంతో కాలంగా అమెరికా పాలకులను కోరుతోంది. తాజాగా, ట్రంప్ ఆ కోరిక నెరవేర్చారు. దీంతో, ఆయన పేరును ఇజ్రాయెల్ నోబెల్ కమిటీకి పంపించిందని విశ్లేషకులు అంటున్నారు.

67 మంది ప్రాణాలు కాపాడిన శునకం



మండి: విపత్తులు జంతువులకు ముందే తెలుస్తాయంటారు. అది నిజమని మరోసారి నిరూపించిందో శునకం. హిమాచల్‌లో వరదలను ముందుగా హెచ్చరించి 67 మంది ప్రాణాలను కాపాడింది. హిమాచల్‌ప్రదేశ్‌లో కొండచరియలు విరిగిపడటం, ఆకస్మిక వరదలు ప్రజలను అతలాకుతలం చేస్తున్నది తెలిసిందే. జూన్ 20న రుతుపవనాలు ప్రారంభమైనప్పటి నుంచి రాష్ట్రంలో కనీసం 78 మంది మరణించారు. 50 మంది కొండచరియలు విరిగిపడటంతో మృత్యువాత పడగా.. 28 మంది రోడ్డు ప్రమాదాల్లో ప్రాణాలు కోల్పోయారు. అయితే.. మండిలోని ధరంపూర్ ప్రాంతంలోని సియాతి గ్రామంలో 67 మంది త్రుటిలో ప్రమాదం నుంచి బయటపడ్డారు. సియాతి నివాసి నరేంద్ర ఇంట్లో ఓ శునకం ఉంది. ప్రమాదం సంభవించిన జూన్ 30న అది ఇంట్లోని రెండో అంతస్తులో పడుకుంది. బయట భోరున వర్షం. ఉన్నట్టుండి కుక్క మొరగడం ప్రారంభించింది. అది విని.. నరేంద్ర నిద్ర నుంచి లేచాడు. రెండో అంతస్తుకు వెళ్లాడు. అప్పటికే ఇంటి గోడలో పెద్ద పగుళ్లు కనిపించాయి. నీరు లోపలికి రావడం ప్రారంభమైంది. వెంటనే కుక్కతో పాటు కిందకు పరిగెత్తి అందరినీ నిద్రలేపాడు. ఇళ్లనుంచి సురక్షిత ప్రాంతాలకు పారిపోవాలని అందరినీ కోరాడు. వాళ్లు అలా వెళ్లిన కొద్దిసేపటికే, గ్రామంలో కొండచరియలు విరిగిపడ్డాయి. పదికి పైగా ఇళ్ళు నేలమట్టమయ్యాయి. ఆ గ్రామంలో ఇప్పుడు నాలుగైదు ఇళ్ళు మాత్రమే కనిపిస్తున్నాయి. మిగిలినవి కొండచరియల శిథిలాల కింద ఉన్నాయి. ప్రాణాలతో బయటపడిన వారు ఏడు రోజులుగా త్రియంబాల గ్రామంలో నిర్మించిన నైనా దేవి ఆలయంలో ఆశ్రయం పొందుతున్నారు. శునకం అప్రమత్తం చేయకుండా ఉంటే.. అంతమంది ప్రాణాలు నిద్రలోనే పోయేవని గ్రామస్తులు చెబుతున్నారు.

ఉగ్రవాదంపై ఒక్కటే మాట

ఆ భూతాన్ని ఏమాత్రం సహించం

- దానిని ప్రోత్సహించే దేశాలకూ మేం వ్యతిరేకం
- భారత్, బ్రెజిల్ ప్రకటన
- అధ్యక్షునితో మోదీ చర్చలు

బ్రసీలియా: ఉగ్రవాదంపై భారత్, బ్రెజిల్ సంయుక్త సమరనాదం చేశాయి. ''ఉగ్రవాదాన్ని సహించబోం. ఆ భూతంపై పోరులో మాది ఒకే బాట, ఒకే మాట. ఈ విషయంలో ద్వంద్వ ప్రమాణాల మాటే లేదు. ఒకే విధానంతో ముందుకెళ్తాం'' అని బ్రిక్స్ వేదికగా ప్రకటించాయి. ప్రధాని నరేంద్ర మోదీ బ్రెజిల్ అధ్యక్షుడు లూయిజ్ ఇనాసియో లూలా డసిల్వాతో మంగళవారం ద్వైపాక్షిక చర్చలు జరిపారు. ఉగ్రవాదంపై భారత్, బ్రెజిల్ ఆలోచనాధోరణి ఒకేలా ఉందంటూ వారు సంయుక్త ప్రకటన విడుదల చేశారు. పహల్గాం ఉదంతం తర్వాత భారత్‌కు సంఘీభావం తెలిపినందుకు బ్రెజిల్‌కు, డసిల్వాకు మోదీ ధన్యవాదాలు తెలిపారు.

విస్తృతాంశాలపై చర్చలు

వాణిజ్యం, అంతరిక్షం, పునరుత్పాదక ఇంధనం, ఆహారం, ఇంధన భద్రత, మౌలికవసతుల అభివృద్ధి, డిజిటల్ ప్రజా వసతులు, రక్షణ, భద్రత, ఆరోగ్యం, ఫార్మాసూటికల్స్, సంస్కృతి, ఇరుదేశాల ప్రజల మధ్య సత్సంబంధాలు తదితర కీలకాంశాలపై మోదీ, డసిల్వా లోతుగా చర్చించారు. కీలకమైన ఖనిజాలు, అధునాతన, నూతన సాంకేతికతలు, కృత్రిమ మేధ, సూపర్ కంప్యూటర్లు అంశాల్లోనూ సహకారం పెంపొందించుకోవడంపై చర్చించారు. 12 బిలియన్ డాలర్లుగా ఉన్న వార్షిక ద్వైపాక్షిక వాణిజ్యాన్ని ఐదేళ్లలో 20 బిలియన్ డాలర్లకు పెంచుకోవాలని లక్ష్యంగా నిర్దేశించుకున్నారు. ఇంధనం, వ్యవసాయం, డిజిటల్ రూపాంతరీకరణ, ఉగ్రవాదంపైపోరుపై సంయుక్త సహకారం కోసం ఆరు ఒప్పందాలు కుదుర్చుకున్నారు.

కార్నివాల్.. ఫుట్‌బాల్.. సాంబా

''భారత్, బ్రెజిల్ సంబంధాలు కార్నివాల్‌లాగా వర్ణరంజితంగా ఉండాలి. ఫుట్‌బాల్ క్రీడలాగా స్ఫూర్తిదాయకంగా ఉండాలి. సాంబా నృత్యంలాగా ఇరుదేశాల ప్రజల హృదయాలను రంజింపజేయాలి. ఇరుదేశాల వీసా కేంద్రాల వద్ద పొడవాటి క్యూ వరసలు మాయమయ్యేలా వీసాప్రాసెసింగ్ వేగంగా జరగాలి. అన్నింటా అదే స్ఫూర్తి కనపడాలి'' అని మోదీ అన్నారు. పశ్చిమాసియా ఎక్కడైనా సరే, వివాదాలకు చర్చలు, సంప్రదింపులతో పరిష్కారాలు కనుగొనాలన్నారు. ''బ్రెజిల్‌తో రక్షణ రంగ ఒప్పందం అనేది ఇరుదేశాల మధ్య లోతైన పరస్పర విశ్వాసానికి ప్రతీక. రక్షణరంగ పరిశ్రమల మధ్య మరింత అనుసంధానం కోసం కృషిచేస్తాం. వ్యవసాయం, పశుసంవర్ధనలో రెండు దేశాల మధ్య దశాబ్దాలుగా సహకారం ఉంది. ఇప్పుడు వ్యవసాయ రంగ పరిశోధన, ఆహార శుద్ధి రంగాలకూ దీనిని విస్తరిస్తాం. ఆరోగ్యరంగంలోనూ పరస్పర సహకారం అందించుకుంటాం. పర్యావరణం, శుద్ధ ఇంధనం అనేవి రెండు దేశాలకూ కీలకమే. నేటి ఒప్పందాలు మా హరిత లక్ష్యాలను నెరవేరుస్తాయి. యూపీఐ చెల్లింపు వ్యవస్థను బ్రెజిల్‌లోనూ అందుబాటులోకి రావడానికి ప్రయత్నిస్తాం. ఆయుర్వేదం, భారత సంప్రదాయ వైద్యం సైతం బ్రెజిల్‌కు చేరువచేస్తాం'' అని మోదీ అన్నారు.



బ్రెజిల్ అత్యున్నత పురస్కారాన్ని స్వయంగా మోదీ మెడలో వేసి సత్కరిస్తున్న డసిల్వా

మోదీకి అత్యున్నత పౌర పురస్కారం

మోదీకి బ్రెజిల్ అత్యున్నత పౌర పురస్కారం 'ది గ్రాండ్ కాలర్ ఆఫ్ ది నేషనల్ ఆర్డర్ ఆఫ్ ది సదరన్ క్రాస్' లభించింది. బ్రెజిల్ అధ్యక్షుడు డసిల్వా ఆయనకు పురస్కారాన్ని ప్రదానం చేశారు. ఈ అవార్డును అధ్యక్షుడు స్వయంగా మోదీ మెడలో వేశారు. ఈ సందర్భంగా డసల్వా, మోదీ కరచాలనం, తర్వాత ఆత్మీయంగా ఆలింగనం చేసుకున్నారు. '' నాకీ అవార్డ్ దక్కడం ఎంతో గర్వంగా, ఉద్వేగంగా ఉంది. ఇది నాకు మాత్రమేకాదు 140 కోట్ల భారతీయులకు దక్కిన పురస్కారం'' అని మోదీ సంయుక్త ప్రకటన వేళ వ్యాఖ్యానించారు. 2014 మేలో ప్రధాని అయ్యాక మోదీకి ఇలా విదేశాల్లో మొత్తంగా 26 అత్యున్నత పౌరపురస్కారాలు లభించాయి.



రైలు ఢీకొనడంతో తుక్కయిపోయిన వ్యాన్

స్కూల్ వ్యాన్‌ను ఢీకొట్టిన రైలు

- ముగ్గురు విద్యార్థులు మృత్యువాత
- తమిళనాడులోని కడలూర్‌లో ఘటన

కడలూర్: పట్టాలు దాటేందుకు ప్రయత్నిస్తున్న స్కూల్ బస్సును రైలు ఢీకొన్న ఘటనలో ముగ్గురు విద్యార్థులు చనిపోయారు. మరో విద్యార్థి, వ్యాన్ డ్రైవర్ తీవ్రంగా గాయపడ్డారు. తమిళనాడులోని కడలూరు-అలప్పక్కం రైలు మార్గంలో 170వ నంబర్ రైల్వే లెవల్ క్రాసింగ్ వద్ద మంగళవారం ఉదయం 7.45 గంటల సమయంలో ఘటన చోటుచేసుకుంది. రైలు ఢీకొనడంతో నలుగురు విద్యార్థులున్న ఆ వ్యాను పల్టీలు కొట్టింది. అనంతరం విల్లుపురం-మైలాదుతురై ప్యాసింజర్ రైలును డ్రైవర్ నిలిపివేశారు. నుజ్జునుజ్జయిన వ్యానులోంచి స్థానికులు విద్యార్థులను బయటకు తీశారు. ఇద్దరు విద్యార్థులు అక్కడికక్కడే చనిపోగా మరొకరు ఆస్పత్రిలో కన్నుమూశారు. వ్యాను డ్రైవర్, 12వ తరగతి విద్యార్థి తీవ్ర గాయాలతో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. స్కూలుకు ఆలస్యమవుతుందని, గేట్ తెరిచే ఉంచాలని వ్యాన్ డ్రైవర్ ఒత్తిడి చేయడం వల్లే గేటును తెరిచి ఉంచానని గేట్ కీపర్ అంటుండగా, తాము వచ్చేసరికే గేటు ఓపెన్ చేసి ఉందని వ్యాన్ డ్రైవర్, క్షతగాత్రుడైన విద్యార్థి చెప్పారు. నిర్లక్ష్యంగా వ్యవహరించాడంటూ గేట్ కీపర్‌పై కేసు నమోదు చేసి, అతడిని అరెస్ట్ చేశారు. కాగా, స్కూలు విద్యార్థులను బయటకు తీసేందుకు వచ్చిన ఓ వ్యక్తి తెగిన విద్యుత్ తీగను తాకి షాక్‌కు గురయ్యారు. అతడు కూడా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. ప్రమాదంపై రైల్వే శాఖ ప్రజలను క్షమాపణ కోరింది. మృతుల కుటుంబాలకు రూ.5 లక్షల చొప్పున తీవ్రంగా గాయపడిన వారికి రూ.2.5 లక్షలు, సాధారణ గాయాలైన వారికి రూ.50 వేల పరిహారం ప్రకటించింది. రాష్ట్ర ప్రభుత్వం కూడా మృతుల కుటుంబాలకు రూ.5 లక్షల పరిహారం ప్రకటించింది.

హజ్ దరఖాస్తు ప్రక్రియ ప్రారంభం

న్యూఢిల్లీ: హజ్ యాత్ర-2026కు దరఖాస్తుల ప్రక్రియ ప్రారంభమైంది. కేంద్ర మైనారిటీ వ్యవహారాల శాఖ ఆధ్వర్యంలోని హజ్ కమిటీ ఈ ప్రక్రియను మంగళవారం అధికారికంగా ప్రారంభించింది. హజ్ యాత్రకు వెళ్లాలనుకునేవారు హజ్ కమిటీ అధికారిక వెబ్‌సైట్ ద్వారా లేదా ఐఓఎస్, ఆండ్రాయిడ్ ఫోన్లలోని 'హజ్ సువిధ'మొబైల్ యాప్ ద్వారా దరఖాస్తులు సమర్పించవచ్చు. జూలై 31 అర్ధరాత్రి వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని హజ్ కమిటీ పేర్కొంది. దరఖాస్తు సమర్పించే ముందు హజ్ మార్గదర్శకాలు, విధివిధానాలను పూర్తిగా చదవాలని హజ్ కమిటీ కోరింది. అలాగే దరఖాస్తు చివరి తేదీకి లేదా అంతకుముందే జారీ అయ్యి 2026 డిసెంబర్ 31 వరకు చెల్లుబాటయ్యే మెషీన్ చదవగలిగిన భారత పాస్‌పోర్ట్ కలిగి ఉండడం తప్పనిసరి. మరణం, తీవ్రమైన అనారోగ్య పరిస్థితులుంటే తప్ప యాత్రను రద్దు చేసుకోరాదు. రద్దు చేసుకున్న వారిపై జరిమానా విధిస్తామని తెలిపింది.

త్వరలో ఇండియాతో ట్రేడ్ డీల్

- ఇప్పటికే చాలా సమీపంలోకి వచ్చాం
- మాతో ఒప్పందంపై తుది నిర్ణయం విదేశాలదే
- మా దేశంలో ఉత్పత్తులు అమ్ముకోవాలంటే సుంకాలు చెల్లించాల్సిందే
- అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ స్పష్టీకరణ

న్యూయార్క్: ఇండియాతో అతి త్వరలో వాణిజ్య ఒప్పందం కుదుర్చుకోబోతున్నామని, ఈ విషయంలో ఇప్పటికే చాలా సమీపంలోకి వచ్చామని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించారు. ఇతర దేశాల నుంచి అమెరికాలోకి వచ్చే ఉత్పత్తులపై ఎంతమేరకు సుంకాలు విధించబోతున్నామో తెలియజేస్తూ తమ అధికారులు ఆయా దేశాలకు లేఖలు పంపిస్తున్నారని వెల్లడించారు. యునైటెడ్ కింగ్‌డమ్(యూకే), చైనాతో తాజాగా ట్రేడ్ డీల్ కుదిరిందని, ఇకపై భారత్‌తో ఒప్పందానికి చాలా దగ్గరగా వచ్చేశామని అన్నారు. స్థానిక కాలమానం ప్రకారం సోమవారం ఓ కార్యక్రమంలో ట్రంప్ మాట్లాడారు. లేఖలు పంపించడం వరకే తమ బాధ్యత అని, తమతో ఒప్పందానికి ముందుకు రావాలో వద్దో ఆయా దేశాలే తేల్చుకోవాలని, తుది నిర్ణయం వారిదేనని పరోక్షంగా స్పష్టంచేశారు. కొన్ని దేశాలు తమ ఉత్పత్తులపై 200 శాతం దాకా సుంకాలు విధిస్తున్నాయని, అమెరికాను దోచుకోవడమే వాటి విధానామా? అని ప్రశ్నించారు. ఇకపై అమెరికాలో ఉత్పత్తులు విక్రయించుకోవాలంటే సుంకాలు చెల్లించకతప్పదని తేల్చిచెప్పారు. భారత్-పాకిస్తాన్ మధ్య యుద్ధాన్ని తానే ఆపేశానని, ఆ ఘనత తనకే చెందాలని ట్రంప్ మరోసారి వ్యాఖ్యానించారు. మాట వినకపోతే వ్యాపారం, వాణిజ్యం నిలిపివేస్తానని హెచ్చరించడంతో ఆ రెండు దేశాలు దారికొచ్చాయని అన్నారు. విదేశాలపై ఏప్రిల్ 2న విధించిన సుంకాల తాత్కాలిక రద్దును ట్రంప్ సర్కారు ఆగస్టు 1వ తేదీ దాకా పొడిగించిన సంగతి తెలిసిందే. మరోవైపు ట్రంప్ సంతకంతో అమెరికా ప్రభుత్వం లేఖలు పంపించిన దేశాల జాబితాలో ఇండియా లేకపోవడం గమనార్హం. బంగ్లాదేశ్, బోస్నియా, కాంబోడియా, ఇండోనేషియా, జపాన్, కజకిస్తాన్, మలేషియా, దక్షిణాఫ్రికా, దక్షిణ కొరియా, థాయ్‌లాండ్, టునీషియా తదితర దేశాలకు ఈ లేఖలు అందాయి.

మయన్మార్, లావోస్‌పై 40 శాతం టారిఫ్

మయన్మార్, లావోస్‌పై డొనాల్డ్ ట్రంప్ టారిఫ్ మోత మోగించారు. రెండు దేశాల ఉత్పత్తులపై 40 శాతం టారిఫ్ విధిస్తున్నట్లు సోమవారం ప్రకటించారు. ఈ మేరకు ఆయా దేశాల అధినేతలకు రాసిన లేఖలను సోషల్ మీడియాలో పోస్టుచేశారు. అలాగే కాంబోడియా, థాయ్‌లాండ్‌పై 36 శాతం, సెర్బియా, బంగ్లాదేశ్‌పై 35 శాతం, ఇండోనేషియాపై 32 శాతం, దక్షిణాఫ్రికా, బోస్నియా, హెర్జిగోవినాపై 30 శాతం, కజకిస్తాన్, మలేషియా, టునీషియాపై 25 శాతం టారిఫ్ విధిస్తున్నట్లు పేర్కొన్నారు. ఇవి ఆగస్టు 1 నుంచే అమల్లోకి వస్తాయని వెల్లడించారు. ఈ టారిఫ్‌లకు ప్రతీకారంగా అమెరికా ఉత్పత్తులపై టారిఫ్‌లు పెంచే ఆలోచన చేయొద్దని ఆయా దేశాల అధినేతలను సున్నితంగా హెచ్చరించారు. జపాన్, దక్షిణ కొరియా ఉత్పత్తులపై 25 శాతం సుంకాలు విధించిన సంగతి తెలిసిందే.

బ్రిక్స్‌పై 10 శాతం సుంకాలు

పునరుద్ఘాటించిన ట్రంప్

న్యూయార్క్/వాషింగ్టన్: బ్రిక్స్ కూటమిపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి అక్కసు వెళ్లగక్కారు. తమ దేశాన్ని, కరెన్సీ (డాలర్) ఆధిపత్యాన్ని దెబ్బ తీసేందుకే అది ఆవిర్భవించిందని మంగళవారం ఆరోపించారు. ''డాలర్‌కు అంతర్జాతీయంగా ఉన్న విలువను నాశనం చేసేందుకు బ్రిక్స్ దేశాలు ప్రయత్నిస్తున్నాయి. తెలివైన అధ్యక్షుడెవరూ అలా జరగనివ్వరు. అది ఒక పెద్ద ప్రపంచ యుద్ధంలో ఓటమి చవిచూడటం వంటిదే. అలా ఎప్పటికీ జరగనివ్వం. ప్రపంచ కరెన్సీల్లో ఇప్పటికీ, ఎప్పటికీ డాలరే కింగ్. దాని ఆధిపత్యాన్ని సవాలు చేయాలనుకుని బ్రిక్స్ దేశాలు అనుకుంటే, తద్వారా మాతో ఆటలు ఆడాలనుకుంటే అభ్యంతరం లేదు. కానీ అందుకు మూల్యంగా వాటన్నింటిపైనా మరో 10 శాతం సుంకాలు విధించి తీరతాం. కేవలం బ్రిక్స్‌కూటమిలో ఉన్నందుకు అవి చెల్లించాల్సిన భారీ మూల్యమిది. అందుకు అవి సిద్ధంగా ఉన్నాయని నేను భావించడం లేదు'' అన్నారు.

శ్రీరాముడు పుట్టింది మా దేశంలోనే

నేపాల్ ప్రధాని ఓలి పాత పాట

కఠ్మాండు: నేపాల్ ప్రధాని కేపీ శర్మ ఓలి మరోసారి వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. హిందువుల ఆరాధ్య దైవమైన శ్రీరామ చంద్రుడు తమ దేశంలోనే జన్మించాడని వ్యాఖ్యానించారు. ఈ చారిత్రక సత్యాన్ని సంకచోం అవసంర లేదని, ప్రపంచం మొత్తం వ్యాపించేలా ఈ విషయాన్ని వివరించాలంటూ వ్యాఖ్యానించారు. నేపాల్‌లో పర్యాటకంపై జరిగిన ఓ జాతీయ సదస్సులో ఆయన మాట్లాడారు. 'నేపాల్ ప్రజలు ఈ నిజాన్ని అంగీకరించాలి. శ్రీరాముడు మన దేశంలోనే పుట్టాడనే వాస్తవాన్ని ప్రపంచానికి ప్రచారం చేయాలి. దీన్ని ప్రపంచానికి చెప్పేందుకు ఏమాత్రం సంకోచించకూడదు. అనవసర భయాలు వదిలేయాలి. స్వీయ-నియంత్రణ మానుకోవాలి' అని ప్రజలకు సూచించారు. శ్రీరాముడి జన్మస్థలంగా పేర్కొంటున్న ప్రాంతం ప్రస్తుత నేపాల్ భూభాగంలోనే ఉందని ఓలి స్పష్టం చేశారు. అంతేకాదు.. శివుడు, విశ్వామిత్ర మహర్షి, కౌశిక్ మహర్షి వంటి ప్రముఖ హిందూ పురాణ పురుషులు కూడా నేపాల్లోనే పుట్టారని పేర్కొన్నారు. వాల్మీకి రామాయణంలో చెప్పిన విధంగా.. రాముడు, లక్ష్మణుడు విశ్వామిత్రుడి వద్ద విద్యను అభ్యసించడానికి కోసి నదిని దాటారని, ఆ ప్రాంతం ప్రస్తుతం నేపాల్ భూభాగంలోనే ఉందని ఓలి పేర్కొన్నారు. ఓలి గతంలోనూ ఇలాంటి వ్యాఖ్యలు చేశారు.

మీరూ వ్యోమగాములవుతారు

షిల్లాంగ్ విద్యార్థులతో మాట్లాడిన శుభాంశు శుక్లా

న్యూఢిల్లీ: యాగ్జియం-4మిషన్‌లో భాగంగా అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం (ఐఎస్ఎస్)కు చేరుకున్న భారత వ్యోమగామి శుభాంశు శుక్లా మంగళవారం స్కూలు విద్యార్థులతో మాట్లాడారు. మేఘాలయ, అసోంలోని ఏడు స్కూళ్ల విద్యార్థులు షిల్లాంగ్‌లోని నార్త్ ఈస్ట్ స్పేస్ అప్లికేషన్స్ సెంటర్(నెసాక్)వద్దకు చేరుకున్నారు. ఈ సందర్భంగా వారితో శుక్లా హామ్ రేడియో నుంచి 10 నిమిషాలసేపు మాట్లాడారు. మీలో చాలా మంది భవిష్యత్తులో వ్యోమగాములవుతారు.. చంద్రుడిపైనా నడుస్తారు అంటూ ఉత్తేజపరిచారు. అంతరిక్ష కేంద్రం నుంచి శుక్లా తమతో మాట్లాడటంతో విద్యార్థులంతా ఎంతో ఉద్వేగం చెందారు. విద్యార్థులు పంపిన 20 ప్రశ్నలకు సమాధానాలిచ్చారు. ఇందులో వ్యోమగామిగా శిక్షణ పొందడం నుంచి అంతరిక్షంలో ఆరోగ్యంగా ఉండటానికి సంబంధించిన అంశాలున్నాయి. 'భూమికి తిరిగొచ్చాక మీకు మార్గదర్శకుడిగా ఉంటా. మీలో చాలా మంది వ్యోమగాములవుతారు. మీలో ఒకరు చంద్రుడిపై నడుస్తారు కూడా.. ఆసక్తిని పెంచుకోండి, కష్టించి పనిచేయండి, ఆత్మ విశ్వాసం కలిగి ఉండండి'అంటూ వారిలో శుభాంశు శుక్లా ఉత్సాహం కల్పించారు. ఐఎస్ఎస్‌లో రోజువారీ జీవితం సూర్యుడి గమనాన్ని బట్టి కాకుండా, గ్రీన్‌విచ్ కాలమానం(జీఎంటీ) ప్రకారం సెట్ చేసిన వాచ్‌ను బట్టి మాత్రమే సాగుతుందన్నారు. ఐఎస్ఎస్ భూమి చుట్టూ 90 నిమిషాలకోసారి పరిభ్రమిస్తున్నందున తాము రోజులో 16 సూర్యోదయాలు, 16 సూర్యాస్తమయాలను చూస్తామని తెలిపారు. భార రహిత స్థితిలో మనిషి శరీరం చాలా మార్పులకు లోనవుతుందని, ఆరోగ్యంగా ఉండేందుకు ప్రతి రోజూ క్రమం తప్పక సైక్లింగ్ వంటి వ్యాయామాలు చేస్తామన్నారు. ఐఎస్ఎస్‌కు వచ్చిన మొదట్లో తనకు అనారోగ్యంగా అనిపించినా రానురాను అలవాటైందని తెలిపారు. శారీరకంగా, మానసికంగా దృఢంగా ఉండటం ఎంతో అవసరమని చెప్పారు. 'మా మిషన్‌లో రోబోట్లు, కృత్రిమ మేధ విడదీయరాని భాగంగా మారిపోయాయి. ఐఎస్ఎస్ లోపలా వెలుపలా చేయాల్సిన పనుల కోసం రోబోటిక్ చేతులను వాడుతున్నాం. వీటితో మా పనులు ఎంతో సురక్షితం, సమర్థవంతమయ్యాయి'అంటూ వివరించారు.


ఉగ్ర సంస్థల నిధుల సేకరణకు 'ఆన్‌లైన్' వ్యవస్థల దుర్వినియోగం

ఎఫ్ఏటీఎఫ్ తాజా నివేదిక వెల్లడి

న్యూఢిల్లీ: ఉగ్రసంస్థలకు నిధులను సమకూర్చేందుకు ఈ-కామర్స్ వేదికలు, ఆన్‌లైన్ చెల్లింపు వ్యవస్థలను దుర్వినియోగం చేశారని ప్రపంచ వ్యాప్తంగా ఉగ్ర సంస్థలకు అందే నిధులపై నిఘా పెట్టే ఎఫ్ఏటీఎఫ్ (ఫైనాన్షియల్ యాక్షన్ టాస్క్‌ఫోర్స్) పేర్కొంది. 2019లో జమ్మూకశ్మీర్‌లో పుల్వామాలో 40 మంది సీఆర్‌పీఎఫ్ జవాన్లను బలి తీసుకున్న ఉగ్ర దాడి, 2022లో గోరఖ్‌నాథ్ ఆలయ ఘటనకు ఇందుకు ఉదాహరణగా పేర్కొంది. కొన్ని ఉగ్ర సంస్థలు పలు దేశాల ప్రభుత్వాల నుంచి ఆర్థికపరమైన ఇతరత్రా మద్దతు ఇప్పటికీ కొనసాగుతుండటంపై ఆందోళన వ్యక్తం చేసింది. ఇందులో ప్రత్యక్షంగా ఆర్థిక సాయం అందించడం, ఆయుధ సామగ్రి అందజేత, తరలింపు, శిక్షణ వంటి అంశాల్లో ప్రభుత్వాలు ఉగ్ర సంస్థలకు తోడ్పాటునిస్తున్నాయంది. ఏప్రిల్‌లో పహల్గాంలో 26 మంది హేయంగా పొట్టనబెట్టుకున్న ఉగ్ర చర్యను ఖండించిన ఎఫ్ఏటీఎఫ్.. బయటి నుంచి ఆర్థికపరమైన సాయం అందకుండా ఇట్లాంటివి అసాధ్యమని పేర్కొంది. పుల్వామా దాడిలో వాడిన పేలుడు సామగ్రి, అల్యూమినియం పౌడర్‌ను జైషే మొహ్మద్ సంస్థ అమెజాన్ ఈ కామర్స్ వేదికల ద్వారా తెప్పించినట్లు గుర్తించామంది. పరికరాలు, ఆయుధాలు, రసాయనాలు, 3డీ ప్రింటింగ్ మెటీరియల్ వంటి వాటిని సైతం ఈ-కామర్స్ ద్వారా కొనుగోలు చేస్తున్నాయని తెలిపింది. ఉగ్ర సంస్థలు ఆదాయం కోసం చౌక వస్తువులను ఈ-కామర్స్ ద్వారా విక్రయిస్తున్నాయని పేర్కొంది. గోరఖ్‌నాథ్ ఆలయం వద్ద దాడి కేసులో ఐఎస్ బోధనలతో ప్రేరేపితుడైన ఓ వ్యక్తి భద్రతా సిబ్బందిపై దాడికి తెగబడ్డాడు. ఇతడు సైతం ఆన్‌లైన్ పేమెంట్ వ్యవస్థల ద్వారా ఐఎస్‌కు డబ్బు పంపించాడని ఎఫ్ఏటీఎఫ్ వివరించింది. తీవ్రవాద భావజాలాన్ని వ్యాప్తి చేసేందుకు ఉగ్ర సంస్థలు పుస్తకాలు, సంగీతం, దుస్తులు వంటి వాటిని సానుభూతి పరులకు ఆన్‌లైన్‌లో విక్రయిస్తూ వనరులను సమకూర్చుకుంటున్నాయని తెలిపింది. ఆన్‌లైన్ పేమెంట్ వ్యవస్థల ద్వారా తక్కువ ఖర్చుతో, ఎంతో వేగంగా డబ్బును పంపించేందుకు అవకాశముండటం ఉగ్ర సంస్థలకు అనుకూలంగా మారిందని పేర్కొంది.

ప్రభుత్వ ఉద్యోగాల్లో మహిళలకు 35శాతం రిజర్వేషన్

ఎన్నికల వేళ బిహార్ సీఎం నితీష్ కుమార్ నజరానా



పాట్నా: బిహార్‌లో ఎన్నికల వేళ ముఖ్యమంత్రి నితీష్ కుమార్ సంచలన ప్రకటన చేశారు. మహిళా సాధికారతలో భాగంగా ప్రభుత్వ ఉద్యోగాలన్నింటిలోనూ మహిళలకు 35% రిజర్వేషన్లు కల్పించనున్నట్లు ఆయన ప్రకటించారు. బిహార్‌లో శాశ్వత నివాసితులు అయిన మహిళలకు ఇది వర్తిస్తుందని తెలిపారు. ''అన్ని రాష్ట్ర ప్రభుత్వ సర్వీసుల్లో అన్ని వర్గాలు, స్థాయిలు, రకాల పోస్టులకు ప్రత్యక్ష నియామకాల్లో బిహార్‌కు చెందిన మహిళా అభ్యర్థులకు ప్రత్యేకంగా 35% రిజర్వేషన్ అందిస్తాం'' అని నితీష్ కుమార్ అన్నారు. అన్ని విభాగాల్లో, అన్ని స్థాయిల్లోని ప్రభుత్వ సేవల్లో మహిళల ప్రాతినిధ్యాన్ని పెంచడానికి తమ ప్రభుత్వం కృషి చేస్తోందని, రాష్ట్రంలో ఎక్కువ మంది మహిళలు శ్రామిక శక్తిలోకి ప్రవేశించి పరిపాలనలో కీలక పాత్ర పోషించేలా చూడటం ఈ నిర్ణయం లక్ష్యమని ఎక్స్ వేదికగా ఆయన ప్రకటించారు. పాట్నాలో ముఖ్యమంత్రి అధ్యక్షతన జరిగిన మంత్రివర్గ సమావేశం ఈ నిర్ణయం తీసుకుంది. అంతేకాదు.. రాష్ట్రంలోని యువతకు ప్రభుత్వ సహకారాన్ని మరింత పెంచుతూ యువజన కమిషన్ ఏర్పాటు చేయనున్నట్లు నితీష్ ప్రకటించారు.

సాక్షి హైదరాబాద్

బుధవారం ৷ 9 ৷ జూలై ৷ 2025



కల్తీ కల్లు తాగి 13 మందికి అస్వస్థత

కల్తీ కల్లు తాగి 13 మంది అస్వస్థతకు గురై ఆసుపత్రి పాలైన సంఘటన కూకట్‌పల్లిలో మంగళవారం వెలుగులోకి వచ్చింది. -8లో



డిటెక్టివ్.. బీ సెలెక్టివ్..

ఒకప్పుడు సినిమాల్లో కనిపించిన డిటెక్టివ్ పాత్రలు.. ప్రస్తుతం ఆధునికుల నిజ జీవితంలో మాత్రం కీలకంగా మారాయి. - సిటీప్లస్‌లో

వాతావరణం

గరిష్టం/కనిష్టం 32.0/23.0

నగరంలో బుధవారం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. చిరుజల్లులు కురిసే అవకాశముంది. గరిష్టంగా 32, కనిష్టంగా 23 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదవుతాయని అంచనా.



నాడు..

బతుకమ్మకుంటకు జీవజలం!

తుది దశకు చేరిన చెరువు అభివృద్ధి పనులు

- సెప్టెంబర్‌కు పూర్తిస్థాయిలో అందుబాటులోకి
- నాటి–నేటి ఫొటోలు విడుదల చేసిన హైడ్రా



నేడు..

అంబర్‌పేటలోని బతుకమ్మకుంట జీవం పోసుకుంది. ఒకప్పటిలా నీటితో కళకళలాడుతోంది. కబ్జా చెర వీడటంతో రూ.8 కోట్ల వ్యయంతో హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అసెట్ ప్రొటెక్షన్ ఏజెన్సీ (హైడ్రా) చేపట్టిన అభివృద్ధి పనులు తుది దశకు చేరుకున్నాయి. వచ్చే సెప్టెంబర్ నాటికి బతుకమ్మకుంట పూర్తి స్థాయిలో అందుబాటులోకి వస్తుందని హైడ్రా ప్రకటించింది. ఈ చెరువుకు సంబంధించిన 'నాడు–నేడు' ఫొటోలను మంగళవారం విడుదల చేసింది. తొలుత చెత్త, మొక్కల్ని తొలగించిన అధికారులు చెరువులో పూడికతీత చేపట్టారు. ఈ ఏడాది ఫిబ్రవరిలో జేసీబీలు కేవలం అడుగున్నర తవ్వగా... లోపల నుంచి నీళ్లు ఉబికివచ్చాయి. బతుకమ్మ కుంటను పునరుద్ధరించి, పూర్వ వైభవం తీసుకురావాలని నిర్ణయించిన హైడ్రా అధికారులు దాని పూర్వాపరాలు అధ్యయనం చేశారు. 1962–63 నాటి రికార్డుల ప్రకారం సర్వే నం.563లో 14.06 ఎకరాల విస్తీర్ణంలో బతుకమ్మ కుంట విస్తరించి ఉండేది. ఫుల్ ట్యాంక్ లెవల్, బఫర్ జోన్లతో కలిపి దీని వైశాల్యం 16.13 ఎకరాలు ఉండేదని అధికారులు తేల్చారు. తాజా సర్వే ప్రకారం అక్కడ కేవలం 5.15 ఎకరాల భూమి మాత్రమే మిగిలినట్లు తేలింది. దీంతో కుంటను పునరుద్ధరించాలని హైడ్రా కమిషనర్ రంగనాథ్ నిర్ణయించారు. ప్రస్తుతం అక్కడ నివసిస్తున్న వారిని ఖాళీ చేయించకుండా, ఎలాంటి ఇబ్బందులూ రాకుండా చెరువు తవ్వకాలకు ఆదేశాలు జారీ చేశారు. దీంతో స్థానికులు హైడ్రాకు సహకరించారు. ఒకప్పటి ఎర్రకుంటనే బతుకమ్మకుంటగా మారిందని, రెవెన్యూ రికార్డులూ అదే చెబుతున్నాయని స్థానికులు హైడ్రా దృష్టికి తెచ్చారు. బతుకమ్మ కుంట చుట్టూ సుందరీకరణ పనులు చేపడుతూ అందులో స్వచ్ఛమైన నీళ్లు నిలిచేలా చేయడం ద్వారా పర్యావరణం పరిరక్షణ, భూగర్భ జలాల పెరుగుదలతో పాటు ఆహ్లాదకరమైన వాతావరణం ఏర్పాటుకు ప్రాధాన్యం ఇస్తున్నారు. స్థానికులు ఈ ఏడాది బతుకమ్మకుంటలోనే బతుకమ్మ ఆడేలా చేయాలన్నదే తమ లక్ష్యమని హైడ్రా స్పష్టం చేసింది. – సాక్షి, సిటీబ్యూరో

రేపు ఉజ్జయినీ మహంకాళి అమ్మవారికి బంగారు బోనం



చార్మినార్: ఆషాఢమాస బోనాల ఉత్సవాలను పురస్కరించుకుని గురువారం సికింద్రాబాద్ ఉజ్జయినీ మహంకాళి అమ్మవారికి బంగారు బోనం సమర్పించనున్నారు. సప్త మాతృకలకు సప్త బంగారు బోనంలో భాగంగా ఇప్పటికే మొదటి బోనాన్ని గోల్కొండ జగదాంబ అమ్మవారికి, రెండో బోనాన్ని విజయవాడ కనక దుర్గమ్మ తల్లికి.. మూడో బోనాన్ని బల్కంపేట ఎల్లమ్మ తల్లికి, నాలుగో బోనాన్ని జూబ్లీహిల్స్ పెద్దమ్మ తల్లికి సమర్పించారు. అయిదో బంగారు బోనాన్ని సికింద్రాబాద్ ఉజ్జయినీ అమ్మవారికి సమర్పించనున్నట్లు ఉమ్మడి దేవాలయాల ఊరేగింపు కమిటీ చైర్మన్ గోపిశెట్టి రాఘవేందర్ తెలిపారు.

రామకృష్ణ మఠాన్ని సందర్శించిన గవర్నర్ దంపతులు



రామకృష్ణ మఠంలో మొక్కలను పరిశీలిస్తున్న గవర్నర్ దంపతులు

కవాడిగూడ: తెలంగాణ రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ దంపతులు మంగళవారం లోయర్ ట్యాంక్ బండ్‌లోని రామకృష్ణ మఠాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా రామకృష్ణ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం కోల్‌కతా బేలూరు రామకృష్ణ మఠం అధ్యక్షుడు స్వామి గౌతమానందజీ మహారాజును కలిసి ఆశీర్వాదం తీసుకున్నారు. ఈ సందర్భంగా రామకృష్ణ మఠంలో పర్యటించి అక్కడ ఉన్న మొక్కల పెంపకాన్ని పరిశీలించారు. మఠం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాల గురించి అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో హైదరాబాద్ రామకృష్ణ మఠం అధ్యక్షుడు స్వామి బోధమయానంద స్వామీజీ తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య తెలంగాణే లక్ష్యం: మంత్రి పొన్నం ప్రభాకర్

బంజారాహిల్స్: ఆరోగ్య తెలంగాణే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. బంజారాహిల్స్ కొమురం భీం భవన్‌లో మంగళవారం జీహెచ్‌ఎంసీ శానిటేషన్ సిబ్బందికి ఏర్పాటు చేసిన హెల్త్ క్యాంప్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రత్యేక వైద్య శిబిరంలో మంత్రి వైద్య పరీక్షలు చేయించుకున్నారు. అనంతరం శిబిరంలో అధునాతన యంత్రాలు, సిబ్బందికి ఇచ్చే మందులు తదితరాలను పరిశీలించారు. జీహెచ్‌ఎంసీ శానిటేషన్ సిబ్బందికి వ్యక్తిగత పరికరాల కిట్స్‌ను మేయర్ గద్వాల్ విజయలక్ష్మి, జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆర్‌వీ కర్ణన్, హైదరాబాద్ జిల్లా కలెక్టర్ దాసరి హరిచందనలతో కలిసి మంత్రి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. జీహెచ్‌ఎంసీలో పని చేస్తున్న ప్రతి శానిటేషన్ సిబ్బందికి వైద్య పరీక్షలు చేస్తూ నెలవారీ మందులు ఇచ్చే కార్యక్రమం ప్రారంభమైందన్నారు. కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ అదనపు కమిషనర్ రఘుప్రసాద్, చీఫ్ మెడికల్ అధికారి డాక్టర్ పద్మజ, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ వెంకటి, టీబీ నివారణ అధికారి చల్లాదేవి, అదనపు డీఎం అండ్ హెచ్‌ఓలు డాక్టర్ విజయనిర్మల తదితరులు పాల్గొన్నారు.



వైద్య పరీక్షలు చేయించుకుంటున్న మంత్రి పొన్నం ప్రభాకర్

జోహార్.. వైఎస్సార్



దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర రెడ్డి జయంతి సందర్భంగా మంగళవారం బంజారాహిల్స్‌లోని 'సాక్షి' ప్రధాన కార్యాలయంలో ఆయన చిత్రపటం వద్ద నివాళులర్పించిన 'సాక్షి' డైరెక్టర్లు తదితరులు

ఈ–వేస్ట్.. ఊస్ట్!

జీహెచ్‌ఎంసీ ప్రధాన కార్యాలయంలోనే పేరుకుపోయిన ఈ–వ్యర్థాలు



- రీసైక్లింగ్ సెంటర్‌కు తరలింపు..

జీహెచ్‌ఎంసీ ప్రధాన కార్యాలయంలోని ఈ వ్యర్థాల తరలింపు

సాక్షి, సిటీబ్యూరో: వివిధ రకాల చెత్త సమస్యలు పరిష్కరించాల్సిన జీహెచ్‌ఎంసీ ప్రధాన కార్యాలయంలోనే దాదాపు 2.5 టన్నుల ఈ–వేస్ట్ పేరుకుపోయింది. జోనల్, సర్కిల్ కార్యాలయాల్లోనూ ఇది తక్కువేం లేదు. జీహెచ్‌ఎంసీలోని వివిధ విభాగాల అధికారుల కార్యాలయాలతో పాటు కారిడార్లలోనూ, ఎక్కడికక్కడ కుప్పలుగా పేరుకుపోయిన ఈ–వ్యర్థాలు కమిషనర్ కర్ణన్ కంట పడటంతో వాటిని తొలగించే పనులు చేపట్టాల్సిందిగా జీహెచ్‌ఎంసీలోని స్వచ్ఛభారత్ మిషన్ ప్రాజెక్ట్ టీమ్‌ను ఆదేశించారు. దాంతోపాటు అన్ని విభాగాలనూ సందర్శించి, వ్యర్థాలు ఎక్కడ పడితే అక్కడ వేయకుండా తగిన అవగాహన కల్పించాలని సూచించారు. ఈ నేపథ్యంలో స్వచ్ఛభారత్ మిషన్ స్లోగన్ 'రెడ్యూస్, రీ యూజ్, రీసైకిల్' అమలులో భాగంగా దాదాపు 2.5 వేల టన్నుల ఈ–వ్యర్థాలను దుండిగల్‌లోని రీసైక్లింగ్ కేంద్రానికి తరలించారు. కంప్యూటర్లు, ప్రింటర్లతోపాటు క్యాట్రిడ్జ్‌లు, ప్రింటర్ కన్స్యూమబుల్స్, నెట్‌వర్క్ యాక్సెసరీస్, హ్యాండ్ హెల్డ్ కంప్యూటర్ల బ్యాటరీలు, చార్జర్లు,డిజిటల్ బోర్డులు, తదితరమైనవి ఈ–వ్యర్థాల్లో ఉన్నాయి.

ఏటా 20 వేల టన్నుల ఈ– వ్యర్థాల ప్రాసెస్..

- దుండిగల్‌లోని ఈ–వ్యర్థాల ప్రాసెసింగ్ సెంటర్‌లో ఈ– వ్యర్థాల్లోని విలువైన లోహాలను వేరు చేసి రీసైక్లింగ్ చేస్తారు. అది ఆసియాలోనే తొలి లీడ్ ప్లాటినం సర్టిఫైడ్ ఈ–ప్రాసెసింగ్ సెంటర్. రాంకీకి చెందిన 'రీ సస్టెయినబిలిటీ' సంస్థ అమెరికాకు చెందిన రెల్డాన్ మెటల్స్‌తో కలిసి దీన్ని ఏర్పాటు చేసింది. దాదాపు రెండేళ్ల క్రితం పని ప్రారంభించిన ఈ సంస్థకు కంప్యూటర్లు, మొబైల్ ఫోన్లు, సర్క్యూట్ బోర్డులు సహా ఏటా 20 వేల టన్నుల ఎలక్ట్రానిక్ వ్యర్థాలను ప్రాసెస్ చేసే సామర్థ్యం ఉంది.
- ష్రెడ్డింగ్, మాగ్నెటిక్ సార్టింగ్, థర్మల్, హైడ్రోమెటలర్జికల్ రిఫైనింగ్ వంటి అధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో బంగారం, వెండి, నికెల్, కోబాల్ట్ ,పల్లాడియం వంటి విలువైన లోహాలను తిరిగి వినియోగించేలా చేస్తుంది. తద్వారా సర్క్యులర్ ఎకానమీ సాధ్యమవుతుంది. జీహెచ్‌ఎంసీ అన్ని కార్యాలయాలతోపాటు ఎలక్ట్రానిక్ పరికరాలు ఎక్కువగా వాడే వారు కూడా ఈ–వ్యర్థాలను ఎక్కడ పడితే అక్కడ పారవేయవద్దని జీహెచ్‌ఎంసీ సూచిస్తోంది. ఈ– వ్యర్థాల గురించి తగిన అవగాహన కల్పించడమే కాకుండా, ప్రజల ఇళ్ల నుంచి కార్యాలయాల నుంచి స్పెషల్ డ్రైవ్ ద్వారా వీటిని సేకరించే చర్యలు చేపట్టేందుకు కూడా జీహెచ్‌ఎంసీ సన్నద్ధమవుతోంది.

'ఎలివేటెడ్' పరిహారం సొమ్ము

కంటోన్మెంట్‌కే

కీలక ఉత్తర్వులు జారీ చేసిన కేంద్రం

- బోర్డు వినతికి అంగీకరించిన వైనం
- రూ.303 కోట్లతో అభివృద్ధి పనులకు లైన్ క్లియర్



బోర్డు కార్యాలయంలో మాట్లాడుతున్న ఎంపీ ఈటల రాజేందర్

కంటోన్మెంట్: సికింద్రాబాద్ కంటోన్మెంట్ పరిధిలో చేపట్టనున్న ఎలివేటెడ్ కారిడార్‌లలో భాగంగా సేకరించే భూముల పరిహారం సొమ్మును కంటోన్మెంట్‌లోనే వినియోగించుకునేందుకు కేంద్ర ప్రభుత్వం అంగీకారం తెలిపింది. ఈ మేరకు సంబంధిత ఉత్తర్వులు మంగళవారం జారీ అయ్యాయి. దీంతో కంటోన్మెంట్ బోర్డు పరిధిలో రూ.303 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టేందుకు మార్గం సుగమమైంది. రాష్ట్ర ప్రభుత్వం కంటోన్మెంట్ పరిధిలో రెండు ప్రతిష్టాత్మక ఎలివేటెడ్ కారిడార్‌ల నిర్మాణం చేపట్టింది. ఇందుకోసం 129 ఎకరాల రక్షణ భూములు, 24 ఎకరాల కంటోన్మెంట్, 110 ఎకరాల ప్రైవేటు భూములు సేకరిస్తోంది. రక్షణ భూములకు బదులుగా జవహర్ నగర్ సమీపంలోని సుమారు 400 ఎకరాల రాష్ట్ర ప్రభుత్వ భూములను రక్షణ శాఖకు అప్పగించనున్నారు. 24 ఎకరాల కంటోన్మెంట్ భూములకు బదులుగా రూ.303 కోట్లను కేంద్ర ప్రభుత్వానికి చెల్లించాల్సి ఉంది. అయితే.. కంటోన్మెంట్ పరిధిలోని నాలాలు, భూగర్భ డ్రైనేజీల ఆధునికీకరణకు వినియోగించుకునేలా అవకాశం ఇవ్వాలంటూ బోర్డు అధికారులు కేంద్రాన్ని కోరారు. ఇందుకు రాష్ట్ర ప్రభుత్వం సమ్మతించడంతో, కేంద్రం అనుమతి కోసం లేఖలు రాశారు. తాజాగా కంటోన్మెంట్ బోర్డు వినతికి కేంద్రం ఆమోదం తెలిపింది.

మా కృషి వల్లే: ఈటల రాజేందర్

కంటోన్మెంట్ భూముల పరిహారం సొమ్మును కంటోన్మెంట్‌లోనే వినియోగించుకునేలా కేంద్రం అనుమతులు ఇవ్వడం పట్ల స్థానిక ఎంపీ ఈటల రాజేందర్ హర్షం వ్యక్తం చేశారు. మంగళవారం బోర్డు సీఈఓ మధుకర్ నాయక్, బోర్డు సభ్యురాలు భానుక నర్మదలతో కలిసి బోర్డు కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. ఇదంతా గతంలో బోర్డులో నామినేటెడ్ సభ్యుడిగా ఉన్న తమ పార్టీకి చెందిన రామకృష్ణ, బోర్డు అధికారుల ప్రయత్నాలకు తోడు కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి, తానూ కలిసి రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ విన్నవించడం వల్లే సాధ్యమైందన్నారు. కంటోన్మెంట్ బోర్డుకు తక్షణమే ఎన్నికలు నిర్వహించాల్సి ఉందన్నారు. రాజ్‌నాథ్ సింగ్‌ను కలిసి ప్రత్యేకంగా విన్నవిస్తానన్నారు.

తేలని ప్రైవేటు పరిహారం..



ఎలివేటెడ్ కారిడార్‌లకు సంబంధించి సేకరించే రక్షణ, కంటోన్మెంట్ భూములకు పరిహారం విషయం దాదాపు ఖరారైనప్పటికీ, ప్రైవేటు భూముల పరిహారం విషయంలో ఇప్పటికీ ఎలాంటి స్పష్టత లేదు. రాష్ట్ర రహదారి –1 (రాజీవ్ రహదారి) పరిధిలో 86 ఎకరాలు, జాతీయ రహదారి –44 మార్గంలో 24 ఎకరాల ప్రైవేటు భూములను సేకరించనున్నారు. ఈ మేరకు ఆస్తులను కోల్పోనున్న బాధితులకు అందించే పరిహారంపై ఎలాంటి స్పష్టత లేకుండాపోయింది.

మీ సేవ.. మరింత

చేరువ!

ధ్రువీకరణ పత్రాల అందజేతలో ఈ కేంద్రాలది కీలక పాత్ర

- తాజాగా వివాహ రిజిస్ట్రేషన్లు, మార్కెట్ విలువ ధ్రువీకరణల జారీ
- గ్రేటర్ సహా మేడ్చల్, రంగారెడ్డి జిల్లాల్లో 1,327 మీ సేవ కేంద్రాలు

సాక్షి, సిటీబ్యూరో: ప్రభుత్వ కార్యాలయాలకు ప్రజలు వెళ్లకుండానే వారికి అవసరమైన ధ్రువపత్రాలు అందించడంలో మీ సేవ కేంద్రాలు కీలక పాత్ర పోషిస్తున్నాయి. గ్రేటర్ సహా శివారు మేడ్చల్–మల్కాజిగిరి, రంగారెడ్డి జిల్లాల్లో 1,327 మీ సేవ కేంద్రాలు ఉన్నాయి. తద్వారా ప్రభుత్వ పరిధిలోని 22 శాఖలకు సంబంధించిన 482 రకాల సర్వీసులు లభిస్తుండటంతో గ్రేటర్ సహా శివారు జిల్లాల ప్రజలకు వెసులుబాటు కలగటంతో పాటు వ్యయ, దూర భారం తగ్గుతోంది. తాజాగా మరో రెండు రకాల సేవలను ఈ జాబితాలో చేర్చడంతో సంబంధిత ప్రజలకు మరింత ప్రయోజనం చేకూరనుంది. వివాహ రిజిస్ట్రేషన్లు, మార్కెట్ విలువ ధ్రువీకరణ పత్రాలు పొందే అవకాశాన్ని ప్రభుత్వం కల్పిస్తోంది.

వివాహ ధ్రువీకరణ పత్రం కోసం..

వివాహ ధ్రువీకరణ పత్రం పలు సందర్భాల్లో అత్యవసరం. దీంతో వివాహ బంధానికి చట్టపరంగా గుర్తింపు లభిస్తోంది. దరఖాస్తుకు భార్యాభర్తల ఆధార్‌కార్డులు, వయసు, పుట్టిన తేదీ, కుల, ఆదాయం, పదోతరగతి ధ్రువీకరణ పత్రాలతో పాటు పెళ్లి ఫొటోలు, వివాహ ఆహ్వాన కార్డులు అవసరం. పెళ్లి చేసుకున్న ప్రాంతం, చిరునామా, వివాహ తేదీ, భార్యాభర్తల మతం, వృత్తి, శాశ్వత చిరునామా, దరఖాస్తుదారుల తల్లిదండ్రుల పేర్లు, సాక్షుల వివరాలు, వారి చిరునామాను దరఖాస్తులో పొందుపర్చాల్సి ఉంటుంది. న్యాయవాది ద్వారా తీసుకున్న నోటరీ ఉండాలి. దేవాలయంలో పెళ్లి చేసుకుంటే ఆలయం నుంచి, ఫంక్షన్ హాలులో చేసుకుంటే సంబంధిత యాజమాన్యం నుంచి తీసుకున్న ధ్రువీకరణ పత్రాలు సమర్పించాలి. దరఖాస్తుతో రిజిస్ట్రేషన్ ఫీజును ఆన్‌లైన్‌లో చెల్లించాలి. తర్వాత స్లాట్ బుక్ చేసుకుని ఆ తేదీన సబ్‌రిజిస్ట్రార్ ఎదుట ముగ్గురు సాక్షులతో పాటు భార్యాభర్తలు హాజరు కావాల్సి ఉంటుంది. దరఖాస్తును సబ్ రిజిస్ట్రార్ పరిశీలించి వివాహ ధ్రువపత్రం జారీ చేస్తారు.

మార్కెట్ విలువ సర్టిఫికెట్‌కు..

అపార్టుమెంట్, ఇంటి స్థలం, ఇతర ఆస్తులపై ప్రస్తుతం ఉన్న మార్కెట్ విలువను నిర్ధారించుకోవడానికి మీ సేవ కేంద్రంలో దరఖాస్తు చేసుకోవటానికి అవకాశం ఉంది. దరఖాస్తు పరిశీలన అనంతరం సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం నుంచి ఆస్తి ప్రస్తుత మార్కెట్ విలువ ధ్రువీకరణ పత్రం జారీ కానుంది. దరఖాస్తుదారు ఆధార్‌కార్డు, ఇల్లు, స్థలం పత్రాలు, పన్ను రసీదు, జిల్లా, గ్రామం వివరాలను సమర్పించాల్సి ఉంటోంది.

సద్వినియోగం చేసుకోవాలి..

ప్రభుత్వం కొత్తగా రెండు రకాల సేవలను మీసేవ జాబితాలో చేర్చిన నేపథ్యంలో ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సంబంధిత శాఖ అధికార వర్గాలు సూచించాయి. ప్రజలకు పాలన చేరువ చేయాలన్న లక్ష్యంలో భాగంగా ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుందని, మీ సేవ కేంద్రాల ద్వారా సులభంగా, వేగంగా పనులు పూర్తి చేసుకోవచ్చని పేర్కొంటున్నాయి.

ఏ ఫ్లైట్.. ఎక్కడ..

ప్రయాణికులకు అందుబాటులో రియల్‌టైం సమాచారం

- హైదరాబాద్ ఎయిర్‌పోర్టులో సమాచార కియోస్క్‌లు
- విమానాల రాక, పోకలపై ఎప్పటికప్పుడు వివరాలు
- ప్రయాణికుల గైడ్ కోసం రూట్‌మ్యాపులు
- జాప్యానికి తావు లేకుండా సత్వర సేవలు



సాక్షి, సిటీబ్యూరో: విమానాల రాకపోకలపై రియల్ టైం సమాచారాన్ని అందజేసే అధునాతన కియోస్క్‌లను హైదరాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయంలో ఏర్పాటు చేశారు. వీటి ద్వారా ఫ్లైట్ వాస్తవ సమాచారం లభిస్తుంది. రియల్ టైం సమాచారం వల్ల ప్రయాణికులకు తమ జర్నీ సమయంపై స్పష్టమైన అవగాహన లభిస్తుంది. హైదరాబాద్ ఎయిర్‌పోర్టు నుంచి రాకపోకలు సాగించే సుమారు 400కు పైగా డొమెస్టిక్, ఇంటర్నేషనల్ విమానాల వివరాలను కియోస్క్‌ల ద్వారా తెలుసుకొనే సదుపాయాన్ని ప్రవేశపెట్టారు. ప్రయాణికులకు మెరుగైన, నాణ్యమైన, సత్వర సదుపాయాలను అందజేసే చర్యల్లో భాగంగా టెర్మినళ్లపై వీటిని ఏర్పాటు చేశారు. ప్రస్తుతంఅంతర్జాతీయ విమానాశ్రయాల్లో వివిధ రకాల కియోస్క్‌లు ఉన్నాయి. చెక్–ఇన్ వంటి సదుపాయాల కోసం కొన్నింటిని వినియోగిస్తున్నారు. బ్యాగేజ్ సేవల కోసం, అదనపు లగేజీ చెల్లింపులు వంటి వాటి కోసం కూడా ఎయిర్‌లైన్స్ కొన్ని రకాల కియోస్క్‌లను వినియోగిస్తున్నాయి. కొన్ని కియోస్క్‌ల ద్వారా నచ్చిన సీట్లను కూడా ఎంపిక చేసుకొనే సదుపాయం ఉంది. ఈ క్రమంలోనే హైదరాబాద్ ఎయిర్‌పోర్ట్ తాజాగా ఈ సమాచార కియోస్క్‌లను ప్రవేశపెట్టింది.

సత్వర స్పందన..

- సాధారణంగా ఆలస్యంగా చేరుకొనే విమానాలు, ఆలస్యంగా బయలుదేరే వాటి వివరాలపై అధికారిక ప్రకటన వస్తే తప్ప సమాచారం లభించదు. ఇప్పుడు ప్రయాణికులే స్వయంగా ఈ వివరాలను తెలుసుకొనే అవకాశం ఉంది. అలాగే ఎయిర్‌పోర్టు నుంచి టెర్మినల్‌కు వెళ్లేవాళ్లు, టెర్మినల్ నుంచి ఎయిర్‌పోర్టు బయటకు వచ్చేవాళ్లు ప్రవేశ, నిష్క్రమణ మార్గాలను కూడా ఈ కియోస్క్‌ల ద్వారా తెలుసుకొనే సదుపాయం ఉంది. నావిగేషన్ మ్యాప్‌లను ఏర్పాటు చేశారు. మరోవైపు ఎయిర్‌పోర్టులో లభించే వివిధ రకాల సదుపాయాల రూట్‌మ్యాపులు కూడా ఈ కియోస్క్‌లలో ఉన్నాయి.
- ప్రయాణికులు ఎలాంటి గందరగోళానికి, జాప్యానికి తావు లేకుండా ఎయిర్‌పోర్టు సేవలను వినియోగించుకోవచ్చని రెండు రోజుల క్రితం ఆస్ట్రేలియా నుంచి హైదరాబాద్‌కు చేరుకున్న అవినాష్ అనే ప్రయాణికుడు తెలిపారు.కియోస్క్ సేవల పట్ల ఆయన సంతృప్తిని వ్యక్తం చేశారు. కియోస్క్‌ల ద్వారా వైఫై సేవలను కూడా అందజేస్తున్నారు. ప్రయాణికులు తమ ఫ్లైట్ పీఎన్నార్ నంబర్‌ను నమోదు చేసి వైఫై సేవలను పొందవచ్చు. ఎయిర్‌పోర్ట్ సేవల పట్ల స్పందన తెలియజేసేందుకు కూడా ఈ కియోస్క్‌లలో ఒక ఆప్షన్ ఏర్పాటు చేశారు. రూట్ మ్యాపుల ద్వారా ఎయిర్‌పోర్టులో ఏ సదుపాయం ఎక్కడ లభిస్తుందో తెలుసుకొని నేరుగా అక్కడికి చేరుకోవచ్చు.

ఉత్తమ ఎయిర్‌పోర్టుగా గుర్తింపు..

ప్రయాణికుడే ప్రథమం అనే లక్ష్యంతో హైదరాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయం అనేక రకాల సేవలను అందజేస్తోంది. ఈ క్రమంలో ఇటీవల ప్రయాణికుల సంఖ్య, విమానసీట్ల భర్తీ ఆధారంగా 4వ స్థానంలో నిలిచింది. ఫ్రాంక్‌ఫర్ట్‌లో జరిగిన కార్యక్రమంలో ఉత్తమ ఎయిర్‌పోర్టుగా గుర్తింపును పొందింది. ప్రస్తుతం ప్రతి రోజు సుమారు 400కుపైగా విమానాలు రాకపోకలు సాగిస్తున్నాయి. రోజుకు 80 వేల మందికి పైగా ప్రయాణం చేస్తున్నారు. దేశవ్యాప్తంగా 70కిపైగా నగరాలకు హైదరాబాద్ నుంచి కనెక్టివిటీ ఉంది. 20కి పైగా అంతర్జాతీయ నగరాలకు నేరుగా హైదరాబాద్ నుంచి విమానాలు రాకపోకలు సాగిస్తున్నాయి.

ఏపీకే ఫైల్‌తో రిటైర్డ్ లెఫ్టినెంట్ కల్నల్‌కు టోకరా

- ట్రాఫిక్ ఉల్లంఘన పేరుతో వాట్సాప్ సందేశం
- నిజమేనని నమ్మి లింక్ క్లిక్ చేసిన బాధితుడు
- రెండు విడతల్లో రూ.1.2 లక్షలు కాజేసిన వైనం



సాక్షి, సిటీబ్యూరో: ట్రాఫిక్ ఉల్లంఘనకు సంబంధించిన జరిమానా అంటూ రిటైర్డ్ లెఫ్టినెంట్ కల్నల్‌కు వాట్సాప్ ద్వారా ఆండ్రాయిడ్ ప్యాకేజ్ కిట్ (ఏపీకే) ఫైల్ పంపిన సైబర్ నేరగాళ్లు రూ.1.2 లక్షలు కాజేశారు. బాధితుడి ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సైబర్ క్రైమ్ అధికారులు మంగళవారం ప్రకటించారు. బాధితుడికి సోమవారం వాట్సాప్ ద్వారా 'ఈ-పరివాహన్.ఏపీకే' అనే లింకుతో ఉన్న సందేశం వచ్చింది. అందులో బాధితుడికారు తీవ్రమైన ట్రాఫిక్ ఉల్లంఘనకు పాల్పడిందని, ఈ నేపథ్యంలోనే రూ.1000 జరిమానా విధించామని, తక్షణం లింక్‌ను క్లిక్ చేయడం ద్వారా చెల్లించాలని ఉంది. ఇది ట్రాఫిక్ అధికారులు పంపిన మెయిల్‌గా భావించిన అతను లింక్‌ను క్లిక్ చేశారు. దీంతో ఏపీకే ఫైల్‌లో ఉన్న మాల్‌వేర్ ఆయన ఫోన్‌లోకి ఇన్‌స్టాల్ అయిపోయింది. దీని ద్వారా ఫోన్‌ను తమ ఆధీనంలోకి తీసుకున్న సైబర్ నేరగాళ్లు బాధితుడి యూపీఐ ఖాతాలకు సంబంధించిన వివరాలు సంగ్రహించారు. వీటిని వినియోగించి రెండు అనధికారిక లావాదేవీలు నిర్వహించి రూ.1.2 లక్షలు కాజేశారు. ఈ విషయం గుర్తించిన బాధితుడు సైబర్ క్రైమ్ ఠాణాను ఆశ్రయించారు.

కల్లు కాంపౌండ్‌లో బాలిక కిడ్నాప్



కిడ్నాప్‌నకు గురైన కీర్తన



అనుమానితురాలు

శంషాబాద్: కల్లు కాంపౌండ్ వద్ద ఓ చిన్నారిని మచ్చిక చేసుకున్న గుర్తు తెలియని మహిళ బాలికను కిడ్నాప్ చేసిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఆర్‌జీఐ ఎస్‌ఐ బాలరాజు కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి.. మహబూబ్‌నగర్ జిల్లా, మిడ్జిల్ మండలం, కంచన్‌పల్లి గ్రామానికి చెందిన లక్ష్మమ్మ తన కుమార్తెలు కీర్తన (6) అర్చన్ (3)తో పాటు తమ మావతో కలిసి ఈ నెల 1న శంషాబాద్ కల్లు కాంపౌండ్‌కు వచ్చింది. కల్లు తాగుతున్న క్రమంలో ఎదురుగా కూర్చున్న గుర్తు తెలియని మహిళ లక్ష్మమ్మ కుమార్తె కీర్తనను దగ్గరకు తీసుకుని మాటలు కలపడంతో పాటు కల్లు తాగించింది. అనంతరం కాంపౌండ్ బయట తినడానికి ఏమైనా ఇప్పిస్తానని తల్లికి చెప్పి చిన్నారిని తీసుకుని బయటికి వెళ్లింది. ఆమె తిరిగి రాకపోవడంతో లక్ష్మమ్మ పరిసర ప్రాంతాల్లో గాలించింది. గ్రామానికి వెళ్లిపోయిన అనంతరం వారి కుటుంబసభ్యుల సూచన మేరకు మంగళవారం ఆర్‌జీఐఏ పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసిన పోలీసులు సీసీ టీవీ ఫుటేజీలను పరిశీలించగా మధ్యవయస్సురాలైన ఓ మహిళ కీర్తనను వెంటబెట్టుకుని వెళ్లిన ట్లు గుర్తించారు. మూడు బృందాలు ఏర్పాటు చేసి ముమ్మరంగా గాలిస్తున్నారు.

థ్యాంక్యూ..సీఎం సార్..

పారదర్శకంగా పదోన్నతులు, పోస్టింగ్‌ల పట్ల హర్షం

సాక్షి, సిటీబ్యూరో: త్వరితగతిన నిర్ణయాలు తీసుకుని, పారదర్శకంగా పోస్టింగ్‌లు ఇవ్వడం పట్ల వైద్య సిబ్బంది హర్షం వ్యక్తం చేస్తున్నారని తెలంగాణ టీచింగ్ గవర్నమెంట్ డాక్టర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు డా.కిరణ్ బొల్లేపాక, కార్యదర్శి మాదాల కిరణ్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. వైద్యుల ఆకాంక్షలకు అనుగుణంగా నిర్ణయాలు తీసుకున్న సీఎం రేవంత్‌రెడ్డి, వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహలకు ధన్యవాదాలు తెలిపారు. దశాబ్దంగా ఎన్నడూ పోస్టింగ్‌లు, పదోన్నతులు ఇంత పారదర్శకంగా జరిగినట్లు చూడలేదన్నారు. ప్రొఫెసర్ల పదోన్నతులను పరిగణలోకి తీసుకోవడం పట్ల కృతజ్ఞతలు తెలిపారు. ఎంతో కాలంగా ఎదురు చూస్తున్న సమస్యలకు పరిష్కారం లభించిందని వారు పేర్కొన్నారు.

డెలివరీ బాయ్‌పై దాడి

జగద్గిరిగుట్ట: డెలివరీ బాయ్‌పై గుర్తు తెలియని వ్యక్తులు దాడి చేసిన సంఘటన జగద్గిరిగుట్ట పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. జగద్గిరిగుట్ట సీఐ నర్సింహ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. దేవమ్మ బస్తీకి చెందిన శ్రీకాంత్ జియో డెలివరీ బాయ్‌గా పనిచేస్తున్నాడు. కాగా సోమవారం రాత్రి పనులు ముగించుకు ఐడీపీఎల్ నుంచి జగద్గిరిగుట్ట వైపు వెళుతుండగా పాపిరెడ్డి నగర్ ప్రధాన రహదారిలో గుర్తు తెలియని వ్యక్తులు అతడి బైకును అడ్డుకున్నారు. ఈ నేపథ్యంలో వాగ్వాదం జరగడంతో వారు దీంతో శ్రీకాంత్‌పై ముక్కుముడిగా దాడి చేశారు. స్థానికుల సమాచారంతో ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. గాయపడిన శ్రీకాంత్‌ను సమీపంలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

కల్తీ కల్లు తాగి 13 మందికి అస్వస్థత

ఒకరి పరిస్థితి విషమం



బాధితులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

కేపీహెచ్‌బీ కాలనీ: కల్తీ కల్లు తాగి 13 మంది అస్వస్థతకు గురై ఆసుపత్రి పాలైన సంఘటన కూకట్‌పల్లిలో మంగళవారం వెలుగులోకి వచ్చింది. రెండు రోజుల వ్యవధిలోనే ఒకే రకమైన అనారోగ్య సమస్యలతో 11 మంది అస్వస్థతకు గురై ఒకే ఆసుపత్రిలో చేరడంతో అప్రమత్తమైన ఆసుపత్రి వర్గాలు పోలీసులు, జీహెచ్‌ఎంసీ అధికారులకు సమాచారం అందించారు. ఆసుపత్రిలో చేరిన వారిలో 9 మంది పురుషులు, నలుగురు మహిళలు ఉన్నారు. వీరంత వాంతులు, విరోచనాలు, లో బీపీ , కడుపునొప్పి తదితర సమస్యలతో కూకట్‌పల్లి రాందేవ్ రావ్ ఆసుపత్రిలో చికిత్స నిమిత్తం చేరారు. బాధితులందరూ ఒక రోజు అటు ఇటుగా కల్లు తాగిన వారే కావడంతో కల్తీ కల్లు కారణంగానే వారు అస్వస్థతకు గురై ఉండవచ్చునని అధికారులు భావిస్తున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు, ఆరోగ్య శాఖ సిబ్బంది ఆసుపత్రికి చేరుకొని విచారణ చేపట్టారు. చికిత్స పొందుతున్న వారిలో అడ్డగుట్టకు చెందిన యోబు, నడిగడ్డ తండాకు చెందిన దేవదాసు, గోకుల్ ప్లాట్స్ కు చెందిన పోచవ్వ, హెచ్‌ఎంటీ శాతవాహన నగర్ కు చెందిన చాకలి లక్ష్మి, శంశీగూడ ఇందిరానగర్ కు చెందిన గోవిందమ్మ, పెంటేష్, హెచ్‌ఎంటీ హిల్స్‌కు చెందిన యాదగిరి, నరసింహ, హైదర్ నగర్ కు చెందిన మాధవి, కోటేశ్వర్ రావు, మానప్ప ఉన్నారు. వీరందరూ హైదర్ నగర్, శాతవాహన నగర్, ఎల్లమ్మబండ తదితర ప్రాంతాల్లో కల్తీ కల్లు సేవించటం వల్ల అనారోగ్యానికి గురైనట్లు గుర్తించారు. ఈ విషయమై ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ అధికారులు కూడా దర్యాప్తు చేపట్టారు. బాధితుల ఆరోగ్య స్థితిపై మేడ్చల్ జిల్లా వైద్యశాఖ అధికారి ఉమా గౌరి సమీక్షించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ అస్వస్థతకు గురైన వారిలో ఇద్దరు మినహా మిగిలిన వారంతా కల్లు తాగినట్లు గుర్తించామని, అక్యూట్ గ్యాస్ట్రైటిస్ తదితర లక్షణాలు ఉన్నాయని, వారి ఆరోగ్యం నిలకడగానే ఉందన్నారు. బుధవారం ఉదయం నిర్వహించే వైద్యపరీక్షల అనంతరం డయాలసిస్ అవసరమా లేదా అనేది నిర్ధారిస్తామన్నారు. రాందేవ్ రావ్ ఆసుపత్రిలో 11 మంది చికిత్స పొందుతున్నారని, మిగతా చోట్ల మరో ఇద్దరు ఉన్నట్లు చెబుతున్నారని మొత్తంగా 13 మంది ఆసుపత్రి పాలైనట్లు తెలిసిందన్నారు. బాలానగర్ డీసీపీ సురేష్ కుమార్, కూకట్‌పల్లి ఏసీపీ ఆసుపత్రికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు.

ఎమ్మెల్యే మాధవరం పరామర్శ

విషయం తెలుసుకున్న కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు వెంటనే ఆసుపత్రికి చేసుకుని వైద్యులను అడిగి పరిస్థితిని తెలుసుకున్నారు. అస్వస్థతకు కారణాలను గుర్తించి చర్యలు తీసుకోవాలని సూచించారు. కల్తీ కల్లు విషయంలో పోలీసులు, ఎక్సైజ్ శాఖ అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని ప్రజల ఆరోగ్య పరిరక్షణకు ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు.

బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలి: ఎమ్మెల్యే గాంధీ

కల్తీ కల్లు తాగి ఆసుపత్రి పాలైన వారిని శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ పరామర్శించారు. అక్కడే ఉన్న వైద్యులను, పోలీసులు, ఎక్సైజ్ అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కల్తీ కల్లు విక్రయిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. చాలా కాలంగా కల్తీ కల్లు విక్రయాలు జరుగుతున్నా ఎక్సైజ్ అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపించారు.

సీఎస్ఆర్ నిధుల పేరుతో టోకరా

- 9 మంది అరెస్టు
- పరారీలో మరో ముగ్గురు
- రూ.6.94 లక్షల నగదు, 8 సెల్‌ఫోన్లు, 3 బైకులు స్వాధీనం

మలక్‌పేట: అనాథ శరణాలయాలకు సీఎస్ఆర్ నిధులు ఇప్పిస్తామని ఓ వ్యక్తిని నమ్మించి రూ. 50 లక్షలు టోకరా వేసిన ముఠాను మలక్‌పేట, సౌత్ ఈస్ట్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు అరెస్ట్ చేశారు. వారి నుంచి రూ.6.94 లక్షల నగదు, 8 సెల్ ఫోన్లు, మూడు బైక్‌లు స్వాధీనం చేసుకుని నిందితులను కోర్టులో హాజరుపరిచారు.. మలక్‌పేట ఇన్‌స్పెక్టర్ పిడమర్తి నరేష్ కథనం మేరకు వివరాలి ఉన్నాయి.. ఓల్డ్‌బోయినపల్లికి చెందిన నిమ్మల రవీందర్‌గౌడ్, విశాఖపట్నం, గాజువాకకు చెందిన ఈగల రమణ, సికింద్రాబాద్‌కు చెందిన కొల్లి లింకన్‌బాబు, రంగారెడి జిల్లాకు చెందిన పిన్నింటి నవీన్‌రెడ్డి అలియాస్ శ్రీకాంత్, ఈదీ బజార్‌కు చెందిన సయ్యద్ దస్తగిర్ ఖాద్రీ, బోయినపల్లికి చెందిన గజ్జెల్లి విజయ్‌చంద్ర, మాదన్నపేటకు చెందిన దర్శనం మురళి, చందానగర్ నివాసి అశోక్‌గౌడ్, సైదాబాద్‌కు చెందిన అవులేరాము ముఠాగా ఏర్పడ్డారు. వారు ప్రైవేట్ కంపెనీలు, సంస్థల నిర్వాహకులుగా పరిచయం చేసుకుని వివిధ సంస్థల నుంచి ట్రస్ట్‌కు నిధులు వచ్చేలా చూస్తామని ప్రచారం చేసుకునేవారు. తమ కంపెనీకి చెందిన సీఎస్ఆర్ నిధులు రూ. కోటి ఇస్తామని, వాటిలో ఫిఫ్టీ ఫిఫ్టీ భాగస్వామ్యంతో బాధితునితో ఒప్పందం చేసుకుంటారు. ఈ నేపథ్యంలో వారు సేవారత్ ట్రస్ట్ నిర్వహిస్తున్న మంచిర్యాలకు చెందిన విజయ్‌కుమార్‌ను కలిసి నిధులు ఇప్పిస్తామని చెప్పారు. వారి మాటలు నమ్మిన అతను రూ.50 లక్షలు సమకూర్చుకుని ఈనెల 4న మూసారంబాగ్‌లోని తమ బంధువుల ఇంట్లో వారిని కలిశాడు. దీంతో వారు ల్యాప్‌టాప్‌లో రూ.6 కోట్ల నకిలీ బ్యాంక్ ఖాతా వివరాలు చూపించారు. అదే సమయంలో మరో బృందం టాస్క్‌ఫోర్స్ పోలీసుమంటూ అక్కడికి వచ్చి రూ. 50 లక్షలు తీసుకుని వారితో పాటు ముందుగా వచ్చిన ఇద్దరితో కలిసి అక్కడి నుంచి పరాయ్యారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. మలక్‌పేట పోలీసులు, సౌత్‌ఈస్ట్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు ఐదు బృందాలు ఏర్పాటు చేసి సీసీ టీవీ ఫుటేజ్‌లు, నిందితుల కాల్ డేటా ఆధారంగా 9 మందిని అదుపులోకి తీసుకున్నారు. ఎమ్.ఎస్. కే (మోహన్ అలియాస్ వాహిద్), సమీర్ అలియాస్ సల్మాన్, సాహిల్ అలియాస్ షబాజ్ పరారీలో ఉన్నట్లు తెలిపారు. మిగిలిన మొత్తం పరారీలో ఉన్న వ్యక్తుల దగ్గర ఉందని తెలిపారు. సౌత్ ఈస్ట్ టాస్క్ ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ సైదాబాబు, మలక్‌పేట డీఐ జయశంకర్, డీఎస్సై కిరణ్‌లాల్ పాల్గొన్నారు.


ఏసీబీ వలలో డిప్యూటీ స్టేట్ ట్యాక్స్ ఆఫీసర్



నగదుతో పట్టుబడిన ట్యాక్స్ ఆఫీసర్ సుధ

గన్‌ఫౌండ్రీ: జీఎస్టీ రిజిస్ట్రేషన్ కోసం రూ.8 వేల లంచం తీసుకుంటూ మాదాపూర్ డిప్యూటీ స్టేట్ ట్యాక్స్ ఆఫీసర్, ఎం.సుధ నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులకు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుబడ్డారు. హైదరాబాద్ ఏసీబీ డీఎస్పీ శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో నాంపల్లిలోని గగన్ విహార్‌లోని కార్యాలయంలో ఓ కంపెనీకి సంబంధించిన జీఎస్టీ రిజిస్ట్రేషన్ ప్రక్రియను పూర్తి చేసేందుకు ట్యాక్స్ ఆఫీసర్ సుధ రూ.8 వేలు డిమాండ్ చేసినట్లు బాధితుడు ఏసీబీకి ఫిర్యాదు చేశాడు. దీంతో రంగంలోకి దిగిన ఏసీబీ అధికారులు మంగళవారం ఆమె బాధితుడిని నుంచి నగదు తీసుకుంటుండగా రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఆమెపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు.

సెక్యూరిటీ గార్డు దారుణ హత్య



దాసరి రాజు(ఫైల్)

గచ్చిబౌలి: నిర్మాణంలో ఉన్న భవనంలో సెక్యూరిటీ గార్డు దారుణ హత్యకు గురైన సంఘటన గచ్చిబౌలి పోలీస్ స్టేషన్ పరిధిలోని మయూరి బిల్డింగ్స్‌లో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ హబీబుల్లాఖాన్ కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. గచ్చిబౌలి సర్వే నెంబర్ 90/1లో ఓఆర్ఆర్ సర్కిల్‌లో నిర్మాణంలో ఉన్న మయూరి బిల్డింగ్‌లో మైక్రాన్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ ఎలక్ట్రికల్ పనులు నిర్వహిస్తోంది. ఇందులో భాగంగా బేస్‌మెంట్ 3లో ఎలక్ట్రికల్ సామగ్రి స్టోర్ రూమ్ ఏర్పాటు చేశారు. జగద్గిరిగుట్టకు చెందిన దాసరి రాజు(59) అక్కడ సెక్యూరిటీ గార్డుగా విధులు నిర్వహిస్తున్నాడు. సోమవారం రాత్రి డ్యూటీకి వచ్చిన అతను మంగళవారం ఉదయంరక్తపు మడుగులో పడి ఉండటాన్ని గుర్తించిన స్టోర్ ఇన్‌చార్జి అనిల్ డయల్ 100కు సమాచారం అందించారు. సంఘటనా స్థలాన్ని పరిశీలించిన పోలీసులు ఇనుప రాడ్డుతో రాజు తలపై కొట్టడంతో అతను అక్కడికక్కడే మృతి చెందినట్లు గుర్తించారు. సమీపంలోని సీసీ ఫుటేజీలను పరిశీలించగా గుర్తుతెలియని వ్యక్తి లోపలికి వెళ్లినట్లుగా గుర్తించారు. ఆటోలో వెళ్లిన అనుమానితుడి కోసం ప్రత్యేక బృందాలు గాలిస్తున్నాయి. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించిన పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఆత్మహత్య చేసుకుంటున్నట్లు వీడియో పంపి..

ఉరి వేసుకుని ఆటో డ్రైవర్ బలవన్మరణం

సనత్‌నగర్: తాను ఆత్మహత్య చేసుకుంటున్నట్లు స్నేహితుడికి వీడియో పంపి ఆటోడ్రైవర్ ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన సనత్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి.. మహబూబ్‌నగర్ జిల్లా, హన్వాడ మండలం, పెద్దదర్పల్లి గ్రామానికి చెందిన చంద్రయ్య నగరానికి వలస వచ్చాడు. భార్యా ఇద్దరు కుమారులతో ప్రభాకర్‌రెడ్డినగర్ జింకలవాడలో నివాసం ఉంటున్నాడు. అతడి చిన్నకుమారుడు వినోద్ కుమార్ (23 ఆటో డ్రైవర్‌గా పని చేస్తున్నాడు.. ఈ నెల 6న మధ్యాహ్నం వినోద్ కుమార్ స్నేహితుడు చంద్రశేఖర్ చంద్రయ్యకు ఫోన్ చేసి వినోద్‌కుమార్ సీలింగ్ ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంటున్నట్లుగా వీడియో పంపించినట్లు చెప్పి అతడి ఇంటికి వెళ్లి చూడగా వినోద్ కుమార్ ఉరికి వేలాడుతూ కనిపించాడు. అతడిని కిందకు దింపి సమీపంలోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా పరీక్షించిన వైద్యులు అతను అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతుడి తండ్రి చంద్రయ్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

విద్యుదాఘాతంతో ఆటో డ్రైవర్ మృతి

కేపీహెచ్‌బీకాలనీ: ఆలయ పూజా కార్యక్రమానికి సంబంధించి ఫ్లెక్సీ కడుతుండగా విద్యుదాఘాతానికి గురై ఓ ఆటో డ్రైవర్ అక్కడికక్కడే మృతి చెందిన సంఘటన కూకట్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో మంగళవారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. నారాయణఖేడ్ మండలానికి చెందిన జ్ఞానేశ్వర్ (37) కొన్నేళ్లుగా భాగ్యనగర్ కాలనీలో నివాసం ఉంటూ ఆటో డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. స్థానిక సాయిబాబా ఆలయంలో సేవా కార్యక్రమాల్లో పాల్గొనేవాడు. ఈ నేపథ్యంలో గురుపౌర్ణమి వేడుకలను పురస్కరించుకుని ఆలయ ఫ్లెక్సీని కాలనీ కమాన్‌కు కట్టేందుకు మంగళవారం మధ్యాహ్నం కమాన్‌పైకి ఎక్కగా విద్యుత్ తీగలు తగలడంతో విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానికుల సమాచారంతో సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

రైతులపై మాట్లాడే హక్కు కేటీఆర్‌కు లేదు

ప్రెస్‌క్లబ్‌ను శుద్ధి చేసిన కాంగ్రెస్ నేతలు



పంజగుట్ట: రైతులకు సంకెళ్లు వేసిన చరిత్ర బీఆర్ఎస్ ప్రభుత్వానిదని, రైతు సమస్యలపై మాట్లాడే నైతిక హక్కు కేటీఆర్‌కు లేదని కాంగ్రెస్ సీనియర్ నాయకులు అన్నారు. మంగళవారం బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హైదరాబాద్ ప్రెస్‌క్లబ్‌లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేసి ప్రెస్‌క్లబ్‌ను అపవిత్రం చేశారని ఆరోపిస్తూ కాంగ్రెస్ నాయకులు ఆవు పంచకం, పసుపు నీటితో ప్రెస్‌క్లబ్‌ను శుద్ధి చేశారు. ఈ సందర్భంగా నాయకులు బోయ నగేష్, శ్రీకాంత్ యాదవ్, నారికెళ్ల నరేష్, పరమేష్ యాదవ్ మాట్లాడుతూ .. అధికారం కోల్పోయినా కేటీఆర్‌కు అహంకారం తగ్గలేదని, ప్రతి రోజూ ప్రజలను ఎలా రెచ్చగొడదామా అని చూస్తుంటాడన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ముక్కు నేలకు రాయాలని కేటీఆర్ అంటున్నాడని, రేవంత్ రెడ్డి బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తున్నందుకు, మహిళలకు ఉచితంగా బస్సు సౌకర్యం కల్పిస్తున్నందుకా, రైతులకు రుణమాఫీ, రైతుబంధు ఇస్తున్నందుకు ముక్కు నేలకు రాయాలా అని ప్రశ్నించారు. రైతులకు సంకెళ్లు వేసినందుకు, ఒక్క పరీక్ష కూడా సరిగ్గా నిర్వహించనందుకు, మిగులు బడ్జెట్ ఉన్న రాష్ట్రాన్ని స్కీంలు, ప్రాజెక్టుల పేరుతో దోచుకున్నందుకు మీరు ముక్కు నేలకు రాయాలని డిమాండ్ చేశారు. ఒక ముఖ్యమంత్రి ఢిల్లీ వెళ్లే కార్యక్రమం ముందే నిర్ణయిస్తారని, ప్రతిపక్ష నేతగా ఆ విషయం కేటీఆర్‌కు కూడా తెలుసని, అయినా ముఖ్యమంత్రి రాలేదని అని కుర్చీ వేసి కూర్చోవడం ప్రజలను మభ్యపెట్టడమే అన్నారు. ప్రజలను మోసం చేసినందుకే గత ఎన్నికల్లో బుద్ధి చెప్పారని, ఎంపీ స్థానాల్లో ఒక్కటి కూడా గెలవలేదని, ఎమ్మెల్సీల్లో కనీసం క్యాండెట్ కూడా దొరకలేదని, మున్ముందు పార్టీ కనుమరుగవుతుందని జోస్యం చెప్పారు. కార్యక్రమంలో కాటూరి రమేష్, బొగ్గు వెంకటేష్, దేవేందర్ రెడ్డి, రవి, జగన్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

జీవితంపై విరక్తితో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ బలవన్మరణం

కేపీహెచ్‌బీకాలనీ: జీవితంపై విరక్తి చెందిన ఓ సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ సీలింగ్ ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన కేపీహెచ్‌బీ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వడిగినేని చైతన్య (35) సాఫ్ట్‌వేర్ ఉద్యోగి. గత ఏప్రిల్ 23న నాగ మౌనికతో వివాహమైంది. ఈ దంపతులు కేపీహెచ్‌బీ, 7వ ఫేజ్‌లోని ఎల్ఐజీ-43లో నివాసం ఉంటున్నారు. ఆషాఢ మాసం నేపథ్యంలో జూన్ 21న నాగ మౌనిక పశ్చిమ గోదావరి జిల్లా తాళ్లపూడి మండలం తిరుగుడుమెట్ట గ్రామంలోని తల్లిగారింటికి వెళ్లింది. ప్రతిరోజూ ఆమె ఫోన్‌లో భర్తతో మాట్లాడుతూ ఉండేది. సోమవారం రాత్రి 10 గంటలకు ఫోన్‌లో అతనితో మాట్లాడింది. అప్పటికే తన భర్త దిగులుగా మాట్లాడటంతో కొద్ది సేపటి తర్వాత ఫోన్ కట్ అయింది. అనంతరం రాత్రి 11 గంటల ప్రాంతంలో చైతన్యకు ఫోన్ చేయగా ఎత్తలేదు. పలుమార్లు ప్రయత్నించినా స్పందన లేకపోవంతో వెంటనే తన మామకి సమాచారం అందించింది. వెంటనే కింది అంతస్తులోకి వెళ్లి చైతన్యను పిలవగా ఎంతకీ స్పందించకపోవడంతో తలుపులు పగులగొట్టి లోపలికి వెళ్లి చూడగా.. చైతన్య సీలింగ్ ఫ్యాన్‌కు ఉరివేసుకుని విగతజీవిగా కనిపించాడు. వెంటనే విషయాన్ని మౌనికకు ఫోన్ ద్వారా సమాచారం అందించారు. ఈ మేరకు మౌనిక పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో.. తన భర్త జీవితం పట్ల విసిగిపోయి ఆత్మహత్యకు పాల్పడి ఉండవచ్చని పేర్కొంది. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు కేపీహెచ్‌బీ పోలీసులు చెప్పారు.

ఫుట్‌ఓవర్ బ్రిడ్జే లేబర్ వార్డు!

- మహారాష్ట్ర మహిళకు కాన్పు చేసిన ఆర్మీ డాక్టర్
- ఉత్తరప్రదేశ్‌లోని ఝాన్సీ రైల్వే స్టేషన్‌లో ఉదంతం
- వైద్యుడు మేజర్ రోహిత్ స్వస్థలం హైదరాబాద్
- గత శనివారం ఘటన, సోషల్‌మీడియాలో వైరల్



సాక్షి, సిటీబ్యూరో: ఉత్తరప్రదేశ్‌లోని ఝాన్సీ మిలటరీ ఆస్పత్రిలో డాక్టర్‌గా పనిచేస్తున్న హైదరాబాద్ వాసి మేజర్ రోహిత్ బచ్‌వాలా మహారాష్ట్రకు చెందిన ఓ మహిళను కాపాడటానికి రైల్వే స్టేషన్ ఫుట్‌ఓవర్ బ్రిడ్జ్‌ని లేబర్ వార్డుగా మార్చారు. పురిటినొప్పులతో తీవ్ర ఇబ్బందిపడుతున్న ఆమెకు తన వద్ద ఉన్న సాధారణ ఉపకరణాలతో పురుడుపోశారు. వివరాల్లోకి వెళ్తే..మహారాష్ట్ర పన్వేల్ ప్రాంతానికి చెందిన నిండు గర్భిణి అశ్వర్ ఫలక్ తన భర్త జుబేర్ ఖురేషీ, కుమారుడితో కలిసి గత శుక్రవారం పన్వేల్-గోరఖ్‌పూర్ ఎక్స్‌ప్రెస్ ఎక్కారు. తన భర్త స్వస్థలమైన ఉత్తరప్రదేశ్‌లోని బరాబంకీ ప్రయాణమయ్యారు. వీరి రైలు గత శనివారం మధ్యాహ్నం ఝాన్సీ సమీపానికి చేరుకుంది. ఆ సమయంలో ఫలక్‌కు పురిటినొప్పులు ప్రారంభమయ్యాయి. విషయం గుర్తించిన రైల్వే అధికారులు అప్రమత్తం అయ్యారు. ఓ మహిళా టీటీఈ, ఇతర సిబ్బందిని వీల్‌చైర్‌తో ప్లాట్‌ఫామ్‌పై సిద్ధంగా ఉంచారు. అదే సమయంలో ఆర్మీ మెడికల్ కార్ప్స్‌లో (ఏఎంసీ) మెడికల్ ఆఫీసర్‌గా పని చేస్తున్న డాక్టర్ రోహిత్ హైదరాబాద్‌లోని కుటుంబం వద్దకు రావడానికి శనివారం మధ్యాహ్నం ఝాన్సీ రైల్వేస్టేషన్‌కు చేరుకున్నారు. అక్కడ గర్భిణికి పురిటినొప్పులు వస్తున్న విషయం తెలుసుకుని ఆమెకు పురుడు పోసేందుకు సిద్ధమయ్యారు. ఆమెను ఫుట్‌ఓవర్ బ్రిడ్జ్ పైన పడుకోబెట్టి..తన జేబులో ఉన్న పాకెట్ నైఫ్, మహిళా టీటీఈకి చెందిన హెయిర్ క్లిప్స్‌తో పాటు ఆ సమీపంలో ఉన్న వ్యక్తి నుంచి తీసుకున్న ధోవతిలతో ఆ పని ప్రారంభించారు. దాదాపు 20 నిమిషాలు శ్రమించిన రోహిత్ ఈ క్రతువు పూర్తి చేయగా..ఫలక్ పండంటి మగ బిడ్డకు జన్మనిచ్చింది. ఈ లోపు అక్కడకు చేరుకున్న అంబులెన్స్‌ను వీరిని సమీపంలోని ఆస్పత్రికి తరలించింది. ఆ తల్లీబిడ్డలకు ఆరోగ్యంగా ఉన్నారని వైద్యులు స్పష్టం చేశారు. ఈ హడావుడి పూర్తయ్యే సమయానికి రోహిత్ ఎక్కాల్సిన రైలు వెళ్లిపోవడంతో ఆయన మళ్లీ మిలటరీ ఆస్పత్రికి వెళ్లిపోయారు.

అభినందించిన ఆర్మీ చీఫ్ జనరల్ ఉపేంద్ర..

రైల్వే స్టేషన్‌లో ఇబ్బందికర పరిస్థితుల్లో కనిపించిన మహిళకు సాయం చేయడానికి సిద్ధమవడంతో పాటు తన ప్రయాణాన్నీ మానుకుని కాన్పు చేసిన మేజర్ రోహిత్‌ను ఆర్మీ చీఫ్ జనరల్ ఉపేంద్ర ద్వివేది సోమవారం అభినందించారు. ఈ మేరకు తన అధికారిక ఎక్స్ ఖాతాలో ఈ విషయాన్ని పొందుపరిచారు. ఈ వీడియో, ఫొటోలు నెట్టింట వైరల్‌గా మారాయి.

మీ ఆప్తుల అంత్యక్రియలు, శ్రద్ధాంజలి, నిర్యాణం, వర్ధంతి, జయంతిల ప్రకటనల కోసం సంప్రదించండి.
ఈ తరహా ప్రకటనలపై డిస్కౌంట్ కూడా కలదు
Ph: 040-23256000 Ext: 6344, 9912220352

సాక్షి క్లాసిఫైడ్స్

Education

DIRECT FINAL YEAR
■ Last Chance: 10th, Inter, Direct Degree (Disc), BA, B.Com, B.Sc, BBA, BCA, BMLT, DMLT, B.Tech, Diploma, MA, M.Com, M.Sc, MBA, MCA. Regular/lateral entry. 9381287629 [T-2502]

Real Estate
■ 13,499/- కే గజం HMDA అప్రూవ్ కొంగరకలాన్ కలెక్టరేట్ ఫాక్స్ కాన్, TCS, ఏరో స్పేస్ దగ్గర న్యూవెంచర్లో ప్లాట్లు అమ్మబడును. బ్యాంక్ లోన్ Avil. Ph: 8309376230 [HA-1405]

PLOT FOR SALE
■ ECIL తుర్కపల్లి దగ్గరలో DTCP ప్లాట్స్, గజం : 7500/- బ్యాంక్ లోన్, EMI సౌకర్యం కలదు. LP No. 15172/584/2024/H, 9030181717 [SCA25006062]

Services

ASTROLOGY
■ ఇల్లు, ఆఫీస్ స్థలాలకు వాస్తు సరిచేసుకోండి. వాస్తు సిద్ధాంతి డా.కుంచాల హనుమంతరావు గారు హైదరాబాద్ లో 4 రోజులు మాత్రమే ఉంటారు. సంప్రదించండి: 92466 24248 [SCA25005971]

BUSINESS SERVICE
■ మీ బంగారం బ్యాంకుల్లో గానీ, మార్వాడి షాప్స్, ఏ ఇతర ఫైనాన్స్‌లలో ఉన్నా మా డబ్బు తో విడిపించి మార్కెట్ ధరకు కొనబడును. ఫోన్: 9100329739 [H-800535]

PERSONAL CARE

CHANGE OF NAME
■ I, Rangu Rathan Kumar R/o 30-647/6/38a, Shiva Gowri Enclave, Street No. 4, Neredmet Post, Medchal - Malkajgiri, Telangana have changed my minor son's name from Rangu Arav to Rangu Sriyan. [HA-44260]
■ I, JAISWAL SHEETAL OMPRAKASH W/o. Om Prakash Shiolal Jaiswal, R/o. Block C/206, Janapriya Arcadia, Kowkoor, Alwal, Secunderabad-500010, Telangana state have changed my name from JAISWAL SHEETAL OMPRAKASH to JAISWAL SHEETAL for all records purpose. [HA-01030]
■ I, MAHESH BHATT, S/o. Narayan Prasad Bhatt, R/o: Villa 159, Bloomfield Ecstasy, Tellapur, Sangareddy – 502032, TG have changed my name from MAHESH KUMAR BHATT to MAHESH BHATT for all future purposes [SCA25006078]

LOST
■ I, MODDU INDIRA KARINGU, W/o. Late YADAGIRI REDDY, R/o. H.No.3-26, Sheriguda (V), Ibrahimpatnam (M) Ranga Reddy (D), T.G. My Original PassPort No: J7189342 Document was lost while traveling by bike. If any found Please call. 9550364818 [SCA25006079]

OLD AGE HOME
■ వృద్ధులు, NRI'S లగ్జరీ రూమ్స్, లిఫ్ట్ @ మేడిపల్లి. దీర్ఘకాలిక మంచాన ఉన్న వారికి 24/7 మెడికల్, ఉప్పల్ & చిర్యాల్. మీన్స్ భోజన వసతి. 7981467036, 9391039990, 6281125552 [H-783378]

Wanted
■ త్రివేణి హోంకేర్ హైదరాబాద్‌లో వృద్ధులను పేషెంట్లను చూసుకొనుటకు వర్కర్స్/నర్సులు కావలెను. ఫ్రీ వసతి ఫుడ్ జీ : 18K. Ph: 9848571888, 9640400073 [SCA25005909]

■ రాయిదుర్గ్: సాఫ్ట్‌వేర్ కంపెనీలో పనిచేయుటకు Security Guards కావలెను. 12hrs shift. జీతం: 24500/- (PF, ESI కలిపి). ఫోన్: 8008069888 [HA-13326]
■ లేడీడెలికాల్స్ డే॥ఎంట్రీ, DTP టైపిస్ట్ (ఇంట్లో నుండే జాబ్స్) ఫీల్డ్ బాయ్స్, యాంకర్స్, విలేకర్లు, వీడియో ఎ॥, హెల్పర్స్, సూ॥వై, డ్రై॥. (ఫ్రీ హాస్టల్. జీ॥12-20K. 7780468727 [SCA25006045]
■ వంట, ఇంటిపని పిల్లలను పేషెంట్స్‌ని చూసుకోవడానికి కేర్ టేకర్స్ పంపబడును. ఫోన్: 6309807798, 9121099519 స్త్రీ/పు వర్కర్స్ కావలెను. [SCA25005958]
■ Required Field Executives for Electronic Goods Procurement from Stores. Ph. No: 9133399257, 9703333378 [G-145]
■ Wanted Drivers Minimum 3Yrs Experience, Age 30-40, Work at IT Companies, Hyd. Good Salary. Call: 9100777768 [HA-15969]
■ Leading Insurance Company Requires AGENCY PARTNERS for New Branches @ Hyderabad & Secunderabad. Salary Up to Rs. 30000+ Incentives Call: 9500435725/ 9551087099 [HA-1605]
■ Wanted Male Marketing Staff, Class Room Incharges and Receptionists, Qualification Any Degree, Age Limit: 25 to 45 years, Salary: 12000/- to 20000/-. Working Location: Master Minds College, Dilshuknagar, L.B.Nagar, Hyderabad, Contact: 9248733362, 9248733346 [G-6081]

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకు — జోన్ సెంటర్స్
సాక్షి క్లాసిఫైడ్స్ 3+2 3 ప్రకటనలకు చెల్లించండి, 2 ప్రకటనలు ఉచితంగా పొందండి
హైదరాబాద్ సిటీ ఎడిషన్‌లో 5 ప్రకటనలకు రూ. 2280/- (4 లైన్లు). ప్రతి అదనపు లైనుకు రూ. 540/-
గమనిక: జతపై మీరు ఇచ్చే అన్ని ప్రకటనలపై 5% GST అదనం

దిల్‌సుఖ్‌నగర్	9912348016	రాజేంద్రనగర్	9010202372
ఎల్.బి.నగర్	9912225475	కూకట్‌పల్లి	9912225476
తార్నాక	9010202751	బాలానగర్	9951602997
సికింద్రాబాద్	9010299013	మల్కాజ్‌గిరి	9505507562
చిక్కడపల్లి	9912225453	మెహదీపట్నం	9912225468
అబిడ్స్	9705144457	చందానగర్	9912225453
అమీర్‌పేట్	9505507563	ఉప్పల్	7095250115

వివరాలకు : 6-2-249/1, సాక్షి టవర్స్, రోడ్ నెం. 1, బంజారాహిల్స్, హైదరాబాద్ - 34
Ph: 040-2325 6000, Ext : 6235 Cell : 9912225453

నేడు కరెంట్ ఉండని ప్రాంతాలు

ఖైరతాబాద్: సైఫాబాద్ డివిజన్ పరిధిలో ట్రీ కట్టింగ్, సబ్‌స్టేషన్ల మెయింటనెన్స్ పనుల్లో భాగంగా బుధవారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు అసిస్టెంట్ డివిజినల్ ఇంజనీర్ తెలిపారు. లుంబినీపార్క్ సబ్‌స్టేషన్ పరిధిలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1గంట వరకు ఆల్ ఇండియా రేడియో, బ్యాండ్ లైన్, పోలీస్ కంట్రోల్ రూం, షీ టీం ఆఫీస్, కళాంజలి షోరూం ఏరియా, హుస్సేన్ సాగర్ సబ్‌స్టేషన్ పరిధిలో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు హనుమాన్ టెంపుల్, ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ ఏరియా, రాజ్‌నగర్ కొంత భాగం, మక్తా, మహాభారత్‌నగర్, శ్రీనివాసనగర్, బీజేఆర్‌నగర్, నెక్లెస్ రోడ్డు, పీపుల్స్ ప్లాజా, ఫుడ్ కోర్టు రెస్టారెంట్, జలవిహార్ తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు.

పలు ఫీడర్ల పరిధిలో..

వెంగళరావునగర్: చికోటి గార్డెన్స్, సెలబ్రిటీ క్లబ్ 11కేవీ ఫీడర్లు ఎయిర్‌పోర్ట్, ప్రకాశ్‌నగర్ సబ్‌స్టేషన్ల పరిధిల్లో జరుగుతున్న మరమ్మతుల కారణంగా బుధవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు ప్రకాశ్‌నగర్, రాహుల్ బజాజ్ వెనుక, చికోటి గార్డెన్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని గ్రీన్ లాండ్స్ సీబీడీ డీఈ జి.భీమానాయక్ మంగళవారం తెలిపారు. అదేవిధంగా శాంతిబాగ్ 11 కేవీ ఫీడర్ బేగంపేట సబ్‌స్టేషన్ల పరిధుల్లో కొనసాగుతున్న మరమ్మతుల కారణంగా మధ్యాహ్నం 2నుంచి సాయంత్రం 5గంటల వరకు శాంతిబాగ్, శివబాగ్, కెకె జోన్ హోటల్ ప్రాంతాల్లో కరెంటు సరఫరా ఉండదన్నారు.

ప్రజల్లో చైతన్యం తెచ్చిన మహమ్మద్ నిస్సార్

హిమాయత్‌నగర్: ప్రజాకవి, రచయిత, గాయకుడు, తెలంగాణ ప్రజా నాట్యమండలి సీనియర్ నాయకులు మహమ్మద్ నిస్సార్ తన ఆట పాటల ద్వారా ప్రజల్లో చైతన్యం తీసుకువచ్చాడని తెలంగాణ ప్రజా నాట్యమండలి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పల్లె నరసింహ అన్నారు. హిమాయత్‌నగర్ సత్యనారాయణరెడ్డి భవన్‌లో విప్లవ కవి, రచయిత, గాయకులూ మహమ్మద్ నిస్సార్ 5వ వర్ధంతిని మంగళవారం నిర్వహించారు. పల్లె నరసింహ, తెలంగాణ రాష్ట్ర ప్రజా నాట్యమండలి అధ్యక్షుడు కె.శ్రీనివాస్, లక్ష్మీ నారాయణ, కే.ఉప్పలయ్య, కిన్నెర, పి.సైదులు, నాయకులు వేల్పుల నారాయణ, వీరస్వామి, సుదర్శన్, చంద్రమోహన్‌గౌడ్, నిక్కత్, సుమిత్రాదేవి, నిధి, భిక్షపతి, నారాయణరెడ్డి తదితరులు నివాళులర్పించారు.

హాస్టల్ విద్యార్థుల సమస్యలపై బీజేపీ దృష్టి

రహమత్‌నగర్: వసతి గృహాల్లో నెలకొన్న సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్తామని బీజేపీ నాయకులు స్పష్టం చేశారు. ఎస్పీఆర్‌హిల్స్‌లోని గిరిజన బాలుర వసతి గృహాన్ని మంగళవారం సందర్శించి విద్యార్థుల సమస్యలు తెలుసుకున్నారు. బీజేపీ డివిజన్ అధ్యక్షుడు తంగపల్లి లక్ష్మణ్ మాట్లాడుతూ ప్రభుత్వ వసతి గృహాల్లో మౌలిక సదుపాయాలు లేక విద్యార్థులు తిప్పలు పడుతున్నారని ఆరోపించారు. బీజేపీ నాయకులు కొలన్ సత్యనారాయణ, రామకృష్ణ, రాంధారిబాబు, శ్రీనివాస్‌రెడ్డి, కిషోర్, విశాల్ సింగ్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

గంగమ్మ ఆలయాన్ని అభివృద్ధి చేయాలని వినతి



మంత్రి పొన్నంకు వినతిపత్రం అందజేస్తున్న గంగ తెప్పోత్సవ కమిటీ సభ్యులు

ఖైరతాబాద్: నెక్లెస్ రోడ్డులోని సాగర తీరంలో ఉన్న గంగమ్మ ఆలయాన్ని అభివృద్ధి చేయాలని కోరుతూ మంగళవారం గంగ తెప్పోత్సవ కమిటీ ఆధ్వర్యంలో మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. దశాబ్దాల చరిత్ర ఉన్న గంగమ్మ ఆలయాన్ని అభివృద్ధి చేయాలని, అక్కడే భక్తుల సౌకర్యార్థం బతుకమ్మ ఘాట్‌ను ఏర్పాటు చేయాలని కోరారు. మత్స్యశాఖ చైర్మన్ మెట్టు సాయికుమార్‌తో పాటు తెలంగాణ గంగ తెప్పోత్సవం అధ్యక్షుడు మల్కు మహేందర్‌బాబు, మంగళపల్లి రాజు, మల్కు విశాల్ బాబు, బైరు హనీస్ కుమార్ ఉన్నారు.

సమస్యలపై డీఎంసీతో చర్చ



సమస్యలపై డీఎంసీతో చర్చిస్తున్న కార్పొరేటర్

వెంగళరావునగర్: డివిజన్ పరిధిలోని పలు కాలనీలు, బస్తీల్లో నెలకొన్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని స్థానిక కార్పొరేటర్ దేదీప్య విజయ్ అన్నారు. స్థానిక జీహెచ్‌ఎంసీ సర్కిల్–19 కార్యాలయంలో మంగళవారం కార్పొరేటర్ పలువురు బీఆర్‌ఎస్ నాయకులతో కలిసి డీఎంసీ జకియా సుల్తానాను కలిసి సమస్యలపై చర్చించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ సీనియర్ నాయకులు విజయ్‌కుమార్, శ్యాంరావు, సత్యనారాయణ, లక్ష్మీ, జీహెచ్‌ఎంసీ వీధి దీపాలు, ఇంజనీరింగ్, శానిటేషన్ అధికారులు పాల్గొన్నారు.

హాయిగా.. సేదతీరేలా..

- రూ.73 లక్షలతో పార్కు సుందరీకరణ
- జూబ్లీహిల్స్‌లో ఆధునిక హంగులతో ఉద్యానవనం
- నెలన్నరలోపు పూర్తి చేయాలని కమిషనర్ ఆదేశాలు



జూబ్లీహిల్స్ రోడ్డు నంబర్-36 హైకింగ్ ట్రయల్ పార్కు పనులు పరిశీలిస్తున్న జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆర్‌వీ కర్ణన్

బంజారాహిల్స్: జూబ్లీహిల్స్‌లో మరో భారీ ఉద్యానవనాన్ని ఆధునిక హంగులతో తీర్చిదిద్దేందుకు జీహెచ్‌ఎంసీ ముందుకువచ్చింది. జూబ్లీహిల్స్ రోడ్డు నంబర్–22 నుంచి 25 వరకు ఎంసీఆర్‌హెచ్‌ఆర్‌డీ వరకు విస్తరించి ఉన్న 8 ఎకరాల విస్తీర్ణంలో రూ.73 లక్షల వ్యయంతో హైకింగ్ ట్రయల్ పార్కును తీర్చిదిద్దుతున్నారు. ఈ పార్కు నిర్మాణం పూర్తయితే స్థానికులకు ఆహ్లాదంతో పాటు పచ్చదనం పరిశుభ్రత మరింత అందుబాటులోకి వస్తుంది. హైకింగ్ ట్రయల్ పార్కు నిర్మాణ పనులను జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆర్‌వీ కర్ణన్, ఖైరతాబాద్ జోనల్ కమిషనర్ అనురాగ్‌జయంతి, ఈఈ విజయ్‌కుమార్, హార్టికల్చర్ ఆఫీసర్ బాలయ్య తదితరులతో కలిసి మంగళవారం పరిశీలించారు. హైటెన్షన్ వైర్ల కింద ఈ పార్కు ఉండటంతో దీనికి హైకింగ్ ట్రయల్ పార్కుగా నామకరణం చేశారు. పార్కు సుందరీకరణ పనులను నెలన్నర వ్యవధిలో పూర్తి చేయాలని, మరికొన్ని మార్పులు, చేర్పులు కూడా కమిషనర్ సూచించారు. పార్కు అభివృద్ధి, సుందరీకరణ పనుల్లో చేపట్టిన డిజైన్‌లో మరిన్ని హంగులను ఉండాలని ఆయన సూచించారు. రోడ్డు నంబర్–36 నుంచి రోడ్డు నంబర్–25 వరకు ఈ పార్కులో ఆయన పర్యటించారు. సందర్శకులకు ఆహ్లాదకర వాతావరణం ఉండేవిధంగా సుందరీకరణ పనులు నిర్దేశించిన కాలవ్యవధిలో పూర్తి చేయాలన్నారు. అంతేకాకుండా చిల్డ్రన్స్ ప్లే ఏరియా, వాకర్లకు సిట్టింగ్ ఏరియా, మూడు ఫౌంటెయిన్లు, వాకింగ్ ట్రాక్, రెండు పాండ్స్‌ను ఇందులో భాగంగా అభివృద్ధి చేయనున్నారు. ఈ పనులు పూర్తయితే స్థానికంగా



పచ్చని వాతావరణం నెలకొంటుందని అధికారులు పేర్కొన్నారు. ఇప్పటివరకు చెత్తా చెదారం, పిచ్చి మొక్కలతో స్థానికులకు అనారోగ్యకర వాతావరణంలో ఉన్న ఈ పార్కును త్వరలోనే అద్భుతంగా తీర్చిదిద్దనున్నారు.

పొదుపు పథకాలను సద్వినియోగం చేసుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న సీవో బుచ్చమ్మ

ఫిలింనగర్: పొదుపు గ్రూపులకు ప్రభుత్వం అందజేస్తున్న రుణాలను సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా అభివృద్ధి సాధించాలని జూబ్లీహిల్స్ సర్కిల్–18 సీవో బుచ్చమ్మ సూచించారు. ఫిలింనగర్‌లోని జ్ఞానిజైల్‌సింగ్ నగర్ మహిళా భవన్‌లో జ్ఞానిజైల్‌సింగ్‌నగర్, అంబేద్కర్ నగర్, పద్మాలయ అంబేడ్కర్ నగర్ బస్తీల మహిళా సమాఖ్యల సమావేశం మంగళవారం నిర్వహించారు. వడ్డీ లేని రుణాలతో పాటు ఇందిరా మహిళా శక్తి, లోన్ బీమా, ప్రమాద బీమా, కొత్త గ్రూపుల ఏర్పాటుపై సభ్యులకు ఆమె అవగాహన కల్పించారు. ఆసక్తి ఉన్న వారు ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్లకు దరఖాస్తు చేసుకోవాలని వాటి ఏర్పాటుకు కూడా ప్రభుత్వం రుణం ఇస్తుందని తెలిపారు. జ్ఞానిజైల్‌సింగ్ నగర్ సమాఖ్య అధ్యక్షురాలు పి.పద్మ,రోడ్ నెం.9 అంబేద్కర్‌నగర్ సమాఖ్య అధ్యక్షురాలు చంద్రమ్మ, పద్మాలయ అంబేద్కర్‌నగర్ సమాఖ్య అధ్యక్షురాలు నాగమణి పాల్గొన్నారు.

పట్టు పరిశ్రమపై విద్యార్థులకు అవగాహన

శ్రీనగర్‌కాలనీ: పట్టుపురుగుల నుంచి సిల్క్ ఎలా తయారు చేస్తారో విద్యార్థులకు అవగాహన కల్పించారు. శ్రీనగర్‌కాలనీలోని సత్యసాయినిగమాగమంలో ఇండియన్ సిల్క్ గ్యాలరీలో ఆధ్వర్యంలో సిల్క్ ఎగ్జిబిషన్ కొనసాగుతోంది. ఇందులో భాగంగా మంగళవారం గ్రోయింగ్ రూట్స్ స్కూల్ విద్యార్థులకు పట్టుపరిశ్రమపై సెంట్రల్ సిల్క్ బోర్డ్ ప్రతినిధులు మధుకుమార్, అలీ అవగాహన కల్పించారు. పట్టుపురుగుల నుంచి సిల్క్ ఎలా తయారు చేస్తారు. సిల్క్‌లో ఎన్ని రకాలు ఉంటాయి. నాణ్యమైన పట్టు వస్త్రాలు ఎలా ఉంటాయి. తదితర అంశాల గురించి వివరించారు. కార్యక్రమంలో సెంట్రల్ సిల్క్‌బోర్డ్ సభ్యులు, నిర్వాహకులు వినయ్‌కుమార్, శ్రీనివాసరావు పాల్గొన్నారు.



పట్టుపరిశ్రమపై అవగాహన కల్పిస్తున్న సెంట్రల్ సిల్క్ బోర్డ్ ప్రతినిధులు

మహానేతకు నివాళి

వెంకటేశ్వరకాలనీ: దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి జయంతి సందర్భంగా మంగళవారం బంజారాహిల్స్ రోడ్ నెం.1లోని సిటీ సెంటర్ చౌరస్తాలో ఉన్న వైఎస్సార్ విగ్రహానికి మాజీ కార్పొరేటర్ భారతి నాయక్ నివాళులర్పించారు. నేతలు బాబానాయక్, రాములు చౌహాన్, జావెద్, రాంజీనాయక్, సిద్దు తదితరులు పాల్గొన్నారు.



వైఎస్సార్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న మాజీ కార్పొరేటర్ భారతి నాయక్ తదితరులు



వైఎస్సార్‌కు నివాళులర్పిస్తున్న మంత్రి కొండా సురేఖ, విజయారెడ్డి

బంజారాహిల్స్ ఠాణా ఎదుట ఎమ్మార్పీఎస్ నేతల ధర్నా

బంజారాహిల్స్: బంజారాహిల్స్ రోడ్డు నంబర్–12లోని ఎన్‌బీటీనగర్‌లో ఎమ్మార్పీఎస్ జెండా ఎగురవేసేందుకు దిమ్మెను నిర్మించగా దానిని అక్రమంగా కూల్చివేసి దళితుల మనోభావాలను దెబ్బతీశారని, దిమ్మెను కూల్చివేయించిన వారిపై తక్షణమే చర్యలు తీసుకోవాలంటూ ఎమ్మార్పీఎస్ నాయకులు మంగళవారం బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్ వద్ద ధర్నా నిర్వహించారు. తమ సామాజికవర్గంపై కొంతమంది ప్రజాప్రతినిధులు వివక్ష చూపుతున్నారని, తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. జెండా గద్దెను కూల్చివేయడమే కాకుండా ప్రశ్నించిన తమపై హత్యాయత్నం కేసు నమోదు చేశారని ఆరోపించారు. న్యాయం చేయాలంటూ నినాదాలు చేశారు. దీంతో ఠాణా వద్ద ఉద్రిక్త వాతావరణం నెలకొంది.



ధర్నా నిర్వహిస్తున్న ఎమ్మార్పీఎస్ నేతలు

ఎప్పటికప్పుడు సమస్యలను పరిష్కరిస్తా

శ్రీనగర్‌కాలనీ: ప్రజా సమస్యల పరిష్కారానికి ముందుంటానని, మాగంటి గోపీనాథ్ సోదరుడిగా ఆయన ఆశయాలను అమలు చేస్తానని బీఆర్‌ఎస్ నేత మాగంటి వజ్రనాథ్ అన్నారు. కమలాపురి కాలనీ అసోషియేషన్ సభ్యులతో మంగళవారం ఆయన సమావేశమయ్యారు. అసోసియేషన్ ప్రెసిడెంట్ డాక్టర్ గోఖలే కాలనీలో జరిగిన అభివృద్ధి, పలు సమస్యలను వివరించారు. కాలనీలో పెండింగ్‌లో ఉన్న సమస్యలను తెలుసుకున్నారు. కాలనీలు, బస్తీల సంక్షేమం, అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తానని పేర్కొన్నారు.



కమలాపురికాలనీ అసోసియేషన్ సభ్యులతో మాగంటి వజ్రనాథ్

ఎన్‌బీటీనగర్‌లో దిమ్మె నిర్మాణానికి యత్నించిన వారిపై కేసు

బంజారాహిల్స్: అనుమతులు తీసుకోకుండా పబ్లిక్ ప్లేస్‌లో దిమ్మె నిర్మించేందుకు యత్నించిన వారిపై బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్‌లో క్రిమినల్ కేసు నమోదైంది. వివరాల్లోకి వెళితే.. బంజారాహిల్స్ రోడ్డు నంబర్–12లోని ఎన్‌బీటీనగర్ ప్రభుత్వ పాఠశాల ఎదుట ఈ నెల 6వ తేదీ రాత్రి కొమ్ము విజయ్, అజయ్‌కుమార్, నర్సింహ, రాములు అనే వ్యక్తులు ఎమ్మార్పీఎస్ జెండా కోసం దిమ్మెను నిర్మించేందుకు యత్నించారు. దీంతో స్థానికులు పబ్లిక్ ప్లేస్‌లో ఎలా నిర్మిస్తారంటూ అడ్డుకున్నారు. ఈ దిమ్మె నిర్మాణంతో రాకపోకలకు ఇబ్బందులు ఎదురవుతాయని, అనుమతులు లేకుండా అక్రమంగా దిమ్మె నిర్మిస్తున్నారని, పబ్లిక్ ప్లేస్‌ను డ్యామేజీ చేశారంటూ జూబ్లీహిల్స్ సర్కిల్ టౌన్‌ప్లానింగ్ ఏసీపీ శ్రీనివాస్ బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు ఎమ్మార్పీఎస్ నేతలు కొమ్ము విజయ్, అజయ్‌కుమార్, నర్సింహ, రాములుపై పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ట్రేడ్ లైసెన్స్ రెన్యువల్ చేయించుకోని షాపు సీజ్



బంజారాహిల్స్: బంజారాహిల్స్ రోడ్డు నంబర్–1లోని తనిష్క్ టైటాన్ కంపెనీ లిమిటెడ్ షోరూం ట్రేడ్ లైసెన్స్ రెన్యువల్ చేయించుకోకుండా కొనసాగిస్తుండటంతో జీహెచ్‌ఎంసీ సర్కిల్–18 ట్యాక్స్ ఇన్‌స్పెక్టర్లు మంగళవారం దుకాణాన్ని సీజ్ చేశారు. రూ.55 వేల లైసెన్స్ ఫీజు చెల్లించకుండా నడుపుతున్నారు. సీజ్ చేసిన కొద్దిసేపటికే సంబంధీకులు లైసెన్స్ ఫీజు చెల్లించి కొత్త ట్రేడ్ లైసెన్స్ తీసుకున్నారు.

వచ్చేనెల 19న 'బీసీల సింహగర్జన'

హిమాయత్‌నగర్: కాంగ్రెస్ పార్టీ కామారెడ్డి డిక్లరేషన్ హామీ ప్రకారం బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు అంశంలో ప్రభుత్వం దాటవేత వైఖరిని నిరసిస్తూ వచ్చేనెల 19న కామారెడ్డిలో లక్ష మంది బీసీలతో 'బీసీల సింహగర్జన' నిర్వహించనున్నట్లు తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం వెల్లడించింది. బషీర్‌బాగ్ దేశోద్ధారక భవన్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఎర్ర సత్యనారాయణ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ అసెంబ్లీలో తీర్మానించి, కేంద్ర ప్రభుత్వానికి నివేదిక పంపించి చేతులు దులుపుకుందని ఆరోపించారు. సీఎం రేవంత్‌రెడ్డి అనేక అనేకమార్లు ఢిల్లీ వెళ్లి బీసీ రిజర్వేషన్ల గురించి ప్రస్తావించకపోవడం శోచనీయమన్నారు. నాయకులు కోలా జనార్దన్, సుధాకర్, నందగోపాల్, ఉదయ్, బోయ గోపి తదితరులు పాల్గొన్నారు.

వడ్డీ లేని రుణాలపై మహిళలకు అవగాహన

రహమత్‌నగర్: స్వయం సహాయక సంఘాల ద్వారా మహిళలు ఆర్థిక అభ్యున్నతికి అవకాశం ఉందని, ప్రతి మహిళా స్వయం సహాయక సంఘంలో చేరాలని జీహెచ్‌ఎంసీ మాజీ డిప్యూటీ మేయర్, కార్పొరేటర్ బాబా ఫసియుద్దీన్ అన్నారు. బోరబండ డివిజన్ తుర్రేబాజ్‌ఖాన్ కమ్యూనిటీ హాల్‌లో మంగళవారం నిర్వహించిన పట్టణ మహిళా సమాఖ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం అందజేస్తున్న వడ్డీ లేని రుణాలపై మహిళలకు అవగాహన కల్పించాలని సూచించారు. డివిజన్‌కు మంజూరైన వడ్డీ రుణాల పంపిణీ త్వరలోనే చేపడతామని పేర్కొన్నారు. ప్రాజెక్ట్ అధికారి వెంకట్‌కిషన్‌రావు, కమ్యూనిటీ ఆర్గనైజర్లు, యూసీడీ సిబ్బంది, నాయకులు కాసుల మహేష్ కుమార్‌గౌడ్, ఆనంద్, మహేందర్‌గౌడ్, పాషా పాల్గొన్నారు.

మహిళల ఆర్థిక అభ్యున్నతికి కృషి

ఖైరతాబాద్: ఖైరతాబాద్ డివిజన్ రాజ్‌నగర్‌లో ఇందిరా మహిళా శక్తి గ్రూప్ ఆధ్వర్యంలో మంగళవారం సంబరాలు నిర్వహించారు. శ్రీవినాయక ఎస్‌ఎల్‌ఎఫ్ మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో నిర్వహించిన సంబరాలకు కార్పొరేటర్ విజయారెడ్డి హాజరై మాట్లాడారు. కొత్త సంఘాలను ఏర్పాటు చేయాలని, వడ్డీలేని రుణాలను మహిళలకు అందించాలని, బ్యాంక్ లింకేజ్ చేయాలని, దివ్యాంగులు ప్రత్యేకంగా సంఘాలు ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు. ప్రతి మహిళను కోటీశ్వరురాలుగా మార్చాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ఇందిరా మహిళా శక్తి గ్రూప్‌లు, మహిళా శక్తి గ్రూప్‌లు ఆర్థికంగా ఎదిగేందుకు పెట్రోల్ పంపులు,ఇందిరా క్యాంటీన్లను ఏర్పాటు చేసుకునే విధంగా ప్రోత్సహిస్తోందన్నారు. ప్రాజెక్ట్ ఆఫీసర్ శ్రీనివాస్, సీఓ సురేందర్, ఎంటమాలజీ సూపర్‌వైజర్ సుమన్, మహిళలు పాల్గొన్నారు.



వరద సాఫీగా సాగేలా..

నాలాలను పరిశీలించిన హైడ్రా కమిషనర్

బంజారాహిల్స్: బంజారాహిల్స్ రోడ్డు నంబర్–12లోని చింతలబస్తీ సమీప నాలాను హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ మంగళవారం పరిశీలించారు. ఇక్కడ నాలాపై కల్వర్టు 12 మీటర్ల విస్తీర్ణంలో ఉండగా.. చింతలబస్తీ వైపు కబ్జాలను తొలగించిన విషయం విధితమే. 6మీటర్ల మేర కబ్జాకు గురవ్వడంతో కల్వర్టు కింద భారీగా చెత్త పేరుకుపోయి వరద సాఫీగా సాగేందుకు వీలులేని పరిస్థితి నెలకొంది. అక్కడ చెత్తను తొలగించడానికి లాంగ్ ఆర్మ్ జేసీబీని వినియోగించిన తీరును రంగనాథ్ పరిశీలించారు. ఇదే మాదిరి నగరంలోని ప్రధాన కల్వర్టుల్లో పేరుకుపోయిన చెత్తను తొలగించాలని సూచించారు. అంతకుముందు కృష్ణానగర్‌లో నాలాల తీరును క్షేత్రస్థాయిలో పరిశీలించారు. వరద ముంచెత్తడానికి గల కారణాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. వరద నివారణకు ఇటీవల కొత్తగా 3 మీటర్ల వెడల్పుతో నిర్మించిన వరద కాలువ మధ్యలో ఎందుకు ఆగిపోయిందో విచారించారు. కృష్ణానగర్ ప్రధాన దారిని దాటించడానికి ఉన్న అవరోధాలపై వాకబు చేశారు. పైనుంచి ఎంత వెడల్పుతో వస్తుందో అంతే స్థాయిలో బాక్సు డ్రైన్లను కానీ.. పైపులను ఒకటి రెండో రోజుల్లో అమర్చి రాకపోకలను పునరుద్ధరించేలా పనులు చేపట్టాల్సిన ఆవశ్యకతను చర్చించారు. సంబంధిత శాఖలన్నిటితో సమావేశమై దీనిపై చర్చించాలని సూచించారు.



పేదలకు అండగా హైడ్రా

వెంగళరావునగర్: పేదలు నిర్మించుకున్న గృహాలను హైడ్రా ఎన్నడూ కూల్చివేయలేదని, ఏదైనా అభ్యంతరకరంగా ఉన్న వాటిని మాత్రమే ఇప్పటి వరకు తొలగించడం జరిగిందని హైడ్రా కమిషనర్ రంగనాథ్ అన్నారు. యూసుఫ్‌గూడ డివిజన్ పరిధిలోని శ్రీకృష్ణానగర్‌లో మంగళవారం ఆయన ఆకస్మిక పర్యటన చేశారు. శ్రీకృష్ణానగర్ పూర్ణ టిఫిన్ సెంటర్ ప్రధాన రహదారిలో అధికారులతో కలిసి పరిశీలించారు.



కృష్ణానగర్‌లో పర్యటిస్తున్న హైడ్రా కమిషనర్ రంగనాథ్

జీతాలు పెంచండి సార్

మంత్రి పొన్నంకు స్వీపర్ల మొర

బంజారాహిల్స్: జీతాలు పెంచండి సార్.. వచ్చే జీతాలు అద్దెలు, ఖర్చులకు సరిపోవడం లేదంటూ జూబ్లీహిల్స్ సర్కిల్–18 శానిటేషన్ విభాగంలోని స్వీపర్లు మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కోరారు. బంజారాహిల్స్‌లోని కొమురం భీం భవన్‌లో జరిగిన హెల్త్ క్యాంపునకు మంగళవారం హాజరైన ఆయన శానిటేషన్ వర్కర్లతో ముచ్చటించారు. ఈ సందర్భంగా వారు మంత్రితో మాట్లాడుతూ వర్షాకాలంలో జీహెచ్‌ఎంసీ ఇచ్చిన రెయిన్ కోట్లతో మొత్తం తడిసిపోతున్నామని, అవి సరిగ్గా లేవని వాటిని మార్చాలని కోరారు. స్పందించిన మంత్రి సమస్యలపై అధికారులతో చర్చిస్తామని హామీ ఇచ్చారు.



స్వీపర్లతో మాట్లాడుతున్న మంత్రి పొన్నం ప్రభాకర్



ఆస్పత్రి ఏర్పాటుకు సహకరించాలని వినతి



డీఎంసీ సమ్మయ్యతో మాట్లాడుతున్న జూబ్లీహిల్స్ డివిజన్ కార్పొరేటర్ వెల్దండ వెంకటేష్

ఫిలింనగర్: జూబ్లీహిల్స్ డివిజన్ పరిధిలోని జవహర్ కాలనీ బస్తీలో ఉన్న అర్బన్ హెల్త్ సెంటర్‌కు అద్దె చెల్లించకపోవడంతో అక్కడి నుంచి ఖాళీ చేయాలని ఇంటి ఓనర్ ఒత్తిడి పెంచుతున్నాడని, వెంటనే ఆస్పత్రిని వేరే చోటకు తరలించేందుకు బస్తీలో ఉన్న కమ్యూనిటీ హాల్‌ను కేటాయించాలంటూ జూబ్లీహిల్స్ డివిజన్ కార్పొరేటర్ వెల్దండ వెంకటేష్ డీఎంసి సమ్మయ్యను కోరారు. మంగళవారం కార్పొరేటర్ వెంకటేష్ డీఎంసిని స్థానిక బస్తీవాసులతో కలిసి స్థానిక పరిస్థితిని వివరించారు. స్థానికంగా ఏదైనా కమ్యూనిటీ హాల్‌లోకి మార్చడం కుదరకపోతే కనీసం అక్కడే ఉన్న ప్రభుత్వ స్థలంలో కంటైనర్‌లో అయినా ఆస్పత్రిని తాత్కాలికంగా ఏర్పాటు చేయాలని ఆయన కోరారు. సానుకూలంగా స్పందించిన డీఎంసి అక్కడ పర్యటించి బస్తీ కమిటీ నేతలతో చర్చించి కమ్యూనిటీ హాల్‌లో ఏర్పాటుచేసేందుకు ప్రయత్నం చేస్తానని హామీ ఇచ్చారు.

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
9912220379
9640081203

మహానేత వైఎస్సార్‌కు ఘన నివాళి

ఇడుపులపాయలో వైఎస్ జగన్ దంపతులు, వైఎస్ విజయమ్మ ప్రత్యేక ప్రార్థనలు

వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు

మౌనం పాటించి వైఎస్సార్‌ను స్మరించుకున్న కుటుంబ సభ్యులు



తల్లి విజయమ్మతో వైఎస్ జగన్ ఆత్మీయ ఆలింగనం

సాక్షి ప్రతినిధి, కడప: దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి 76వ జయంతి సందర్భంగా వైఎస్సార్ కడప జిల్లా ఇడుపులపాయలోని ఆయన సమాధి వద్ద వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మంగళవారం ఘనంగా నివాళులు అర్పించారు. వైఎస్సార్ సతీమణి వైఎస్ విజయమ్మ, కుమారుడు వైఎస్ జగన్, కోడలు వైఎస్ భారతీరెడ్డి, సోదరుడు వైఎస్ సుధీకర్‌రెడ్డి, సమీప బంధువులు మహానేత విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. పులివెందుల నుంచి వారు రోడ్డు మార్గాన ఉదయం 7.45 గంటలకు వైఎస్సార్ ఘాట్‌కు చేరుకున్నారు. పాస్టర్లు బెనహర్ నరేష్, మృత్యుంజయ, రత్నకుమార్ ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. రెండు నిమిషాలపాటు మౌనం వహించి వైఎస్సార్‌ను స్మరించుకున్నారు. కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, రాజ్యసభ సభ్యుడు మేడా రఘునాథరెడ్డి, జెడ్పీ చైర్మన్ ముత్యాల రామగోవిందురెడ్డి, ఎమ్మెల్యేలు ఆకేపాటి అమర్‌నాథరెడ్డి, డాక్టర్ సుధ, చంద్రశేఖర్, మాజీ ఎమ్మెల్యేలు రవీంద్రనాథరెడ్డి, రఘురామిరెడ్డి, అంజాద్ బాషా, గడికోట శ్రీకాంత్ రెడ్డి, కొరముట్ల శ్రీనివాసులు, ఎమ్మెల్సీలు రమేష్ యాదవ్, డీసీ గోవిందరెడ్డి, సమీప బంధువులు వైఎస్ యువరాజ్‌రెడ్డి, డాక్టర్ ఈసీ సుగుణమ్మ, వైఎస్ ప్రమీలమ్మ తదితరులు వైఎస్సార్‌కు ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఇడుపులపాయకు తరలివచ్చిన పార్టీ నేతలు, అభిమానులను వైఎస్ జగన్ పేరుపేరునా పలకరించారు. అనంతరం వైఎస్సార్ తనయ వైఎస్ షర్మిల నివాళులు అర్పించారు.

మిస్ యూ డాడ్..

వైఎస్ జగన్ భావోద్వేగం

సాక్షి, అమరావతి: దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి జయంతి సందర్భంగా ఆయన తనయుడు, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి భావోద్వేగానికి లోనయ్యారు. మిస్ యూ డాడ్.. అంటూ మంగళవారం సామాజిక మాధ్యమం ఎక్స్‌లో పోస్టు చేశారు. ఇడుపులపాయలో వైఎస్సార్ ఘాట్ వద్ద నివాళులర్పించిన ఫొటోలను ఆ పోస్టుకు జత చేశారు.



దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డికి నివాళులర్పిస్తున్న ఏపీ మాజీ సీఎం వైఎస్ జగన్ దంపతులు. చిత్రంలో వైఎస్సార్ సతీమణి వైఎస్ విజయమ్మ తదితరులు

పరిపాలనాదక్షుడు.. మహానేత వైఎస్సార్

సంక్షేమం, అభివృద్ధితో పేదల గుండెల్లో చిరస్థాయిలో నిలిచారు ● వైఎస్సార్ అభిమానుల ఆత్మీయ సమ్మేళనంలో పలువురు వక్తలు

సాక్షి, హైదరాబాద్: సంక్షేమం, అభివృద్ధిని రెండు కళ్లలా భావించి పాలన అందించిన దివంగత సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి పేదల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయారని పలువురు వక్తలు కొనియాడారు. వైఎస్సార్ 76వ జయంతి సందర్భంగా వైఎస్సార్ స్ఫూర్తి ఫౌండేషన్ ఆధ్వర్యంలో మంగళవారం హైదరాబాద్ హైటెక్ సిటీ లోని బుట్ట కన్వెన్షన్ సెంటర్‌లో దైవమే మానవ రూపేణా పేరుతో నిర్వహించిన అభిమానుల ఆత్మీయ సమ్మేళనంలో పలువురు మాజీ జడ్జీలు, రిటైర్డ్ ఉన్నతాధికారులు, రాజకీయ నేతలు, సీనియర్ జర్నలిస్టులు ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. మాజీ ఎంపీ మేకపాటి రాజమోహన్‌రెడ్డి మాట్లాడుతూ దేశంలో ఏ ముఖ్యమంత్రీ చేయలేనట్లుగా సంక్షేమ, అభివృద్ధి పథకాలను ప్రవేశపెట్టి అమలు చేసిన గొప్ప పరిపాలనాదక్షుడు వైఎస్సార్ అని కొనియాడారు. పేదవాడికి విద్య, వైద్యం అందుబాటులోకి తెచ్చారని గుర్తుచేశారు. ఉచిత విద్యుత్, జలయజ్ఞం, ఆరోగ్యశ్రీ, రుణమాఫీ పథకాలు ప్రవేశపెట్టిన ఘనత ఆయనకే దక్కుతుందన్నారు. కాంగ్రెస్‌ను జాతీయ స్థాయిలో రెండుసార్లు నిలబెట్టింది వైఎస్సార్ అని, ఆయన బతికుంటే ప్రధాని స్థాయికి ఎదిగేవారన్నారు.

సుపరిపాలన అందించారు: రిటైర్డ్ జస్టిస్ పి. లక్ష్మణరెడ్డి

హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ పి. లక్ష్మణరెడ్డి మాట్లాడుతూ బడుగు, బలహీన వర్గాల కోసం పరితపించి సుపరిపాలన అందించిన వైఎస్సార్‌ను ప్రజలు మరువలేరన్నారు. రాజ్యాంగానికి అనుగుణంగా అసమానతలు తగ్గించేందుకు ప్రయత్నించారని.. అట్టడుగు వర్గాలను అభివృద్ధి పరచాలన్న సంకల్పంతో సుపరిపాలన సాగించిన మహానేత అని కొనియాడారు.



మంగళవారం హైదరాబాద్‌లో జరిగిన వైఎస్సార్ ఆత్మీయ సమ్మేళనంలో వైఎస్సార్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న కొమ్మినేని, జస్టిస్ లక్ష్మణరెడ్డి, జవహర్‌రెడ్డి, అజేయ కల్లం, కొండా రాఘవరెడ్డి, జస్టిస్ నాగార్జునరెడ్డి, వై. ఈశ్వరప్రసాద్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, మేకపాటి రాజమోహన్‌రెడ్డి తదితరులు

సామాజిక న్యాయానికి పర్యాయ పదం: రిటైర్డ్ జస్టిస్ సి.వి. నాగార్జునరెడ్డి

దివంగత వైఎస్సార్ పాలనలో అందిన విద్య, వైద్యం, వ్యవసాయం, మౌలిక సదుపాయాల కల్పన ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయాయని మాజీ న్యాయమూర్తి జస్టిస్ సీవీ నాగార్జునరెడ్డి తెలిపారు. సామాజిక న్యాయానికి పర్యాయ పదం వైఎస్సార్ అన్నారు.

వైఎస్సార్ మహనీయుడు: అజేయ కల్లం

ఏపీ ప్రభుత్వ మాజీ సీఎస్ అజేయ కల్లం మాట్లాడుతూ మానవతా విలువలుగల మహనీయుడు వైఎస్సార్ అని కొనియాడారు. సరికొత్త ఆలోచనలను ప్రోత్సహించే వైఎస్సార్ ప్రజాసమస్యల పరిష్కార మార్గాలపై దృష్టి సారించేవారన్నారు.

హైదరాబాద్‌కు కృష్ణా, గోదావరి జలాల చొరవ వైఎస్సార్‌దే: కేఎస్ జవహర్‌రెడ్డి

హైదరాబాద్ నగరానికి తాగునీటి సమస్య లేదంటే అందుకు కారణం దివంగత సీఎం రాజశేఖరరెడ్డి చేపట్టిన చొరవేనని మాజీ ప్రధాన కార్యదర్శి కె.ఎస్. జవహర్‌రెడ్డి అన్నారు. సుదూర ప్రాంతాల నుంచి నగరానికి కృష్ణా, గోదావరి జలాలను తీసుకొచ్చారని గుర్తుచేశారు. మాజీ ముఖ్య కార్యదర్శి ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ పేదల ప్రాణాలు కాపాడేందుకు సీఎం రిలీఫ్ ఫండ్‌కింద నిత్యం భారీగా నిధులు విడుదల చేసేవారన్నారు. వైఎస్సార్ లేకపోవడం తెలుగు ప్రజల దురదృష్టమన్నారు. రిటైర్డ్ ఐజీ హనుమంతరెడ్డి మాట్లాడుతూ పేదలకు న్యాయం జరిగేందుకు వైఎస్సాఆర్ ప్రాధాన్యత ఇచ్చేవారని చెప్పారు. వైఎస్సార్ చరిత్రను భావితరాలకు అందించాల్సిన అవసరం ఎంతైనా ఉందని చెప్పారు.

సమస్యలకు పరిష్కారం ఆయన నైజం: శాంతా బయోటెక్ చైర్మన్ కె.ఐ. వరప్రసాదరెడ్డి

రైతులను ఆదుకోవడానికి వైఎస్సార్ సరికొత్తగా ఆలోచించేవారని శాంతా బయోటెక్ చైర్మన్ కె.ఐ. వరప్రసాదరెడ్డి పేర్కొన్నారు. ప్రజాసమస్యలు వినడం, వినిపించడం, సమస్యలకు పరిష్కారం చూపడం అయన నైజమన్నారు. సీనియర్ జర్నలిస్టు కొమ్మినేని శ్రీనివాసరావు మాట్లాడుతూ వైఎస్సార్ హయాంలోనే పులిచింతలను పూర్తి చేశారని.. పోలవరానికి నిధులు తెచ్చి ఇంతవరకూ ఆ ప్రాజెక్టు రూపాంతరం చెందిందంటే అది వైఎస్సార్ ఘనతేనని కొనియాడారు.



వరప్రసాదరెడ్డి

సీనియర్ జర్నలిస్టు దేవులపల్లి అమర్ మాట్లాడుతూ వైఎస్సార్ దగ్గర్నుంచీ ప్రతిఒక్కరూ నేర్చుకోవాల్సింది ఒక్కోటి ఉంటుందన్నారు. వైఎస్సార్ స్ఫూర్తి ఫౌండేషన్ వ్యవస్థాపకుడు వై. ఈశ్వరప్రసాద్‌రెడ్డి స్వాగతోపన్యాసం చేసిన ఈ కార్యక్రమంలో రిటైర్డ్ ఐఏఎస్ భాను, మాజీ ఏసీబీ డైరెక్టర్ మల్లారెడ్డి, ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయ మాజీ వీసీ రాఘవరెడ్డి, కొండా రాఘవరెడ్డి తదితరులు ప్రసంగించారు.

వైఎస్సార్ పేరుతో అభ్యుదయ రైతులకు అవార్డులు

- వ్యవసాయ రంగానికి సేవలందించినవారికి కూడా..
- అందుకోసం వైఎస్సార్ ఫౌండేషన్ ఏర్పాటు చేసే యోచన
- వచ్చే వైఎస్సార్ వర్ధంతి నాటికి ఫౌండేషన్ ఏర్పాటు
- డిప్యూటీ సీఎం భట్టి వెల్లడి
- దివంగత సీఎంను స్మరించుకున్న కాంగ్రెస్ నేతలు



సిటీ సెంటర్ చౌరస్తాలో వైఎస్సార్ విగ్రహానికి నివాళులు అర్పిస్తున్న డిప్యూటీ సీఎం భట్టి, కేవీపీ. దానం తదితరులు

సాక్షి, హైదరాబాద్/పంజగుట్ట: ఉమ్మడి రాష్ట్రంలో వ్యవసాయ రంగం అభివృద్ధికి, రైతుల అభ్యున్నతికి విశేష కృషి చేసిన దివంగత ముఖ్యమంత్రి వై.ఎస్. రాజశేఖరరెడ్డి పేరుతో అభ్యుదయ రైతులు, వ్యవసాయ రంగానికి విశేష సేవలందించినవారికి అవార్డులు ఇవ్వాలని ప్రభుత్వం ఆలోచిస్తోందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తెలిపారు. అందులో భాగంగా వైఎస్సార్ పేరిట ఒక ఫౌండేషన్‌ను ఏర్పాటు చేసి, దాని ద్వారా కార్యక్రమాలను నిర్వహించాలనే ఆలోచన చేస్తున్నట్లు చెప్పారు. వైఎస్ రాజశేఖరరెడ్డి 76వ జయంతి సందర్భంగా బంజారాహిల్స్‌లోని సిటీసెంటర్ చౌరస్తా, పంజగుట్ట కూడలిలోని వైఎస్సార్ విగ్రహాలకు మంగళవారం భట్టి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఆయాచోట్ల ఆయన మీడియాతో మాట్లాడారు. రాబోయే వైఎస్సార్ వర్ధంతి నాటికి ఫౌండేషన్‌కు రూపకల్పన చేసి వ్యవసాయ రంగానికి విశేష సేవలందించిన వారిని గుర్తించి వైఎస్సార్ పేరిట అవార్డులు ఇవ్వాలని ఆలోచిస్తున్నట్లు చెప్పారు. వైఎస్సార్‌ను నిత్యం స్మరిస్తూ, వారి ఆలోచనను ముందుకు తీసుకువెళతామని స్పష్టం చేశారు. వైఎస్సార్ అంటే మొదట గుర్తుకువచ్చేది వ్యవసాయం, నీటిపారుదల ప్రాజెక్టులేనని అన్నారు. మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. వైఎస్సార్ మరణించి 15 ఏళ్లు అవుతున్నా ఆయన గుర్తులు ప్రతి ఇంట్లో చిరస్మరణీయంగా ఉన్నాయని పేర్కొన్నారు. నేటితరం యువత, రాజకీయాల్లోకి రావాలనుకునేవారు వైఎస్సార్ నుంచి ఎంతో నేర్చుకోవాలన్నారు. పంజగుట్ట కూడలిలో జరిగిన కార్యక్రమంలో భట్టితోపాటు టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్, పుదుచ్చేరి మాజీ సీఎం నారాయణస్వామి, మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, మాజీ ఎంపీలు కేవీపీ రామచంద్రరావు, అంజన్‌కుమార్ యాదవ్, ఎమ్మెల్యే దానం నాగేందర్, ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్, సీడబ్ల్యూసీ సభ్యులు గిడుగు రుద్రరాజు, ఫిరోజ్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ టీపీసీసీ ఆధ్వర్యంలో ఘన నివాళులు

వైఎస్సార్ 76వ జయంతి సందర్భంగా టీపీసీసీ ఆధ్వర్యంలో ఘనంగా నివాళులర్పించారు. గాంధీ భవన్‌లో వైఎస్సార్ చిత్రపటానికి పూలమాలలు వేసి రాష్ట్ర అభివృద్ధికి ఆయన చేసిన కృషిని స్మరించుకున్నారు. అనంతరం పేదలకు వస్త్రాలు, స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నారాయణస్వామి, మహేశ్‌కుమార్‌గౌడ్, దానం, శ్రీగణేశ్, బల్మూరి, అద్దంకి దయాకర్, మధుయాష్కీ గౌడ్, అంజన్ కుమార్‌యాదవ్, కేవీపీ పాల్గొన్నారు.

నగర వార్తలు

నగరంలో నేడు

- మాదాపూర్‌లోని శిల్పారామంలో ఏర్పాటు చేసిన హస్తకళా మ్యూజియం ఉదయం 10.30 నుంచి రాత్రి 8 గంటల వరకు అందుబాటులో ఉంటుంది.
- శ్రీనగర్ కాలనీలోని శ్రీ సత్యసాయి నిగమాగమంలో ఉదయం 10 నుంచి రాత్రి 8.30 గంటల వరకు ఇండియన్ సిల్క్ గ్యాలరీ ఎక్స్‌పో జరుగుతుంది.
- మాదాపూర్‌లోని చిత్రమయి స్టేట్ ఆర్ట్ గ్యాలరీలో డిజిటల్ ఆర్ట్, పెయింటింగ్ ఎగ్జిబిషన్ ఉదయం 10.30 నుంచి రాత్రి 7 గంటల వరకు అందుబాటులో ఉంటుంది.
- మాదాపూర్ శిల్పారామం సమీపంలోని ఇందిరా మహిళా శక్తి బజార్‌లో చేనేత ఉత్పత్తుల ప్రదర్శన ఉదయం 11 నుంచి రాత్రి 8 గంటల వరకు అందుబాటులో ఉంటుంది.
- హైటెక్ సిటీలోని నోవాటెల్ హోటల్‌లో హైలైఫ్ ఎగ్జిబిషన్ ఉదయం 11 నుంచి రాత్రి 8 గంటల వరకు అందుబాటులో ఉంటుంది.

గ్రేటర్ సిటీ నలుమూలలా ప్రతిరోజూ నిర్వహించే ఈవెంట్ల వివరాలను ఒక రోజు ముందే మాకు పంపండి. 'సాక్షి' ఎంగేజ్‌మెంట్ కాలం (నగరంలో నేడు)లో ప్రచురిస్తాం. మీ ఈవెంట్ల వివరాలను sakshiupdates123@gmail.com కు మెయిల్ చేయగలరు.

నకిలీ మందుల విక్రయాలు.. ఒకరి అరెస్టు

సాక్షి, సిటీ బ్యూరో: ఎవరైనా నకిలీ మందులు తయారు చేసినా, అమ్మినా ఉపేక్షించబోమని డ్రగ్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ డైరెక్టర్ జనరల్ షానవాజ్ ఖాసిం అన్నారు. ఈ నెల 8న నకిలీ మందులు అమ్ముతున్నట్లు గుర్తించిన కేసులో గాంధీనగర్ ఎస్‌బీఐ కాలనీలోని అరవింద్ ఫార్మా డిస్ట్రిబ్యూటర్స్ భాగస్వామి మనీష్‌కుమార్‌ను మంగళవారం అరెస్టు చేశారు. ఈ మేరకు ఆయనను సికింద్రాబాద్ అదనపు చీఫ్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ ముందుకు హాజరుపర్చగా ఈ నెల 23 వరకు రిమాండ్ విధించారు. మూర్ఛ వ్యాధికి సంబంధించిన లెవిపిల్ 500 అనే మాత్రలు గుర్తింపు పొందిన కంపెనీ పేరుతో తయారు చేసి విక్రయిస్తున్నట్లు అధికారు నిగ్గుతేల్చారు. ప్రజారోగ్యాన్ని కాపాడటానికి డ్రగ్ కంట్రోల్ విభాగం కట్టుబడి ఉంటుందని షానవాజ్ ఖాసిం తెలిపారు. నకిలీలకు అడ్డుకట్ట వేయాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉందన్నారు. 1800–599–6969 నెంబరులో ఫిర్యాదులు చేయాలని సూచించారు.

బోనాలు తెలంగాణ సంస్కృతికి ప్రతీక

● ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం

కవాడిగూడ: తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ఆషాఢమాసం బోనాలు చిహ్నంగా నిలుస్తాయని తెలంగాణ జన సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు, ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా బోనాల పండగను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని సూచించారు. తెలంగాణ జన సమితి అనుబంధ జీహెచ్‌ఎంసీ ఔట్ సోర్సింగ్ ఎంప్లాయీస్ యూనియన్ ఆధ్వర్యంలో మంగళవారం లోయర్ ట్యాంక్‌బండ్ కనకాల కట్టమైసమ్మ దేవాలయం వద్ద ఘనంగా బోనాల వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు బోనాలతో భారీ తొట్టెలను ఊరేగించి మొక్కులను చెల్లించుకున్నారు. బోనాల వేడుకల్లో ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం, మాజీ ఎంపీ వి.హనుమంతరావు, నగర డిప్యూటీ మేయర్ మోతె శ్రీలతారెడ్డి, తెలంగాణ జనసమితి నగర అధ్యక్షుడు ఎం.నరసయ్య గౌడ్‌తోపాటు కార్మికులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కోదండరాం మాట్లాడుతూ జీహెచ్‌ఎంసీలో ఔట్ సోర్సింగ్ కార్మికులకు వేతనాల పెంపుదల ఆవశ్యకత అత్యంత అవసరమన్నారు. పెండింగ్ సమస్యలను పరిష్కరించడానికి సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి మాట్లాడతానని ఆయన కార్మికులకు హామీ ఇచ్చారు. ఔట్ సోర్సింగ్ ఎంప్లాయీస్ యూనియన్ కన్వీనర్ ఆకుల శ్రీనివాస్ ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకలకు భారీ ఎత్తున మహిళా కార్మికులు తరలివచ్చి బోనాలతో అమ్మవారికి మొక్కులు సమర్పించారని తెలిపారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ గ్రేటర్ నాయకుడు ఎంఎన్ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



బోనాలతో ఎమ్మెల్సీ కోదండరాం, శ్రీలతారెడ్డి, జీహెచ్‌ఎంసీ కార్మికులు

జూ పార్కులో వన మహోత్సవం

చార్మినార్: రాష్ట్రంలో అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించే వన మహోత్సవం మంగళవారం నెహ్రూ జూలాజికల్ పార్క్‌లో జరిగింది. రాష్ట్ర జూ పార్క్స్ డైరెక్టర్ డాక్టర్ సునీల్ ఎస్.హిరేమత్, క్యూరేటర్ జె.వసంత, సిబ్బందితో కలిసి జూ పార్క్‌లోని పశుగ్రాసం ప్రాంతంలో ఫికస్, ఇండియన్ బ్లాక్ బెర్రీ(జాముస్), సేక్రెడ్ ఫిగ్, ఇతర మొక్కలను నాటారు. జూ పార్క్ ప్రాంగణంలో దాదాపు 250 మొక్కలను నాటారు. ఈ సందర్భంగా హిరేమత్ మాట్లాడుతూ నెహ్రూ జూలాజికల్ పార్క్‌ను హైదరాబాద్ ఆకుపచ్చ ఊపిరితిత్తులుగా కూడా పిలుస్తారని అన్నారు. పార్క్ క్యూరేటర్ జె.వసంత మాట్లాడుతూ సిబ్బంది తమ నివాస ప్రాంగణాల్లో కూడా రెండు కంటే ఎక్కువ మొక్కలను నాటాలని, వాటిని తమ సొంత పిల్లల్లాగా పోషించాలని సూచించారు. కార్యక్రమంలో డిప్యూటీ క్యూరేటర్ ఎం.బర్నోబా, డాక్టర్ ఎం.ఎ. హకీమ్ తదితరులు పాల్గొన్నారు.



వన మహోత్సవంలో పాల్గొన్న డాక్టర్ సునీల్ ఎస్. హిరేమత్

27న బ్రాహ్మణ వధూవరుల వివాహ పరిచయ వేదిక

సాక్షి, సిటీబ్యూరో: బ్రాహ్మణ సేవా సంఘ సమాఖ్య ఆధ్వర్యంలో ఈ నెల 27న రెండు తెలుగు రాష్ట్రాలకు సంబంధించిన బ్రాహ్మణ వధూవరుల వివాహ పరిచయ వేదిక ఏర్పాటు చేస్తున్నట్లు సమాఖ్య ప్రతినిధులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. శ్రీనగర్‌కాలనీలోని శ్రీ సత్యసాయి నిగమాగమంలో ఈ కార్యక్రమం ఉంటుందని సంఘం చైర్మన్ సి.సుధాకర్, అధ్యక్షుడు సి.ప్రభాకర్‌రావు, కార్యదర్శి కె.చంద్రశేఖర్‌లు పేర్కొన్నారు. గత 19 ఏళ్లుగా తాము ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామని, వేలాది జంటలను ఒక్కటి చేశామని, బ్రాహ్మణ వధూవరులు ఈ సారి కూడా వేదికను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

చెరువులను సందర్శించిన కర్ణాటక ఇంజనీర్ల బృందం

సాక్షి, సిటీబ్యూరో: నగరంలో హైడ్రా పనితీరును బెంగళూరు లేక్స్ డిపార్ట్‌మెంట్ ఇంజినీర్ల బృందం మంగళవారం పరిశీలించింది. చెరువుల పరిరక్షణ, పునరుద్ధరణ, అభివృద్ధిని క్షేత్ర స్థాయిలో వీక్షించింది. పాతబస్తీలో బమ్రుక్‌నుద్దౌలా చెరువుతోపాటు అంబర్‌పేటలోని బతుకమ్మకుంటను సందర్శించింది. చెరువుల పునరుద్ధరణ, అభివృద్ధి పనులు చేపట్టక ముందు, తాజా పరిస్థితులను గమనించింది. చెరువుల్లో ఆక్రమణలను తొలగించిన తీరును తెలుసుకుంది. నీటి జాడ లేని చెరువులను అభివృద్ధి చేసిన తీరును అభినందించింది. వరదల నివారణకు చెరువుల ప్రాధాన్యం ఎంతో ఉందని వివరించింది. చెరువులను అనుసంధానం చేసే నాలాలను కూడా పరిరక్షించాల్సిన అవసరం ఎంతో ఉందని అభిప్రాయ పడింది.

హైడ్రా అన్ని రాష్ట్రాలకూ అవసరం..

చెరువుల సందర్శన అనంతరం కర్ణాటక రాష్ట్రం నుంచి వచ్చిన చీఫ్ ఇంజనీర్ హరిదాసు, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు నిత్య, భూప్రద, మహదేవ్‌లతోపాటు ఆ రాష్ట్ర ప్రతినిధులు హైడ్రా కమిషనర్ రంగనాథ్‌తో భేటీ అయ్యారు. 'హైడ్రా గురించి విన్నాం.పత్రికల్లో చదివాం. ఇక్కడ ప్రత్యక్షంగా చూస్తున్నాం. చెరువుల పునరుద్ధరణ పనులు అద్భుతంగా ఉన్నాయి' అని వారు ప్రశంసించారు. హైడ్రా వంటి సంస్థ అన్ని రాష్ట్రాలకూ అవసరమన్నారు. బెంగళూరులో చెరువులను హైడ్రా కమిషనర్ సందర్శించినప్పటి చిత్రాలతో కూడిన ఫొటో ఫ్రేమ్‌ను రంగనాథ్‌కు ఇంజనీర్ల బృందం అందించింది.

సమగ్ర సాంస్కృతిక విధానం తేవాలి

● జస్టిస్ చంద్రకుమార్

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: తెలంగాణలో సమగ్ర సాంస్కృతిక విధానం తేవాలని హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ బి.చంద్రకుమార్ అన్నారు. మంగళవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో తెలంగాణ ప్రజా సాంస్కృతిక కేంద్రం ఆధ్వర్యంలో రౌండ్‌టేబుల్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ పోరాటగడ్డపై విష సంస్కృతి విలయతాండవం చేస్తోందని, దీనిలో కాషాయం, కార్పొరేట్ శక్తులు కలిసిపోయాయని అన్నారు. మానవీయ విలువలను బోధించాల్సిన ప్రభుత్వాలు తక్షణమే కళాకారులతో ప్రచార యాత్రలు చేపట్టాలన్నారు. తెలంగాణలో జానపద అకాడమీ, బాలల సాహిత్య అకాడమీ, సంగీత నృత్య అకాడమీ, లలిత కళల అకాడమీ, ఫొటోగ్రఫీ చిత్రకళ అకాడమీలను తక్షణమే ఏర్పాటు చేసి ప్రత్యేక అధికారులను నియమించాలని డిమాండ్ చేశారు. ఎస్వీకే కార్యదర్శి ఎస్. వినయకుమార్ మాట్లాడుతూ భారత రాజ్యాంగ విలువలను భావితరాలకు కళాయాత్రల ద్వారా వివరించాలని కోరారు. కార్యక్రమంలో టీపీఎస్‌కే అధ్యక్షుడు భూపతి వెంకటేశ్వర్లు, ఆవాజ్ రాష్ట్ర కార్యదర్శి ఎం.డి.అబ్బాస్, జి.రాములు, విజ్ఞాన దర్శిని నాయకులు రమేష్, పీఎస్ మూర్తి, బుచ్చిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న జస్టిస్ చంద్రకుమార్

తెలుగు వర్సిటీ ప్రతిభా పురస్కార గ్రహీతలు వీరే..

నాంపల్లి: తెలుగు విశ్వవిద్యాలయం ప్రతియేటా వివిధ రంగాల్లో విశేషమైన కృషి చేసిన 12 మంది ప్రముఖులను ప్రతిభా పురస్కారాలతో సత్కరిస్తోంది. 2024వ సంవత్సరానికిగాను విశ్వవిద్యాలయం ప్రతిభా పురస్కారాలను వివిధ ప్రక్రియల్లో ఎంపికైనవారి పేర్లను ప్రకటించింది. ఎల్.నరేందర్(చిత్రలేఖనం), డాక్టర్ యాకూబ్(కవిత), డాక్టర్ ఎం.ఎ. శ్రీనివాసన్(పరిశోధన), బైరోజు చంద్రశేఖర్(శిల్పం), ఆర్.ప్రసన్నరాణి(నృత్యం), డాక్టర్ బి.రాధ సారంగపాణి(సంగీతం), కె.కైలాస్(పత్రికా రంగం), దుప్పెల్లి శ్రీరాములు(నాటకం), గజ్వెల్లి సమ్మయ్య(జానపద కళా రంగం), ఆముదాల మురళి(అవధానం), డాక్టర్ పులిగడ్డ విజయలక్ష్మి(ఉత్తమ రచయిత్రి), పోల్కంపల్లి శాంతాదేవి(నవల/కథ) పురస్కారాలకు ఎంపికైనట్లు తెలుగు వర్సిటీ రిజిస్ట్రార్ ఆచార్య కోట్ల హనుమంతరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పురస్కారాలను ఈ నెల 19న నాంపల్లి ప్రాంగణంలోని నందమూరి తారక రామారావు కళా మందిరంలో జరిగే ప్రత్యేక ఉత్సవంలో రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గడ్డం వివేక్ ముఖ్యఅతిథిగా హాజరై పురస్కారాలను ప్రదానం చేస్తారని పేర్కొన్నారు. పురస్కారం కింద ఒక్కొక్కరికి రూ.20,116 నగదు, జ్ఞాపికలను అందజేసి సత్కరిస్తారని తెలిపారు.

ఉప్పల్ స్టేడియం గేట్ల ఎదుట ప్రహరీ నిర్మాణం

● ప్రశ్నార్థకంగా మారిన పార్కింగ్

ఉప్పల్: ఉప్పల్ రాజీవ్‌గాంధీ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియం ప్రతిష్టకు భంగం వాటిల్లే ప్రమాదం ఏర్పడుతోంది. స్టేడియం పార్కింగ్ స్థలం ప్రశ్నార్థకంగా మారింది. 4, 5, 6, 7, 8 నంబర్ గేట్లను మూసివేసే విధంగా ప్రైవేట్ సంస్థకు చెందిన వ్యక్తులు గత కొన్నాళ్లుగా ప్రహరీ నిర్మిస్తున్నారు. ఇన్నాళ్లు హెచ్‌సీఏ ఆట సమయాల్లో ఈ ఖాళీ స్థలాన్ని పార్కింగ్ కోసం వాడుకుంటోంది. ఆ స్థలం ఇన్నాళ్లు ఉప్పల్ ఐలా సంరక్షణలోనే ఉండేది. ఇప్పుడు ఆ స్థలం ప్రైవేట్ వ్యక్తుల ఆధీనంలోకి వెళ్లినట్లు సమాచారం. అయితే ప్రహరీ నిర్మాణం పట్ల హెచ్‌సీఏ అభ్యంతరాలు తెలపకపోవడం ఆశ్చర్యంగా ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఉప్పల్‌లో క్రికెట్ స్టేడియంతోపాటు పార్కింగ్ స్థలం ఉండాల్సిందేనని, లేనిపక్షంలో ఆందోళన చేస్తామని స్థానికులు అంటున్నారు.



ఉప్పల్ క్రికెట్ స్టేడియం గేట్ల ముందు ప్రహరీ నిర్మిస్తున్న దృశ్యం

బలవంతపు గర్భస్రావాలపై నివేదిక ఇవ్వండి

వైద్య, ఆరోగ్య శాఖ అధికారులకు రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ ఆదేశాలు

సిటీ కోర్టులు: వైద్య, ఆరోగ్య శాఖ, కుటుంబ సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ కార్యదర్శికి రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ నోటీసులు జారీ చేసింది. భువనగిరి పట్టణంలోని ఓ ప్రైవేట్ దవాఖానాలో అక్రమ లింగ నిర్ధారణ పరీక్షలు, ఆడపిండాల బలవంతపు గర్భస్రావాలపై వచ్చిన వార్తలపై రాష్ట్ర మానవహక్కుల కమిషన్ స్పందించి సూమోటోగా కేసు స్వీకరించింది. ఈ మేరకు మంగళవారం విచారణ చేపట్టింది. లింగనిర్ధారణ పరీక్షలు చేసి గర్భస్రావాలు చేయడం ఏంటని ఆవేదన వ్యక్తం చేసింది. ఈ అంశంపై వెంటనే సంబంధిత అధికారులు స్పందించి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించింది. ఈ ఘటనపై పూర్తి నివేదికను ఆగస్టు 20లోపు కమిషన్ ముందు దాఖలు చేయాలని వైద్య, ఆరోగ్య శాఖ, కుటుంబ సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ కార్యదర్శికి ఆదేశాలు జారీ చేసింది. విచారణను ఆగస్టు 20వ తేదీకి వాయిదా వేసింది.









డిటెక్టివ్.. బీ సెలెక్టివ్..

ఒకప్పుడు సినిమాల్లో చాలా బాగా, బలంగా కనిపించిన డిటెక్టివ్ పాత్రలు.. ప్రస్తుతం తెరపై పెద్దగా కనిపించకపోవచ్చు.. కానీ ఆధునికుల నిజ జీవితంలో మాత్రం కీలకంగా మారాయి. వివాహ పూర్వపు దర్యాప్తుల నుంచి కార్పొరేట్ ఫ్రాడ్స్ వరకూ.. ఎన్నో రంగాల్లో వీరి కార్యకలాపాలు విస్తరిస్తున్నాయి. ఓ రకంగా చెప్పాలంటే ప్రేమ, పెళ్లి, లివిన్ మొదలు ప్రతిదానికీ వీరిపై ఆధారపడుతున్నారు కొందరు.. అయితే అలాంటి ఏజెన్సీలను ఎన్నుకునే క్రమంలో తగిన జాగ్రత్తలు పాటించాలని నిపుణులు సూచిస్తున్నారు..

- సాక్షి, సిటీబ్యూరో

- రిలేషన్ షిప్స్‌పై ప్రైవేటు సంస్థల నిఘా ప్రభావం
- పరస్పర అపనమ్మకాలు.. డిటెక్టివ్స్‌ను ఆశ్రయిస్తున్న వైనం
- ప్రేమ, పెళ్లి, లివిన్‌ల నుంచి విడాకుల వరకూ..
- ఉద్యోగ నియామకాలు, కార్పొరేట్ లావాదేవీల్లోనూ కీలక పాత్ర
- ఏజెన్సీ ఎంపికలో జాగ్రత్తలు అవసరమని నిపుణుల సూచన


దాదాపు మూడు దశాబ్దాల క్రితం ఆర్థిక సంస్కరణల ఫలితంగా పలు ప్రైవేటు రంగాలు పుంజుకున్నాయి. దీంతోపాటు వ్యక్తిగత గోప్యత, భద్రత, సత్వర న్యాయం కోసం స్వతంత్ర విచారణలు అవసరమయ్యాయి. అయితే అప్పటికే ముంబయి వంటి నగరాల్లో ఉన్నప్పటికీ.. ఢిల్లీ, హైదరాబాద్ వంటి నగరాల్లో ఒక్కసారిగా డిటెక్టివ్ ఏజెన్సీలు ఊపందుకున్నాయి. ప్రస్తుతం మన నగరంలోనే దాదాపు 30కి పైగా ప్రైవేటు విచారణ సంస్థలు సేవలందిస్తున్నాయి.

పెళ్లికి ముందు.. పరిశోధన..

ఇటీవలి కాలంలో పెళ్లిళ్లలో మోసాలు పెరిగిపోయాయి. దీంతో పాత సంబంధాల సమాచారం దాచిపెట్టడం వంటివి తెచ్చిపెట్టే సమస్యల పరిష్కారంగా డిటెక్టివ్ సేవలు బాగా అవసరం అవుతున్నాయి. కొన్ని మ్యాట్రిమోని సంస్థలు సైతం దీని కోసం డిటెక్టివ్స్‌ను ఆశ్రయిస్తున్నాయి. పెళ్లి తర్వాత భార్యాభర్తలు పరస్పరం అనుమానాలతో ఈ సంస్థల సేవల్ని కోరుకుంటున్నారు. నగరంలో ఇటీవలి కాలంలో విడాకుల సంఖ్య విపరీతంగా పెరగడానికి ఇలాంటి స్వతంత్ర విచారణలు కూడా ఓ కారణమేనని పలు అధ్యయనాలు చెబుతున్నాయి. సదరు సంస్థలు చేసిన విచారణలో లోపం కారణంగా అందిన నివేదికలతో అనేకమంది విడిపోతున్నారని చెబుతున్నాయి అధ్యయనాలు.

ప్రేమలు, లివిన్‌లలోనూ..

ఇక ప్రేమికులు కూడా ఈ విషయంలో తక్కువ తినలేదు. 'పార్టీలు, పిక్నిక్‌లు, కొలీగ్స్‌తో చనువుగా ఉండడం వంటి వన్నీ ప్రస్తుతం తప్పని అవసరం. అయితే ఇవే అనుమానాలకూ దోహదం చేస్తున్నాయి. తమ లవర్స్ మీద అనుమానాలతో మమ్మల్ని నెలకు కనీసం 25 మందైనా సంప్రదిస్తుంటారు' అంటూ నగరంలో పేరున్న ఓ డిటెక్టివ్ సంస్థ ప్రతినిధి చెప్పారు. ప్రేమికులు కేవలం కబుర్లు, షికార్లతో కాలక్షేపం చేసే కాలం పోయి ఏకంగా లివిన్ రిలేషన్ షిప్స్‌లో ఉండడం సర్వసాధారణం అయ్యింది. ఇలాంటి ట్రెండ్ ఈ పరిస్థితికి దారి తీస్తోందని ఫ్యామిలీ కౌన్సిలర్ సుజాత అంటున్నారు.



డివోర్స్‌కు ఫోర్స్..

'వివాహేతర సంబంధం కారణంగా విడాకులు ఇవ్వాలంటే మమ్మల్ని కలవాలి. ఆ తర్వాత విడాకులు ఇచ్చిన మహిళకు ఆదాయం ఉందని భరణం ఇవ్వనక్కర్లేదని నిరూపించాల్సినప్పుడు కూడా మమ్మల్నే కలవాలి' అంటూ చెప్పారు నగరంలోని లక్డీకాపూల్‌లో డిటెక్టివ్ ఏజెన్సీ నడుపుతున్న ఓ మహిళ. గతంలో ఈ తరహాలో తమ భార్య/భర్తల నేరాన్వేషణ సంపన్న కుటుంబాల్లోనే ఎక్కువ ఉండేదని, అయితే ప్రస్తుతం దాదాపుగా అన్ని రకాల ఆదాయవర్గాల్లోనూ కనిపిస్తోందని అన్నారామె.

కార్పొరేట్ వెరిఫికేషన్ కోసం..

కార్పొరేట్ రంగంలో అవినీతి కార్యకలాపాలను గుర్తించేందుకు కూడా డిటెక్టివ్ ఏజెన్సీలు పనిచేస్తున్నాయి. ఉద్యోగుల నియామకాల కోసం చేసే బ్యాక్‌గ్రౌండ్ చెకింగ్ నుంచి ఉద్యోగుల వర్గీకరణ, ఇంటర్నల్ లీకులు, మేనేజ్‌మెంట్ లెవెల్ మోసాల నిర్ధారణకు సంస్థలు ఈ సేవలను వినియోగిస్తున్నాయి. ఎస్సెట్ ట్రేసింగ్, ఫ్రాడ్ ఇన్వెస్టిగేషన్ వంటివి వీరు చేస్తున్నారు. అంతే కాకుండా లోన్ రికవరీ/విత్‌హోల్డింగ్ కేసుల్లో ఆస్తుల వివరాల కోసం పలు బ్యాంకులు, ఆర్థిక సంస్థలు కూడా జై డిటెక్టివ్ అంటున్నారు.

ఈజీ.. టెక్నాలజీ..

ప్రస్తుతం డిటెక్టివ్ సేవల్లో టెక్నాలజీ కీలక భూమిక పోషిస్తోంది. వాహనాల పర్యవేక్షణ, వ్యక్తుల స్థల నిర్ధారణకు ఆధునిక పరికరాల సహాయంతో ట్రాకింగ్ సులభంగా మారింది. అలాగే సర్వైలెన్స్, డేటా అనాలసిస్ మరింత ప్రభావవంతంగా మారాయి. సోషల్ మీడియా మానిటరింగ్, డిజిటల్ ట్రెయిల్స్ ఆధారంగా వివరాల సేకరణ, ప్రత్యక్ష సాక్ష్యాల కోసం సీక్రెట్ కెమెరాలు, ఆడియో రికార్డర్లు ఉపకరిస్తున్నాయి. ఫోన్ కాల్స్, మెసేజ్‌లు, బ్యాంక్ లావాదేవీలను విశ్లేషించేందుకు డేటా అనలిటిక్స్, అనుమతి మేరకు హ్యాకింగ్, బగ్ డిటెక్షన్, మొబైల్ ట్రాకింగ్ వంటివీ చేస్తున్నారు.



వ్యవస్థాపకులు వీరే..

చాలా వరకూ ఈ తరహా ఏజెన్సీల స్థాపకులు మాజీ భద్రతా విభాగాలకు చెందిన వారే కావడం గమనార్హం. రిటైర్డ్ పోలీస్ అధికారులు, సైనిక లేదా నిఘా విభాగాల మాజీ ఉద్యోగులు, లాయర్లు, క్రిమినాలజీ విద్యార్థులు ఈ సంస్థల స్థాపన, నిర్వహణల్లో ఎక్కువగా కనిపిస్తున్నారు. వీరికి న్యాయపరమైన అవగాహన, విచారణ పద్ధతులపై ట్రెనింగ్ ఉండటం కలిసొచ్చే అంశం. ప్రస్తుతం నగరంలో షార్ప్ డిటెక్టివ్, హైదరాబాద్ డిటెక్టివ్ ప్రై లిమిటెడ్, డీడీఎస్ డిటెక్టివ్, థర్డ్ ఐ ఇన్వెస్టిగేషన్స్, పారామౌంట్, లింక్స్, యారో, రియల్ ఐ, తదితర ఏజెన్సీలు పనిచేస్తున్నాయి.

తస్మాత్.. జాగ్రత్త..

ఇలాంటి డిటెక్టివ్ ఏజెన్సీల సంస్థల్ని సేవల కోసం ఆశ్రయించేటప్పుడు అత్యంత జాగ్రత్తగా వ్యవహరించాల్సి ఉంది. కార్పొరేట్ సంస్థలు, న్యాయవాదులు, బ్యాంకులు వంటి ఆర్గనైజ్డ్ వ్యవస్థలకు ఫర్వాలేదు కానీ.. వ్యక్తిగత అవసరాలకు సంప్రదించేటప్పుడు ఒకటికి పదిసార్లు క్రాస్ చెక్ చేసుకోవడం అవసరమని నిపుణులు సూచిస్తున్నారు. వ్యక్తిగత రహస్యాలను సేకరించిన అనంతరం బ్లాక్‌మెయిల్ చేసిన సందర్భాలూ నగరంలో లేకపోలేదని హెచ్చరిస్తున్నారు.

సోషల్ బ్రీడ్స్..

లైఫ్‌స్టైల్‌గా మారిన మూగజీవాల పెంపకం

- పెట్ డాగ్స్‌కు తెలుగు సెలబ్రిటీల ప్రాధాన్యత
- నాగ్, రామ్ చరణ్, పూరీ, అమల, కవిత, చార్మీ సహా
- ప్రతిష్టాత్మక టుస్సాడ్స్ మ్యూజియంలో మైనపు కుక్క బొమ్మలు

గతంలో సినిమా సెలబ్రిటీలు వారి లైఫ్‌స్టైల్, ఫ్యాషన్, కార్లు, ఇంటీరియర్స్‌తో వార్తల్లో ఉండేవారు. కానీ ప్రస్తుతం పెంపుడు జంతువులు, ముఖ్యంగా కుక్కలు ప్రధాన ఆకర్షణగా నిలుస్తున్నాయి. ఈ మధ్యకాలంలో సెలబ్రిటీల కుక్కలు ఇంటర్వ్యూలకు, షూటింగులకు, ఫొటోషూట్లకు, ఇతర ఈవెంట్లకు ప్రత్యేక ఆకర్షణగా మారుతున్నాయి. ముఖ్యంగా సోషల్ మీడియాలో వీటి ఫొటోలు, వీడియోలు విపరీతంగా వైరల్ అవుతున్నాయి. ఇది కేవలం ట్రెండ్ మాత్రమే కాదు.. వారి వ్యక్తిత్వాన్ని ప్రతిబింబించే ఫ్యాషన్ స్టేట్‌మెంట్‌లా మారిపోయింది.

- సాక్షి, సిటీబ్యూరో

రామ్ చరణ్ తన పెంపుడు కుక్క రైమ్ (ఫ్రెంచ్ బార్బెట్)ను ఎంతో ప్రేమగా పెంచుతున్నారు. ఇటీవల మేడమ్ టుస్సాడ్స్ మ్యూజియంలో ఏర్పాటైన రామ్‌చరణ్ తన మైనపు విగ్రహానికి తన కుక్కతో కలిసి ఉన్న స్టైలిష్ పోజ్ మరింత ఆకర్షణగా నిలిచింది. ప్రపంచవ్యాప్తంగా చర్చకు దారితీసింది. ఓ ఇంటర్వ్యూలో భాగంగా ఇలా ఒక్క పెట్ డాగ్‌ను ఈ మ్యూజియంలో ఏర్పాటు చేయడం చరిత్రలో రెండోసారి మాత్రమని వివరించారు. ఉపాసన పలు వేదికలపై యానిమల్ థెరపీ, పెట్ పేరెంటింగ్ వంటి అంశాలపై తరచూ మాట్లాడతారు. కుక్కలతో కలిసి తీసుకున్న ఫొటోలు తరచూ ఇన్‌స్టాలో షేర్ అవుతుంటాయి.



ఆత్మీయమైన అమల-నాగార్జున..

ప్రముఖ సినీతార, అక్కినేని నాగార్జున సతీమణి అమలకు మూగజీవాల పైన ఉన్న ప్రేమ గురించి ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. బ్లూక్రాస్ సొసైటీతో మూగజీవాల సంరక్షణకు ఎన్నో యేళ్లుగా సేవలందిస్తున్నారు. తన ఇంట్లో కూడా కుక్కలను ప్రత్యేకంగా పెంచుతుంటారు. ఇందులో పలు బ్రీడ్ డాగ్స్‌తో పాటు స్ట్రీట్ డాగ్స్ సైతం ఉన్నాయి. నాగార్జున-అమల పెళ్లి తరువాత రెండు పప్పీలను తనకు గిఫ్ట్‌గా ఇచ్చారని ఓ ఇంటర్వ్యూలో తెలిపారు. తనయుడు అఖిల్ కూడా ఓ ఇంటర్వ్యూల్లో కుక్కతో సందడి చేశారు.





రాజకీయ రంగంలోనూ..

బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ఇటీవల తన పెంపుడు కుక్కతో ఉన్న పోస్టు సోషల్ మీడియాలో హల్చల్ చేశాయి. సాదు జంతువులు తమ చుట్టూ ఉండే నెగెటివ్ ఎనర్జీని తీసుకుని యజమానులకు మేలు చేస్తాయని, ఈ విషయాన్ని తాను నమ్ముతానని ఇటీవల ఓ ఇంటర్వ్యూలో చెప్పారు. కష్టకాలంలో తనకు తోడ్పాటుగా ఉందని ఆమె వెల్లడించారు.



మై పెట్.. యోగామేట్..

ఫిట్‌నెస్ ఐకాన్ సుధీర్ బాబు తన ట్రెనింగ్‌లో కూడా పెంపుడు కుక్కను భాగం చేస్తుంటారు. యోగా చేస్తున్నప్పుడు పక్కన ఉండే పెంపుడు జంతువుల ఫొటోలు చాలామందికి ఇన్‌స్పిరేషన్‌గా మారాయి.



సమంత 'హష్ అండ్ శాష'..

సమంతకు కుక్కలంటే చాలా ఇష్టం. ముఖ్యంగా తన రెండు డాగ్స్ హష్ అండ్ శాషతో పలుమార్లు సందడి చేశారు. సోషల్‌మీడియాలోనూ వైరల్‌గా మారారు. తన కుక్కను కొన్ని సందర్భాల్లో షూటింగ్స్‌కు కూడా తీసుకెళ్లారు.

కుక్క, పక్షి.. ఓ పూరీ..

ఖరీదైన బ్రీడ్ కుక్కలు, పక్షులు పెంచడంలో డైరెక్టర్ పూరీ జగన్నాథ్‌ది ప్రత్యేక శైలి. వాటి కోసమే లక్షలు ఖర్చు చేస్తాడన్న విషయం విదితమే. పూరీ వద్ద ఖరీదైన కుక్కలు ఉన్నాయి. గతంలో తన ఆఫీస్‌లో విభిన్న రకాల పక్షులు అక్కడికి వచ్చే వారిని ఆశ్చర్యపరిచేవి. సోషల్ మీడియాలోనూ వీడియోలు షేర్ చేస్తుంటారు.

స్టార్ డాగ్స్..

వీరితో పాటు తెలుగు సినీ రంగంలో నాని 'స్మైలీ'తో ఉన్న అనుబంధాన్ని సోషల్‌మీడియా వేదికగా పంచుకున్నారు. సినీతార సాయిపల్లవి, ఇతర సెలబ్రిటీలు ఇన్‌స్టాలో ప్రత్యేక ఖాతాలు కూడా మెయిటేన్ చేస్తున్నారు.



పర్సనల్ బెస్ట్ ఫ్రెండ్..

తన కుక్కను 'పర్సనల్ బెస్ట్ ఫ్రెండ్'గా పిలుచుకునే చార్మీ కౌర్ గతంలో కొన్ని ఇంటర్వ్యూలకు కుక్కను వెంట తీసుకొచ్చిన సందర్భాలున్నాయి. పెట్ డాగ్‌తో సెల్ఫీలు, స్టైలిష్ డ్రెస్సులతో తీసిన ఫొటోలు నెట్టింట వైరల్ అయ్యాయి.



అర్ధరాత్రి ఆర్డర్ల పట్ల ఆసక్తి..

నగరవాసుల తీరుతెన్నులపై అధ్యయనం

సాక్షి, సిటీబ్యూరో: రోజువారీ నిత్యావసర వస్తువుల నుంచి ప్రీమియం కొనుగోళ్ల వరకూ ప్రతిదీ డోర్ డెలివరీ చేసే త్వరిత వాణిజ్య (క్విక్ కామర్స్) వేదిక, ఇన్‌స్టామార్ట్ నగర వాసుల ఆర్డర్ల తీరు తెన్నులపై ఓ అధ్యయనాన్ని విడుదల చేసింది. దీని ప్రకారం.. గత కొంత కాలంగా నగరవాసులు అర్ధరాత్రి సమయంలో రకరకాల వస్తువులకు ఆర్డర్లు ఇవ్వడం పెరిగిందని తేల్చింది. రోజువారీ డిమాండ్‌ను కిరాణా సామాగ్రి కొనసాగిస్తుండగా, నిత్యావసరాల స్థాయిలోనే, ఎలక్ట్రానిక్స్, బొమ్మలు, వ్యక్తిగత సంరక్షణ విభాగాలు అద్భుతమైన వృద్ధిని చూస్తున్నాయని తెలిపింది. సంస్థ వెల్లడించిన ప్రకారం..

పాలు, పెరుగు నుంచి లిప్ లైనర్ వరకూ..

గత ఆరు నెలల నుంచి నగరంలో అత్యధికంగా ఆర్డర్ చేయబడిన వస్తువుల్లో పాలు, పెరుగు, ఇడ్లీ, దోసె పిండి, శీతల పానీయాలు, గుడ్లు, పచ్చి మామిడి, వేరుశనగలు జాబితాలో అగ్రస్థానంలో ఉన్నాయి. బ్యాటరీలు, సాకెట్ సర్జ్ గార్డ్‌లు, ఫాస్ట్-చార్జింగ్ కేబుల్స్, ప్లేయింగ్ కార్డ్‌లు, ఎల్‌సీడీ రైటింగ్ ప్యాడ్స్ వంటి ఉత్పత్తులకు అధిక డిమాండ్ ఉంది. ఎలక్ట్రానిక్స్, బొమ్మలకు డిమాండ్ 117% పెరిగింది. బ్యూటీ విభాగంలో లిప్ లైనర్లు, మినీ లిప్‌స్టిక్‌లు, లిప్ గ్లాస్ లిప్ బామ్‌లు, మేకప్ బ్రష్ వంటి బ్యూటీ ఉత్పత్తులకు గిరాకీ ఏర్పడింది.

మొబైల్ షోకేస్ లా మెట్రో..

సాక్షి, సిటీబ్యూరో: డిజిటల్ ప్రొడక్షన్ ప్రింటింగ్‌లో అగ్రగామిగా ఉన్న కొనికా మినోల్టా బిజినెస్ సొల్యూషన్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ దేశవ్యాప్తంగా మెట్రో రైళ్లకు కొత్త లుక్ తేనుంది. మెట్రో రైళ్లలో క్యాంపెయినింగ్ చేసే క్రమంలో ఢిల్లీ, ముంబయి, బెంగళూరు, చెన్నై, కోల్‌కతాతో పాటు నగరంలోనూ మెట్రోలను ఎంచుకుంది. ఈ విషయాన్ని సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ కట్సుహిసా అన్సారి తెలిపారు. ఈ నెల 23 నుంచి ఇది ప్రారంభం అవుతుందని, దేశంలోని మెట్రో నగరాల్లో సరికొత్త బ్రాండింగ్‌కు బాటలు వేస్తున్నామని వివరించారు. తాము బ్రాండింగ్ చేసేందుకు ఎంచుకున్న ప్రతి ట్రైన్, మొబైల్ షో కేస్ లా కొత్తగా కనిపించనుందని చెప్పారు.





మూట్ కోర్ట్ పోటీలు..

సాక్షి, సిటీబ్యూరో: అనంత లా కాలేజీ ఆధ్వర్యంలో నాల్గో అంతర్ కళాశాల మూట్ కోర్ట్ పోటీ విజయవంతంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వాల్‌మార్ట్ సీనియర్ డైరెక్టర్, ఏఐ నిపుణుడు హేమాద్రి అనంతతో పాటు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎంవీ.చంద్రమతి, కరస్పాండెంట్ అనంత రవి న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించారు. ఈ న్యాయ వ్యవస్థ విశిష్టత తెలుపుతూ, నేటి తరం న్యాయ వ్యవస్థలో ఏఐ వినియోగం ఎంతో మార్పులు తెస్తుందని సందర్భంగా హేమాద్రి అనంత ఆకాంక్షించారు. విద్యార్థులు భవిష్యత్తులో న్యాయ వృత్తిలో ఆధునిక సాంకేతికతలతో ముందుండాలని సూచించారు. విద్యార్థులు ఆహ్లాదకరమైన వాతావరంలో వాదోపవాదాలు వినిపించారు. అనంతరం 'న్యాయ ప్రక్రియలో ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్' అనే అంశంపై వాదనలు జరిగాయని తెలిపారు. ఈ పోటీల్లో శ్రుతి, రేవతి, శ్రీజ విజేతలుగా నిలిచారు.

క్లుప్తంగా...


మోటార్ స్విచ్ ఆన్ చేస్తున్న మంత్రి జూపల్లి కృష్ణారావు

ప్రాజెక్టుల నిర్వహణపై బీఆర్ఎస్ నిర్లక్ష్యం: జూపల్లి

కేఎల్ఐ ప్రాజెక్టు ద్వారా నీటి విడుదల

కొల్లాపూర్: గత బీఆర్ఎస్ ప్రభుత్వ నిర్లక్ష్యంతో రైతులు ఇబ్బందులు పడ్డారని, ప్రాజెక్టుల నిర్వహణ అస్తవ్యస్తంగా మారిందని ఎక్సైజ్, పర్యాటక శాఖమంత్రి జూపల్లి కృష్ణారావు ఆరోపించారు. మంగళవారం నాగర్‌కర్నూల్, వనపర్తి జిల్లాలకు చెందిన ఎమ్మెల్యేలు వంశీకృష్ణ, కసిరెడ్డి నారాయణరెడ్డి, కూచుకుళ్ల రాజేశ్, మేఘారెడ్డిలతో కలిసి ఆయన కేఎల్ఐ ప్రాజెక్టులోని ఎల్లూరు లిఫ్టులో స్విచ్ ఆన్ చేసి నీటిని విడుదల చేశారు. ప్రాజెక్టు నిర్వహణ అంశాలపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జూపల్లి మాట్లాడుతూ కేఎల్ఐ ప్రాజెక్టు పరిధిలోని అన్ని రిజర్వాయర్లను నింపి, అవసరాలకు అనుగుణంగా ఆయకట్టు భూములకు సాగునీరు అందిస్తామన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం రూ.8 లక్షల కోట్లు అప్పు చేసి కూడా ప్రాజెక్టులను పూర్తి చేయలేక పోయిందన్నారు. ఎల్లూరు లిఫ్టులో 2 మోటార్లు పాడైనా మరమ్మతులు చేయించలేక పోయారని జూపల్లి విమర్శించారు. కార్యక్రమంలో ప్రాజెక్టు సీఈ విజయ్‌భాస్కర్‌రెడ్డి, ఎస్ఈ సత్యనారాయణరెడ్డి, ఈఈలు శ్రీనివాసరెడ్డి, మాణిక్‌ప్రభు, చంద్రశేఖర్, మురళి తదితరులున్నారు.

కేసీఆర్‌ను సవాల్ చేయమను.. రేవంత్‌ను ఒప్పిస్తా

మళ్లీ కేటీఆర్ వస్తానంటే నేనే వస్తా : టి.జగ్గారెడ్డి



సాక్షి, హైదరాబాద్: ఏ విషయంలోనైనా చర్చించేందుకు మాజీ సీఎం కేసీఆర్ సవాల్ చేస్తే.. ఆ చర్చకు సీఎం రేవంత్ వచ్చేలా తాను ఒప్పిస్తానని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ టి.జగ్గారెడ్డి వ్యాఖ్యానించారు. 'రేవంత్, కేసీఆర్‌లు ఫస్ట్ బెంచ్ స్టూడెంట్లు. నేను, కేటీఆర్, హరీశ్‌రావు సెకండ్ బెంచ్ స్టూడెంట్స్. కేటీఆర్ బీఆర్ఎస్‌కు వర్కింగ్ ప్రెసిడెంట్ అయితే నేను కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్‌ను. మరోసారి చర్చకు కేటీఆర్ వస్తానంటే నేనే వస్తా. ప్రెస్‌క్లబ్‌కే కాదు... కేటీఆర్, హరీశ్‌లు ఏ క్లబ్‌కు రమ్మన్నా వస్తా.'అని ఆయన చెప్పారు. మంగళవారం గాంధీభవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జగ్గారెడ్డి మాట్లాడుతూ కేసీఆర్ కోటాలో నేరుగా ఎమ్మెల్యే అయిన కేటీఆర్‌కు రాజకీయ ఒడిదుడుకులు ఏం తెలుస్తాయని ప్రశ్నించారు. సన్నాసి అనే మాటలను ప్రారంభించింది కేసీఆరేనని, ఆయన తిట్టిన తిట్లను కొంచెం పాలిష్ చేసి రేవంత్ మాట్లాడుతున్నారని అన్నారు. 'మీరు తిడితే మేం తిడతాం. మేమేమీ సత్రం నడపడం లేదు. రేవంత్‌తో గోక్కోవడం ఎందుకు? తన్నించుకోవడం ఎందుకు'అని ప్రశ్నించారు. పదేళ్లు మంత్రి అయిన కేటీఆర్‌కు ప్రజాసమస్యలపై ఎక్కడ చర్చిస్తారో తెలియదా అని అన్నారు.

జగ్గారెడ్డి క్షమాపణ చెప్పాలి

ప్రెస్‌క్లబ్‌పై వ్యాఖ్యలు.. ఖండించిన కమిటీ

సాక్షి, హైదరాబాద్: హైదరాబాద్ ప్రెస్‌క్లబ్‌ను కల్లు కాంపౌండ్‌తో పోల్చుతూ కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ టి.జగ్గారెడ్డి చేసిన వ్యాఖ్యలను ప్రెస్‌క్లబ్ కమిటీ తీవ్రంగా ఖండించింది. జగ్గారెడ్డి తన వ్యాఖ్యలను ఉపసంహరించుకుని క్షమాపణ చెప్పాలని మంగళవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేసింది. ప్రెస్‌క్లబ్ 60 ఏళ్ల నాటి మీడియా కమ్యూనిటీ సభ్యుల సంస్థ అని పేర్కొంది. ఇది అన్ని వర్గాల ప్రజలు వచ్చి తమ అభిప్రాయాలను వ్యక్తపరిచే వేదికని స్పష్టం చేసింది. చంద్రబాబు నాయుడు, వైఎస్ రాజశేఖర్‌రెడ్డి, ప్రస్తుత ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి వంటి ముఖ్యమంత్రులు కూడా తమ రాజకీయ అభిప్రాయాలను వ్యక్తీకరించడానికి ప్రెస్‌క్లబ్ వేదికను ఉపయోగించారని గుర్తు చేసింది. బాధ్యతాయుతమైన సీనియర్ నాయకులు ప్రెస్‌క్లబ్‌పై వ్యాఖ్యలు చేయడం ఆమోదయోగ్యం కాదని హితవు పలికింది.

కేటీఆర్‌పై మంత్రి సీతక్క ఏం మాట్లాడినా చెల్లుతుందా?

ప్రశ్నించిన బీఆర్ఎస్ మహిళా నేతలు

సాక్షి, హైదరాబాద్: ఆదివాసీ కార్డు అడ్డం పెట్టుకుని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై మంత్రి సీతక్క ఏం మాట్లాడినా చెల్లుతుందా? అని బీఆర్ఎస్ మహిళా నేతలు ప్రశ్నించారు. మంగళవారం తెలంగాణ భవన్‌లో మాజీ ఎంపీ మాలోత్ కవిత, జిల్లా పరిషత్ మాజీ చైర్‌పర్సన్ తుల ఉమ, బీఆర్ఎస్ నాయకురాలు సుమిత్రానంద్ మీడియాతో మాట్లాడారు. ములుగులో కేటీఆర్‌పై సీతక్క మాట్లాడిన వ్యాఖ్యలను ఖండిస్తున్నామన్నారు. రాష్ట్రంలో ఎక్కడ ఘటన జరిగినా కేటీఆర్ స్పందిస్తారని చెప్పారు. సీతక్క జీవో 49, ఇసుక దందాల ఆరోపణలపై సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఎమ్మెల్యేగా ఉన్న సీతక్క వేరు.. మంత్రిగా ఇప్పటి సీతక్క వేరన్నారు. సీతక్కకు కేటీఆర్‌కు ఏమైనా గెట్టు పంచాయతీ ఉందా? ప్రజా సమస్యలపై కేటీఆర్ మాట్లాడితే ఉలికిపాటు ఎందుకు అని నిలదీశారు.

ఫరఖ్ పడింది!

న్యాస్ సర్వేలో రాష్ట్రానికి మెరుగైన స్థానం

- 9వ తరగతిలో 17, 6లో 26వ స్థానం కైవసం
- మొత్తంగా మూడేళ్లలో పది పాయింట్లు పురోగతి
- 3, 6, 9 తరగతుల విద్యార్థులపై జాతీయ ఫరఖ్ సర్వే



తెలంగాణలో పాఠశాల విద్య కొంత మెరుగుపడిందని రాష్ట్రీయ సర్వేక్షణ్-ఫరఖ్-2024 (న్యాస్) జాతీయ సర్వేలో తేలింది. ప్రాథమిక విద్యలో 2021లో దేశంలో 36వ స్థానంలో ఉన్న తెలంగాణ, ఇప్పుడు 26వ స్థానానికి ఎగబాకింది. ఆరో తరగతిలో 26వ స్థానం, తొమ్మిదో తరగతిలో 17వ స్థానాన్ని దక్కించుకుంది. 6, 9 తరగతుల్లో ఆంధ్రప్రదేశ్ కంటే మెరుగైన ప్రతిభను కనబరిచింది. విద్యార్థుల్లో అభ్యసన సామర్థ్యాలు అంచనా వేసేందుకు కేంద్ర ప్రభుత్వ సంస్థ ఎన్సీఈఆర్టీ ప్రతి మూడేళ్లకు ఒకసారి జాతీయ స్థాయిలో సర్వే నిర్వహిస్తుంది. గతంలో దీన్ని నేషనల్ అచీవ్‌మెంట్ సర్వేగా పిలిచేవారు. 2024లో రాష్ట్రీయ సర్వేక్షణ-ఫరఖ్ పేరుతో సర్వే నిర్వహించారు. ఫరఖ్ అంటే.. 'పెర్ఫార్మెన్స్, అసెస్‌మెంట్, రివ్యూ, అనాలిసిస్, నాలెడ్జ్, హోలిస్టిక్, డెవలప్‌మెంట్'. దేశవ్యాప్తంగా 781 జిల్లాల్లో 74,229 పాఠశాలల్లోని 3, 6, 9 తరగతులకు చెందిన 21,15,022 మంది విద్యార్థులకు ఈ సర్వేలో భాగంగా పలు పరీక్షలు నిర్వహించారు. తెలంగాణ వ్యాప్తంగా 33 జిల్లాల్లో 3,342 స్కూళ్ల నుంచి లక్ష మంది విద్యార్థులు ఈ సర్వేలో పాల్గొన్నారు. భాష, గణితం, సైన్స్, సోషల్, పరిసరాల విజ్ఞానం పాఠ్యాంశాలకు సంబంధించి ఐచ్ఛిక ప్రశ్నలు ఇచ్చారు. మూడో తరగతిలో 45, ఆరో తరగతిలో 51, తొమ్మిదిలో 60 ప్రశ్నలు ఇచ్చారు.

– సాక్షి, హైదరాబాద్

10 పాయింట్లు మెరుగు

న్యాస్ సర్వే-2021లో జాతీయ సగటు కన్నా మన విద్యార్థులు తక్కువ స్కోర్ నమోదు చేశారు. ఈ సారి పరిస్థితి మెరుగైంది. మూడేళ్ల క్రితం చేపట్టిన సర్వేలో 3, 5, 8 తరగతుల విద్యార్థులకు సామర్థ్య పరీక్ష నిర్వహించారు. ఈసారి 3, 6, 9 తరగతులకు నిర్వహించారు. 3వ తరగతి భాష, మేథమెటిక్స్‌లో ఈసారి 10 పాయింట్ల మేర పురోగతి ఉందని విద్యాశాఖ తెలిపింది. ప్రభుత్వ స్కూళ్లు ఈసారి ప్రైవేటు సంస్థలతో పోటీగా మెరుగైన ఫలితాలు కనబరిచాయి. 3వ తరగతిలో అత్యధిక సామర్థ్యం కనబరిచిన జిల్లాలుగా వనపర్తి 14, జనగాం 16వ స్థానంలో నిలిచాయి. 6వ తరగతిలో జనగాం 35వ స్థానంతో అత్యధిక సామర్థ్యం కనబరిచిన జాబితాలో ఉంది. ములుగు 47వ స్థానంతో అతి తక్కువ సామర్థ్యం గల జాబితాలో చేరింది. 9వ తరగతిలో జనగాం 33వ స్థానంలో అత్యధిక సామర్థ్యం గల జాబితాలో చేరింది. అతి తక్కువ సామర్థ్యం ఉన్న జాబితాలో ఈ తరగతిలో తెలంగాణ జిల్లాలేవీ లేవు. దేశవ్యాప్తంగా భాషలో 64 శాతం, మేథ్స్‌లో 60 శాతం మంది సామర్థ్యం కనబరిచారు. అమెరికా సహా ప్రపంచవ్యాప్తంగా 49 శాతం మాత్రమే సామర్థ్య పరీక్షలో ప్రతిభ ఉన్నట్లు సర్వే పేర్కొంది.

న్యాస్ సర్వేలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ర్యాంకులు

తరగతి	ఆంధ్రప్రదేశ్	తెలంగాణ
3	13	26
6	33	26
9	28	17



ఇది మంచి పరిణామం



న్యాస్ సర్వేలో తెలంగాణ పాఠశాల విద్య మంచి ఫలితాలను కనబర్చడం అభినందనీయం. ఏడాదిగా పాఠశాల విద్యలో తీసుకొస్తున్న సంస్కరణలే దీనికి కారణం. ఉపాధ్యాయ నియామకాలు, సకాలంలో బదిలీలు, పదోన్నతులు, పర్యవేక్షణ, ఫౌండేషనల్ లిటరసీ అండ్ న్యూమరసీ (ఎఫ్ఎల్ఎన్) కార్యక్రమాలు ఈ పురోగతికి కారణం. విద్యా ప్రమాణాలు పెంచేందుకు కృషి చేసిన ఉపాధ్యాయులకు అభినందనలు.

–డాక్టర్ నవీన్ నికోలస్, పాఠశాల విద్య డైరెక్టర్

ప్రభుత్వ విశ్వాసం పెంచిన టీచర్లు



జాతీయ స్థాయిలో పాఠశాల విద్య పురోగతి దిశగా ఉపాధ్యాయుల కృషి అభినందనీయం. వారి పట్ల విశ్వాసం, నమ్మకంతో ముందుకెళ్లిన ప్రభుత్వ ప్రోత్సాహమూ గొప్పదే. ప్రభుత్వ పాఠశాలల్లోనూ ప్రమాణాలు మెరుగ్గా ఉన్నాయని న్యాస్ నిరూపించింది. ఇదే స్ఫూర్తితో ముందుకు వెళ్లేందుకు ఉపాధ్యాయ సంఘాలతో కలిసి కృషి చేస్తాను.

– పింగిలి శ్రీపాల్‌రెడ్డి, టీచర్స్ ఎమ్మెల్సీ

చర్చ జరగాల్సింది అసెంబ్లీలో..

అక్కడ లెక్కలతో సహా అన్నీ వివరిస్తాం

- ప్రెస్‌క్లబ్‌కు వచ్చి సవాల్ అంటే ఎట్లా?
- సీఎం సవాల్ విసిరింది పెద్దమనిషి కేసీఆర్‌కు
- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క


మహబూబాబాద్ జిల్లా కేసముద్రంలో లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలు అందజేస్తున్న ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు పొంగులేటి, కోమటిరెడ్డి, సీతక్క, కొండా సురేఖ, ఎంపీ బలరాం నాయక్, వేం నరేందర్ రెడ్డి తదితరులు

సాక్షి, మహబూబాబాద్: 'రాష్ట్ర అభివృద్ధికి ఏ పార్టీ ఎంత ఖర్చు చేసింది అనే విషయంపై చర్చ జరగాల్సింది అసెంబ్లీలో. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన నాటినుంచి నేటి వరకు ఎంత ఖర్చు చేసింది?, పదేళ్ల బీఆర్ఎస్ ప్రభుత్వం ఎంత ఖర్చుపెట్టింది? అనే విషయంపై అసెంబ్లీలో చర్చకు వస్తే లెక్కలతో సహా చూపిస్తాం..'అని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క బీఆర్ఎస్ నాయకులకు సవాల్ విసిరారు. మంగళవారం మహబూబాబాద్ జిల్లా సోమ్లాతండా, కేసముద్రం పట్టణంలో రూ.400 కోట్ల విలువగల అభివృద్ధి పనులకు రాష్ట్ర మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, తుమ్మల నాగేశ్వర్‌రావు, సీతక్క, కొండా సురేఖ, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్ రెడ్డితో కలిసి భట్టి విక్రమార్క శంకుస్థాపన చేశారు. మహిళా సంఘాలకు రుణాలు, ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు మంజూరు పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా స్థానిక ఎమ్మెల్యే మురళీ నాయక్ అధ్యక్షతన రెండుచోట్ల ఏర్పాటు చేసిన బహిరంగ సభల్లో మాట్లాడారు.

బీఆర్ఎస్‌కు ఈసారి డిపాజిట్లు కూడా దక్కవు..

'ప్రజా ప్రభుత్వం లక్ష కోట్లకు పైగా డబ్బులు సంక్షేమం కోసం ఖర్చు పెట్టిందని సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటిస్తే బీఆర్ఎస్ నేతలు జీర్ణించుకోవడం లేదు. సీఎం రేవంత్‌రెడ్డి.. పెద్దమనిషి కేసీఆర్‌కు సవాల్ విసిరారు. ఆయన సవాల్ స్వీకరించలేదు. ఇంకో ఆయన ప్రెస్‌క్లబ్‌కు వచ్చి సవాల్ అంటే ఎట్లా? సీఎం సవాల్‌ను స్వీకరించాలనే ఆలోచన ఉంటే శాసనసభకు రావాలి. రాష్ట్ర ప్రభుత్వం చర్చకు సిద్ధంగా ఉంది. బీఆర్ఎస్ నాయకత్వం మొత్తానికి నేను సవాల్ విసురుతున్నా. కృష్ణా, గోదావరి జలాల పంపిణీలో తెలంగాణకు నష్టం చేసింది బీఆర్ఎస్ ప్రభుత్వమే. మొన్న పార్లమెంటు ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు గుండు సున్నా వచ్చింది. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో, అసెంబ్లీ ఎన్నికల్లో డిపాజిట్లు కూడా దక్కవు..'అని డిప్యూటీ సీఎం అన్నారు.

12 నుంచి వడ్డీ లేని రుణాల పంపిణీ

'గత ప్రభుత్వ కాలంలో 17,162 మెగావాట్ల విద్యుత్ పీక్ డిమాండ్ ఉండగా ఈ ఏడాది మార్చిలో అదనంగా 2 వేల మెగావాట్ల డిమాండ్ వచ్చింది. అయినా రెప్పపాటు కూడా కరెంటు కోతలు లేవు. రైతులకు 24 గంటలు ఉచిత విద్యుత్తు ఇస్తున్నాం. పదేళ్ల కాలంలో నాలుగు దఫాలుగా 25,000 చొప్పున బీఆర్ఎస్ ప్రభుత్వం రుణమాఫీ కింద రైతుల ఖాతాల్లో జమ చేస్తే అవి వడ్డీకే సరిపోలేదు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం రైతు రుణమాఫీ చేసింది. రైతులను కోటీశ్వరులను చేసేందుకు ఈనెల 12 నుంచి 18వ తేదీ వరకు వడ్డీలేని రుణాల పంపిణీ కార్యక్రమం చేపడుతున్నాం. కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా తీర్చిదిద్దే లక్ష్యంతో డ్వాక్రా మహిళలకు ఏటా రూ.20 వేల కోట్ల వడ్డీ లేని రుణాలు అందించాలని నిర్ణయించి తొలి ఏడాది రూ.21 వేల కోట్లు పంపిణీ చేశాం..'అని భట్టి తెలిపారు.

అధికారం పోగానే కాలు కాలిన పిల్లిలా ఎగురుతున్నారు..

మంత్రి పొంగులేటి మాట్లాడుతూ.. పది సంవత్సరాలు రాష్ట్రంపై పడి దోచుకున్న నాయకులు అధికారం పోగానే కాలు కాలిన పిల్లిలా ఎగురుతున్నారని, సంస్కారం లేకుండా మాట్లాడుతున్నారని విమర్శించారు. మంత్రి కోమటిరెడ్డి మాట్లాడుతూ.. బీఆర్ఎస్ పాలనలో నాలుగు కుటుంబాలు, నాలుగు నియోజకవర్గాలే బాగు పడ్డాయని, కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రంలోని అట్టడుగు వర్గాల అభ్యున్నతికి పాటుపడుతోందని చెప్పారు. మంత్రి తుమ్మల మాట్లాడుతూ.. అభివృద్ధిలో రాష్ట్రాన్ని పరుగులు పెట్టిస్తున్నామని, అసాధ్యం అన్న పనులన్నీ సుసాధ్యం చేసి చూపిస్తున్నామని అన్నారు. మంత్రులు సీతక్క, కొండా సురేఖ కూడా మాట్లాడారు. ఈ కార్యక్రమాల్లో ప్రభుత్వ విప్ రాంచంద్రునాయక్, ఎంపీ బలరాం నాయక్, ఎమ్మెల్యేలు కోరం కనకయ్య, నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

రాజకీయ 'అధినేత్రి'

- రాజకీయాల్లో మహిళలను ప్రోత్సహించేందుకు పీసీసీ కొత్త కార్యక్రమం
- ఆలోచన, అధ్యయనం, ఆచరణ పేరుతో మహిళా నేతలకు శిక్షణ
- మండలస్థాయి నుంచే కార్యాచరణకు పీసీసీ చీఫ్ వ్యూహం



సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర రాజకీయాల్లో మహిళా నాయకత్వాన్ని పెంచేందుకు అధికార కాంగ్రెస్ పార్టీ కొత్త కార్యక్రమానికి శ్రీకారం చుట్టబోతోంది. 'అధినేత్రి' పేరుతో మండల స్థాయి నుంచి మహిళలు రాజకీయాల్లో రాణించేలా శిక్షణా కార్యక్రమాలను ఏర్పాటు చేయనుంది. పీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ బి.మహేశ్‌కుమార్‌గౌడ్ ఈ కార్యాచరణను రూపొందిస్తున్నారు. దేశ రాజకీయాల్లో శక్తిమంతమైన మహిళలుగా గుర్తింపు పొందిన ఇందిరాగాంధీ, సోనియాగాంధీల ఫొటోలతో 'ఆలోచన, అధ్యయనం, ఆచరణ'అనే నినాదంతో మహేశ్‌గౌడ్ ఈ కార్యక్రమాన్ని రూపొందిస్తున్నారు. త్వరలోనే ఈ కార్యక్రమాన్ని విస్తృతంగా క్షేత్రస్థాయికి తీసుకెళ్తామని ఆయన మంగళవారం మీడియాతో ఇష్టాగోష్టిగా మాట్లాడుతూ తెలిపారు. నియోజకవర్గాల పునర్విభజన తర్వాత రాష్ట్రంలో మహిళా రిజర్వేషన్లు అమలవుతాయనే అంచనా మేరకు పీసీసీ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని రూపొందిస్తున్నారు. మహిళా రిజర్వేషన్లు అమలైతే 51 మంది మహిళలు ఎమ్మెల్యేలుగా అసెంబ్లీలో అడుగుపెడతారని, ఆ సంఖ్యకు మరో 10 మందిని కలిపి మొత్తం 60 మంది మహిళలను ఈసారి ఎమ్మెల్యేలుగా గెలిపిస్తామని సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించిన నేపథ్యంలో అధినేత్రి కార్యక్రమం ప్రాధాన్యత సంతరించుకుంది. ఇప్పటికే రాజకీయాల్లో క్రియాశీలంగా ఉన్న మహిళా నాయకులు, జెడ్పీటీసీలు, జెడ్పీ చైర్మన్లుగా పనిచేసిన నేతలు, వారసత్వంగా రాజకీయాల్లో మంచిపేరున్న కుటుంబాల నుంచి వచ్చే మహిళలు... ఇలా అనేక కేటగిరీల్లో మహిళలను ఎంపికచేసి అసెంబ్లీ ఎన్నికలు వచ్చేంతవరకు నిర్వహించనున్నట్లు గాంధీభవన్ వర్గాలు వెల్లడించాయి.


పీయూష్ గోయల్‌తో మాట్లాడుతున్న రేవంత్. చిత్రంలో మల్లు రవి, జితేందర్

కోటా పెంచండి

▶ మొదటి పేజీ తరువాయి

సంబంధించి రైల్వే శాఖ తగిన రేక్‌లు కేటాయించడం లేదని, వాటి సంఖ్య పెంచాలని విజ్ఞప్తి చేశారు.

ఏరో–డిఫెన్స్ కారిడార్‌గా మంజూరు చేయండి

హైదరాబాద్ ఆదిభట్లలో అత్యున్నతమైన మౌలిక వసతులతో ప్రత్యేక రక్షణ, ఏరోస్పేస్ పార్కును తమ ప్రభుత్వం ఏర్పాటు చేసిందని కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్‌కు ముఖ్యమంత్రి తెలిపారు. ఈ నేపథ్యంలో హైదరాబాద్–బెంగళూరు పారిశ్రామిక కారిడార్‌ను ఏరో–డిఫెన్స్ కారిడార్‌గా మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. 'పెట్టుబడులకు సిద్ధంగా ఉన్న వంద ప్లగ్ అండ్ ప్లే పారిశ్రామిక పార్కుల అభివృద్ధికి సంబంధించిన ప్రతిపాదనలు సమర్పిస్తాం. కేంద్ర ప్రభుత్వం వాటికి మద్దతుగా నిలవాలి. జహీరాబాద్ ఇండస్ట్రియల్ స్మార్ట్ సిటీ అభివృద్ధికి జాతీయ పారిశ్రామిక కారిడార్ అభివృద్ధి, అమలు ట్రస్ట్ (ఎన్ఐసీడీఐటీ) ఆమోదించిన రూ.596.61 కోట్లను త్వరగా విడుదల చేయాలి. స్మార్ట్ సిటీకి అవసరమైన నీటి సరఫరా, విద్యుత్, ఇతర వసతుల కల్పనకు ఆర్థిక సహాయం చేయాలి. హైదరాబాద్–వరంగల్ పారిశ్రామిక కారిడార్‌లో భాగంగా వరంగల్ విమానాశ్రయానికి నిధులు మంజూరు చేయాలి..'అని కోరారు. హైదరాబాద్–విజయవాడ పారిశ్రామిక కారిడార్ ఫీజిబిలిటీపై అధ్యయనం చేస్తున్నట్లు తెలిపారు.

రిజర్వేషన్లు ఇచ్చాకే ఎన్నికల యోచన

- 'స్థానికం'లో 42% బీసీ రిజర్వేషన్లపై న్యాయ నిపుణులతో చర్చిస్తున్నాం
- ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి వ్యాఖ్యలపై విచారణ జరుగుతోంది
- మా పాలనలో నిర్బంధాలు లేనందునే కవిత ధర్నాలు చేస్తున్నారు
- విలేకరులతో ఇష్టాగోష్టిలో పీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్ వ్యాఖ్యలు



సాక్షి, హైదరాబాద్: స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించే అంశంపై తమకు స్పష్టత ఉందని టీపీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ బి. మహేశ్‌కుమార్‌గౌడ్ తెలిపారు. రిజర్వేషన్లు ఇచ్చాకే ఎన్నికలకు వెళ్లాలనేది పార్టీపరంగా తమ ఆలోచన అన్నారు. ఇందుకోసం న్యాయ నిపుణులతో చర్చిస్తున్నట్లు చెప్పారు. మంగళవారం సీఎల్పీ కార్యాలయంలో ఆయన విలేకరులతో పలు అంశాలపై ఇష్టాగోష్ఠిగా మాట్లాడారు. పార్టీ సంస్థాగత నిర్మాణంపై దృష్టి పెట్టామని.. త్వరలోనే జిల్లా కాంగ్రెస్ కమిటీలను ఏర్పాటు చేస్తామన్నారు. ఇందుకోసం ఏఐసీసీ నుంచి పరిశీలకులు వస్తారన్న మహేశ్‌కుమార్‌గౌడ్.. ఈ నెలాఖరుకు పార్టీకి సంబంధించి అన్ని కమిటీలను పూర్తి చేస్తామన్నారు. జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలపై క్రమశిక్షణ కమిటీ విచారణ చేస్తోందని.. తీన్మార్ మల్లన్న అంశానికి, అనిరుధ్ రెడ్డి అంశానికి మధ్య తేడా ఉందన్నారు.

జూబ్లీహిల్స్ ఉపఎన్నికలో గెలుస్తాం..

రాష్ట్రంలో ఎక్కడ ఉపఎన్నికలు వచ్చినా గెలిచేది తామేనని.. జూబ్లీహిల్స్ అసెంబ్లీ స్థానానికి జరిగే ఉపఎన్నికలో తాము గెలుస్తామని సర్వేలు చెబుతున్నాయని మహేశ్‌కుమార్‌గౌడ్ చెప్పారు. కేసీఆర్ పాలనలో నెలకు 15 రోజులు హౌస్ అరెస్టులు ఉండేవని, ఉదయం నుంచి సాయంత్రం వరకు పోలీస్‌స్టేషన్లలో ఉంచేవారని, తాము అలా చేయడం లేదని అన్నారు. కాంగ్రెస్ పాలనలో నిర్బంధాలు లేవు కాబట్టే బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత ధర్నాలు చేయగలుతుగుతున్నారని ఆయన పేర్కొన్నారు. కేటీఆర్ ప్రెస్‌క్లబ్‌కు వెళ్లినా.. ఎక్కడకు వెళ్లినా తాము అడ్డుకోవడం లేదన్నారు. రాష్ట్రంలో యూరియా సరఫరా పెరిగిందని.. యూరియాకు కరువు ఉందనేది బీఆర్ఎస్ దుష్ప్రచారమేనని ఆయన కొట్టిపారేశారు.

ఎమర్జెన్సీని తలపించేలా పాలన

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై కేటీఆర్ ఫైర్

- రాష్ట్రంలో చంద్రబాబు చెప్పినట్టు కోవర్టు పాలన సాగిస్తున్నాడు
- కాంగ్రెస్ అగ్రనేతలకు, బీజేపీ పెద్దలకు మూటలు మోస్తున్నాడని ఆరోపణ
- ఆయనకు రచ్చ తప్ప చర్చ చేతకాదని తేలిపోయిందని ఎద్దేవా
- ప్రెస్‌క్లబ్‌లో సీఎంకు ప్రత్యేక కుర్చీ వేసి వేచిచూసిన బీఆర్ఎస్ నేత


సీఎం రేవంత్‌రెడ్డి కోసం వేచిచూస్తున్న కేటీఆర్. చిత్రంలో ప్రశాంత్ రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, కవిత, సబిత, గంగుల, దాసోజు

సాక్షి, హైదరాబాద్: 'ఆనాటి రోజులు తెస్తామంటూ ఎన్నికల్లో పాటలు రాయించుకున్న కాంగ్రెస్ పార్టీ తిరిగి పాత దుర్దినాలను తీసుకొచ్చింది. ఇందిరమ్మ రాజ్యం పేరిట అక్రమ కేసులు, అణచివేతలు, నిర్బంధాలకు పాల్పడుతోంది. 50 ఏళ్ల క్రితం నాటి ఎమర్జెన్సీ రోజులను తలపించేలా పాలన సాగుతోంది. అరుపులు, గావు కేకలు, బూతులు మాట్లాడటం మినహా రేవంత్‌రెడ్డి రాష్ట్రానికి చేసిందేమీ లేదు. రాష్ట్ర రైతాంగానికి, యువతకు ఎవరేం చేశారో తేల్చుకుందాం రమ్మని సీఎం విసిరిన సవాలును స్వీకరించి వచ్చాను. నదుల బేసిన్‌లతో సహా ఏ అంశంపైనా రేవంత్‌కు బేసిక్ నాలెడ్జ్ లేదని తెలిసినా ఆయన ముచ్చట పడుతున్నాడని సవాలును స్వీకరించా. ప్రజల సమక్షంలో, మీడియా సాక్షిగా చర్చ కోసం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌కు వస్తే సీఎం ఢిల్లీకి పారిపోయాడు. సీఎంకు వీలుకాని పక్షంలో డిప్యూటీ సీఎం, వ్యవసాయ మంత్రి లేదా ఇతర మంత్రులను ఎవరినైనా చర్చకు పంపుతారని భావించా. కానీ రేవంత్‌కు రచ్చ చేయడం మినహా చర్చ చేయడం రాదని నేటితో తేలిపోయింది..'అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావు ఎద్దేవా చేశారు. సీఎం రేవంత్ ఈ నెల 4న ఎల్బీ స్టేడియం వేదికగా చేసిన సవాలును స్వీకరిస్తున్నట్లు ప్రకటించిన కేటీఆర్.. మంగళవారం ఉదయం 11 గంటలకు సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌కు చేరుకున్నారు. సీఎం కోసం ప్రత్యేక కుర్చీ వేసి పార్టీ నేతలతో కలిసి అరగంట వేచి చూశారు. అనంతరం భారీగా తరలివచ్చిన పార్టీ నాయకులు, కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడారు.

అందరూ 'పే సీఎం'అంటున్నారు..

'రాష్ట్రంలో 18 నెలలుగా అరాచక పాలన సాగుతోంది. రేవంత్‌రెడ్డి రాష్ట్ర రైతులను మోసం చేస్తూ తన గురువు చంద్రబాబునాయుడు కోసం కృష్ణా, గోదావరి జలాలను వదులుతూ బనకచర్ల లింక్ ప్రాజెక్టుకు పచ్చ జెండా ఊపుతున్నాడు. పోతిరెడ్డిపాడు నుంచి కృష్ణా నీళ్లను దొంగ చాటుగా తీసుకెళ్తుంటే కళ్లు మూసుకుని చంద్రబాబు చెప్పినట్టు కోవర్టు పాలన సాగిస్తున్నాడు. నీళ్ల ఆంధ్రకు, నిధులు ఢిల్లీకి తరలిస్తున్నాడు. కాంగ్రెస్ అగ్ర నాయకత్వంతో పాటు బీజేపీ పెద్దలకు పైసల మూటలు మోస్తూ పదవిని కాపాడుకుంటున్నాడు. పేమెంట్ కోటాలో పీసీసీ, సీఎం పదవి తెచ్చుకున్న రేవంత్‌ను అందరూ ''పే సీఎం''అంటున్నారు.

మరో చాన్స్ ఇస్తున్నాం.. తేదీ చెప్పండి

రుణమాఫీ, రైతు భరోసా అందని రైతులు, మిల్లర్లకు ధాన్యం అమ్ముకుని నష్టపోయిన రైతుల జాబితాను తీసుకుని నేను బహిరంగ చర్చ కోసం వస్తే.. తొడగొట్టి సవాలు విసిరిన సీఎం ఎప్పటిలాగానే పారిపోయాడు. ముఖ్యమంత్రికి ఒకవేళ తీరిక లేదనుకుంటే మరో అవకాశం ఇస్తున్నాం. తేదీ, సమయం, వేదిక మీరే చెప్పండి. జూబ్లీహిల్స్‌లోని మీ ప్యాలెస్‌కు అయినా వస్తాం. ఏ అంశం మీద చర్చ పెట్టినా వచ్చేందుకు సిద్ధం మైక్ కట్ చేయకుండా అవకాశం ఇస్తే అసెంబ్లీలో చర్చకు కూడా వస్తాం. ఒకవేళ సీఎం చర్చకు రాకపోతే ముక్కు నేలకు రాసి కేసీఆర్‌కు క్షమాపణ చెప్పాలి..'అని కేటీఆర్ డిమాండ్ చేశారు.

తెలంగాణ భవన్ నుంచి భారీ కాన్వాయ్‌తో..

కేటీఆర్ ఉదయం 10 గంటలకు తెలంగాణ భవన్‌కు చేరుకున్నారు. మాజీ మంత్రులు తలసాని శ్రీనివాస్ యాదవ్, వేముల ప్రశాంత్‌రెడ్డి, గంగుల కమలాకర్, మహమూద్ అలీ, ఎమ్మెల్సీ మధుసూదనాచారి, ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, పార్టీ నేత ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ తదితరులు స్వాగతం పలికారు. అక్కడి నుంచి భారీ వాహన కాన్వాయ్‌తో ప్రెస్‌క్లబ్‌కు చేరుకున్న కేటీఆర్.. కాంగ్రెస్ పాలనలో ఆత్మహత్యలు చేసుకున్న 600 మంది అన్నదాతలకు సంతాపం ప్రకటించారు. అనంతరం సీఎం కోసం వేచి చూశారు. 'కేటీఆర్ ఇక్కడ.. రేవంత్ ఎక్కడ?'అంటూ బీఆర్ఎస్ కార్యకర్తలు ఈ సందర్భంగా నినాదాలు చేశారు. కాగా పోలీసులు మంగళవారం ఉదయం నుంచే తెలంగాణ భవన్, ప్రెస్‌క్లబ్ వద్ద పెద్ద సంఖ్యలో మోహరించారు.

కేసీఆరే పనికి రాడని పక్కన పెట్టాడు

- కేటీఆర్‌తో మా సీఎం చర్చకు వస్తాడా?
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్‌పై కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల ధ్వజం

సాక్షి, హైదరాబాద్: బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. సీఎం తనతో చర్చకు రావాలంటూ సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో కేటీఆర్ ఉన్న సమయంలో సీఎల్పీ వేదికగా కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు ఆయనపై విమర్శనాస్త్రాలు సంధించారు. పరిగి, మానకొండూరు, మహబూబ్‌నగర్ ఎమ్మెల్యేలు టి.రామ్మోహన్‌రెడ్డి, కవ్వంపల్లి సత్యనారాయణ, యెన్నెం శ్రీనివాస్‌రెడ్డి, ఎమ్మెల్సీలు అద్దంకి దయాకర్, బల్మూరి వెంకట్, ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య సీఎల్పీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. 'కేటీఆర్‌తో బీఆర్ఎస్‌కు ఒక్క ఓటు రాదు. అందుకే కేటీఆర్ పనికిరాడని కేసీఆరే పక్కన పెట్టాడు. ఆయనకు నాయకత్వ లక్షణాలు లేవని. సొంత చెల్లి కూడా చెబుతోంది. కేసీఆర్ పక్కన పెట్టిన కేటీఆర్‌తో మా సీఎం రేవంత్ చర్చకు వస్తాడా? స్థాయి మరిచి మాట్లాడడం మానుకుంటే కేటీఆర్‌కు మంచిది. లేదంటే ప్రజలు రాళ్లతో కొడతారు.'అని వ్యాఖ్యానించారు. పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలోని అన్ని వర్గాలను మోసం చేసిన చరిత్ర కేసీఆర్‌దని అన్నారు. మానకొండూరు ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ మాట్లాడుతూ సీఎం రేవంత్ స్థాయి కేటీఆర్‌కు లేదన్నారు. సీఎం గురించి మాట్లాడితే మొండి రంపంతో నాలుక కోసి ఉప్పు, కారం పెడతామని హెచ్చరించారు. ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్ మాట్లాడుతూ బజారున పడిన పిచ్చికుక్కలా కేటీఆర్ వ్యవహరిస్తున్నాడని వ్యాఖ్యానించారు. చర్చకు రావాలని కేసీఆర్‌కు రేవంత్‌రెడ్డి సవాల్ విసిరితే బచ్చాగాడు కేటీ ఆర్ వస్తున్నాడని, ఆయన సీఎం రేవంత్‌రెడ్డికి సవాల్ విసరడమేంటని విప్ అయిలయ్య ప్రశ్నించారు. అయ్య ఫామ్‌హౌస్‌లో ఉంటే.. కొడుకు ప్రెస్‌క్లబ్‌కు వచ్చి చిల్లరమల్లర మాటలు మాట్లాడుతున్నాడని విమర్శించారు.

గురుదత్‌ను సర్వోన్నత దర్శకుడిగా ప్రపంచం గుర్తిస్తుంది.
'ప్యాసా', 'కాగజ్ కే ఫూల్' వంటి క్లాసిక్స్ తీసి గ్రేట్ మాస్టర్ అనిపించుకున్నాడు.
వహిదా రెహమాన్ వంటి నటిని ఇంట్రడ్యూస్ చేశాడు.
నేటి తరానికి అతని సినిమాలు పాఠాలే.
అలాగే అతని వ్యక్తిగత జీవితం కూడా
కుటుంబ జీవితాన్ని ఎలా పదిలపరుచుకోవాలో హెచ్చరించే పాఠం.
మరణించి దశాబ్దాలు గడిచినా నేటికీ స్మరణకు నోచుకుంటున్న
గురుదత్ శత జయంతి సందర్భంగా ప్రత్యేక కథనం.

నేడు గురుదత్ శతజయంతి

అతడు వదిలి వెళ్లిన పాఠాలు


వహీదా రహెమాన్‌తో గురుదత్

గురుదత్‌కు చిన్నప్పటి నుంచి దృష్టి సమస్య ఉంది.

రెండు గజాల అవతల ఏముందో కళ్లద్దాలు లేకుంటే చూడలేడు.

గురుదత్ తాను హీరోగా నటించిన చాలా సినిమాల్లో కళ్లద్దాలు వాడలేదు. ఇప్పుడు మీరు అతని సినిమాలు చూడండి. ఆ సినిమాలన్నింటిలోనూ అతడు ఎదురుగా ఏముందో కనపడకనే నటించాడు. డైలాగులు చెప్పాడు. నృత్యాలు చేశాడు. క్లోజప్స్ ఇచ్చాడు. కళ్లు కనపడుతున్నట్టుగానే ప్రేక్షకులకు భ్రాంతి కలిగించాడు.

గురుదత్ అంత గొప్ప మేధావి. నిపుణుడు. నటుడు. కళాకారుడు.

• • •

గురుదత్ తెలిసిన వాళ్లకు పరిచయం చేయనక్కర్లేదు. తెలియని తెలుగువారికి 'మల్లెపూవు' సినిమాను గుర్తు చేయాలి. శోభన్‌బాబు నటించిన ఈ సినిమా పెద్ద హిట్ అయ్యింది. 'చిన్నమాటా... ఒక చిన్నమాటా...' 'మల్లెపూవు'కు ఒరిజినల్ గురుదత్ క్లాసిక్ 'ప్యాసా'. గురుదత్‌ను పరిచయం చేయాలంటే తెలుగు లింక్ ఇంకోటి చెప్పొచ్చు. మన తెలుగమ్మాయి వహీదా రహెమాన్‌ను సూపర్‌స్టార్‌ను చేసింది అతడే. సికింద్రాబాద్‌లో పుట్టి పెరిగిన దర్శకుడు శ్యాం బెనగళ్‌కు గురుదత్ దగ్గరి బంధువు. గురుదత్ చేతుల్లో పడి స్టార్ కమెడియన్ అయిన బస్ కండక్టర్ జానీ వాకర్. ఇతని తండ్రి మిల్లు టెక్నీషియన్‌గా మూడేళ్ల పాటు వరంగల్‌లో పని చేశాడు.

• • •

హీరోలకు విశేషమైన ప్రత్యేకతలు ఉండాలి. దిలీప్ కుమార్, రాజ్ కపూర్, దేవ్ ఆనంద్... ఈ ముగ్గురిలో ప్రేక్షకులు మెచ్చే ప్రత్యేకతలు ఉన్నాయి. చూపులకు వీరు అందగాళ్లు. మాట తీరు, నడక, నటన... ఏదో స్పెషల్. కాని వీరిమధ్య ఏ ప్రత్యేకతలు లేనట్టుగా కనపడుతూ ప్రత్యేకత చాటుకున్న హీరో గురుదత్. ఒక రకంగా ఇతను రాజ్‌కపూర్‌కు క్లాసిక్ వెర్షన్. రాజ్‌కపూర్ నటించి దర్శకత్వం వహించాడు. గురుదత్ కూడా అలాగే చేశాడు. రాజ్‌కపూర్ పాపులర్ స్టయిల్‌లో సినిమా మేకింగ్ చేస్తే గురుదత్ క్లాసిక్ స్టయిల్‌లో చేశాడు. ఇద్దరూ పాటలు తీయడంలో మాస్టర్స్. కాని రాజ్‌కపూర్ పాటలకు ప్రిలూడ్ ఉండాలి. 'ఆవారా హూ'... మొదలవ్వాలంటే మొదట సంగీతం వినిపించాలి. ఈ సంగీతాన్ని కట్ చేసి నేరుగా పాటను మొదలెట్టి షాక్‌కు గురి చేశాడు గురుదత్. అతని సినిమాల్లోని పాటలు ప్రిలూడ్స్ లేకుండా మొదలవుతాయి. పాట పాడాలంటే వెంటనే పాడొచ్చు కదా... మొదట సంగీతం వినండి అని ఆగడం ఎందుకు అన్నట్టుగా ఉంటుంది అతని ధోరణి. మిస్టర్ అండ్ మిసెస్ 55లో 'అయ్ జీ దిల్ పర్ హువా ఐసా జాదూ' పాట చూడండి.

• • •

గురుదత్ అసలు పేరు వసంత కుమార్ పడుకోన్. కొంకణి ప్రాంతం వీళ్లది. మంగుళూరు. కోల్‌కతాలో బాల్యం గడిచాక, కాలేజీ చదువు చదివే వీలు లేక, నెలకు 30 రూపాయలకు టెలిఫోన్ ఆపరేటర్‌గా పని చేశాడు. తర్వాత పండిట్ రవి శంకర్ సోదరుడు ఉదయ్ శంకర్ దగ్గర కొరియోగ్రఫీ నేర్చుకున్నాడు. పూణె వెళ్లి ప్రభాత్ స్టూడియోలో ఉద్యోగిగా సినిమా జీవితం మొదలుపెట్టాడు. అక్కడే దేవ్‌ఆనంద్ మొదటి సినిమా 'హమ్ ఏక్ హై' చిత్రీకరణ జరిగింది. ఇద్దరూ స్నేహితులయ్యారు. దేవ్ ఆనంద్ హీరో అయ్యాక గురుదత్‌కు దర్శకుడిగా అవకాశం ఇస్తే 'బాజీ' (1951) తీసి క్రైమ్ థ్రిల్లర్స్ ఇలా కూడా తీయొచ్చా అని ప్రేక్షకులను ఆశ్చర్యపరిచాడు. బాజీ సూపర్ హిట్. అప్పటికి గురుదత్ వయసు సరిగ్గా 25 సంవత్సరాలు. ఈ వయసుకే అతడు స్క్రీన్ మీద మాస్టర్ స్టోరీ టెల్లర్ అయ్యాడు.

• • •

గురుదత్‌కు ఒక టీమ్ ఉంది. అతడు సినిమా ఇండస్ట్రీలో అందరినీ కలిసే వ్యక్తి కాదు. అందరూ కలవడానికి వీలు ఇవ్వడు. కమెడియన్ జానీ వాకర్, సినిమాటోగ్రాఫర్ వి.కె.మూర్తి, నటుడు రహెమాన్, రచయిత అబ్రార్ అల్వీ.. ఇలా కొంతమంది మాత్రమే అతనికి దగ్గరగా ఉండగలిగారు. ఈ టీమ్‌తోనే అతడు గొప్ప సినిమాలు తీశాడు. నిర్మించాడు. నటించాడు. గురుదత్‌తో ప్రమేయం ఉన్న సినిమాలు మొత్తం 15. అతను దర్శకత్వం వహించింది కేవలం 8. అయినా సరే నేటికీ అతడు భారతదేశం చూసిన గొప్ప దర్శకుల్లో ఒకడు.

• • •

సినిమా నేల విడిచి సాము చేయకపోవడం... వర్తమానంలో ఉండటం... పాత్రలు తమ బలాలు బలహీనతలతో కనపడటం... వాటి మనసుల్లోని వెలుగు నీడల వలే దృశ్యాల్లో కూడా వెలుగు నీడలు పరవడం, మంచి సంగీతం, నటన... న్యాయమైన కొన్ని ఆలోచనల ప్రతిపాదన... అంతే గురుదత్ సినిమాలు. అయినా సరే నిలిచాయి. మిస్టర్ అండ్ మిసెస్ 55లో అతడు కార్టూనిస్టుగా కనిపిస్తాడు. ఆ రోజుల్లో కార్టూనిస్టును హీరోగా ఊహించగలమా? 'ప్యాసా'లో అతడు కవి. 'కాగజ్ కే ఫూల్'లో సినిమా దర్శకుడు. గురుదత్ తను కళాకారుడు కనుక కళా ప్రపంచంలో ఉండే పాత్రలే అతడి సినిమాలను లీడ్ చేశాయి.

• • •

సమాజం వేరు... ఆదర్శం వేరు... ఆదర్శాన్ని చావుదెబ్బ తీయడమే సమాజం పని... ఇక ఆదర్శవంతమైన కళను అది ఎంత హేళన చేయాలో అంతా చేస్తుంది. ఎందుకంటే ఆదర్శాన్ని చూస్తే సమాజానికి భయం. ఆదర్శాన్ని ఊతంగా చేసుకుని విలువలు పాటిస్తే ఐదు వేళ్లూ నోట్లోకి వెళ్లవు. డబ్బులు రాలవు. మేడలు నిలవవు. కాని ఆదర్శం అంటే తనకు ఇష్టమని చెప్పుకోవడానికి సమాజం నటిస్తుంటుంది. ఆ నటన మీద గురుదత్ గట్టిగా ప్రకటించిన నిరసన, ఊసిన ఉమ్ము 'ప్యాసా'. గురుదత్, వహీదా రహెమాన్, సాహిర్ లూధియాన్వీ, ఎస్.డి.బర్మన్, వి.కె.మూర్తి... వీరందరి ఉత్కృష్ట కళాప్రకటన అది.

ఈ సినిమాతో వచ్చిన ఖ్యాతితో గురుదత్ తీసిన మరో క్లాసిక్ 'కాగజ్ కే ఫూల్'. అయితే రాజ్ కపూర్‌కు 'మేరా నామ్ జోకర్' వల్ల ఏం జరిగిందో గురుదత్‌కు 'కాగజ్ కే ఫూల్' వల్ల అదే జరిగింది. కాలం కంటే ముందు తీసిన ఈ సినిమా గురుదత్‌ను ఆ రోజుల్లో ఫెయిల్యూర్ డైరెక్టర్‌గా నిలబెట్టింది. 18 లక్షలు నష్టం. సినిమా ప్రపంచంలో సక్సెస్, ఫెయిల్యూర్‌లు ఎలా ఉంటాయో ఇగోలు మనుషుల్ని ఎలా బలిచేస్తాయో చూపిన ఈ సినిమా నేడు కల్ట్ క్లాసిక్‌గా నిలిచినా గురుదత్‌ను దర్శకత్వం కుర్చీని వదిలిపెట్టేలా చేసింది.

• • •

గురుదత్ ఆ తర్వాత కూడా 'చౌదవీ కా చాంద్', 'సాహిబ్ బీవీ ఔర్ గులామ్'లను నటించి, నిర్మించి చాలా డబ్బు చేసుకోగలిగాడు. అతడు ఆర్థిక కష్టాల వల్ల చనిపోలేదు. ఆత్మిక కష్టాల వల్ల వెళ్లిపోయాడు. 39 ఏళ్లకు 1964లో మరణించినా నేటికీ గురుదత్ ఫెస్టివల్స్ జరుగుతూనే ఉన్నాయి. గురుదత్ సినిమాలు పాఠ్యాంశాలుగానే ఉన్నాయి.

గురుదత్ మరో వందేళ్లు ఉంటాడు.

– కె.

కళ సరే... ఇంటి మాట ఏమిటి?

గురుదత్‌ను ఎవరో నిర్మాత 'మిస్సమ్మ' సినిమా చూడమని హైదరాబాద్‌కు పిలిపించాడు. గురుదత్‌కు నచ్చితే హిందీలో రీమేక్ చేయించాలని. హైదరాబాద్‌కు వచ్చిన గురుదత్‌కు 'మిస్సమ్మ' నచ్చలేదు కాని అంతకుముందు సంవత్సరం రిలీజై హిట్ అయిన 'రోజులు మారాయి'లో డాన్స్ చేసి గుర్తింపు పొందిన వహీదా రహెమాన్‌ను పరిచయం చేస్తే ఆమె నచ్చింది. నాలుగు సినిమాల కాంట్రాక్ట్ మీద బొంబాయి తీసుకెళ్లిన గురుదత్ ఆమెను 'సి.ఐ.డి' నుంచి 'సాహిబ్ బీబీ ఔర్ గులామ్' వరకూ గట్టి పాత్రలు ఇచ్చి ఆమె కెరీర్‌ను కుదుట పరిచాడు. ఆ పరిచయం అతని వివాహ జీవితంలో దుమారం రేపింది. అప్పటికే ప్రసిద్ధ గాయని గీతాదత్‌ను వివాహం చేసుకుని, ముగ్గురు పిల్లల తండ్రి అయిన గురుదత్ అటు ఆమె నిరసనను, ఇటు వహీదా పట్ల ఆకర్షణను నిర్వహించలేక చతికిల పడ్డాడు. గురుదత్ వల్ల గీతాదత్ గాయనిగా తన కెరీర్‌ను పోగొట్టుకుంది. ఒక గొప్ప గాయని భర్తగా ఆమెను ఎలా చూసుకోవాలో గురుదత్‌కు తెలియలేదు. అలాగే సాటి నటీమణి ఆకర్షణ నుంచి ఎలా తప్పించుకోవాలో కూడా తెలియలేదు. ఈ కారణం చేత గురుదత్ అకాలమరణం సంభవించింది. ఇతను మరణించిన రెండేళ్లకే గీతాదత్ మరణించింది. ముగ్గురు పిల్లలు అనాథలవగా వారిలో ఒక కుమారుడు తర్వాతి కాలంలో ఆత్మహత్య చేసుకున్నాడు. కెరీర్‌ను, కుటుంబాన్ని సమన్వయం చేసుకుంటూ ఎక్కడ దేనికి విరామం ఇవ్వాలో తెలుసుకుని జీవించకపోతే ఎవరైనా ఒడిదుడుకులు ఎదుర్కొనక తప్పదు అని గురుదత్ జీవితం విలువైన పాఠం చెబుతూనే ఉంటుంది.

వక్త్ నే కియా క్యా హసీన్ సితమ్
హమ్ రహే నా హమ్ తుమ్ రహే నా తుమ్


భార్య గీతాదత్‌తో గురుదత్

ఫస్ట్ ఇండియన్ ఉమన్

నీటి మీద రికార్డు


వాటర్ స్కీయింగ్ చేస్తున్న అనూజ వైద్య

అనూజ వైద్య మరో రికార్డు సాధించింది. పర్వతారోహకురాలైన అనూజ వైద్య ఇప్పుడు కొత్త రికార్డుల కోసం నీటి మీద దృష్టి పెట్టారు. ఇంటర్నేషనల్ వాటర్ స్కీయింగ్ పోటీల్లో పాల్గొన్న తొలి భారతీయ మహిళ ఆమె.

గుజరాత్ రాష్ట్రం, సూరత్‌కు చెందిన అనూజవైద్య గత నెల (జూన్) 24 నుంచి 29 వరకు థాయ్‌లాండ్‌లో జరిగిన ఏషియన్ వాటర్ స్కీయింగ్ అండ్ వేక్ బోర్డింగ్ చాంపియన్‌షిప్‌లో పాల్గొన్నారు. బాల్యం నుంచి అనూజ స్పోర్ట్స్‌లో చురుగ్గా ఉండేవారు. ట్రెకింగ్, స్విమ్మింగ్‌తోపాటు తండ్రి ప్రోత్సాహంతో తాపి నదిలో వాటర్ స్పోర్ట్స్‌లో శిక్షణ పొందారు. ఆమె తల్లి సొంతరాష్ట్రం ఉత్తరాఖండ్. తల్లి ప్రోత్సాహంతో అనూజ ఆమె చెల్లి అదితి ఇద్దరూ పర్వతారోహణ చేశారు. ఎవరెస్ట్ పర్వతాన్ని 2019లో తొలి ప్రయత్నంలోనే అధిరోహించి 'ఎవరెస్ట్ సిస్టర్స్' గా గుజరాత్ రాష్ట్రంలో పేరు తెచ్చుకున్నారు. ఈ సిస్టర్స్ ఉత్తరాఖండ్‌లో 'గెట్ సెట్ అడ్వెంచర్స్' పేరుతో అడ్వెంచర్ స్పోర్ట్స్ కంపెనీ స్థాపించారు. ఇదిలా ఉండగా 27 ఏళ్ల అనూజ వైద్య తాజాగా వాటర్ స్కీయింగ్ స్పోర్ట్స్‌లో భారత్ తరఫున పాల్గొన్నారు. రికార్డుల్లో శిఖరాగ్రాన్ని చేరిన అనూజ ప్రస్తుతం నీటి/మీద రికార్డుల బాట పట్టారు. అంతర్జాతీయంగా గుర్తింపు పొందిన ఈ క్రీడ మనదేశ మహిళల దృష్టిని పెద్దగా ఆకర్షించలేదు.

వీరికంటే ముందు ఎవరెస్ట్ శిఖరాన్ని హరియాణకు చెందిన తాషి, నుంగ్షి మాలిక్‌లు ఎవరెస్ట్‌ను (2023)అధిరోహించారు. సెవెన్ సమ్మిట్స్ పూర్తి చేసిన తొలి సిస్టర్స్‌గా రికార్డు సొంతం చేసుకున్నారు. అనూజ వేసిన తొలి అడుగుతో కొత్తతరం క్రీడాకారిణులు ఆ దారిలో నడుస్తారని ఆశిద్దాం.

ఫిట్‌నెస్

ఐరన్ సయామీ




సయామీ ఖేర్

ఇటీవల కాలంలో తారలు తమ అభిరుచులను ఇతర రంగాలకూ విస్తరిస్తున్నారు. వారిలో మరింత విభిన్నంగా తనని తాను నిరూపించుకుంటోంది 33 ఏళ్ల సయామీ ఖేర్. ఒకే సంవత్సరంలో రెండుసార్లు 'ఐరన్‌మ్యాన్ 70.3' పూర్తి చేసిన తొలి భారతీయ నటిగా వార్తల్లో నిలిచింది.

ఫిట్‌నెస్‌కు అధిక ప్రాధాన్యం ఇచ్చే సయామీ ఖేర్ జూలై 6న స్వీడన్‌లోని జోంకోపింగ్‌లో జరిగిన ఐరన్‌మ్యాన్ 70.3 యూరోపియన్ ఛాంపియన్‌షిప్‌లో పాల్గొని, పతకాన్ని సాధించింది. ఇది ప్రపంచవ్యాప్తంగా అత్యంత కఠినమైన ట్రయాథ్లాన్ సర్క్యూట్‌లలో ఒకటి. కిందటేడాది సెప్టెంబర్‌లో తొలిసారిగా మెడల్ అందుకున్న ఆమె ఇప్పుడు స్వీడన్‌లో నిర్వహించిన రేస్‌లో సత్తా చాటి మరో పతకం అందుకుంది.

తన విజయంపై సయామీ ఖేర్ స్పందిస్తూ 'ఎంతో ఆనందంగా ఉంది. క్రమశిక్షణతో ఏదైనా సాధ్యమే. అలాగని ప్రపంచానికి నేనేంటో నిరూపించుకోవాలన్న ఉద్దేశంతో ఇదంతా చేయలేదు. నా మనసుకు నచ్చింది చేస్తున్నాను. ఒక మహిళగా ఇది శారీరకంగా సవాల్‌తో కూడిన పనే. అసాధ్యం అనిపించిన దానిని పూర్తి చేయడంలో ఒక గర్వం, అపరిమితమైన ఆనందం'' ఉంటాయి అంటోంది.

నాసిక్‌కు చెందిన సయామీ ఖేర్ తెలుగు సినిమా 'రేయ్'తో తెరంగేట్రం చేసింది. ఆ తర్వాత బాలీవుడ్‌లో అవకాశాలు అందుకున్న ఆమె... కొన్నాళ్ల గ్యాప్ అనంతరం 'వైల్డ్ డాగ్'తో తెలుగు ఆడియన్స్‌ను పలకరించింది. మళ్లీ తెలుగులో నటించలేదు. ఇటీవల వచ్చిన హిందీ చిత్రం 'జాబ్'లో కీలకపాత్ర పోషించింది.

• కిచెన్ టిప్

కొన్ని రకాల మసాలా వంటకాల్లో పెరుగు ఉపయోగిస్తుంటారు. అయితే దీంతో పాటు టీస్పూన్ వెనిగర్, కాస్త నిమ్మరసం కూడా కలిపితే కూరకు అదనపు రుచిని జోడించచ్చని అంటున్నారు.



• బ్యూటిప్

రాత్రి పడుకునే ముందు కాస్తంత స్వచ్ఛమైన కొబ్బరినూనెను పాదాలకు రాసుకుని మర్దన చేయాలి. ఆ తర్వాత సాక్సులు వేసుకోవాలి. ఇలా క్రమం తప్పకుండా రోజూ చేయడం వల్ల పొడిబారిన చర్మం కాస్తా చాలా తక్కువ వ్యవధిలోనే మృదువుగా మారుతుంది.



ఒక నిమ్మచెక్కకు పంచదార అద్దుకోవాలి. దీనితో కాళ్లు, చేతులకు మర్దన చేస్తున్నట్లు మృదువుగా రుద్దుకోవాలి. అలాగే రాత్రి నిద్రించే ముందు ఆలివ్ లేదా ఆల్మండ్ ఆయిల్‌తో మర్దన చేసుకున్నా సరిపోతుంది. ఇది చర్మాన్ని ఎంతో కోమలంగా ఉంచుతుంది.

బులియన్

(బంగారం 10 గ్రా.: వెండి కిలో) జూలై 8న ముగింపు రూ.లలో

హైదరాబాద్	
బంగారం (24 క్యారెట్లు)	97,710
బంగారం (22 క్యారెట్లు)	90,270
వెండి	1,09,300
విజయవాడ	
బంగారం (24 క్యారెట్లు)	1,00,220
బంగారం (22 క్యారెట్లు)	90,600
వెండి	1,11,100
విశాఖపట్నం	
బంగారం (24 క్యారెట్లు)	98,840
బంగారం (22 క్యారెట్లు)	90,600
వెండి	1,20,000
రాజమండ్రి	
బంగారం (24 క్యారెట్లు)	1,00,220
బంగారం (22 క్యారెట్లు)	93,320
వెండి	1,11 ,100
ప్రొద్దుటూరు	
బంగారం (24 క్యారెట్లు)	97,100
బంగారం (22 క్యారెట్లు)	89,330
వెండి	1,08,800
చెన్నై	
బంగారం (24 క్యారెట్లు)	98,830
బంగారం (22 క్యారెట్లు)	90,600
వెండి	1,20,000

గమనిక: గిట్టుబాటు, నిల్వ, పోటీ వంటి పలు అంశాల ప్రాతిపదికన షాపుల మధ్య పసిడి ధరల్లో కొంత వ్యత్యాసం ఉండవచ్చు.

పురస్కారం

ప్రకృతి 'పోగు'చేసి...


గూడ పవన్

'అలాగే' అనుకొని పాత దారిలోనే నడిచేవాళ్లు కొందరు. 'ఇలా కూడా' అని కొత్తదారిలో నడిచి విజయం సాధించేవాళ్లు కొందరు. రెండో కోవకు చెందిన పవన్ రసాయన రంగులు లేని చేనేత చీర గురించి కల కన్నాడు. చేనేత కళకు కొత్త కళ తీసుకువచ్చాడు.

సహజ సిద్ధమైన రంగులతో, తేలియా రుమాల్ డిజైన్‌తో డబుల్ ఇక్కత్ పట్టు చీరెను తయారు చేసిన యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపురం మండలం పుట్టపాకకు చెందిన గూడ పవన్ యువ చేనేత విభాగంలో ఇచ్చే జాతీయ పురస్కారానికి ఎంపికయ్యాడు.

శ్రమకు తగిన ఫలితం

సహజ సిద్ధమైన రంగుల డిజైన్లతో పట్టు చీరెను నేయడం కోసం రాత్రింబవళ్లు కష్టపడ్డాను. పడిన శ్రమకు గుర్తింపు దక్కింది. నేను నేసిన చీరెకు జాతీయ అవార్డు రావడం సంతోషంగా ఉంది. ఈ చీరెలో ఉన్న రంగులు వెలిసిపోకుండా ఉంటాయి.

– గూడ పవన్



చీర తయారీ ఇలా...

బంతి పూలు, దానిమ్మ పండ్లు, పుదీన, కొత్తిమీర, బెల్లం, ఉల్లిగడ్డ పొట్టు, ఆకులు, చెట్ల బెరడు... ఇలా ప్రకృతి నుంచి సేకరించిన పదార్థాలతో సహజరంగులు తయారు చేశాడు. ఈ రంగులను మల్బరీ పట్టుదారానికి అద్ది తేలియా రుమాల్ డిజైన్‌తో పట్టుచీరను తయారుచేశాడు.

సహజ పదార్థాలను ఎండబెట్టడం, ఉడకబెట్టడం, రంగులు అద్దడం, చీరెకు డిజైన్‌లు చేసే ప్రక్రియకు ఆరు నెలలు పట్టింది. 6.25 మీటర్‌ల పొడవు, 46 ఇంచుల వెడల్పుతో తయారుచేసిన ఈ చీరెలో తేలియా రుమాల్‌కు సంబంధించిన పదహారు ఆకృతులు ఉన్నాయి. బంతిపూలు, రథం, త్రీడీ డిజైన్... ఇలా రకరకాల డిజైన్‌లు చీర పొడవునా ఉంటాయి. రకరకాల ఆకృతులతో చీర అందంగా కనిపిస్తుంది. సాధారణ పట్టు చీరెలా ముడతలు పడకుండా మృదువైన పట్టును ఈ చీరె కోసం వాడారు. రంగు వెలవని చీర ఒక్కటి రూ.75 వేలు ఖరీదు చేస్తుంది. గత సంవత్సరం ఢిల్లీలోని రాష్ట్రపతి భవన్‌లో రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ఎదురుగా మగ్గంపై ఈ చీరె నేసి ప్రశంసలు అందుకున్నాడు. బీటెక్ మధ్యలోనే వదిలేసి తండ్రి శ్రీను దగ్గర చేనేతలో శిక్షణ పొందాడు.

చీరకు సిరులద్ది...


నర్మద

చేనేత ఎంత అద్భుతమైన కళో, చేనేత వస్త్రాలను మార్కెటింగ్ చేయడం కూడా అంతే అద్భుత కళ. ఆ కళలో ఆరితేరిన గజం నర్మద ఎంతోమందికి స్ఫూర్తిని ఇస్తోంది.

భారత ప్రభుత్వం, చేనేత, జౌళీ మంత్రిత్వ శాఖ వివిధ విభాగాలలో ఇచ్చే జాతీయ పురస్కారాలలో మార్కెటింగ్ విభాగంలో ఇచ్చే పురస్కారానికి నర్మద ఎంపికైంది...

నిరాశవాదులకు నలుదిక్కులా నిరాశ మాత్రమే కనిపిస్తుంది. ఆశావాదులకు అనేక దారులు కనిపిస్తాయి. యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపురం మండలం పుట్టపాక గ్రామానికి చెందిన గజం నర్మద ఆశావాది.

ఉత్సాహమే శక్తిగా ప్రతి అడుగు

చేనేత కళ మసక బారుతున్నట్లు అనిపించినప్పుడు, 'చేనేత రంగం కాలం చెల్లిన రంగం' అనే మాటలు వినిపిస్తున్నప్పుడు నర్మద ఎప్పుడూ నిరాశపడిపోలేదు. 'బంగారు పళ్లేనికి అయినా గోడ చేర్పు కావాలి' అనే మాటను ఎన్నోసార్లు విని ఉన్నది నర్మద.

చేనేత అనేది బంగారం లాంటి కళ. ఆ కళకు 'మార్కెటింగ్ నైపుణ్యం' అనే గోడ చేర్పును తీసుకువచ్చి విజయం సాధించింది.

ఎంతోమందికి ఉపాధి

'గజం నర్మద హ్యాండ్లూమ్' పేరుతో హైదరాబాద్‌లో చేనేత వస్త్రాల వ్యాపారం ప్రారంభించింది నర్మద. 2013లో రూ.10 లక్షల వ్యయంతో ప్రారంభించిన ఫర్మ్ ఇప్పుడు రూ. 8 కోట్ల టర్నోవర్‌కు చేరింది. జనగామ జిల్లాలోని సుమారు మూడు వందల మంది చేనేత కళాకారుల నుంచి చేనేత పట్టు ఇక్కత్ చీరెలు కొనుగోలు చేస్తుంది. రకరకాల అప్‌డేట్ డిజైన్లతో అందంగా తయారైన చీరెలను ఆన్‌లైన్‌లో ఆర్డర్‌లు తీసుకుంటుంది. హైదరాబాద్, ఢిల్లీ, కోల్‌కత్తా, బెంగళూరు, ముంబై...దేశంలోని ప్రధాన నగరాల్లో ఇక్కత్ చీరెలను విక్రయిస్తుంది.



మరింత ఉత్సాహం... మరింత స్ఫూర్తి

చేనేత మార్కెటింగ్‌లో ఈ ఏడాది నాకు అవార్డు రావడం సంతోషంగా ఉంది. కనుమరుగు అవుతున్న చేనేత వృత్తికి ఈ జాతీయ పురస్కారం ప్రోత్సాహాన్ని ఇస్తుంది. మా గ్రామానికి చెందిన పద్మశ్రీ అవార్డు గ్రహీతలు గజం గోవర్ధన్, గజం అంజయ్యలు నాకు ఆదర్శం. ప్రఖ్యాత డిజైనర్ గౌరంగ్ నాకు స్ఫూర్తి. లేటెస్ట్ డిజైన్‌లు రూపొందించి విక్రయించడం వల్ల ఇక్కత్ చీరెలకు మరింత ఆదరణ లభిస్తోంది. జాతీయ అవార్డు రావడం నాకే కాదు చేనేత రంగంలో పనిచేస్తున్న మహిళలకు ఉత్సాహాన్ని, స్ఫూర్తిని ఇస్తుంది అని భావిస్తున్నాను.

– గజం నర్మద

– యంబ నర్సింహులు, సాక్షి, యాదాద్రి



ఆకుల శ్రీజ శుభారంభం

వరల్డ్ టేబుల్ టెన్నిస్ (డబ్ల్యూటీటీ) టూర్‌లో భాగంగా యునైటెడ్ స్టేట్స్ (యూఎస్) 'స్మాష్ లెవెల్' టీటీ టోర్నీలో భారత క్రీడాకారిణి, తెలంగాణ అమ్మాయి ఆకుల శ్రీజ శుభారంభం చేసింది. లాస్ వేగస్‌లో జరుగుతున్న ఈ టోర్నీలో మహిళల సింగిల్స్ తొలి రౌండ్‌లో ప్రపంచ 64వ ర్యాంకర్ శ్రీజ 14-12, 11-8, 11-5తో ప్రపంచ 66వ ర్యాంకర్ టుంగ్ చువాన్ చియెన్ (చైనీస్ తైపీ)పై గెలిచి రెండో రౌండ్‌లోకి ప్రవేశించింది. 23 నిమిషాల్లో ముగిసిన ఈ మ్యాచ్‌లో శ్రీజ తన సర్వీస్‌లో 18 పాయింట్లు, ప్రత్యర్థి సర్వీస్‌లో 18 పాయింట్లు సాధించింది. రెండో రౌండ్‌లో 23వ ర్యాంకర్ హొనోకా (జపాన్)తో శ్రీజ ఆడుతుంది. భారత్‌కే చెందిన మనిక బత్రా, యశస్విని తొలి రౌండ్ లోనే నిష్క్రమించారు. మనిక 11-5, 3-11, 6-11, 6-11తో యి హువా హువాంగ్ (చైనీస్ తైపీ) చేతిలో, యశస్విని 11-13, 9-11, 3-11తో మివా హరిమోటో (జపాన్) చేతిలో ఓడారు. పురుషుల సింగిల్స్ తొలి రౌండ్‌లో భారత ప్లేయర్ సత్యన్ 11-7, 9-11, 11-5, 11-8తో సహచరుడు మానవ్ ఠక్కర్‌పై నెగ్గాడు. మహిళల డబుల్స్ తొలి రౌండ్‌లో యశస్విని-దియా (భారత్) ద్వయం 11-9, 7-11, 3-11, 5-11తో హీనా హయాటా-మిమా ఇటో (జపాన్) జోడీ చేతిలో ఓడిపోయింది.


బుమ్రా, కరుణ్ నాయర్

బూమ్ బూమ్ బుమ్రా

స్టార్ పేస్ బౌలర్ సుదీర్ఘ సాధన

లండన్: ఇంగ్లండ్‌తో మూడో టెస్టు కోసం భారత టాప్ పేస్ బౌలర్ జస్‌ప్రీత్ బుమ్రా సిద్ధమవుతున్నాడు. రేపటి నుంచి ప్రఖ్యాత లార్డ్స్ మైదానంలో ఈ మ్యాచ్ జరుగుతుంది. పని భారం కారణంగా ఈ సిరీస్‌లో మూడు టెస్టులే ఆడాలని నిర్ణయించుకున్న బుమ్రా బర్మింగ్‌హామ్‌లో జరిగిన రెండో టెస్టుకు దూరమయ్యాడు. ఇప్పుడు తగినంత విరామం తర్వాత పూర్తి ఫిట్‌గా మ్యాచ్‌కు అతను సన్నద్ధమయ్యాడు. టెస్టుకు రెండు రోజుల ముందు మంగళవారం బుమ్రా సుదీర్ఘ సమయం పాటు నెట్స్‌లో శ్రమించాడు. విరామం లేకుండా అతను బౌలింగ్ ప్రాక్టీస్ చేశాడు. ఆప్షనల్ ప్రాక్టీస్ రోజు కావడంతో ప్రధాన బ్యాటర్లు గిల్, రాహుల్, జైస్వాల్, పంత్‌తో పాటు సుందర్, సిరాజ్, ఆకాశ్‌దీప్ కూడా మంగళవారం సాధన చేయలేదు. దాంతో కరుణ్ నాయర్, సాయి సుదర్శన్, అభిమన్యు ఈశ్వరన్, ధ్రువ్ జురేల్‌లకు బుమ్రా బౌలింగ్ చేశాడు. వీరందరినీ తన బౌలింగ్‌తో బుమ్రా ఇబ్బంది పెట్టాడు. ఎలాంటి అసౌకర్యం లేకుండా పూర్తి రనప్‌తో అతను బౌలింగ్ చేశాడు. నెట్స్‌కు వచ్చీ రాగానే బౌలింగ్ కోచ్ మోర్నీ మోర్కెల్‌ను అడిగి తనకు కొత్త బంతి మాత్రమే కావాలని ఎంచుకున్న బుమ్రా దాంతో ప్రాక్టీస్ కొనసాగించాడు. 2021లో లార్డ్స్ టెస్టు రెండో ఇన్నింగ్స్‌లో రివర్స్ స్వింగ్‌తో మూడు కీలక వికెట్లు పడగొట్టిన బుమ్రా భారత్ ఘన విజయంలో ప్రధాన పాత్ర పోషించాడు. ఈ సారి లార్డ్స్ పిచ్ పేస్ బౌలింగ్‌కు అనుకూలంగా ఉంటుందని వినిపిస్తున్న నేపథ్యంలో అతను ఎలా చెలరేగుతాడనేది ఆసక్తికరం.

'టాప్' ర్యాంక్‌కు చేరువగా దీప్తి శర్మ



దుబాయ్: ఇంగ్లండ్‌తో జరుగుతున్న టి20 సిరీస్‌లో నిలకడగా రాణిస్తున్న భారత స్పిన్నర్ దీప్తి శర్మ... అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ (ఐసీసీ) మహిళల టి20 ర్యాంకింగ్స్‌లో అగ్ర స్థానానికి చేరువైంది. మంగళవారం విడుదల చేసిన తాజా ర్యాంకింగ్స్‌లో దీప్తి శర్మ ఒక స్థానం పురోగతి సాధించి రెండో ర్యాంక్‌కు చేరుకుంది. గత ఆరేళ్లగా టాప్-10లో కొనసాగుతున్న దీప్తి తన కెరీర్‌లో తొలిసారి టాప్ ర్యాంక్ అందుకునేందుకు దగ్గరగా వచ్చింది. ప్రస్తుతం దీప్తి ఖాతాలో 738 రేటింగ్ పాయింట్లు ఉన్నాయి. 746 పాయింట్లతో పాకిస్తాన్ బౌలర్ సాదియా ఇక్బాల్ నంబర్‌వన్ స్థానంలో ఉంది. ఇంగ్లండ్‌తో మరో రెండు టి20లు జరగాల్సి ఉన్న నేపథ్యంలో దీప్తి శర్మ విశేషంగా రాణిస్తే తదుపరి ర్యాంకింగ్స్‌లో టాప్ ర్యాంక్‌ను అందుకునే అవకాశముంది.

'హండ్రెడ్' టోర్నీకి దూరం

వచ్చే నెలలో ఇంగ్లండ్‌లో జరిగే 'హండ్రెడ్' టోర్నీ నుంచి దీప్తి శర్మ వైదొలిగింది. వర్క్‌లోడ్ మేనేజ్‌మెంట్, టీమిండియా బిజీ షెడ్యూల్ కారణంగా ఆమె ఈ నిర్ణయం తీసుకుంది. దీప్తి వైదొలిగిన నేపథ్యంలో ఈసారి 'హండ్రెడ్' టోర్నీలో భారత ప్రాతినిధ్యం ఉండటంలేదు. గత సీజన్ ఫైనల్లో దీప్తి శర్మ చివరి ఓవర్‌లో కొట్టిన సిక్స్‌తో లండన్ స్పిరిట్స్ జట్టు తొలిసారి 'హండ్రెడ్' ట్రోఫీని సొంతం చేసుకోవడం విశేషం. గత సీజన్‌లో లండన్ స్పిరిట్స్ జట్టు దీప్తి శర్మకు 36 వేల పౌండ్లు చెల్లించింది.

మరిన్ని క్రీడా వార్తలు సాక్షి ప్లస్ స్పోర్ట్స్ ఈ-పేపర్‌లో

సబలెంకా శ్రమించి...

- వింబుల్డన్ టోర్నీ సెమీస్‌లో బెలారస్ స్టార్
- 2 గంటల 54 నిమిషాలపాటు జరిగిన క్వార్టర్ ఫైనల్లో విజయం


సబలెంకా


అనిసిమోవా

లండన్: ఈ ఏడాది వరుసగా మూడో గ్రాండ్‌స్లామ్ టోర్నీలో ఫైనల్ చేరేందుకు బెలారస్ స్టార్ సబలెంకా మరో విజయం దూరంలో నిలిచింది. ఈ సంవత్సరం ఆస్ట్రేలియన్ ఓపెన్, ఫ్రెంచ్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ టోర్నీల్లో ఫైనల్‌కు చేరి రన్నరప్‌తో సరిపెట్టుకున్న సబలెంకా... అదే జోరును వింబుల్డన్ టోర్నీలోనూ కొనసాగించి ఈ టోర్నీలో మూడోసారి సెమీఫైనల్లోకి దూసుకెళ్లింది. మంగళవారం జరిగిన మహిళల సింగిల్స్ క్వార్టర్ ఫైనల్లో టాప్ సీడ్ సబలెంకా 4-6, 6-2, 6-4తో ప్రపంచ 104వ ర్యాంకర్ లౌరా సిగెమండ్ (జర్మనీ)పై కష్టపడి గెలిచింది. 2 గంటల 54 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో సబలెంకాకు 37 ఏళ్ల సిగెమండ్ నుంచి ఊహించని ప్రతిఘటన ఎదురైంది. క్వార్టర్ ఫైనల్ చేరే క్రమంలో ప్రత్యర్థులకు ఒక్క సెట్ కూడా కోల్పోని సబలెంకా ఈ మ్యాచ్‌లో తొలి సెట్‌ను చేజార్చుకుంది. అయితే రెండో సెట్‌లో తేరుకున్న సబలెంకా మూడుసార్లు ప్రత్యర్థి సర్వీస్‌ను బ్రేక్ చేసింది. సెట్‌ను 6-2తో దక్కించుకొని మ్యాచ్‌లో నిలిచింది. మూడో సెట్‌లో ఇద్దరూ నువ్వా నేనా అన్నట్లు పోరాడారు. చివరకు పదో గేమ్‌లో సిగెమండ్ సర్వీస్‌ను బ్రేక్ చేసిన సబలెంకా విజయాన్ని ఖరారు చేసుకుంది. మ్యాచ్ మొత్తంలో రెండు ఏస్‌లు సంధించిన సబలెంకా నాలుగు డబుల్ ఫాల్ట్‌లు చేసింది. నెట్ వద్దకు 43 సార్లు దూసుకొచ్చి 25 సార్లు పాయింట్లు గెలిచింది. 29 విన్నర్స్ కొట్టిన ఈ బెలారస్ స్టార్ 36 అనవసర తప్పిదాలు చేసింది. తన సర్వీస్‌ను ఆరుసార్లు కోల్పోయి ప్రత్యర్థి సర్వీస్‌ను ఎనిమిదిసార్లు బ్రేక్ చేసింది. 2021, 2023లలో వింబుల్డన్‌లో సెమీఫైనల్ చేరి ఓడిపోయిన సబలెంకా రేపు జరిగే సెమీఫైనల్లో అనిసిమోవాతో ఆడుతుంది.

తొలిసారి సెమీస్‌లో అనిసిమోవా

నాలుగోసారి వింబుల్డన్ టోర్నీలో ఆడుతున్న ప్రపంచ 12వ ర్యాంకర్ అనిసిమోవా (అమెరికా) తొలిసారి సెమీఫైనల్‌కు అర్హత సాధించింది. క్వార్టర్ ఫైనల్లో అనిసిమోవా 6-1, 7-6 (11/9)తో పావ్లీచెంకోవా (రష్యా)పై నెగ్గింది. 22వసారి గ్రాండ్‌స్లామ్ టోర్నీ ఆడిన అనిసిమోవా 2019లో ఫ్రెంచ్ ఓపెన్‌లో సెమీఫైనల్‌కు చేరుకుంది.

అల్‌కరాజ్ అలవోకగా...

పురుషుల సింగిల్స్‌లో డిఫెండింగ్ చాంపియన్ అల్‌కరాజ్ (స్పెయిన్) వరుసగా మూడో ఏడాది సెమీఫైనల్లోకి ప్రవేశించాడు. కామెరాన్ నోరి (బ్రిటన్)తో జరిగిన క్వార్టర్ ఫైనల్లో అల్‌కరాజ్ 6-2, 6-3, 6-3తో గెలుపొందాడు. 99 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో అల్‌కరాజ్ 13 ఏస్‌లు సంధించి ప్రత్యర్థి సర్వీస్‌ను ఐదుసార్లు బ్రేక్ చేశాడు. సెమీఫైనల్లో అమెరికా ప్లేయర్, ప్రపంచ ఐదో ర్యాంకర్ టేలర్ ఫ్రిట్జ్‌తో అల్‌కరాజ్ తలపడతాడు. మరో క్వార్టర్ ఫైనల్లో ఫ్రిట్జ్ 6-3, 6-4, 1-6, 7-6 (7/4)తో ఖచనోవ్ (రష్యా)పై గెలిచి తన కెరీర్‌లో తొలిసారి వింబుల్డన్‌లో సెమీఫైనల్‌కు చేరాడు.

గట్టెక్కిన సినెర్

సోమవారం అర్ధరాత్రి దాటాక జరిగిన ప్రిక్వార్టర్ ఫైనల్లో ప్రపంచ నంబర్‌వన్ యానిక్ సినెర్ (ఇటలీ)కి అదృష్టం కలిసొచ్చింది. దిమిత్రోవ్ (బల్గేరియా)తో జరిగిన మ్యాచ్‌లో సినెర్ తొలి రెండు సెట్‌లను 3-6, 5-7తో కోల్పోయాడు. మూడో సెట్‌లో స్కోరు 2-2తో సమంగా ఉన్నపుడు దిమిత్రోవ్ గాయపడ్డాడు. దాంతో దిమిత్రోవ్ ఆటను కొనసాగించలేకపోవడంతో సినెర్‌ను విజేతగా ప్రకటించారు. గత ఐదు గ్రాండ్‌స్లామ్ టోర్నీలలో దిమిత్రోవ్ గాయాల కారణంగా వైదొలగడం గమనార్హం.

దక్షిణాఫ్రికా ఘన విజయం

ఇన్నింగ్స్, 236 పరుగులతో జింబాబ్వే ఓటమి



బులవాయో: వరల్డ్ చాంపియన్ దక్షిణాఫ్రికా, జింబాబ్వే మధ్య జరిగిన టెస్టు సిరీస్‌లో ఊహించిన ఫలితమే వచ్చింది. రెండు మ్యాచ్‌ల ఈ సిరీస్‌ను సఫారీ టీమ్ 2-0తో సొంతం చేసుకుంది. మంగళవారం ముగిసిన రెండో టెస్టులో దక్షిణాఫ్రికా ఇన్నింగ్స్, 236 పరుగుల తేడాతో జింబాబ్వేపై ఘన విజయం సాధించింది. ఓవర్‌నైట్ స్కోరు 51/1తో ఆట కొనసాగించిన జింబాబ్వే తమ రెండో ఇన్నింగ్స్‌లో 77.3 ఓవర్లలో 220 పరుగులకే ఆలౌటైంది. నిక్ వెల్చ్ (55), కెప్టెన్ క్రెయిగ్ ఇర్విన్ (49), కైటానో (40) మాత్రమే కొద్దిసేపు పోరాడారు. దక్షిణాఫ్రికా బౌలర్లలో కార్బిన్ బాష్ 4 వికెట్లు పడగొట్టగా... ముత్తుసామి 3, యూసుఫ్ 2 వికెట్లు తీశారు. టెస్టుల్లో దక్షిణాఫ్రికా ఇది వరుసగా పదో విజయం. అజేయంగా 367 పరుగుల రికార్డు స్కోరు సాధించిన వియాన్ ముల్డర్ 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్'గా నిలిచాడు. ఈ టెస్టు సిరీస్ వరల్డ్ టెస్టు చాంపియన్‌షిప్ (డబ్ల్యూటీసీ)లో భాగంగా లేదు. అందుకే దక్షిణాఫ్రికా సాధించిన విజయాలకు ఎలాంటి పాయింట్లు లభించవు. ఇరు జట్ల మధ్య సోమవారం నుంచి ఐదు మ్యాచ్‌ల టి20 సిరీస్ మొదలవుతుంది.

సాక్షి సినిమా

నిశ్శబ్దాన్ని ఆస్వాదించాలి అనుకుంటున్నా!


శ్రుతీహాసన్

సోషల్ మీడియాలో ఎప్పుడూ యాక్టివ్‌గా ఉండే హీరోయిన్లలో శ్రుతీహాసన్ ముందు వరుసలో ఉంటారు. ఎప్పటికప్పుడు తన వ్యక్తిగత విషయాలతో పాటు సినిమాల షూటింగ్, వర్కౌట్స్, ఫిట్‌నెస్, ఆరోగ్యం... వంటి పలు విషయాలను అభిమానులతో పంచుకుంటూ ఉంటారామె. అయితే తాజాగా ఆమె పెట్టిన ఓ పోస్ట్ చర్చనీయాంశంగా మారింది. ''నేను కొన్ని రోజుల పాటు సోషల్ మీడియాకు దూరంగా ఉండాలనుకుంటున్నాను. నిశ్శబ్దాన్ని ఆస్వాదించాలనుకుంటున్నాను'' అంటూ ఇన్‌స్టాగ్రామ్ వేదికగా ఓ పోస్ట్ చేశారు శ్రుతి. ఆమె నిర్ణయంతో అభిమానులు షాక్‌కి గురవుతున్నారు. హఠాత్తుగా ఎందుకు ఇలాంటి నిర్ణయం తీసుకున్నారు? అంటూ పోస్టులు పెడుతున్నారు. ఇన్‌స్టాగ్రామ్‌లో ఆమెకు దాదాపు 24 మిలియన్ల ఫాలోవర్స్ ఉండటం విశేషం. ఇదిలా ఉంటే.. ఇటీవల శ్రుతీహాసన్ ఎక్స్ (ట్విట్టర్) అకౌంట్ హ్యాక్ అయిన విషయం తెలిసిందే. ఈ విషయాన్ని ఆమె స్వయంగా తెలిపారు. ఇక శ్రుతీహాసన్ నటించిన తాజా చిత్రం 'కూలీ'. రజనీకాంత్ హీరోగా లోకేశ్ కనగరాజ్ తెరకెక్కించిన ఈ సినిమా ఆగస్టు 14న విడుదల కానుంది. ఇంకా తమిళంలో 'ట్రైన్', వేరే చిత్రాలతో బిజీగా ఉన్నారామె.

రచయిత శివశక్తి దత్తా కన్నుమూత



ప్రముఖ సంగీత దర్శకుడు ఎంఎం కీరవాణి తండ్రి, పాటల రచయిత శివశక్తి దత్తా (92) కన్నుమూశారు. హైదరాబాద్‌లోని మణికొండలో ఉన్న తన నివాసంలో సోమవారం రాత్రి ఆయన తుదిశ్వాస విడిచారు. రాజమహేంద్రవరం సమీపంలోని కొవ్వూరులో 1932 అక్టోబరు 8న జన్మించారు శివశక్తి దత్తా. ఆయన అసలు పేరు కోడూరి సుబ్బారావు. చిన్నతనంలో కళలపై ఆసక్తి ఉన్న ఆయన ఇంటి నుంచి వెళ్లిపోయి ముంబైలోని ఓ ఆర్ట్స్ కాలేజీలో చేరి, డిప్లొమాలో పట్టభద్రుడు అయ్యారు. ఆ తర్వాత మళ్లీ తన స్వస్థలం కొవ్వూరుకు తిరిగి వచ్చారు. కమలేష్ అనే కలం పేరుతో చిత్రకారుడిగా కొద్ది రోజులు చేశారు. ఆ తర్వాత ఆయన తన పేరును సుబ్బారావు నుంచి శివశక్తి దత్తాగా మార్చుకున్నారు. సంగీతం పట్ల మక్కువతో గిటార్, సితార్, హార్మోనియం వంటి వాయిద్యాలను నేర్చుకున్నారాయన. అనంతరం చెన్నై వెళ్లిపోయి తన తమ్ముడు విజయేంద్ర ప్రసాద్‌తో కలిసి సినిమా రంగంలో అడుగుపెట్టారు. నాగార్జున, విజయశాంతి, జీవిత ప్రధాన పాత్రల్లో కె. రాఘవేంద్ర రావు దర్శకత్వం వహించిన 'జానకి రాముడు' (1988) సినిమాకి స్క్రీన్ రైటర్‌గా చేశారు. ఇక 'సై'లో 'నల్లా నల్లాని కళ్ల పిల్లా', 'ఛత్రపతి'కి 'మన్నేల తింటివిరా కన్నా...', 'బాహుబలి 1'కి 'మమతల తల్లి, ధీవర', 'బాహుబలి 2'లోని 'సాహోరే బాహుబలి', 'ఆర్ఆర్ఆర్'లోని 'రామం రాఘవమ్, 'హనుమాన్'కి 'అంజనాద్రి...' థీమ్ సాంగ్ వంటి పలు సినిమాల్లో పలు పాటలకు సాహిత్యం అందించారాయన. అలాగే 'చంద్రహాస్' అనే చిత్రానికి దర్శకత్వం వహించారు. శివశక్తి దత్తాకు ముగ్గురు సంతానం కీరవాణి, కల్యాణీ మాలిక్, శివశ్రీ కంచి ఉన్నారు. శివశక్తి దత్తా మృతి పట్ల పలువురు సినీ, రాజకీయ ప్రముఖులు సంతాపం తెలిపారు.

ఒక్క రోజులో జీవితం మారిపోతే..!


సాయి పల్లవి

దక్షిణాదిలో స్టార్ హీరోయిన్‌గా పేరు సంపాదించుకున్న సాయి పల్లవి నార్త్‌లోనూ సత్తా చాటాలనుకుంటున్నారు. ఈ ప్రయత్నంలో భాగంగా సాయి పల్లవి హిందీ చిత్రాలు 'ఏక్ దిన్', 'రామాయణ'లకు సైన్ చేశారు. తాజాగా 'ఏక్ దిన్' సినిమా విడుదల తేదీ ఖరారైందని, ఈ చిత్రం ఈ నవంబరు 7న విడుదల కానుందని తెలిసింది. సాయి పల్లవి కెరీర్‌లోని ఈ తొలి హిందీ చిత్రంలో బాలీవుడ్ స్టార్ ఆమిర్ ఖాన్ తనయుడు జునైద్ ఖాన్ హీరోగా నటించారు. సునీల్ పాండే దర్శకత్వంలో ఆమిర్ ఖాన్, మన్సూర్ ఖాన్ ఈ చిత్రాన్ని నిర్మించారు. 'జానే తూ... యా జానే నా' (2008) సినిమా తర్వాత ఆమిర్ ఖాన్, మన్సూర్ కలిసి 17 సంవత్సరాల తర్వాత నిర్మించిన చిత్రం 'ఏక్ దిన్' కావడం విశేషం. ఒకరితో ఒకరికి పరిచయం లేని ఓ అబ్బాయి, ఓ అమ్మాయి ఓ విచిత్రమైన పరిస్థితుల్లో కలుసుకుంటారు. ఆ ఒక్క రోజు తర్వాత వారి జీవితాలు ఏ విధంగా మారిపోయాయి? అన్నదే 'ఏక్ దిన్' సినిమా కథాంశమని సమాచారం. మరోవైపు నితీష్ తివారి 'రామాయణ' సినిమాలో సీతగా నటిస్తున్నారు సాయి పల్లవి. రాముడి పాత్రలో రణ్‌బీర్ కపూర్, రావణుడిగా యశ్ నటిస్తున్నారు. ఈ చిత్రం రెండు భాగాలుగా విడుదల కానుంది. తొలి భాగం 2026 దీపావళికి, రెండో భాగం 2027 దీపావళికి రిలీజ్ కానున్నాయి.

అయోత్తి రీమేక్‌లో?


నాగార్జున

తమిళ హీరో ధనుష్‌తో కలిసి నాగార్జున చేసిన 'కుబేర' సినిమా ఈ జూన్ 20న విడుదలై, సూపర్ హిట్‌గా నిలిచింది. రజనీకాంత్ హీరోగా నటించిన 'కూలీ' సినిమాలో నాగార్జున విలన్‌గా నటించగా, ఈ చిత్రం ఆగస్టు 14న విడుదల కానుంది. అలాగే నాగార్జున వందో సినిమా పనులు తమిళ దర్శకుడు ఆర్.ఎ. కార్తీక్‌తో జరుగుతున్నాయి. కాగా తాజాగా శశికుమార్ ప్రధాన పాత్రలో నటించిన తమిళ చిత్రం 'అయోత్తి' పట్ల నాగార్జున ఆసక్తిగా ఉన్నారట. 2023లో విడుదలై, ప్రేక్షకులను మెప్పించిన ఈ సినిమాను తెలుగులో రీమేక్ చేయాలని నాగార్జున ప్లాన్ చేస్తున్నారని సమాచారం. ఒకవేళ ఈ రీమేక్ వార్త నిజమే అయితే ఈ సినిమాలో ఆయనే హీరోగా నటిస్తారా? లేక నిర్మాణం వరకే పరిమితమవుతారా? అనేది చూడాలి. ఇక 'అయోత్తి' కథ విషయానికి వస్తే... ఉత్తరప్రదేశ్‌లోని అయోధ్యలో జీవించే బలరాం తీర్థ యాత్ర కోసం తమిళనాడులోని రామేశ్వరానికి వెళతాడు. కానీ అనుకోకుండా జరిగిన ప్రమాదంలో బలరాం భార్య జానకి, కూతురు శివానీ గాయపడతారు. చికిత్స తీసుకుంటూనే జానకి మరణిస్తుంది. దీంతో జానకి మృతదేహాన్ని అయోధ్యకు తీసుకెళ్లాలని బలరాం అనుకుంటాడు. కానీ అతనికి అనుకోని సమస్యలు వస్తాయి. ఆ సమస్యలను ఎదుర్కొని, అబ్దుల్ మాలిక్ అనే వ్యక్తి సాయంతో జానకి మృతదేహాన్ని అయోధ్యకు బలరాం ఎలా తీసుకుని వెళ్లాడన్నదే 'అయోత్తి' సినిమా.

రాజా సాబ్‌తో స్టెప్పులు?


తమన్నా

హీరోయిన్ తమన్నాది డిఫరెంట్ స్టైల్. ఒకవైపు హీరోయిన్‌గా సినిమాలు చేస్తూనే, మరోవైపు వీలు కుదిరినప్పుడల్లా ఇతర సినిమాల్లో స్పెషల్ సాంగ్స్‌లో సూపర్బ్‌గా డ్యాన్స్ చేస్తూ, అందుకు తగ్గట్టుగా భారీ పారితోషికం అందుకుంటుంటారు. ఇప్పటికే తమన్నా పదికి పైగా స్పెషల్ సాంగ్స్ చేశారు. 2023లో వచ్చిన రజనీకాంత్ 'జైలర్' సినిమాలో 'నువ్.. కావాలయ్యా..', 2024లో శ్రద్ధా కపూర్-రాజ్‌కుమార్ రావుల 'స్త్రీ 2' చిత్రంలో 'ఆజ్ కీ రాత్' సాంగ్స్‌లో తమన్నా అదిరిపోయే స్టెప్పులు ప్రేక్షకులను అలరించాయి. ప్రేక్షకుల దృష్టిని ఆకర్షించడానికి ఈ పాటలు బాగా ఉపయోగపడ్డాయి. తాజాగా తమన్నా మరో స్పెషల్ సాంగ్‌కు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారని ఫిల్మ్‌నగర్ సమాచారం. ప్రభాస్ హీరోగా మారుతి దర్శకత్వంలో రూపొందుతున్న హారర్ కామెడీ అండ్ ఫ్యాంటసీ సినిమా 'ది రాజా సాబ్'. ఈ సినిమాలోని ఓ స్పెషల్ సాంగ్‌లో ప్రభాస్‌తో కలిసి తమన్నా డ్యాన్స్ చేయనున్నారట. ఈ చిత్రానికి తమన్ సంగీతదర్శకుడు. టీజీ విశ్వప్రసాద్ నిర్మిస్తున్న ఈ చిత్రం డిసెంబరు 5న విడుదల కానుంది.

త్వరలో హెచ్చరిక

సన్నీ అఖిల్, అజయ్ ఘోష్, రవి కాలే, 'శుభలేఖ' సుధాకర్, షాయాజీ షిండే, 'శంకరాభరణం' తులసి ముఖ్య తారలుగా నటించిన చిత్రం 'పోలీస్‌వారి హెచ్చరిక'. బాబ్జీ దర్శకత్వంలో బెల్లి జనార్దన్ నిర్మించిన ఈ సినిమా ఈ నెల 18న విడుదల కానుంది. ఈ చిత్రం ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌లో నిర్మాత కేఎల్ దామోదర్ ప్రసాద్, నటి ఇంద్రజ మాట్లాడుతూ– ''మేమంతా ఇక్కడికి వచ్చామంటే కారణం బాబ్జీ మీద ఉన్న గౌరవం. ఈ సినిమా మంచి విజయం సాధించాలి'' అన్నారు. ''ఈ చిత్రంలో అన్ని వాణిజ్య అంశాలు ఉన్నాయి'' అన్నారు 'శుభలేఖ' సుధాకర్. ''ఈ సినిమాకు ప్రేక్షకాదరణ లభిస్తుందనుకుంటున్నాను'' అని దర్శకుడు సముద్ర నమ్మకం వ్యక్తం చేశారు. ''మా సినిమాని అందరూ చూసి మంచి విజయాన్ని అందించాలి'' అన్నారు బెల్లి జనార్ధన్. బాబ్జీ మాట్లాడుతూ– ''సినిమాల కోసం పని చేసేవారు తాము చేసిన చిత్రం విడుదలైన ప్రతిసారీ పుడుతూనే ఉంటారు. సినిమా కోసమే పుట్టామని భావిస్తారు. మా 'పోలీస్ వారి హెచ్చరిక'ని ఆదరించాలి'' అని పేర్కొన్నారు.


ఇంద్రజ, సన్నీ అఖిల్, బాబ్జీ

ప్రతి ఒక్కరికీ కనెక్ట్ అవుతోంది - సిద్ధార్థ్


శ్రీ గణేశ్, దేవయాని, సిద్ధార్థ్, చైత్ర

''మా '3 బీహెచ్‌కే' చిత్రానికి ప్రేక్షకుల నుంచి అద్భుతమైన స్పందన వస్తోంది. ఒక క్లాసిక్ మూవీకి ఉండాల్సిన క్వాలిటీస్ అన్నీ ఇందులో ఉన్నాయి. ఈ సినిమాలో భాగమవడం గర్వంగా ఉంది'' అని హీరో సిద్ధార్థ్ తెలిపారు. శ్రీ గణేశ్ దర్శకత్వంలో సిద్ధార్థ్ హీరోగా తెలుగు-తమిళ భాషల్లో రూపొందిన చిత్రం '3 బీహెచ్‌కే'. శరత్‌కుమార్, దేవయాని, యోగిబాబు, మీతా రఘునాథ్, చైత్ర కీలక పాత్రధారులు. అరుణ్ విశ్వ నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 4న విడుదలైంది. తెలుగులో మైత్రీ డిస్ట్రిబ్యూషన్ సంస్థ విడుదల చేసింది. ఈ సందర్భంగా మంగళవారం నిర్వహించిన థ్యాంక్స్ మీట్‌లో సిద్ధార్థ్ మాట్లాడుతూ– ''ఈ కథ ప్రతి ఒక్కరికీ కనెక్ట్ అవుతోంది. ఫస్ట్ వీక్ తర్వాత మంచి క్రౌడ్ చూడడం అందమైన అనుభూతి'' అన్నారు. ''తెలుగు ప్రేక్షకులు మంచి సినిమాని ఆదరిస్తారని మా సినిమాతో మరోసారి రుజువైంది'' అన్నారు దేవయాని. శ్రీ గణేశ్ మాట్లాడుతూ– ''నాకు తెలుగు సినిమాలంటే చాలా ఇష్టం. రాజమౌళి, త్రివిక్రమ్, సుకుమార్‌గార్ల వర్క్ ఇష్టం... వారి నుంచి నేను స్ఫూర్తిని పొందాను. మా సినిమాకి సపోర్ట్ చేసిన అందరికీ ధన్యవాదాలు'' అని తెలిపారు. ''మా సినిమాకి తమిళ్‌తో పాటు తెలుగులోనూ అద్భుత స్పందన రావడం ఆనందాన్నిచ్చింది'' అని అరుణ్ విశ్వ పేర్కొన్నారు. సంగీత దర్శకుడు అమృత్ రామనాథ్ మాట్లాడారు.

సాక్షి బిజినెస్
బుధవారం
9-7-2025

స్టాక్ మార్కెట్లు (తొలి రెండు రాత్రి 11.30 గంటలకు)

దేశీ సూచీలు

సెన్సెక్స్ ▲	నిఫ్టీ ▲
270	61
83,713	25,523

విదేశీ సూచీలు

సూచీ	విలువ		మార్పు
నాస్‌డాక్	20,433	▲	20
డోజోన్స్	42,244	▲	163
ఎఫ్‌టీఎస్‌ఈ 100	8,854	▲	48
డాక్స్	24,207	▲	133
షాంఘై	3,497	▲	24
నికాయ్	39,689	▲	101

• అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

ఫారెక్స్ రేట్లు రూ.లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	85.30	86.32
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	115.60	118.51
€	యూరో	ఎస్‌బీఐ	99.43	102.17
¥	జపాన్ యెన్ (100)	ఎస్‌బీఐ	58.00	59.50
AU$	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	55.06	57.27
S$	సింగపూర్ డాలర్	థామస్‌కుక్	64.61	69.30
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	21.95	23.46
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	22.44	24.22
¥	చైనా యువాన్	థామస్‌కుక్	11.07	12.89

మళ్లీ మొబైల్ బిల్లుల మోత!



- ఈసారి 12% వరకు టారిఫ్‌లు అప్
- డేటా వినియోగం ఆధారంగా బహుళ స్థాయిల్లో పెంపు
- ఈ ఏడాది ఆఖరు నాటికి అమలు

టెలికం యూజర్లు పెరుగుతున్న నేపథ్యంలో టెల్కోలు మరో విడత చార్జీల వడ్డనకు సిద్ధమవుతున్నాయి. ఈ ఏడాది ఆఖరు నాటికి 10–12 శాతం మేర పెంచే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది. మధ్యస్థంగాను, అధిక మొత్తంలోను చెల్లించే వర్గాలు టార్గెట్‌గా ఈ పెంపు ఉండవచ్చని సంబంధిత వర్గాలు తెలిపాయి. గతేడాది జులైలోనే బేస్ ప్లాన్లను 11–23 శాతం పెంచేసినందున, ఈసారి వాటి జోలికెళ్లకుండా డేటా అస్త్రాన్ని వాడుకోవాలనే యోచనలో కంపెనీలు ఉన్నట్లు పేర్కొన్నాయి. బేస్ ప్లాన్లను మళ్లీ పెంచితే యూజర్లు.. ప్రత్యర్థి కంపెనీకి మారిపోయే అవకాశాలు ఉండటమే ఇందుకు కారణం. కాబట్టి ఈసారి డేటా ప్రయోజనాలను తగ్గించేసి, మరింత ఖరీదైన ప్లాన్ల వైపు మళ్లించేలా ఈ విడత పెంపు ఉండబోతోందని సంబంధిత వర్గాలు వివరించాయి. డేటా వినియోగం, డేటా స్పీడ్ లేదా డేటాను అత్యధికంగా వినియోగించే వేళలకు వర్తించే విధంగా ఈ పెంపు ఉండొచ్చనే అంచనాలు నెలకొన్నాయి. టారిఫ్‌ల స్వరూపం మారాల్సిన అవసరం ఉందంటూ ఎయిర్‌టెల్, వొడాఫోన్ ఐడియా టాప్ మేనేజ్‌మెంట్ ఇటీవల చేసిన వ్యాఖ్యలు కూడా చార్జీల పెంపు వార్తలకు ఊతమిస్తున్నాయి. అందరికీ ఒకే రకం టారిఫ్‌ను వర్తింపచేయడమనేది సరి కాదంటూ ఎయిర్‌టెల్ ఎండీ గోపాల్ విఠల్ ఈ మధ్య వ్యాఖ్యానించారు. ఇటు వినియోగదారులు, అటు కస్టమర్లు బండిల్డ్ ప్లాన్లకు అప్‌గ్రేడ్ కావడం వల్ల దేశీ టెలికం పరిశ్రమ ఆదాయ వృద్ధి 2025–27 ఆర్థిక సంవత్సరాల్లో రెండంకెల స్థాయిలో ఉండొచ్చని అంచనా వేస్తున్నట్లు బీఎన్‌పీ పారిబా ఒక నివేదికలో తెలిపింది.

యాక్టివ్ యూజర్ల వృద్ధి..

మే నెలలో యాక్టివ్ యూజర్ల సంఖ్య 29 నెలల గరిష్టమైన 74 లక్షలకు ఎగియడంతో మొత్తం యాక్టివ్ యూజర్ల సంఖ్య 108 కోట్లకు చేరింది. దీనితో వరుసగా అయిదు నెలల పాటు కొత్త యూజర్ల సంఖ్య పెరిగినట్లయింది. మే నెలలో రిలయన్స్ జియో ఇన్ఫోకామ్ కొత్త యూజర్ల సంఖ్య 55 లక్షలు పెరిగింది. దీంతో జియో యాక్టివ్ యూజర్ల సంఖ్య 150 బేసిస్ పాయింట్లు (సుమారు 1.5 శాతం) పెరిగి, పరిశ్రమవ్యాప్తంగా మొత్తం యాక్టివ్ యూజర్లలో వాటా 53 శాతానికి చేరింది. అటు భారతి ఎయిర్‌టెల్ కొత్త యూజర్ల సంఖ్య 13 లక్షలు పెరిగింది. మొత్తం యాక్టివ్ యూజర్లలో ఎయిర్‌టెల్ వాటా 36 శాతానికి పెరిగింది. రాబోయే రోజుల్లో 5జీ సేవల విస్తరణ, వినియోగం ఆధారంగా కొత్త కనెక్షన్లు ఉంటాయని పరిశ్రమ వర్గాలు తెలిపాయి. జియోలాంటి టాప్ ఆపరేటర్ల యూజర్లు పెరగడమనేది భవిష్యత్తులో టారిఫ్‌ల పెంపునకు సానుకూల పరిస్థితులున్నట్లుగా కనిపిస్తోందని బ్రోకరేజ్ సంస్థ జెఫ్రీస్ పేర్కొంది. వొడాఫోన్ ఐడియా యూజర్లు తగ్గిపోయే కొద్దీ ఎయిర్‌టెల్, జియోల మార్కెట్ వాటా మరింతగా పెరుగుతుందని తెలిపింది.

– సాక్షి, బిజినెస్‌డెస్క్



భారతి సిమెంట్‌కు ఎస్‌డీఎఫ్ 5 స్టార్ రేటింగ్

సుస్థిర అభివృద్ధి ఫ్రేమ్‌వర్క్ (ఎస్‌డీఎఫ్) కింద 2023–24 ఏడాదికి గాను భారతి సిమెంట్ సున్నపు గనికి వరుసగా ఆరో ఏడాది కేంద్ర గనుల శాఖ నుంచి 5 స్టార్ రేటింగ్ దక్కింది. జైపూర్‌లో జరిగిన కార్యక్రమంలో కేంద్ర గనులు, బొగ్గు శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి చేతుల మీదుగా కంపెనీ సీఎంవో ఎం సాయి రమేశ్, హెడ్ (మైన్స్) కె. సుధాకర్ పురస్కార పత్రాలను అందుకున్నారు.

క్యాప్‌జెమిని చేతికి డబ్ల్యూఎన్‌ఎస్

డీల్ విలువ రూ. 28,250 కోట్లు

సొంత అవసరాల కోసం దేశీయంగా మూడు దశాబ్దాల క్రితం బ్రిటిష్ ఎయిర్‌వేస్ నెలకొల్పిన డబ్ల్యూఎన్‌ఎస్ చివరికి ఫ్రెంచ్ దిగ్గజం క్యాప్‌జెమిని చేతికి చిక్కింది. బిజినెస్ ప్రాసెస్ మేనేజ్‌మెంట్(బీపీఎం) సంస్థ డబ్ల్యూఎన్‌ఎస్‌ను 330 కోట్ల డాలర్ల(సుమారు రూ. 28,250 కోట్లు) నగదు చెల్లింపు ద్వారా క్యాప్‌జెమిని సొంతం చేసుకోనుంది.

బీపీఎం రంగంలో భారీ డీల్‌కు తెరతీస్తూ టెక్నాలజీ సేవల గ్లోబల్ దిగ్గజం క్యాప్‌జెమిని.. డబ్ల్యూఎన్‌ఎస్‌ను కొనుగోలు చేస్తోంది. ఒక్కో షేరుకీ 76.5 డాలర్లు చొప్పున ఆఫర్ చేసింది. ఇది గురువారం ముగింపు(ఎన్‌వైఎస్‌ఈ) ధరతో పోలిస్తే 17 శాతం అధికంకాగా.. నెల రోజుల సగటు ధరతో చూస్తే 27 శాతం ప్రీమియం చెల్లిస్తోంది. ఇందుకు నగదు రూపేణా మొత్తం 3.3 బిలియన్ డాలర్లు వెచ్చించనుంది. వెరసి బీపీఎం విభాగంలో అతిపెద్ద డీల్స్‌లో ఒకటిగా ఇది నిలవనుంది. తాజా డీల్‌కు రెండు సంస్థల బోర్డులు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చినట్లు క్యాప్‌జెమిని వెల్లడించింది. రెండు కంపెనీలూ భారత్‌లో పటిష్ట కార్యకలాపాలు విస్తరించాయి. సంయుక్తంగా 2,00,000 మంది సిబ్బందిని కలిగి ఉన్నాయి. తాజా కొనుగోలుతో తమ క్లయింట్లకు బిజినెస్, టెక్నాలజీ ట్రాన్స్‌ఫార్మేషన్ కార్యకలాపాలను క్యాప్‌జెమిని.. మరింత సమర్థవంతంగా సమకూర్చగలుగుతుంది. సంప్రదాయ బిజినెస్ ప్రాసెస్ సర్వీసుల నుంచి ఆధునిక ఏఐ ఆధారిత మేథో కార్యకలాపాలను క్యాప్‌జెమిని అందించగలుగుతుంది.



డబ్ల్యూఎన్‌ఎస్ నేపథ్యమిదీ...

1999లో బ్రిటిష్ ఎయిర్‌వేస్ ముంబైలో సొంత అవసరాల కోసం డబ్ల్యూఎన్‌ఎస్‌ను నెలకొల్పింది. పుణేలో డెలివరీ సెంటర్‌ను ఏర్పాటు చేసింది. 2002లో వార్‌బర్గ్ పింకస్ 40 కోట్ల డాలర్లకు మెజారిటీ వాటా కొనుగోలు చేసి కంపెనీ పేరును డబ్ల్యూఎన్‌ఎస్‌గా మార్చింది. 2006లో ఎన్‌వైఎస్‌ఈలో లిస్ట్ చేసింది. 2013లో వార్‌బర్గ్ పింకస్ 19.2 కోట్ల డాలర్లకు డబ్ల్యూఎన్‌ఎస్‌ను విక్రయించింది. కంపెనీ ప్రధానంగా బిజినెస్ ప్రాసెస్ ఔట్‌సోర్సింగ్‌తోపాటు.. డేటా అనలిటిక్స్ సర్వీసులు అందిస్తోంది. 2025లో 1.27 బిలియన్ డాలర్ల ఆదాయం సాధించింది.

'సాక్షి ప్లస్' ఈ-పేపర్‌లో ..

6 కంపెనీల ఐపీవోలకు సెబీ ఓకే | క్రిటికల్ మినరల్స్‌పై జాతీయ విధానం అవసరం

బ్యాంక్ ఆఫ్ ఇండియా 'మినిమం' చార్జీల ఎత్తివేత

- విద్యా, గృహ, వాహన రుణ రేట్లు తగ్గింపు
- సేవింగ్స్ డిపాజిట్‌పై రేటు 2.5 శాతం



ముంబై: ప్రభుత్వరంగ బ్యాంక్ ఆఫ్ ఇండియా (బీవోఐ) సేవింగ్స్ ఖాతాలకు సంబంధించి కనీస నిల్వ(మినిమం బ్యాలెన్స్) పెనాల్టీ చార్జీలను పూర్తిగా ఎత్తివేస్తున్నట్టు ప్రకటించింది. అలాగే, కొన్ని రకాల డిపాజిట్లు, రుణ రేట్లను సైతం సవరించింది. 999 రోజులకు సంబంధించి గ్రీన్ డిపాజిట్‌పై వడ్డీ రేటును 7% నుంచి 6.7 శాతానికి తగ్గించింది. రూ.లక్ష నుంచి రూ.10 కోట్ల మధ్య డిపాజిట్లకు ఈ రేటు అమలవుతుంది. సేవింగ్స్ ఖాతాలోని డిపాజిట్లపై రేటును 2.7% (వార్షిక) నుంచి 2.5 శాతానికి తగ్గించింది. ఇక గృహ రుణ రేటును 50 బేసిస్ పాయింట్లు తగ్గిస్తున్నట్టు ప్రకటించింది. ఇప్పటికే తీసుకున్న గృహ రుణాలతోపాటు కొత్తగా తీసుకునే గృహ రుణాలకు ఇది అమలవుతుందని తెలిపింది. సవరణ తర్వాత గృహ రుణాలపై వడ్డీ రేటు 7.35% నుంచి ప్రారంభమవుతుంది. రుణ గ్రహీత సిబిల్ స్కోరు ఆధారంగా ఈ రేటు మారుతుంది. ప్రతిష్టాత్మక ఉన్నత విద్యా సంస్థల్లో ప్రవేశాలు పొందేవారికి 7.5% రేటుకే విద్యా రుణాలను ఆఫర్ చేస్తున్నట్టు ప్రకటించింది. వాహన రుణాలపైనా అర శాతం రేటు తగ్గించినట్టు తెలిపింది. ఈ నిర్ణయాలు ఈ నెల 7 నుంచే అమల్లోకి వచ్చినట్టు పేర్కొంది. ఇప్పటికే ఎస్‌బీఐ, పీఎన్‌బీ, ఇండియన్ బ్యాంక్ సైతం సేవింగ్స్ ఖాతాలకు సంబంధించి కనీస బ్యాలన్స్ పెనాల్టీ చార్జీలను ఎత్తివేస్తున్నట్టు ప్రకటించడం గమనార్హం.

చివర్లో కొనుగోళ్లు

- సెన్సెక్స్ లాభం 270 పాయింట్లు
- మళ్లీ 25,500 స్థాయిపైకి నిఫ్టీ



ముంబై: ట్రేడింగ్ చివర్లో బ్యాంకులు, ఐటీ షేర్లకు కొనుగోళ్ల మద్దతు లభించడంతో స్టాక్ సూచీలు మంగళవారం లాభాలతో ముగిశాయి. ఆసియా మార్కెట్లలోని సానుకూల సంకేతాలు కలిసొచ్చాయి. ఫలితంగా సెన్సెక్స్ 270 పాయింట్లు పెరిగి 83,713 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 61 పాయింట్లు బలపడి 25,523 వద్ద నిలిచింది. ఉదయం స్వల్ప లాభాలతో మొదలైన సూచీలు రోజంతా పరిమిత శ్రేణిలో ట్రేడయ్యాయి. అమెరికా–భారత్ వాణిజ్య చర్చల నేపథ్యంలో ఇన్వెస్టర్లు ఆచితూచి వ్యవహరించారు. సెన్సెక్స్ 491 పాయింట్ల పరిధిలో 83,321 వద్ద కనిష్టాన్ని, 83812 వద్ద గరిష్టాన్ని తాకింది. నిఫ్టీ 25,424 – 25,548 శ్రేణిలో కదలాడింది. క్రూడాయిల్ ధరలు దిగిరావడం, ఆరు ప్రధాన కరెన్సీ విలువలతో పోలిస్తే డాలర్ ఇండెక్స్ బలహీనపడడంతో డాలర్ మారకంలో రూపాయి విలువ 21 పైసలు బలపడి 85.73 వద్ద స్థిరపడింది. యూరప్ మార్కెట్లు అరశాతం లాభాల్లో ముగిశాయి. అమెరికా సూచీలు స్వల్ప నష్టాల్లో ట్రేడవుతున్నాయి.

- కంపెనీ తొలి త్రైమాసిక వ్యాపార అప్‌డేట్ ఇన్వెస్టర్లను నిరాశపరచడంతో టైటాన్ కంపెనీ షేరు 6% నష్టపోయి రూ.3,441 వద్ద స్థిరపడింది. ఇంట్రాడేలో ఆరున్నర శాతం క్షీణించి రూ.3,435 వద్ద కనిష్టాన్ని తాకింది. షేరు పతనంతో కంపెనీ మార్కెట్ విలువ రూ.20,086 కోట్లు కోల్పోయి రూ.3.05 లక్షల కోట్లకు దిగివచ్చింది. సెన్సెక్స్, నిఫ్టీల్లో అత్యధికంగా నష్టపోయి షేరు ఇదే.

భవిత

స్పర్ధయా వర్ధతే విద్య

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన
ఈ- మెయిల్ sakshieducation@gmail.com

నేటి భవిత ఈ పేపర్‌లో..
» సివిల్స్, గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం- భారతదేశ చరిత్ర » టెట్/డీఎస్సీ ప్రత్యేకం-బయాలజీ
» గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం-జనరల్ స్టడీస్-జాగ్రఫీ » బ్యాంక్ ఎగ్జామ్స్ ప్రత్యేకం-ఇంగ్లిష్



ఇండియన్ నేవీలో అగ్నివీర్ ఎంఆర్ మ్యూజిషియన్

ఇండియన్ నేవీలో అగ్నివీర్(ఎంఆర్ మ్యూజిషియన్)-02/2025 బ్యాచ్ నియామకాలకు అవివాహిత పురుషులు, మహిళా అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది.

» **అర్హత:** కనీసం 50 శాతం మార్కులతో పదో తరగతి ఉత్తీర్ణులై ఉండాలి. భారతీయ లేదా విదేశీ వాద్యాలలో ప్రావీణ్యం కలిగి ఉండాలి. గుర్తింపు పొందిన సంగీత సంస్థల నుంచి సర్టిఫికేట్‌లు లేదా పోటీలలో పాల్గొన్న/అవార్డు పొందిన సర్టిఫికేట్‌లు ఉండాలి.
» **వయసు:** 01.09.2004 నుంచి 29.02.2008 మధ్య జన్మించిన వారు మాత్రమే అర్హులు.
» **వేతనం:** మొదటి ఏడాది నెలకు రూ.30,000, నాలుగో ఏడాది రూ.40,000+ఇతర అలవెన్సులు చెల్లిస్తారు.
» **ఎంపిక విధానం:** పదో తరగతి మార్కుల ఆధారంగా, సంగీత సర్టిఫికేట్‌ల ఆధారంగా షార్ట్‌లిస్టింగ్, శారీరక దారుఢ్య పరీక్ష, మెడికల్ ఎగ్జామినేషన్, మ్యూజిక్ ఎబిలిటీ టెస్ట్‌లో ప్రదర్శన ఆధారంగా తుది మెరిట్ జాబితా ఆధారంగా ఎంపికచేస్తారు. తుది ఎంపికైనవారు ఐఎన్‌ఎస్ చిల్కా, ఒడిశాలో ప్రీ-ఎన్రోల్మెంట్ మెడికల్‌లో ఉత్తీర్ణులవ్వాలి.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 13.07.2025
» **వెబ్‌సైట్:** www.joinindiannavy.gov.in

డీఆర్‌డీవో హైదరాబాద్‌లో వివిధ పోస్టులు

హైదరాబాద్‌లోని డిఫెన్స్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ ఆర్గనైజేషన్(డీఆర్‌డీవో) వివిధ ఉద్యోగాల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** ప్రాజెక్ట్ స్టోర్ ఆఫీసర్(పీఎస్‌వో)-01, ప్రాజెక్ట్ సీనియర్ అడ్మిన్ అసిస్టెంట్(పీఎస్‌ఏఏ)-01, ప్రాజెక్ట్ అడ్మిన్ అసిస్టెంట్(పీఏఏ)-01.
» **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో బీఏ/బీకాం/బీఎస్సీ/బీసీఏలో ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
» **వయసు:** ప్రాజెక్ట్ స్టోర్ ఆఫీసర్‌కు 50 ఏళ్లు, ప్రాజెక్ట్ సీనియర్ అడ్మిన్ అసిస్టెంట్‌కు 45 ఏళ్లు, ప్రాజెక్ట్ అడ్మిన్ అసిస్టెంట్‌కు 35 ఏళ్లు మించకూడదు.
» **వేతనం:** నెలకు ప్రాజెక్ట్ స్టోర్ అసిస్టెంట్‌కు రూ.59,276, ప్రాజెక్ట్ సీనియర్ అడ్మిన్ అసిస్టెంట్‌కు రూ.47,496, ప్రాజెక్ట్ అడ్మిన్ అసిస్టెంట్‌కు రూ.35,220.
» **ఎంపిక విధానం:** ఇంటర్వ్యూ ఆధారంగా.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 26.07.2025
» **వెబ్‌సైట్:** https://drdo.gov.in

ఎన్‌డీఎంఏ, న్యూఢిల్లీలో కన్సల్టెంట్ పోస్టులు

న్యూఢిల్లీలో నేషనల్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ అథారిటీ(ఎన్‌డీఎంఏ).. ఒప్పంద ప్రాతిపదికన కన్సల్టెంట్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 05.
» **పోస్టుల వివరాలు:** సీనియర్ కన్సల్టెంట్(లైటింగ్ అండ్ రిలేటెడ్ హజార్డ్)-01, సీనియర్ కన్సల్టెంట్(కమ్యూనికేషన్ అండ్ అవేర్‌నెస్)-01, సీనియర్ కన్సల్టెంట్(ప్రోగ్రామ్ మేనేజ్‌మెంట్, మానిటరింగ్ అండ్ ఎవల్యూషన్)-01, యంగ్ కన్సల్టెంట్(లైటింగ్ హజార్డ్ మేనేజ్‌మెంట్ యూనిట్)-02.
» **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో పీజీ, పీజీ డిప్లొమా, ఎంబీఏలో ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
» **గరిష్ఠ వయో పరిమితి:** సీనియర్ కన్సల్టెంట్‌కు 50నుంచి 62ఏళ్లు,యంగ్ కన్సల్టెంట్‌కు 35ఏళ్లు
» **వేతనం:** నెలకు సీనియర్ కన్సల్టెంట్‌కు రూ.1,25,000, యంగ్ కన్సల్టెంట్‌కు 35,000.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 23.07.2025
» **వెబ్‌సైట్:** https://ndma.gov.in

ఎయిమ్స్ గోరఖ్‌పూర్‌లో నాన్ ఫ్యాకల్టీ పోస్టులు

ఆల్ ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్(ఎయిమ్స్) గోరఖ్‌పూర్‌లో డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ ప్రాతిపదికన నాన్ ఫ్యాకల్టీ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 09.
» **పోస్టుల వివరాలు:** అసిస్టెంట్ నర్సింగ్ సూపరింటెండెంట్-01, చైల్డ్ సైకాలజిస్ట్-01, మెడికల్ ఆఫీసర్-03, మెడికల్ ఫిజిసిస్ట్-04.
» **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో బీఎస్సీ నర్సింగ్, ఎంఏ, ఎంఎస్సీ, పీహెచ్‌డీ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
» **వయసు:** 21 నుంచి 35 ఏళ్లు ఉండాలి.
» **ఎంపిక విధానం:** ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 04.08.2025.
» **వెబ్‌సైట్:** https://aiimsgorakhpur.edu.in

నాల్కో భువనేశ్వర్‌లో 32 మేనేజర్ పోస్టులు

భువనేశ్వర్‌లోని నేషనల్ అల్యూమినియం కంపెనీ లిమిటెడ్(ఎన్‌ఏఎల్‌సీవో) వివిధ విభాగాల్లో డిప్యూటీ జనరల్ మేనేజర్, సీనియర్ మేనేజర్, డిప్యూటీ మేనేజర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 32.
» **పోస్టుల వివరాలు:** డిప్యూటీ మేనేజర్-29, డిప్యూటీ జనరల్ మేనేజర్-02, సీనియర్ మేనేజర్-01.
» **విభాగాలు:** ఫైనాన్స్, హెచ్ఆర్‌డీ, లా, సర్వే, మైనింగ్, ఎన్విరాన్‌మెంట్, కోల్ మైనింగ్, సేఫ్టీ, జియాలజీ.
» **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో డిగ్రీ, సీఏ, పీజీ, పీజీ డిప్లొమా, ఎల్ఎల్‌బీ, ఎంఎస్సీ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
» **వయసు:** 11.08.2025 నాటికి 35 నుంచి 48 ఏళ్లు ఉండాలి.
» **వేతనం:** నెలకు డిప్యూటీ జనరల్ మేనేజర్‌కు రూ.1,00,000, సీనియర్ మేనేజర్‌కు రూ.80,000 నుంచి రూ.2,20,000, డిప్యూటీ మేనేజర్‌కు రూ.60,000 నుంచి రూ.50,500.
» **ఎంపిక విధానం:** సీబీటీ పరీక్ష, పర్సనల్ ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభతేది:** 11.07.2025.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 11.08.2025
» **వెబ్‌సైట్:** https://mudira.nalcoindia.co.in

కేంద్రంలో జూనియర్ ఇంజనీర్

కేంద్ర ప్రభుత్వ ఉద్యోగ నియామకాల సంస్థ.. స్టాఫ్ సెలక్షన్ కమిషన్(ఎస్ఎస్‌సీ) నిరుద్యోగులకు తీపి కబురు అందించింది. కేంద్ర ప్రభుత్వ విభాగాలు/సంస్థల్లో గ్రూప్ బీ (నాన్ గెజిటెడ్), నాన్ మినిస్టీరియల్ పోస్టులను భర్తీ చేయనుంది. మొత్తం 1,340 జూనియర్ ఇంజనీర్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది. కంప్యూటర్ బేస్డ్ టెస్ట్ ద్వారా ఎంపిక ప్రక్రియ చేపట్టనున్నట్లు తెలిపింది. ఈ నేపథ్యంలో.. ఎస్ఎస్‌సీ జూనియర్ ఇంజనీర్ ఎగ్జామినేషన్-2025 ద్వారా భర్తీ చేసే పోస్టులు, దరఖాస్తుకు అర్హతలు, వేతనాలు, ఎంపిక ప్రక్రియ, పరీక్ష విధానం, సిలబస్ అంశాలు, ప్రిపరేషన్ తదితర వివరాలు..

» 1340 జూనియర్ ఇంజనీర్ పోస్టులకు నోటిఫికేషన్
» ఇంజనీరింగ్ డిప్లొమా, బీటెక్ ఉత్తీర్ణులు అర్హులు
» కంప్యూటర్ బేస్డ్ టెస్ట్ ద్వారా ఎంపిక ప్రక్రియ



ఇంజనీరింగ్ డిప్లొమా, ఇంజనీరింగ్ డిగ్రీ ఉత్తీర్ణులకు ఎస్ఎస్‌సీ విడుదల చేసిన జూనియర్ ఇంజనీర్(సివిల్, మెకానికల్, ఎలక్ట్రికల్) ఎగ్జామినేషన్ నోటిఫికేషన్ చక్కటి అవకాశం. అభ్యర్థులు రాత పరీక్షలో ప్రతిభ చూపడం ద్వారా.. బీఆర్‌వో, బ్రహ్మపుత్రా బోర్డ్, సీపీడబ్ల్యూడీ, సెంట్రల్ వాటర్ అండ్ పవర్ రీసెర్చ్ స్టేషన్, డీజీక్యూఏ-నావెల్, ఫరక్కా బ్యారేజ్ ప్రాజెక్టు, మిలిటరీ ఇంజనీర్ సర్వీసు, ఎన్‌టీఆర్‌వోల్లో కేంద్ర కొలువు సొంతం చేసుకోవచ్చు.

✦ మొత్తం పోస్టుల సంఖ్య: 1,340

పోస్టుల వివరాలు

జూనియర్ ఇంజనీర్(సివిల్), జూనియర్ ఇంజనీర్(మెకానికల్),జూనియర్ ఇంజనీర్(ఎలక్ట్రికల్), జూనియర్ ఇంజనీర్(ఎలక్ట్రికల్ అండ్ మెకానికల్).

అర్హతలు

01.01.2026 నాటికి ఆయా పోస్టులను అనుసరించి అభ్యర్థులు సంబంధిత విభాగంలో ఇంజనీరింగ్ డిగ్రీ, లేదా మూడేళ్ల ఇంజనీరింగ్ డిప్లొమా ఉత్తీర్ణులవ్వాలి. కొన్ని పోస్టులకు ఇంజనీరింగ్ డిప్లొమాతోపాటు పని అనుభవం కూడా ఉండాలి. బీఆర్‌వోలోని జూనియర్ ఇంజనీర్ పోస్టులకు పురుష అభ్యర్థులు మాత్రమే అర్హులు.

వయసు

01.01.2026 నాటికి గరిష్ఠ వయోపరిమితి వయసు 30 ఏళ్లలోపు ఉండాలి. సెంట్రల్ పబ్లిక్ వర్క్స్ డిపార్ట్‌మెంట్‌లోని పోస్టులకు 32ఏళ్ల లోపు ఉండాలి. ఎస్సీ/ఎస్టీలకు ఐదేళ్లు, ఓబీసీలకు మూడేళ్ల గరిష్ఠ వయోపరిమితిలో సడలింపు లభిస్తుంది.

వేతనం

నెలకు రూ.35,400–రూ.1,12,400 వేతన శ్రేణి లభిస్తుంది(లెవెల్ 6లో కేంద్ర ఏడో వేతన సవరణ ప్రకారం).

ఎంపిక విధానం

కంప్యూటర్ బేస్డ్ టెస్ట్ పేపర్1, పేపర్ 2ల్లో చూపిన ప్రతిభ ఆధారంగా ఎంపిక ప్రక్రియ నిర్వహిస్తారు. ఇందులో పేపర్ 1కు 200 మార్కులు, పేపర్ 2కు 300 మార్కులు ఉంటాయి. పేపర్ 1, పేపర్ 2 రెండూ కూడా ఆబ్జెక్టివ్ టైప్, మల్టిపుల్ ఛాయిస్ ప్రశ్నల తరహాలో ఉంటాయి. ప్రశ్న పత్రాలు ఇంగ్లిష్/హిందీలో ఉంటాయి.

రాత పరీక్ష

✦ పేపర్ 1 కంప్యూటర్ బేస్డ్ పరీక్షలో.. జనరల్ ఇంటెలిజెన్స్ అండ్ రీజనింగ్ 50 ప్రశ్నలు-50 మార్కులకు, జనరల్ అవేర్‌నెస్ 50 ప్రశ్నలు-50 మార్కులకు, అదేవిధంగా సంబంధిత ఇంజనీరింగ్ సబ్జెక్టుపై పార్ట్ ఏ జనరల్ ఇంజనీరింగ్(సివిల్ అండ్ స్ట్రక్చరల్ ఇంజనీరింగ్)/పార్ట్ బీ జనరల్ ఇంజనీరింగ్(ఎలక్ట్రికల్)/పార్ట్ సీ జనరల్ ఇంజనీరింగ్(మెకానికల్) 100 ప్రశ్నలు-100 మార్కులకు నిర్వహిస్తారు. ఈ పరీక్ష వ్యవధి 2 గంటలు.
✦ పేపర్ 2 కంప్యూటర్ బేస్డ్ టెస్ట్‌లో(అభ్యర్థి ఎంచుకున్న స్పెషలైజేషన్ ఆధారంగా).. పార్ట్ ఏ జనరల్ ఇంజనీరింగ్ (సివిల్ అండ్ స్ట్రక్చరల్ ఇంజనీరింగ్)/పార్ట్ బీ జనరల్ ఇంజనీరింగ్(ఎలక్ట్రికల్) /పార్ట్ సీ జనరల్ ఇంజనీరింగ్(మెకానికల్) 100 ప్రశ్నలు- 300 మార్కులకు పరీక్ష నిర్వహిస్తారు. ఈ పరీక్షకు కేటాయించిన సమయం 2 గంటలు.
✦ పేపర్ 1, పేపర్ 2 రెండింటిలోనూ నెగిటివ్ మార్కుల నిబంధన ఉంది. ప్రతి పొరపాటు సమాధానానికి 0.25 మార్కులను తగ్గిస్తారు. వివిధ షిఫ్ట్‌ల్లో పరీక్షను నిర్వహిస్తున్న నేపథ్యంలో నార్మలైజేషన్ ప్రక్రియను అనుసరిస్తారు.

ప్రిపరేషన్ ఇలా

✦ జనరల్ ఇంటెలిజెన్స్ అండ్ రీజనింగ్ విభాగంలో... వెర్బల్, నాన్ వెర్బల్ ప్రశ్నలు అడుగుతారు. ఇందులో అనాలజీస్, సిమిలారిటీస్, డిఫరెన్సెస్, స్పేస్ విజువలైజేషన్, ప్రాబ్లం సాల్వింగ్, అనాలసిస్, జడ్జ్‌మెంట్, డెసిషన్ మేకింగ్, విజువల్ మెమొరీ, డిస్క్రిమినేషన్, అబ్జర్వేషన్, రిలేషన్‌షిప్ కాన్సెప్ట్స్, అరిథమెటికల్ రీజనింగ్, వెర్బల్ ఫిగర్‌క్లాసిఫికేషన్, అరిథమెటికల్ నంబర్ సిరీస్ నుంచి ప్రశ్నలు ఉంటాయి. ఇందులో రాణించేందుకు అభ్యర్థులు సిలబస్‌కు అనుగుణంగా బేసిక్స్‌పై అవగాహన పెంచుకొని, సాధ్యమైనన్ని ఎక్కువ మోడల్ ప్రశ్నలు, ప్రీవియస్ కొశ్చన్స్‌ను ప్రాక్టీస్ చేయాలి. వేగంగా సమాధానాలు రాబట్టేందుకు వీలుగా షార్ట్‌కట్ మెథడ్స్‌ను అనుసరించాలి.
✦ జనరల్ అవేర్‌నెస్ విభాగంలో.. అడిగే ప్రశ్నలు అభ్యర్థికి తన చుట్టూ జరుగుతున్న తాజా పరిణామాలు, శాస్త్రసాంకేతిక రంగాల్లో సంభవిస్తున్న మార్పులపై ఉన్న అవగాహనను పరీక్షించేలా ఉంటాయి. పొరుగు దేశాలతో భారత సంబంధాలు, భారత చరిత్ర, సంస్కృతి, జాగ్రఫీ, ఎకానమీ, జనరల్ పాలిటీ, శాస్త్ర పరిశోధనల నుంచి ప్రశ్నలు అడుగుతారు.
✦ సంబంధిత స్పెషలైజేషన్ ప్రశ్న పత్రం ఇంజనీరింగ్ డిప్లొమా స్థాయిలో ఉంటుందని పేర్కొన్నారు. అయితే అభ్యర్థులు గత ప్రశ్న పత్రాల ఆధారంగా ఇంజనీరింగ్ డిగ్రీ స్థాయిలో ప్రిపరేషన్ సాగించడం మేలు.

ముఖ్య సమాచారం

✦ **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
✦ **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 21.07.2025
✦ **ఆన్‌లైన్ ఫీజు చెల్లింపునకు చివరి తేది:** 22.07.2025
✦ **దరఖాస్తుల సవరణ తేదీలు:** 01.08.2025, 02.08.2025
✦ **కంప్యూటర్ ఆధారిత రాత పరీక్ష పేపర్ 1:** 27-31 అక్టోబర్ 2025
✦ **కంప్యూటర్ ఆధారిత రాత పరీక్ష పేపర్ 2:** జనవరి–ఫిబ్రవరి 2026
✦ **వెబ్‌సైట్:** https://ssc.gov.in

Published and Printed by Dhananjaya Reddy Rakkasi on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034,
EDITOR: Dhananjaya Reddy Rakkasi, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482.
Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.

Hero

హీరో యొక్క స్కూటర్
స్కూటర్ యొక్క హీరో



★★★★★ లీడర్ మైలేజ్# లో
★★★★★ ప్రీమియం క్రోమ్ యాక్సెంట్స్
★★★★★ స్థిరమైన అల్లాయ్ వీల్స్
★★★★★ సౌకర్యవంతమైన సీట్
★★★★★ విశాలమైన ఫ్లోర్‌బోర్డు
★★★★★ అడ్వాన్స్డ్ ఆటో-క్యాన్సిల్ వింకర్స్

పరిచయం చేస్తున్నాం కొత్త

DESTINI 125

SCAN TO KNOW MORE

డెస్టినీ 125 | బెస్ట్-ఇన్-క్లాస్ మైలేజ్ 60## km/l | పెద్దవి మరియు వెడల్పు అల్లాయ్ వీల్స్
మరింత పొడవైన ఫ్లష్ సీట్ | ఎల్ ఇ డి ప్రొజెక్టర్ హెడ్ లైట్ డి ఆర్ ఎల్ సహితం

తక్కువ డౌన్ పేమెంట్ ₹1999^ | తక్కువ వడ్డీ రేటు 7.99%^ | ADDITIONAL CASH DISCOUNT* AVAILABLE ON Flipkart amazon | GREEN BONUS OF ₹2000$ FOR VEHICLE SCRAPPING | pine labs PAY LATER CASHBACK UPTO ₹7500* | TOLL FREE NO. 1800-266-0018 | INDIA'S FIRST 5 YEAR WARRANTY *Conditions apply

Regd. Office: Hero MotoCorp Ltd., The Grand Plaza, Plot No.2, Nelson Mandela Road, Vasant Kunj - Phase -II, New Delhi - 110070, India. CIN: L35911DL1984PLC017354. It is our endeavour to improve our product. This could lead to changes in product specifications without notice. Accessories and features shown may not be a part of the standard fitment. Always wear a helmet while riding a two-wheeler. Available at select dealerships. ##Based on the testing report of govt. Certified agency. Actual mileage may vary as per riding conditions. ^Finance scheme is at the sole discretion of financiers and subject to its respective terms and conditions. $Green Bonus is applicable Pan India on select Hero products and bonus amount may vary as per model/variant. *T&C apply. Offer valid till 31st July. Offer is for limited period or till stock lasts. For further information, contact nearest Hero MotoCorp authorised outlet (s) or visit website www.heromotocorp.com

Authorised Dealers: Hyderabad: Geetha Hero, Suchitra: Ph: 9289923134, Taduband Ph: 9515408055, Sri Lakshmi Hero, Malakpet: Ph: 9289922155, Vanasthalipuram: Ph: 9246223423, Bhanu Hero, Erragadda: Ph: 9289922148, Kukatpally: Ph: 9392525886, Miyapur: Ph: 9392525885, Phoenix Hero, Habsiguda: Ph: 9289922515, Ramanthapur: Ph: 9246394475, Nagole: Ph: 9246394476, Kushaiguda: Ph: 9246824193, Dealwel Hero, Nampally: Ph: 9289922827, Asifnagar: Ph: 7013367531, Narsingi: Ph: 8712314565, Bibinagar: Ph: 7993119099, Attapur: Ph: 7995852452, Sri Venkanna Hero, Patancheru: Ph: 9289922150, Sowjanya Hero, Bahadurpura: Ph: 9289923133, Phoenix Hero, Hi-Tech City: Ph: 9289922759, Hafeezpet: Ph: 7799017976, Tolichowki: Ph: 7799960345, Chandanagar: Ph: 9100189997, Krishna Sai Hero, Malkajgiri: Ph: 9289922972, Lakshmi Hero, Somajiguda: Ph: 9289922147, Venkateshwara Hero, Narayanguda: Ph: 9289922145, 7799884320, Pragnapur: Ph: 8886642271, Prudhvi Hero, Sangareddy Ph: 9821697396, Associate Dealer – Medak: Ph: 9346848532, Chintal: Ph: 9246562269, Hayatnagar: Ph: 9246555683, Ibbrahimpatnam: Ph: 9703394833, Kphb: Ph: 9246566605, Medchal: Ph: 9949881116, Seethafalmandi: Ph: 9848868671, Shamshabad: Ph: 7893812758, Turkayamzal: Ph: 9014250111, Zaheerabad: Ph: 9440953602, Balapur: Ph: 7396284446, Kothur: Ph: 9989660055, Shadnagar: Ph: 9849408227, Manikonda: Ph: 9453912345, Mallapur: Ph: 9849362062, Amangal: Ph: 9985799937, Santoshnagar: Ph: 9885307031, Tilak Nagar: Ph: 8977731792, Bn Reddy Nagar: Ph: 9030167171, Also Available At – Chegunta: Ph: 8019134280, Dubbak: Ph: 9866663089, Jogipet: Ph: 9849417030, Narayankhed: Ph: 8019134280, Narsapur: Ph: 9701685551, Ramayampet: Ph: 9912475028, Sadasivpet: Ph: 9395383939, Vantimamidi: Ph: 7659084449, Alwal: Ph: 8019011555, Bachupally: Ph: 9505268989, Chevella: Ph: 9550024062, Gachibowli: Ph: 7799238866, Ghatkesar: Ph: 9866825296, Jagdevpur: Ph: 9346072111, Kandukur X Road: Ph: 9290874477, Kattedan: Ph: 8790467659, Kuknurpalle: Ph: 9912433300, Kulkacherla: Ph: 9866594434, Majidpur: Ph: 9440249174, Mall: Ph: 7729991772, Moinabad: Ph: 9966492929, Nagaram: Ph: 9951128704, Shankerpally: Vaishno Motors, Ph: 9849095545, Tandur: Ph: 9701942955, Thukkuguda: Ph: 9014250111, Thumkunta: Ph: 9440028414, Vikarabad: Ph: 9866594434.

RS/Hero/07/25

రెడీ టు కుక్... ఓ నయా ట్రెండింగ్...!

దోశల నుంచి ట్రెండీ కేక్ మిక్స్‌ల దాకా
2 ఏళ్లలో 1.8 కోట్ల కుటుంబాలు యాడ్.
పెద్ద కంపెనీలు సైతం రంగంలోకి
రాబోయే రోజుల్లో మరింత విస్తరణ



సాక్షి, హైదరాబాద్: ఆధునిక జీవనశైలిలో వేగం పెరుగుతున్న కొద్దీ, మన ఆహార అలవాట్లు కూడా అంతే వేగంగా మారిపోతున్నాయి. దీనికి తోడు రోజురోజుకూ విస్తరిస్తున్న పట్టణీకరణతో పాటు భార్యాభర్తలిద్దరూ ఉద్యోగాలు చేస్తుండటంతో డబ్బు ఖర్చుకు వెనకాడకపోవడం...ఉదయం పూట ఆఫీసుకు వెళ్లే తొందర, రోజంతా పనిచేశాక సాయంత్రం పూట ట్రాఫిక్ రద్దీతో చికాకుతో ఇళ్లకు చేరినపుడు అలసిపోయిన మనుషులకు, అప్పటికప్పుడు తక్కువ సమయంతో రుచికరమైన వంటలు తయారుచేసుకునే 'రెడీ టు కుక్ అండ్ ఈట్' ఉత్పత్తులు ఒక వరంగా మారుతున్నాయి.

దోశల నుంచి ట్రెండీ కేక్ మిక్స్‌ల దాకా...

తాజాదనంతో పాటు, ఆరోగ్యంపై దృష్టితో సాంప్రదాయిక దోశ, ఇడ్లీ, వడలు మొదలు ట్రెండీ కేక్ మిక్స్‌ల దాకా ఇప్పుడు మార్కెట్లో ఎన్నోరకాల రెడీ టూ కుక్ మిక్స్‌లు వినియోగదారులకు అందుబాటులోకి వచ్చేశాయి. మొదట్లో పెద్ద నగరాల్లో...మరీ ప్రత్యేకంగా ఐటీ ఉద్యోగులకు ఇలాంటివి అందుబాటులో ఉండగా, ప్రస్తుతం ద్వితీయ, తృతీయ శ్రేణి నగరాలు, పట్టణాలకు కూడా 'రెడీ టు కుక్' ఆహారపు అలవాట్లు, అభిరుచులు విస్తరించేశాయి. గృహిణులు మొదలు విద్యార్థులు, ఉద్యోగులు, బ్యాచిలర్లు ఇలా అన్ని వర్గాల వారికి ఈ రెడీ టు కుక్ వంటకాలు ఆహారం తయారు చేసే సమయాన్ని ఆదా చేస్తూ, రుచికరమైన భోజనాన్ని అందిస్తున్నాయి. అంతేకాకుండా, ప్రస్తుతం ఆరోగ్య పరిరక్షణపై పెరుగుతున్న అవగాహన కారణంగా కూడా ఈ విభాగం మరింత వేగంగా అభివృద్ధి చెందుతూ విస్తరిస్తోంది. ఆహార పదార్థాలు నిల్వ ఉండేందుకు ఉపయోగించే రసాయనాలు (ప్రిజర్వేటివ్స్) లేకుండా, తక్కువ ప్రాసెసింగ్‌తో తయారయ్యే, ఆరోగ్యకరమైన ఉత్పత్తులపై వినియోగదారులు మొగ్గుచూపిస్తున్నారు. ఈ నేపథ్యంలో తమ రకరకాల ఉత్పత్తులతో ఐడీ ఫ్రెష్, ఎంటీఆర్ ఆశీర్వాద్, జిట్స్ వంటి కంపెనీలు మన మార్కెట్‌ను ఆకర్షిస్తున్నాయి. ఇటీవలి అధ్యయనాల ప్రకారం చూస్తే...ఇండియాలో రెడీ టు కుక్ విభాగం 2023లో రూ.5 వేల కోట్ల మార్కెట్‌ను దాటి 2027 నాటికి రూ.8 వేల కోట్లకు చేరుకుంటుందని అంచనా వేస్తున్నారు. 2024లో రెడీ టు కుక్ కేటగిరీ 58 శాతం వృద్ధిని నమోదు చేసినట్టు వెల్లడైంది.



2 ఏళ్లలో 1.8 కోట్ల కుటుంబాలు యాడ్...

తాజాగా కాంటార్ వరల్డ్ ప్యానెల్ విడుదల చేసిన డేటాను పరిశీలిస్తే...గత రెండేళ్లలో రెడీ టు కుక్ కేటగిరీలో అమ్మకాలు అనేవి రెండింతలు పెరగడమే కాకుండా 1.8 కోట్ల కొత్త కుటుంబాలు ఈ తరహా ఆహారపు రకాలు, కేటగిరీల వైపు ఆకర్షితులైనట్లు స్పష్టమైంది. ఇదే సమయంలో రెడీ టు ఈట్ సెగ్మెంట్ అనేది క్షీణతను నమోదు చేయడంతో వినియోగదారులు 'హోమ్-కుక్డ్ మీల్స్'వైపు ఆకర్షితులవుతున్నట్టుగా నిపుణులు అంచనా వేస్తున్నారు.

పెద్ద కంపెనీలు సైతం రంగంలోకి...

ప్రముఖ కంపెనీల బ్రాండ్‌లు సైతం వినియోగదారుల అభిరుచులకు అనుగుణంగా నూతన ఆవిష్కరణలు చేస్తూ, కొత్త వంటకాలను ప్రవేశపెడుతున్నాయని కాంటార్ తన అధ్యయనంలో పేర్కొంది. ఉదాహరణకు, ఇప్పుడు కేవలం దోస మిక్స్ మాత్రమే కాదు, బిర్యానీ కిట్స్ వంటివి ఇంకా ప్రాంతీయ అభిరుచులు, ప్రత్యేకతలకు తగ్గట్టుగా కొత్త ఉత్పత్తులను కూడా మార్కెట్‌లోకి తీసుకొచ్చేశాయి.ఈ విభాగానికి పెరుగుతున్న డిమాండ్‌తో పాటు ఆయా కేటగిరీల వస్తువుల ద్వారా పెరుగుతున్న ఆదాయాన్ని చూశాక పెద్ద కంపెనీలు కూడా ఈ తరహా ఆహార ఉత్పత్తుల తయారీ వైపు దృష్టిని నిలుపుతున్నట్టుగా స్పష్టమవుతోంది. అదే సమయంలో కొత్త స్టార్టప్ కంపెనీలు కూడా ఈ అవకాశాన్ని వినియోగించుకునే విషయంలో ఉత్సాహం చూపడంతో పాటు ముందువరసలో నిలుస్తున్నాయి. ఈ ఉత్పత్తులు ఇప్పుడు కేవలం స్వదేశీయ మార్కెట్‌కే పరిమితమవ్వకుండా జనాభా ఎక్కువగా ఉన్న దేశాల్లోనూ విస్తరిస్తున్నాయి. అమెజాన్, బిగ్ బాస్కెట్, స్విగ్గీ ఇన్‌స్టామార్ట్ వంటి డిజిటల్ ప్లాట్‌ఫామ్‌లు ఈ ఉత్పత్తులను తక్కువ సమయంలో ఇంటికే డెలివరీ చేస్తూ మార్కెట్ విస్తరణకు దోహదపడుతున్నాయి.

రాబోయే రోజుల్లో మరింత విస్తరణ...

ఇన్నాళ్లు సాంప్రదాయికంగా తయారయ్యే వంటకాలను కేవలం అమ్మమ్మలే చేస్తారని భావించిన మనం, ఇప్పుడు అవే వంటకాలను అయిదు నిమిషాల్లో రెడీ చేసుకునే దిశగా అడుగులు వేస్తున్నాము. దీనిని ప్రతికూల మార్పుగా కాకుండా కాలానుగుణంగా భోజన అలవాట్లు, అభిరుచుల్లో వచ్చిన మార్పుగా భావించాల్సి ఉంటుందని మార్కెట్ విశ్లేషకులు సూచిస్తున్నారు. రాబోయే రోజుల్లో 'రెడీ టు కుక్' విభాగం మరింత విస్తరిస్తూ.. సంప్రదాయ రుచులను కొత్త ప్యాకేజింగ్‌లో అందించే ఒరవడి కొనసాగుతుందని నిపుణులు అంచనా వేస్తున్నారు.

అసెంబ్లీని సందర్శించిన మేఘాలయ బృందం



సాక్షి, హైదరాబాద్: మేఘాలయ రాష్ట్ర అసెంబ్లీ బృందం తెలంగాణ అసెంబ్లీని సందర్శించింది. మేఘాలయ పబ్లిక్ అకౌంట్స్ కమిటీ (పీఏసీ) చైర్మన్ చార్లెస్ పిన్‌గ్రోప్ నేతృత్వంలోని ముగ్గురు ఎమ్మెల్యేల బృందం మంగళవారం అసెంబ్లీకి వచ్చింది. వీరికి తెలంగాణ అసెంబ్లీ పీఏసీ చైర్మన్ అరికెపూడి గాంధీ, ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, అసెంబ్లీ కార్యదర్శి వి.నరసింహాచార్యులు తదితర సిబ్బంది స్వాగతం పలికారు. అసెంబ్లీ కమిటీ హాల్‌లో మేఘాలయ బృందంతో సమావేశమైన వీరు రాష్ట్రంలో అసెంబ్లీ నిర్వహిస్తున్న విధానాన్ని, ప్రజా సమస్యల పరిష్కారం కోసం చేస్తున్న చట్టాలను వివరించారు. రాష్ట్రంలో అమలవుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాల గురించి వెల్లడించారు. రాష్ట్ర ఆవిర్భావంతో పాటు తెలంగాణ అసెంబ్లీ ఔన్నత్యాన్ని గురించి, మహబూబ్‌నగర్ విద్యానిధి గురించి మేఘాలయ బృందంతో చర్చించారు. తెలంగాణ అసెంబ్లీని సందర్శించిన వారిలో మేఘాలయ ఎమ్మెల్యేలు లహ్‌కెమెన్ రింబుల్, రూపా.ఎం.మార్క్ ఉన్నారు.

లిఫ్టులు ఆన్ చేసి రిజర్వాయర్లు నింపండి

మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్



సాక్షి, హైదరాబాద్: కల్వకుర్తి ఎత్తిపోతల పథకం మోటార్లు ఆన్ చేయాలని సూచించినా బేఖాతరు చేసిన రాష్ట్ర ప్రభుత్వం.. ఆలస్యంగా నిద్ర లేచిందని మాజీ మంత్రి వి.శ్రీనివాస్ గౌడ్ విమర్శించారు. జూరాల ప్రాజెక్టు లిఫ్టులను కూడా సరైన సమయంలో ఆన్ చేయకపోవడంతో నష్టం జరిగిందన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు పంపులను కూడా ఆన్ చేసి నీటిని ఎత్తిపోయాలని డిమాండ్ చేశారు. ఆయన మంగళవారం తెలంగాణ భవన్‌లో విలేకరులతో మాట్లాడారు. పాలమూరు రంగారెడ్డి పథకం లిఫ్టులను ఆన్‌చేసి రిజర్వాయర్లు నింపి రైతాంగాన్ని ఆదుకోవాలన్నారు. అసెంబ్లీ వేదికగా అన్ని అంశాలపైనా చర్చించేందుకు బీఆర్‌ఎస్ పార్టీ సిద్ధమని, అయితే మైక్ కట్ చేయకుండా అవకాశం ఇప్పించాల్సిన బాధ్యత కాంగ్రెస్ నేతలపైనే ఉందన్నారు. బీఆర్‌ఎస్ నుంచి గెలిచి కాంగ్రెస్‌లోకి ఫిరాయించిన పది మంది ఎమ్మెల్యేలు రాజీనామా చేయాలని, ఆయా స్థానాల్లో ఉప ఎన్నిక జరిగితే ఎవరి సత్తా ఏంటో తెలుస్తుందన్నారు. స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్ల పెంపు అంశంపై పార్టీ ఆందోళన కార్యక్రమాలు చేపడుతుందని శ్రీనివాస్ గౌడ్ ప్రకటించారు. సమావేశంలో బీఆర్‌ఎస్ నేతలు శుభప్రద్ పటేల్, బాలరాజు యాదవ్ పాల్గొన్నారు.

గురుకులాల సమయ పాలన మార్చాలి

– ఎమ్మెల్సీ కొమరయ్య

సాక్షి, హైదరాబాద్: గురుకులాల సమయ పాలన మార్చాలని ఎమ్మెల్సీ మల్క కొమరయ్య డిమాండ్ చేశారు. ఆయన మంగళవారం సంక్షేమ గురుకులాల అధికారులు సైదులు, అలుగు వర్షిణిలను కలిసి వినతి పత్రం అందజేశారు. గురుకులాల్లో కామన్ స్టాఫ్ విధానం, పదోన్నతి చానెల్ అమలు చేయాలని కోరారు.

నేడు విద్యుత్ ఉద్యోగుల నిరసన

సాక్షి, హైదరాబాద్: కేంద్రం అనుసరిస్తున్న ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా బుధవారం నిరసన తెలియజేయనున్నట్లు తెలంగాణ స్టేట్ పవర్ ఎంప్లాయీస్ జాయింట్ యాక్షన్ కమిటీ నేతలు సాయిబాబు, రత్నాకర్‌రావు, బీసీరెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. దేశంలోని అన్ని కార్మిక సంఘాలు ఆందోళనలో పాల్గొంటున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో అత్యవసర సర్వీసులు మినహా ఉద్యోగులు పాల్గొనాలని కోరారు.

మంగళవారం రాత్రి 8 గంటలకు ప్రధాన ప్రాజెక్టుల్లోకి వరద ప్రవాహాలు, నీటి నిల్వలు ఇలా..

ప్రాజెక్టు	గరిష్ఠ మట్టం (అడుగుల్లో)	గరిష్ఠ నిల్వ (టీఎంసీల్లో)	ప్రస్తుత మట్టం (అడుగుల్లో)	ప్రస్తుత నిల్వ (టీఎంసీల్లో)	ఇన్‌ఫ్లో (క్యూసెక్కుల్లో)	అవుట్‌ఫ్లో (క్యూసెక్కుల్లో)
ఆల్మట్టి	1705	129.72	1697	91.08	108286	115670
నారాయణపూర్	1615	37.64	1609	31.05	114972	117245
ఉజ్జయిని	1630	117.64	1626.77	105.98	13493	3321
జూరాల	1045	9.66	1041.3	7.95	125000	126845
తుంగభద్ర	1633	105.79	1625	75.93	52,423	61,442
శ్రీశైలం	885	215.81	882.2	199.74	186,079	1,94,295
నాగార్జునసాగర్	590	312.05	531.9	171.88	114146	4590
పులిచింతల	175	45.77	155.2	18.82	0	7000

పోలీసులు.. రుణ వసూలు ఏజెంట్లు కాదు

- అప్పు చెల్లించని వ్యక్తిపై పోలీసు దర్యాప్తు కోరుతూ దాఖలైన పిటిషన్‌పై హైకోర్టు
- ఆదేశాలివ్వలేమని స్పష్టీకరణ.. సివిల్ సూట్ వేసుకోవాలని సూచన

సాక్షి, హైదరాబాద్: పోలీసులు రుణ వసూలు ఏజెంట్లు కాదని.. వారి విధుల్లో అది భాగం కాదని హైకోర్టు స్పష్టం చేసింది. రుణాలు వసూలు చేసి కమీషన్లు తీసుకొనే ఏజెంట్ల పనులు వారు చేయరని తేల్చిచెప్పింది. పోలీసులు రికవరీ ఏజెంట్లైతే ఇక అంతా కమీషన్ ఇస్తామంటూ రుణాల వసూలు కోసం పోలీస్ స్టేషన్‌లకు వస్తారని వ్యాఖ్యానించింది. ఈ అంశంలో వారికి ఎలాంటి ఆదేశాలు ఇవ్వలేమని చెబుతూ రుణ వసూలు కోసం సివిల్ సూట్ దాఖలు చేసుకోవాలని పిటిషనర్‌కు సూచించింది. అలాగే పిటిషన్ ఉపసంహరణకు అనుమతించింది. అప్పు తీసుకున్న వ్యక్తి తిరిగి చెల్లించడంలేదని.. కేసు నమోదు చేసి దర్యాప్తు చేయాలని కోరినా పోలీసులు చర్యలు తీసుకోవట్లేదంటూ హైదరాబాద్‌కు చెందిన సతీశ్ కుమార్ హైకోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్‌పై జస్టిస్ తడకమళ్ల వినోద్‌కుమార్ మంగళవారం విచారణ చేపట్టారు. దీనిపై పిటిషనర్ తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ అప్పు ఇచ్చినట్లు అన్ని సాక్ష్యాలు ఉన్నా కేసు నమోదు చేసి దర్యాప్తు చేసేందుకు పోలీసులు నిరాకరించారని చెప్పారు. అయితే ఇది సివిల్ వివాదమైనందున.. పోలీసులు జోక్యం చేసుకోలేరని హోంశాఖ తరఫున ఏజీపీ లక్ష్మీకాంత్‌రెడ్డి వాదించారు. వాదనలు విన్న న్యాయమూర్తి ఈ వ్యవహారంలో జోక్యం చేసుకోలేమన్నారు. అప్పు వసూలు కోసం సివిల్ సూట్ వేసుకోవాలి తప్ప పోలీసులకు ఫిర్యాదు చేస్తే ఎలా అని ప్రశ్నించారు.

అదనపు డీఎంఈ పదోన్నతులపై వైద్య సంఘాల హర్షం

సాక్షి, హైదరాబాద్: వైద్య, ఆరోగ్యశాఖలో 44 మంది సీనియర్ ప్రొఫెసర్లకు అదనపు డీఎంఈలుగా పదోన్నతి కల్పిస్తూ ఉత్తర్వులు జారీ చేయడంపై పలు ప్రభుత్వ వైద్యుల సంఘాలు హర్షం వ్యక్తం చేశాయి. సుదీర్ఘ కాలం తరువాత పదోన్నతులు కల్పించడంపై తెలంగాణ ప్రభుత్వ వైద్యుల సంఘం (టీజీజీడీఏ), తెలంగాణ టీచింగ్ గవర్నమెంట్ డాక్టర్స్ అసోసియేషన్ (టీటీజీడీఏ) వేర్వేరు ప్రకటనల్లో ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపాయి. వివిధ స్థాయిల్లో అసిస్టెంట్ ప్రొఫెసర్ల నుంచి ప్రొఫెసర్ల వరకు పదోన్నతులు కల్పించాలన్న నిర్ణయం.. బోధన వృత్తిలో ఉన్న వైద్యులకు ప్రోత్సాహాన్నిస్తుందని టీజీజీడీఏ అధ్యక్షుడు డాక్టర్ నరహరి, సెక్రటరీ జనరల్ డాక్టర్ లాలూ ప్రసాద్ రాథోడ్, టీటీజీడీఏ అధ్యక్షుడు డాక్టర్ కిరణ్ బొల్లేపాక, డాక్టర్ కిరణ్ మాదల పేర్కొన్నారు.


నేటి సమ్మెకు దూరం: బీఎంఎస్

సాక్షి, హైదరాబాద్: దేశవ్యాప్తంగా బుధవారం కార్మిక సంఘాలు తలపెట్టిన సార్వత్రిక సమ్మెలో తాము పాల్గొనడం లేదని భారతీయ మజ్దూర్‌సంఘ్ (బీఎంఎస్) మంగళవారం ఒక ప్రకటనలో తెలిపింది. బీఎంఎస్ అనుబంధ సంఘాలేవీ ఈ సమ్మెలో పాల్గొనడం లేదని రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కలాల్ శ్రీనివాస్, టి.రాంరెడ్డి వెల్లడించారు. కేంద్రం తీసుకొచ్చిన కోడ్ ఆన్ వేజెస్ –19, కోడ్ ఆన్ సోషల్ సెక్యూరిటీస్‌లను తాము స్వాగతించామని పేర్కొన్నారు.

సత్వరం నర్సింగ్ డైరెక్టరేట్ ఏర్పాటు

టీఈఏ అధ్యక్షురాలు నిర్మల వినతి

సాక్షి, హైదరాబాద్: నర్సింగ్ డైరెక్టరేట్ ఏర్పాటు ప్రక్రియను వేగవంతం చేయాలని తెలంగాణ ఎంప్లాయీస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షురాలు డాక్టర్ నిర్మల కోరారు. సంఘం ప్రతినిధులతో కలిసి ఆమె మంగళవారం వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహను కలిశారు. డైరెక్టరేట్ ఏర్పాటుకు కేబినేట్ ఆమోదం తెలిపేలా కృషి చేసిన మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. మంత్రిని కలిసిన వారిలో ఉద్యోగుల జేఏసీ చైర్మన్ సుజాత రాథోడ్, టీఎన్‌ఏ ఉపాధ్యక్షురాలు బి.శిరీష రాణి, లక్ష్మణ్ రుదావత్, కల్పన దత్తా తదితరులు ఉన్నారు.



నిర్మల్ జిల్లాలో ఫ్లెమింగో

పెంబి: నిర్మల్ జిల్లా పెంబి మండలం తాటిగూడ గ్రామ చెరువులో మంగళవారం అరుదైన ఫ్లెమింగో పక్షి దర్శనమిచ్చింది. వింతగా ఉన్న ఈ పక్షిని గ్రామస్తులు ఆసక్తిగా తిలకించి ఫొటోలు తీశారు. అటవీ అధికారులకు సమాచారం అందించారు. వారు దానిని ఫ్లెమింగో పక్షిగా నిర్ధారించారు. ఈ పక్షులు గుజరాత్, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు రాష్ట్రాలలోని సరస్సులలో కనిపిస్తాయని తెలిపారు. తొలిసారిగా నిర్మల్‌లో కనిపించిందని పేర్కొన్నారు.

సింగరేణిలో సమ్మె జరిగేనా?

- బీఎంఎస్ మినహా సంఘాలన్నీ సై
- ఒకరోజు సమ్మెతో సంస్థకు రూ.76 కోట్ల మేర నష్టం
- సమ్మె వద్దంటున్న అధికారులు.. సందిగ్ధంలో కార్మికులు




సమ్మె విజయవంతానికి కొత్తగూడెంలోని సింగరేణి ప్రధాన కార్యాలయం వద్ద ప్రచారం చేస్తున్న నాయకులు

సింగరేణి(కొత్తగూడెం): పోరాడి సాధించుకున్న 29 కార్మిక చట్టాలను కేంద్ర ప్రభుత్వం రద్దు చేసి.. నాలుగు లేబర్ కోడ్‌లుగా మార్చడంతో కార్మికులు, కార్మిక సంఘాల ఉనికికి ప్రమాదం ఏర్పడుతుందంటూ జాతీయ కార్మిక సంఘాలు బుధవారం దేశవ్యాప్త సమ్మెకు పిలుపునిచ్చాయి. ఈ మేరకు సింగరేణి కార్మికులు సైతం సమ్మెలో పాల్గొనాలని.. బీఎంఎస్ మినహా మిగతా జాతీయ, ప్రాంతీయ కార్మిక సంఘాలు నోటీసులు ఇవ్వడమే కాక విస్తృత ప్రచారం చేస్తున్నాయి. ఇక సింగరేణి యాజమాన్యం ఒక రోజు సమ్మెతో సంస్థకు రూ.76 కోట్ల నష్టం వాటిల్లనున్నందున కార్మికులు దూరంగా ఉండాలని కోరుతోంది. ఈ నేపథ్యాన కార్మికులు సమ్మెలో పాల్గొంటారా?.. విధులకు హాజరవుతారా? అన్న సందిగ్ధం నెలకొంది.

మే 20వ తేదీనే తొలి పిలుపు..: లేబర్ కోడ్ల రద్దు డిమాండ్‌తో మే 20వ తేదీన సమ్మె చేయాలని తొలుత నిర్ణయించారు. ఆ సమయాన పహల్గామ్‌లో ఉగ్రవాదులు దాడి చేయడంతో పాకిస్తాన్ – భారత్ నడుమ నెలకొన్న పరిస్థితులతో వాయిదా వేశారు. మళ్లీ ఈనెల 9న బుధవారం సమ్మెకు సిద్ధమై నెల రోజులుగా విస్తృత ప్రచారం చేస్తున్నారు.

సింగరేణి సమస్యలు లేవంటూ..: కార్మికుల హక్కుల పరిరక్షణ, సమస్యల పరిష్కారం కోసం జాతీయ కార్మిక సంఘాలు సమ్మెకు పిలుపునిచ్చినా.. అందులో సింగరేణి సంబంధిత సమస్యలు లేవని యాజమాన్యం చెబుతోంది. ఒకవేళ యాజమాన్యం పరిష్కరించే సమస్యలు ఉంటే.. చర్చల ద్వారా పరిష్కరించుకునే అవకాశం ఉండేదని ప్రచారం చేస్తోంది. వర్షాకాలం నేపథ్యాన ఇప్పటికే సుమారు 50 లక్షల టన్నుల ఉత్పత్తి వెనుకంజలో ఉండగా.. ఇప్పుడు ఒకరోజు సమ్మె చేస్తే.. మరో 1.90 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తికి అంతరాయం ఏర్పడుతుందని అధికారులు చెబుతున్నారు. ఈ నేపథ్యాన కార్మికులు విధులకు హాజరు కావాలని కోరుతున్నారు. ఇదే సమయాన కార్మికులు సమ్మెకు సిద్ధమైతే.. మంగళవారం నైట్ షిఫ్ట్ ఆపరేటర్లను బుధవారం కూడా విధుల్లో కొనసాగించాలనే నిర్ణయానికి వచ్చినట్లు తెలిసింది. అదీ సాధ్యం కాకపోతే ఇప్పటికే నిల్వ ఉన్న బొగ్గును ఉత్పత్తిగా చూపించాలనే భావనలో ఉన్నట్లు సమాచారం.


సమ్మెకు బీఎంఎస్ దూరం



సమ్మెతో గని కార్మికులు వేతనం కోల్పోవడం తప్ప ఏ లాభం ఉండదు. అందుకే కొన్ని సంఘాలు స్వలాభం కోసం చేస్తున్న సమ్మెలో మేం పాల్గొనడం లేదు. ఈ సమ్మె బీజేపీ ప్రభుత్వంపై కక్షతోనే తప్ప.. కార్మికుల సంక్షేమం కోసం కాదని గుర్తించాలి.

– పి.మాధవనాయక్, బీఎంఎస్ నేత


కార్మికుల సత్తా చాటుతాం



దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో సంఘటిత, అసంఘటిత రంగాల్లో పనిచేస్తున్న 50 కోట్ల మంది కార్మికులు పాల్గొంటారు. తద్వారా కేంద్ర ప్రభుత్వానికి కార్మికుల సత్తా తెలియజేస్తాం. అయినా దిగిరాకపోతే రైతుల మాదిరి ఆందోళనలు చేస్తాం.

– వాసిరెడ్డి సీతారామయ్య, అధ్యక్షుడు, ఏఐటీయూసీ


స్తంభింపజేస్తాం..



సమ్మెను విచ్ఛిన్నం చేసేందుకు యాజమాన్యం యత్నిస్తోంది. ఒక్క సంఘం చేతిలో ఉంటే ఏ ఫలితం ఉండదు. సమ్మె ద్వారా సింగరేణి వ్యాప్తంగా 16 లక్షల క్యూబిక్ మీటర్ల ఓబీ వెలికితీతను స్తంభింపజేసి కాంట్రాక్ట్ కార్మికుల సత్తా చాటుతాం.

– ఎన్.సంజీవ్, రాష్ట్ర నేత, ఐఎఫ్‌టీయూ

కార్మికులు ఆలోచించాలి



సింగరేణిలో ఒక రోజు సమ్మెతో రూ.76 కోట్ల నష్టం వస్తుంది. కార్మికులు రూ.14 కోట్ల వేతనం కోల్పోతారు. 1.90 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తికి అంతరాయం ఏర్పడుతుంది. ఈ విషయాన్ని గుర్తించి కార్మి కులు సమ్మెకు దూరంగా ఉండాలి.

– ఎల్.వి.సూర్యనారాయణ, డైరెక్టర్ (ఆపరేషన్స్), సింగరేణి

వసతి గృహాల్లో ఆకస్మిక తనిఖీలు చేయండి

ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్

సాక్షి, అమరావతి: ఇటీవల వసతి గృహాల్లో ఆహార నాణ్యత, ఇతర కారణాలతో విద్యార్థులు అస్వస్థతకు గురవుతున్నారని, అలాంటి పరిస్థితులు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ అధికారులను ఆదేశించారు. వసతి గృహాల పనితీరును మెరుగుపర్చేందుకు జిల్లా కలెక్టర్లతో సహా సంక్షేమ శాఖల అధికారులు ఆకస్మిక తనిఖీలు చేపట్టాలని సీఎస్ స్పష్టం చేశారు. మంగళవారం ఆయన సచివాలయంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ సంక్షేమ శాఖల వసతి గృహాలు, రెసిడెన్షియల్ పాఠశాలల నిర్వహణపై సమీక్షించారు. విద్యార్థులకు ఈ నెలాఖరుకి బెడ్ షీట్లు పంపిణీ చేయాలన్నారు. అడ్మిషన్ల ప్రక్రియను వేగవంతం చేయాలన్నారు. ముఖ ఆధారిత హాజరు విధానాన్ని ఆర్టీజీఎస్‌తో అనుసంధానించి నిరంతరం పర్యవేక్షించాలని పేర్కొన్నారు. మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని ఆదేశించారు.

ఆ వ్యాఖ్యలు ప్రజాస్వామికవాదులు ఖండించాలి: పవన్‌కళ్యాణ్

సాక్షి, అమరావతి: మహిళల వ్యక్తిత్వాన్ని అవహేళన చేస్తూ కించపరిచే వ్యాఖ్యలు చేయడం వైఎస్సార్‌సీపీ నేతలకు అలవాటుగా మారిందని ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డిపై ఆ నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే చేసిన వ్యాఖ్యలు అభ్యంతరకరమైనవని పేర్కొన్నారు. వ్యక్తిగత జీవితాలను లక్ష్యంగా చేసుకొని వ్యాఖ్యలు చేయడం ప్రజాస్వామికవాదులందరూ ఖండించాలని విజ్ఞప్తి చేశారు.

ప్రజారోగ్య శాఖ డైరెక్టర్‌గా పద్మావతి కొనసాగింపు

సాక్షి, అమరావతి: ప్రజారోగ్య, కుటుంబ సంక్షేమ డైరెక్టర్ (ఎఫ్ఏసీ)గా డాక్టర్ కె.పద్మావతి కొనసాగనున్నారు. గత నెల 27న రాజమహేంద్రవరం రీజినల్ డైరెక్టర్ డాక్టర్ పద్మా శశిధర్‌ను ప్రజారోగ్య డైరెక్టర్(ఎఫ్ఏసీ)గా నియమిస్తూ ఇచ్చిన ఉత్తర్వులను ఉపసంహరించుకుంటూ ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులిచ్చింది.

త్వరలో 750 ఈ-బస్సులు

చైర్మన్ కొనకళ్ల నారాయణ

సాక్షి, అమరావతి: ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాల కోసం త్వరలో 750 ఈ-బస్సులను ప్రవేశపెట్టనున్నామని ఆర్టీసీ పాలకమండలి చైర్మన్ కొనకళ్ల నారాయణ చెప్పారు. విజయవాడలో మంగళవారం నిర్వహించిన ఆర్టీసీ పాలకమండలి సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇ-బస్సుల కోసం అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యమివ్వాలన్నారు. ఆగస్టు 15 నుంచి అమలు చేయనున్న మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కోసం అధికారులు, ఉద్యోగులు సన్నద్ధం కావాలన్నారు. ఈ సమావేశంలో ఆర్టీసీ ఎండీ సీహెచ్. ద్వారకా తిరుమలరావు, పాలక మండలి సభ్యులు పాల్గొన్నారు.

ప్రవాసాంధ్రులకు అండగా ఉంటాం: మంత్రి శ్రీనివాస్

సాక్షి, అమరావతి: ప్రవాసాంధ్రులకు ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. మంగళవారం తాడేపల్లిలోని ఏపీఎన్ఆర్టీఎస్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఉపాధి, ఉన్నత విద్యాభ్యాసం నిమిత్తం విదేశాలకు వెళ్లిన రాష్ట్ర ప్రజలు.. ప్రవాసాంధ్ర భరోసా పథకంలో రిజిస్టర్ చేసుకోవాలని కోరారు. అనుకోని ఘటనలు జరిగినప్పుడు వారి కుటుంబానికి ప్రభుత్వం అండగా నిలబడడానికి ఇది ఉపయోగపడుతుందని చెప్పారు. అనంతరం, ఉపాధి నిమిత్తం సౌదీ అరేబియా వెళ్లి రోడ్డు ప్రమాదంలో మరణించిన భవనాసి సత్యబాబు(నెల్లూరు జిల్లా నర్రవాడ గ్రామం) కుటుంబానికి మంత్రి శ్రీనివాస్ ప్రవాసాంధ్ర భరోసా కింద రూ.10 లక్షల బీమా పరిహారం అందజేశారు.

కొత్త హైవేలకు రెడ్ సిగ్నల్



- రాష్ట్ర ప్రభుత్వ ప్రతిపాదనకు కేంద్రం నో
- కేంద్రంలో భాగస్వామిగా ఉన్నా దక్కని ఫలితం

సాక్షి, అమరావతి : కేంద్ర ప్రభుత్వంలో భాగస్వామిగా ఉన్నప్పటికీ రాష్ట్రానికి కొత్త జాతీయ రహదారుల మంజూరులో చంద్రబాబు ప్రభుత్వానికి చుక్కెదురైంది. రాష్ట్ర రహదారులను జాతీయ రహదారులుగా గుర్తించాలన్న ప్రభుత్వ విజ్ఞప్తిపై కేంద్ర జాతీయ రహదారుల శాఖ సానుకూలంగా స్పందించలేదు. ప్రస్తుతానికి అటువంటి ప్రతిపాదనను తాము పరిశీలించడం లేదని తేల్చిచెప్పింది. ఇప్పటికే 425 కి.మీ. మేర నాలుగు రాష్ట్ర రహదారులను జాతీయ రహదారులుగా గుర్తించాలని రాష్ట్ర ప్రభుత్వం గత ఏడాది డిసెంబరులో కేంద్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపింది. ప్రధానంగా ఉత్తరాంధ్రలోని మూడు ముఖ్యమైన రహదారులతోపాటు గోదావరి జిల్లాల్లోని ఓ రహదారిని ఆ జాబితాలో చేర్చింది. అవి..

ఎన్‌హెచ్‌లుగా చేయలేం..

అయితే, ఈ నాలుగు రాష్ట్ర రహదారులను జాతీయ రహదారులుగా గుర్తించి అభివృద్ధి చేయాలన్న రాష్ట్ర ప్రభుత్వ విజ్ఞప్తిని కేంద్ర జాతీయ రహదారుల అభివృద్ధి శాఖ తిరస్కరించినట్లు సమాచారం. ఇప్పటికే దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల్లో పెద్దఎత్తున రాష్ట్ర రహదారులను జాతీయ రహదారులుగా గుర్తించి అభివృద్ధి చేస్తున్నామని.. ఈ నేపథ్యంలో.. కొత్తగా రాష్ట్ర రహదారులను జాతీయ రహదారులుగా గుర్తించలేమని కేంద్రం స్పష్టంచేసింది. దీంతో.. కొత్త జాతీయ రహదారులుగా గుర్తింపు సాధించే ప్రక్రియలో చంద్రబాబు ప్రభుత్వం విఫలమైందని అధికార వర్గాలు చెబుతున్నాయి.

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో 4,500 కి.మీ. అభివృద్ధి..

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో రాష్ట్రంలో 4,500 కి.మీ. మేర రాష్ట్ర రహదారులను జాతీయ రహదారులుగా కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన విషయాన్ని వారు గుర్తుచేస్తున్నారు. కేంద్ర ప్రభుత్వంలో భాగస్వామి కానప్పటికీ అప్పట్లో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రాష్ట్ర రహదారులను జాతీయ రహదారులుగా అభివృద్ధి చేయడంలో సమర్థవంతమైన పనితీరు కనబరిచింది. ప్రస్తుతం టీడీపీ కూటమి ప్రభుత్వం కేంద్రంలో భాగస్వామిగా ఉన్నప్పటికీ రాష్ట్రరహదారులను జాతీయ రహదారులుగా గుర్తింపు సాధించడంలో ఘోరంగా విఫలమైందని అధికార వర్గాలు వ్యాఖ్యానిస్తున్నాయి.

- శ్రీకాకుళం జిల్లా చిలకపాలెం (చెన్నై-కోల్‌కత జాతీయ రహదారి) నుంచి విజయనగరం జిల్లా రామభద్రపురం మీదుగా పార్వతీపురం జిల్లా కేంద్రం నుంచి ఒడిశాలోని రాయగడ వరకు ఉన్న — 145 కి.మీ. రోడ్డు..
- శ్రీకాకుళం జిల్లా కళింగపట్నం నుంచి పార్వతీపురం జిల్లా కేంద్రం వరకు — 151 కి.మీ. రోడ్డు..
- విజయనగరం నుంచి పార్వతీపురం మన్యం జిల్లా పాలకొండ వరకు — 71 కి..మీ. రోడ్డు..
- కాకినాడ నుంచి కోటిపల్లి మీదుగా అమలాపురం వరకు — 58 కి.మీ. రోడ్డు.

ఈ నాలుగు రాష్ట్రరహదారులను జాతీయ రహదారులుగా కేంద్రం గుర్తిస్తే తదుపరి దశ కింద మరో మూడువేల కి.మీ. మేర రాష్ట్ర రహదారుల జాబితాను కూడా రాష్ట్ర ప్రభుత్వం రూపొందించింది. ఈ విషయాన్ని మార్చిలోనే కేంద్ర ప్రభుత్వ దృష్టికి తీసుకువెళ్లింది. గత ఏడాది డిసెంబరులో పంపిన ప్రతిపాదనలు ఆమోదం పొందిన తరువాత ఆ మూడు వేల కి.మీ. రాష్ట్రరహదారుల జాబితాను కేంద్ర ప్రభుత్వానికి పంపించాలని భావిస్తోంది.

సర్కారు వర్సిటీలకు గడ్డుకాలం!

ఇకపై సొంతంగా ఆదాయం సమకూర్చుకోవాల్సిందే

- పరిశోధనలు, నిర్వహణ ఖర్చులకు నిధులివ్వని కూటమి ప్రభుత్వం
- ద్రవిడియన్ వర్సిటీకి రూ.5.20 కోట్లు అప్పు ఇచ్చిన వైనం
- తిరిగి పదేళ్లలో వడ్డీతో సహా చెల్లించాలని ఆదేశం
- ప్రభుత్వ వర్సిటీకి అప్పివ్వడమేమిటని విస్తుపోతున్న విద్యా రంగ నిపుణులు
- మరోవైపు ప్రైవేటు వర్సిటీలకు వందల ఎకరాలు దోచిపెట్టేందుకు సిద్ధం

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో ప్రభుత్వ విశ్వవిద్యాలయాల మనుగడ ప్రశ్నార్థకంలో పడనుందా? పేదింటి విద్యార్థులు చదువుకునే వర్సిటీల భవిష్యత్తుకు గ్యారంటీ లేకుండా పోతోందా? సొంతంగా ఆదాయం సమకూర్చుకుంటే తప్ప వర్సిటీలు నిలబడలేవా? పత్రిక ప్రకటనల్లో మినహా వర్సిటీల బలోపేతానికి ప్రభుత్వ చర్యలు శూన్యమేనా? ఈ ప్రశ్నలన్నింటికీ అవుననే సమాధానం వినిపిస్తోంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రభుత్వ వర్సిటీల పరిస్థితి అగమ్య గోచరంగా తయారైంది. ముఖ్యంగా ఆర్థిక విషయాల్లో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి. సకాలంలో ఆచార్యులకు, బోధనేతర సిబ్బందికి జీతాలు చెల్లించలేని దుస్థితిలో కొట్టుమిట్టాడుతున్నాయి. విద్యార్థుల నుంచి వసూలు చేసిన ఫీజుల మొత్తంలో నుంచే అడ్వాన్సుగా జీతాలు తీసుకుంటున్న పరిస్థితి. వర్సిటీల సమగ్ర అభివృద్ధికి చేయూత ఇవ్వాల్సిన ప్రభుత్వం.. చరిత్రలో ఎన్నడూ లేని విధంగా వాటితో వడ్డీ వ్యాపారం చేస్తోంది. కేవలం బోధన, బోధనేతర సిబ్బందికి బడ్జెట్ కేటాయిస్తే సరిపోతుందని భావిస్తూ.. విద్యా సంబంధిత అంశాలకయ్యే ఆర్థిక భారాన్ని అదే వర్సిటీలపై



వదిలేస్తోంది. అంటే.. మీరే సంపాదించుకుని.. మీరే పాఠాలు చెప్పుకోండి అన్న చందాన వ్యవహరిస్తోంది. ఇందుకు నిదర్శనమే ఇటీవల ద్రవిడియన్ వర్సిటీకి నామినల్ వడ్డీకి రూ.5.20 కోట్లు అప్పుగా ఇవ్వడం. ఇందులో మూడేళ్ల మారిటోరియం అనంతరం పదేళ్లలోపు వర్సిటీ ఆ మొత్తాన్ని వడ్డీతో కలిపి ప్రభుత్వానికి తిరిగి చెల్లించాలని ఉన్నత విద్యాశాఖ కార్యదర్శి జారీ చేసిన ఉత్తర్వుల్లో పేర్కొనడం గమనార్హం. గతంలో ఎన్నడూ, ఏ ప్రభుత్వం కూడా ఒక ప్రభుత్వ వర్సిటీకి ఇలా అప్పుగా నిధులు ఇచ్చిన దాఖలాలు లేవని, పరిశోధనలకు విరివిగా నిధులు ఇవ్వకుండా ఇలా అప్పుల బాట పట్టించడం దారుణం అని విద్యావేత్తలు మండిపడుతున్నారు.

ఆ అప్పు ఎలా తీరుస్తుంది?

- సాధారణంగా కార్పొరేషన్లకు పూచీకత్తుతో ఆర్థిక సంస్థల నుంచి రుణాలు తెచ్చుకునేలా ప్రభుత్వం వెసులుబాటు ఇస్తుంది. అయితే సీఎం ప్రాతినిధ్యం వహిస్తున్న కుప్పం నియోజకవర్గంలోని ద్రవిడియన్ వర్సిటీకి అప్పుగా నిధులు ఇవ్వడం అనేది ఆ వర్సిటీ మనుగడను ప్రశ్నార్థకంలో పడేసిందనే బలమైన వాదన వినిపిస్తోంది. ఏటా కేవలం 300-350 మేర అడ్మిషన్లు ఉండే ద్రవిడియన్ వర్సిటీ ఏ ఆదాయంతో అప్పును తీర్చగలదని నిపుణులు ప్రశ్నిస్తున్నారు. పైగా ఈ వర్సిటీకి దూర విద్య కేంద్రం కూడా లేదు.
- ఒకవైపు అప్పులతో వర్సిటీని నడపాలని చెబుతున్న ప్రభుత్వం.. మరోవైపు అస్మదీయులకు రాజకీయ పునరావాసం కింద ఇక్కడ ఉద్యోగాలు కల్పిస్తూ ప్రజా ధనాన్ని దుర్వినియోగం చేస్తుండటం కళ్లెదుటే కనిపిస్తోంది. ప్రపంచ స్థాయి వర్సిటీలను ఏపీకి తీసుకొస్తామంటూ ఊదరగొడుతున్న కూటమి సర్కారు స్థానిక ప్రభుత్వ వర్సిటీలను మాత్రం గాలికొదిలేసింది.
- మరోవైపు అనుయాయుల సంస్థలకు, ప్రైవేట్ వర్సిటీలకు రూ.వేల కోట్ల విలువ చేసే వందల ఎకరాల భూములను అప్పనంగా ఇచ్చేందుకు సిద్ధంగా ఉంది. ప్రైవేటు వర్సిటీలకు భూములిస్తే రూ.లక్షల్లో ఫీజులు వసూలు చేసి లాభాలు గడిస్తాయి కానీ, ఒక్క పేద విద్యార్థికి కూడా వాటిలో చదువుకునే వెసులుబాటు ఉండదు. అలాంటప్పుడు ప్రభుత్వ వర్సిటీలే పేద విద్యార్థులకు దిక్కవుతాయి.
- ఆంధ్ర, శ్రీవెంకటేశ్వర, జేఎన్‌టీయూ కాకినాడ వంటి వర్సిటీలు ఎక్కువ మంది విద్యార్థుల ప్రవేశాలతో, దూర విద్య కోర్సులతో ఆర్థికంగా బలంగా ఉన్నాయి. మిగిలిన వర్సిటీలు కేవలం ప్రభుత్వం ఇచ్చే బడ్జెట్‌పైనే ఆధారపడి నడుస్తున్నాయి. ఇవన్నీ కూడా స్వయం సమృద్ధి సాధిస్తేనే మనుగడలో ఉంటాయని ద్రవిడియన్ వర్సిటీ ఉదంతం ద్వారా ప్రభుత్వం సందేశం ఇచ్చినట్లే.

దేశ, విదేశాల్లో ఘనంగా వైఎస్సార్ జయంతి

సాక్షి నెట్‌వర్క్: వైఎస్ రాజశేఖరరెడ్డి 76వ జయంతి సందర్భంగా ఏపీ, తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు, ఢిల్లీ సహా వివిధ రాష్ట్రాల్లో.. అమెరికా, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్, కెనడా, యూకే, జర్మనీ, దక్షిణాఫ్రికా, సింగపూర్, మలేసియా, ఒమన్, యూఏఈ, సౌదీ అరేబియా, మలేషియా తదితర దేశాల్లో ఎన్ఆర్ఐ అభిమానులు వైఎస్సార్ సేవలను గుర్తు చేసుకుంటూ ఘనంగా నివాళులర్పించారు. అమెరికాలోని కనెక్టికట్ రాష్ట్రం ఫోర్డ్ నగరంలో పార్టీ యూఎస్ఏ కన్వీనర్ కడప రత్నాకర్ ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. వైఎస్సార్ కటౌట్లు ఏర్పాటు చేసి, కేక్ కట్ చేశారు. ఆస్ట్రేలియాలోని అడెలైడ్‌లోని పామ్స్ బాంకెట్ హాల్లో డాక్టర్ వైఎస్సార్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో అంగరంగ వైభవంగా వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఫెడరల్ ఎంపీ టోనీ జప్పియా ముఖ్య అతిథిగా, రాజేంద్ర పాండే (విశ్వ హిందూ పరిషత్), ఆదిరెడ్డి యారా (అడిలైడ్ తెలంగాణ అసోసియేషన్) ప్రత్యేక అతిథులుగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ వైఎస్సార్ ఫౌండేషన్ కమిటీ సభ్యులు వంశీ బొంతు, రామ్ మోహన్ రెడ్డి మునగాల, కిషోర్ అనుమోలు, ఉదయ్ కుంధం, వెంకట నవీన్ గుర్రాల, వైఎస్సార్‌సీపీ నాయకులు విజయ్ వంగ, చారీ ఆలేట, వర్ధన్ రెడ్డి రేగళ్ల, అర్వింద్ రెడ్డి బైక తదితరులు పాల్గొన్నారు.

నాయీబ్రాహ్మణులు ఆత్మగౌరవాన్ని కాపాడుకోవాలి

ఏబీఎస్పీ జాతీయ సమన్వయకర్త పూర్ణచంద్రరావు

సాక్షి, అమరావతి: నాయీబ్రాహ్మణుల ఆత్మగౌరవాన్ని కాపాడుకోవాల్సిన అవసరమొచ్చిందని ఏబీఎస్పీ జాతీయ సమన్వయకర్త, మాజీ డీజీపీ డాక్టర్ జె.పూర్ణచంద్రరావు అన్నారు. ఆంధ్రప్రదేశ్ నాయీబ్రాహ్మణ వృత్తిదారుల గౌరవ, రక్షణ చట్టం తేవాలని కూటమి ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ విజయవాడలో మంగళవారం రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఇందులో పూర్ణచంద్రరావు మాట్లాడుతూ..గౌరవప్రదమైన కులవృత్తిని మంటగలుపుతున్న కార్పొరేట్ సెలూన్‌లను అడ్డుకోవాలని పిలుపునిచ్చారు. నాయీబ్రాహ్మణులందరూ ఏకతాటిపై నిలబడి కులవృత్తిలో ఎదురవుతున్న సమస్యలపై పోరాడాలన్నారు. ఎవరైనా మెడికల్ షాపు పెట్టుకోవాలంటే బీ ఫార్మసీ వంటి డిగ్రీలు ఉంటేనే లైసెన్స్ ఇస్తారని, అలాగే ఇప్పుడు సెలూన్లు పెట్టుకోవాలన్నా కూడా తప్పనిసరిగా నాయీబ్రాహ్మణ కుల ధ్రువీకరణ పత్రం ఉండేలా ప్రభుత్వం చట్టం తేవాలని డిమాండ్ చేశారు. ఈ విషయమై ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేలా రాష్ట్రంలోని నాయీబ్రాహ్మణులంతా నల్లచొక్కాలు, నల్ల టీషర్టులు ధరించి 40 రోజులపాటు దీక్షగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు.

టీచర్ల క్యాడర్ నిర్ధారించి వేతనాలు చెల్లించాలి

సాక్షి, అమరావతి: రాష్ట్ర వ్యాప్తంగా బదిలీ అయిన ఉపాధ్యాయులకు కొత్త క్యాడర్ స్ట్రెంత్‌ను వెంటనే తుది రూపునిచ్చి జూన్, జూలై నెలల వేతనం చెల్లించాలని ఏపీటీఎఫ్ అమరావతి రాష్ట్ర అధ్యక్షుడు సీవీ ప్రసాద్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వివరాలన్నింటినీ ట్రెజరీ విభాగానికి, సీఎఫ్ఎంఎస్ విభాగానికి చేరేటట్లు చూడాలన్నారు. గత నెల వేతనాల బకాయిల సప్లిమెంటరీ బిల్లులు చేసుకునేందుకు ఈనెల 15 వరకు గడువు పెంచాలని విజ్ఞప్తి చేశారు. బదిలీ అయిన ఉపాధ్యాయులందరికీ పొజిషన్ ఐడీలు ఇవ్వాలన్నారు.

పెన్షనర్లను పట్టించుకోని ప్రభుత్వం: ఎస్టీయూ

పదవీ విరమణ చేసిన ఉద్యోగ, ఉపాధ్యాయులకు గ్రాట్యూటీ, ఈఎల్ ఎన్‌క్యాష్‌మెంట్ తదితర తుది చెల్లింపులు ప్రభుత్వం చెల్లించడం లేదని రాష్ట్రోపాధ్యాయ సంఘం (ఎస్టీయూ) రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎల్.సాయి శ్రీనివాస్, మల్లు రఘునాథ రెడ్డి ఓ ప్రకటనలో అసంతృప్తి వ్యక్తం చేశారు.

నిరంతర విద్యుత్ అందించండి

- ఎనర్జీ అసిస్టెంట్ల సేవలను వినియోగించుకోండి
- విద్యుత్ సరఫరాపై సీఎస్ కె.విజయానంద్ సమీక్ష

సాక్షి, అమరావతి: విద్యుత్ వినియోగదారులకు నాణ్యమైన, నిరంతర విద్యుత్ సరఫరాకు అన్ని చర్యలు తీసుకోవాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ విద్యుత్ శాఖ అధికారులను ఆదేశించారు. ఆంధ్రప్రదేశ్ తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ (ఏపీఈపీడీసీఎల్), ఆంధ్రప్రదేశ్ దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ (ఏపీఎస్పీడీసీఎల్) పరిధిలో విద్యుత్ సరఫరాపై మంగళవారం ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎస్ మాట్లాడుతూ..విద్యుత్ సరఫరాలో ఏవైనా అంతరాయాలు తలెత్తితే తక్షణం స్పందించి వాటి పరిష్కారానికి చర్యలు చేపట్టాలన్నారు. వార్డు సచివాలయాల్లో పని చేసే ఎనర్జీ అసిస్టెంట్లు పెన్షన్ పంపిణీ రోజు మాత్రమే ఆ విధులకు హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని మిగిలిన సమయాల్లో విద్యుత్ సేవలకు ఉపయోగించుకోవాలని సీఎండీలను విజయానంద్ ఆదేశించారు. వ్యవసాయ మోటార్లు, కనెక్షన్ల కార్యక్రమం వేగవంతం చేయాలని, ఇందుకోసం స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్‌ను రూపొందించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో సీఎండీలు ఐ.పృథ్వీ తేజ్, కె. సంతోషరావు, ఏపీట్రాన్స్‌కో గ్రిడ్ డైరెక్టర్ ఏకెవీ భాస్కర్ పాల్గొన్నారు.



విద్యుత్ ఛార్జీలు తగ్గించాలి: సీపీఎం డిమాండ్

సాక్షి, అమరావతి: విద్యుత్ చార్జీలు పెంచబోమని, తగ్గిస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం మరోసారి మోసం చేసిందని, సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు మంగళవారం ఓ ప్రకటనలో మండిపడ్డారు. 2024-25 వినియోగంపై రూ.842 కోట్ల సర్దుబాటు చార్జీలను మోపుతూ సదరన్, సెంట్రల్ విద్యుత్ పంపిణీ సంస్థలు చేసిన తాజా ప్రతిపాదనలను తక్షణమే విరమించుకోవాలని డిమాండ్ చేశారు. అలాగే గోదావరి వరద పెరుగుతోందని భారత వాతావరణ శాఖ ముందస్తు సూచనలకనుగుణంగా ప్రభుత్వం పోలవరం నిర్వాసితులకు రక్షణ శిబిరాలు ఏర్పాటు చేయాలని శ్రీనివాసరావు విజ్ఞప్తి చేశారు.

అవయవమార్పిడి పర్యవేక్షణకు రాష్ట్రస్థాయి స్టీరింగ్ కమిటీ

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో అవయవ, కణజాల మార్పిడి కార్యకలాపాలను పర్యవేక్షించడానికిగాను డైరెక్టరేట్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ (డీఎంఈ) అధ్యక్షతన ఏడుగురు సభ్యులతో రాష్ట్రస్థాయి స్టీరింగ్ కమిటీని ఏర్పాటు చేస్తూ వైద్య, ఆరోగ్య శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కృష్ణబాబు మంగళవారం ఉత్తర్వులిచ్చారు. జాతీయ అవయవ మార్పిడి కార్యక్రమం మార్గదర్శకాల మేరకు ఈ కమిటీని ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ఈ కమిటీలో నెఫ్రాలజీ, యూరాలజీ వైద్యులు, ప్రభుత్వ న్యాయవాది, మంగళగిరి ఎయిమ్స్, గుంటూరు జీజీహెచ్ సూపరింటెండెంట్‌లు సభ్యులుగా వ్యవహరించనున్నారు.

ఆర్ఎస్‌కేల్లో అన్నదాత సుఖీభవ అర్హుల జాబితాలు

వ్యవసాయ శాఖ డైరెక్టర్ ఢిల్లీ రావు

సాక్షి, అమరావతి: అన్నదాత సుఖీభవ-పీఎం కిసాన్ పథకంలో అర్హత పొందిన వారి జాబితాలను సంబంధిత రైతు సేవా కేంద్రం(ఆర్ఎస్‌కే)లలో అందుబాటులో ఉంచినట్లు వ్యవసాయ శాఖ డైరెక్టర్ సేనాపతి ఢిల్లీరావు మంగళవారం తెలిపారు. జాబితాలో తమ పేర్లను పరిశీలించుకోవాలని రైతులకు సూచించారు. ఆర్ఎస్‌కేల్లో ప్రింట్ ఆప్షన్ ఇచ్చామని, అర్హత ఉన్న వారు, తమ సమీప ఆర్ఎస్‌కే కేంద్రాల నుంచి ప్రింట్ కాపీలను పొందవచ్చన్నారు. లేదంటే అన్నదాత సుఖీభవ పోర్టల్‌లో ఆధార్ నంబర్ ద్వారా నో యువర్ స్టేటస్‌లో అర్హతను తెలుసుకోవచ్చన్నారు. మన మిత్ర వాట్సాప్ నంబర్ 9552300009 కు రైతులు తమ ఆధార్ నంబర్ పంపితే, వాట్సాప్ ద్వారా అర్హత వివరాలు తెలుసుకోవచ్చని వివరించారు. అర్హులై ఉండి, ఒక వేళ జాబితాలో పేర్లు లేని పక్షంలో సమీప ఆర్ఎస్‌కేలో అర్జీ సమర్పించడంతో పాటు పోర్టల్‌లోని గ్రీవెన్స్ మాడ్యుల్‌లో కూడా ప్రత్యేకంగా నమోదు చేసుకోవచ్చన్నారు. ఈ అవకాశం ఈ నెల 13 వరకు అందుబాటులో ఉంటుందన్నారు.

పేద కుటుంబాల ప్రగతికి మెప్మా కృషి అవసరం

సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని 20 శాతం అతిపేద కుటుంబాలను పీ-4 పథకం ద్వారా ఆర్థికంగా అభివృద్ధి చేయడమే లక్ష్యమని, ఈ దిశగా మెప్మా సిబ్బంది కృషి చేయాలని పురపాలక పట్టణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి ఎస్.సురేశ్ కుమార్ సూచించారు. మంగళవారం తాడేపల్లిలోని మెప్మా రాష్ట్ర కార్యాలయంలో ఆయన అధ్యక్షతన 15వ ఎగ్జిక్యూటివ్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్పీలకు అందించిన ట్యాబ్‌ల్లో మెప్మా మహిళాకాశం యాప్ ఉపయోగించి వారి విధులను సులభతరం చేయడంపై సమీక్షించారు. సమావేశంలో మెప్మా మిషన్ డైరెక్టర్ తేజ్ భరత్ పాల్గొన్నారు.

'ద.మ. రైల్వే' సూపరింటెండెంట్‌పై ఆదాయానికి మించి ఆస్తుల కేసు

సాక్షి, హైదరాబాద్: ఆదాయానికి మించిన ఆస్తులు కలిగి ఉన్నారన్న ఆరోపణలపై దక్షిణ మధ్య రైల్వేలోని సికింద్రాబాద్ డివిజన్ సంచాలన్ భవన్‌లో ఆఫీస్ సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్న ఏఆర్ రాజశేఖర్‌పై సీబీఐ అధికారులు సోమవారం కేసు నమోదు చేశారు. ఏఆర్ రాజశేఖర్, ఆయన భార్య నవనీతోపాటు మరికొందరు ప్రైవేటు వ్యక్తులను ఈ కేసులో నిందితులుగా చేర్చారు. మొత్తం రూ.1,54,75,309 విలువైన ఆస్తులు అక్రమంగా సంపాదించినట్టు గుర్తించారు. రాజశేఖర్‌పై ప్రివెన్షన్ ఆఫ్ కరప్షన్ యాక్ట్ సెక్షన్ 13 (2), 13 (1) కింద కేసు నమోదు చేసిన సీబీఐ అధికారులు, రాజశేఖర్ అక్రమార్జనపై దర్యాప్తు చేసేందుకు తెలంగాణ ప్రభుత్వ అనుమతి కూడా తీసుకున్నారు.

విద్యుత్ చార్జీల పెంపు ప్రతిపాదన వెనక్కితీసుకోవాలి

వైఎస్సార్‌సీపీ అధికార ప్రతినిధి పుత్తా శివశంకర్ రెడ్డి డిమాండ్



సాక్షి,అమరావతి: విద్యుత్ చార్జీలు పెంచాలన్న డిస్కంల ప్రతిపాదనలను ప్రభుత్వం వెంటనే ఉపసంహరించుకోవాలని వైఎస్సార్‌సీపీ అధికార ప్రతినిధి పుత్తా శివశంకర్‌రెడ్డి డిమాండ్ చేశారు. సీఎం చంద్రబాబు, ఆయన కుమారుడు లోకేశ్ ఎన్నికలకు ముందు ఏ సభకు వెళ్లినా రాబోయే ఐదేళ్లలో విద్యుత్ ఛార్జీలు పెంచబోమని హామీ ఇచ్చారని.. తీరా అధికారంలోకి రాగానే చార్జీల భారం మోపారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తొలి ఏడాదిలోనే రూ.15,485 కోట్ల విద్యుత్ బిల్లుల భారం మోపిందని ధ్వజమెత్తారు. ఇక రెండో ఏడాదికి వచ్చేటప్పటికి రూ.3,629.87 కోట్ల అదనపు చార్జీలు వసూలు చేయాలని డిస్కంలు విద్యుత్ నియంత్రణ మండలికి ప్రతిపాదనలు పంపించాయని, దీంతో కూటమి సర్కారు మరోమారు వడ్డనకు సిద్ధమైందని మండిపడ్డారు. మొత్తం రెండేళ్లలో కలిపి రూ.19,115 కోట్లు విద్యుత్ చార్జీల రూపంలో భారం వేస్తోందని విమర్శించారు. కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ హామీలకు మంగళం పాడిందని, ప్రతి పథకంలోనూ కోత విధిస్తోందని ధ్వజమెత్తారు. ఐదు లక్షల పెన్షన్లను తొలగించిందని ధ్వజమెత్తారు. సంపద సృష్టి అంటే ప్రజలపై భారం వేయడమేనా అని ప్రశ్నించారు. వెంటనే విద్యుత్ చార్జీలు తగ్గించకుంటే వైఎస్సార్‌సీపీ పోరాటం చేస్తోందని స్పష్టం చేశారు. చంద్రబాబు ప్రభుత్వం నిర్లక్ష్యం వల్ల విద్యుత్ సంస్థలు అప్పుల్లో కూరుకుపోతున్నాయని విమర్శించారు. 'వైఎస్సార్ సీపీ హయాంలో వైఎస్ జగన్ దూరదృష్టితో వ్యవహరించారు. రూ.50వేల కోట్లు డిస్కంలకు సబ్సిడీ రూపంలో చెల్లించారు. ఎస్సీ, ఎస్టీలకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్‌ను ఐదేళ్లపాటు నిరంతరాయంగా ఇచ్చారు. ఆక్వా రైతులకు యూనిట్ రూ.1.50కే అందించారు.' అని పుత్తా శివశంకర్ రెడ్డి పేర్కొన్నారు.

ఉచిత బస్సు జిల్లా వరకే..!

- ఢిల్లీలో మంత్రి అచ్చెన్నాయుడు వ్యాఖ్యలు
- గతంలో ఇదే తరహా ప్రకటన చేసిన మంత్రి సంధ్యారాణి
- ప్రతిపాదనలు సిద్ధం చేసిన రవాణాశాఖ!



సాక్షి, న్యూఢిల్లీ: సూపర్ సిక్స్ హామీల్లో ఒకటైన మహిళలకు ఉచిత బస్సు హామీకి కూటమి ప్రభుత్వం ఆంక్షల బ్రేక్ వేస్తోంది. కేవలం జిల్లా వరకు మాత్రమే మహిళల ఉచిత ప్రయాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేస్తోంది. ఈ విషయంపై మంత్రులే లీకులిస్తున్నారు. గతంలో మంత్రి సంధ్యారాణి ఉచిత బస్సు ప్రయాణాన్ని జిల్లాకే పరిమితం చేస్తున్నట్లు ప్రకటించగా.. తాజాగా హస్తిన పర్యటనకు వచ్చిన వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు కూడా జిల్లా వరకే ఉచిత ప్రయాణమని చెప్పారు. దీనిపై రవాణాశాఖ ఇప్పటికే ప్రతిపాదనలు సిద్ధం చేసినట్టు సమాచారం. ఆగస్టు 15 నుంచి పాత జిల్లాల పరిధిలోనే ఉచిత బస్సు పథకం అమలు చేయాలని సర్కారు నిర్ణయించినట్టు తెలుస్తోంది. ఇది మహిళలను మోసగించడమేనని సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

ఉద్దేశపూర్వకంగానే మంత్రుల ద్వారా లీకులు!

ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగానే ఉచిత బస్సుపై మంత్రుల ద్వారా లీకులు ఇప్పిస్తోందని రాజకీయవర్గాల్లో చర్చ జరుగుతోంది. హామీ ఇచ్చేటప్పుడు లేని ఆంక్షలు ఇప్పుడు ఎందుకనే వాదన సర్వత్రా వినిపిస్తోంది. గతంలో మంత్రి సంధ్యారాణి జిల్లా వరకే ఉచిత బస్సు అని ప్రకటించి తాను అలా అనలేదని ఆనక మాట మార్చారు. ఇప్పుడు అచ్చెన్నాయుడు పాత జిల్లాల వరకే ఉచిత బస్సు ప్రయాణ అమలుకు ఉన్న సాధ్యాసాధ్యాలను సీఎం చంద్రబాబు పరిశీలిస్తున్నట్టు నర్మగర్భంగా వ్యాఖ్యానించారు. ఉచిత బస్సు వల్ల భారం పడుతుందని అనుకూల పత్రికల ద్వారా విస్తృత ప్రచారం చేయిస్తున్నారు. దీనిపై సర్వత్రా వ్యతిరేకత వ్యక్తమవుతోంది. హామీ ఇచ్చేటప్పుడు భారం పడుతుందని తెలీదా అంటూ అక్కచెల్లెమ్మలు మండిపడుతున్నారు.

ఐఐటీ, నీట్‌లో అర్హత సాధిస్తే రూ. లక్ష

- అంబేడ్కర్ గురుకులాల విద్యార్థులకు ప్రోత్సాహం
- ఆంధ్రప్రదేశ్ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్ సొసైటీ బోర్డు ఆఫ్ గవర్నెన్స్ నిర్ణయం


సాక్షి, అమరావతి: ఐఐటీ, నీట్‌లో అర్హత సాధించి మెడిసిన్, ఇంజినీరింగ్‌లో సీట్లు తెచ్చుకున్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకులాల విద్యార్థులకు రూ.1 లక్ష ప్రభుత్వ ప్రోత్సాహం అందించాలని ఆంధ్రప్రదేశ్ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్ సొసైటీ బోర్డు ఆఫ్ గవర్నెన్స్ నిర్ణయించింది. రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీబాల వీరాంజనేయస్వామి అధ్యక్షతన మంగళవారం తాడేపల్లిలోని సంస్థ కార్యాలయంలో సమావేశం జరిగింది. ఇందులో పలు కీలక నిర్ణయాలను ఆమోదించారు. ఐఐటీ, నీట్‌లో అతి తక్కువ మార్కులతో అర్హత సాధించలేకపోయిన 120 మంది విద్యార్థులకు లాంగ్ టెర్మ్ కోచింగ్ ఇచ్చేందుకు నిర్ణయించారు. రాష్ట్రంలోని 10 ఐఐటీ, నీట్ ఎక్సలెన్సీ సెంటర్లలో నియామకాలు, గురుకులాలు, ఎస్సీ సంక్షేమ వసతి గృహాల విద్యార్థులకు 11 రకాల వస్తువులతో కాస్మోటిక్ కిట్లు, గురుకులాల్లో మిగిలిపోయిన సీట్లకు స్పాట్ అడ్మిషన్లు చేపట్టాలని నిర్ణయించారు.

విద్యార్థిని కుటుంబానికి రూ. 3లక్షలు

గత విద్యా సంవత్సరంలో అనారోగ్యంతో మృతి చెందిన పల్నాడు జిల్లా వినుకొండ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకులానికి చెందిన ఆరో తరగతి విద్యార్థిని సంకీర్తన బాయి తల్లిదండ్రులకు సాంత్వన పథకం కింద రూ.3 లక్షల చెక్కును మంత్రి శ్రీ బాల వీరాంజనేయస్వామి అందజేశారు. ఈ సమావేశంలో సోషల్ వెల్ఫేర్ సెక్రటరీ ఎంఎం నాయక్, అంబేడ్కర్ గురుకులాల సంస్థ కార్యదర్శి ప్రసన్న వెంకటేశ్, సోషల్ వెల్ఫేర్ డైరెక్టర్ లావణ్య వేణి తదితరులు పాల్గొన్నారు.

సాగుబడి

పునర్వసు కార్తె: 7 నుంచి



ఆక్వాకల్చర్ అంటే చేపలు, రొయ్యలు ఇతర జలజీవులను పెంచటమే. ఇది ప్రపంచంలోనే వేగంగా పెరుగుతున్న ఆహార ఉత్పత్తి విధానం. సముద్రాలలో సహజంగా దొరికే చేపలు తగ్గిపోవటంతో ఆక్వాకల్చర్ ద్వారా మనకు అవసరమైన చేపల్ని అందిస్తున్నారు. ప్రస్తుతం మనం తినే చేపల్లో సగం కంటే ఎక్కువ ఆక్వాకల్చర్ నుంచే వస్తున్నాయి. చెరువుల నుంచి పటిష్టమైన రీసర్క్యులేటరీ ఆక్వాకల్చర్ సిస్టమ్(ఆర్ఎఎస్)ల వరకు ఆక్వాకల్చర్ మనకు ఆహార భద్రతను కల్పిస్తూ ప్రకృతిని కూడా కాపాడుతుంది. ఆర్ఎఎస్ సాధారణ చెరువుల కన్నా ఎంతో అధునాతనంగా ఉంటుంది. ఇందులో ఉపయోగించే నీటిలో 90 శాతం వరకు నీటిని శుద్ధి చేసి మళ్లీ వాడతారు. దీంతో తక్కువ నీటితో ఎక్కువ చేపలను ఉత్పత్తి చేయటం సాధ్యమవుతుంది. ఈ విధానం ద్వారా నీటి వృథా చాలా తక్కువగా ఉండి, పర్యావరణానికి తోడ్పడుతుంది. ఇది భవిష్యత్తు చేపల సాగుకు ఉత్తమ మార్గం. నార్త్ యూరప్ దేశాల్లో పర్యావరణ ప్రమాణాలకు అనుగుణంగా ఆక్వా సాగు చేయించే క్రమంలో ఆర్ఎఎస్ తొలుత ప్రారంభమైనప్పటికీ తదనంతర కాలంలో అన్ని ఖండాలకూ ఈ మెరుగైన ఆక్వాసాగు పద్ధతి విస్తరిస్తోంది. అదేవిధంగా మన దేశంలోనూ నేషనల్ ఫిషరీస్ డెవలప్‌మెంట్ బోర్డు ద్వారా కేంద్ర ప్రభుత్వం ఆర్ఎఎస్ పద్ధతిలో చేపల సాగుకు పోత్సాహం ఇస్తుండటం విశేషం.

ఆధునిక చేపల సాగు... RAS



- చేపల సాగులో ఆధునిక పోకడ.. రీసర్క్యులేటరీ ఆక్వాకల్చర్ సిస్టమ్స్ (ఆర్ఎఎస్)
- చేపల సాగుకు చక్కని భవిష్యత్తుకు పర్యావరణహితమైన మార్గం ఇది
- అతి తక్కువ నీటి వనరులతో ఆక్వా సాగుతో పాటు అధిక దిగుబడికి దోహదం
- 5 టన్నుల చేపల ఉత్పత్తి యూనిట్‌కు కనీస పెట్టుబడి రూ. 15-25 లక్షలు
- సరైన నిర్వహణ ఉంటే సంవత్సరానికి రూ. 6-8 లక్షల ఆదాయం
- మహిళలు, యువతకు 40%-60% వరకు ప్రధాన మంత్రి స్కీమ్ కింద సబ్సిడీలకు అవకాశం







రీసర్క్యులేటరీ ఆక్వాకల్చర్ సిస్టమ్(ఆర్ఎఎస్) వ్యవస్థలో అనేక భాగాలున్నాయి. ఇందులో ప్రతి భాగమూ కీలకపాత్ర పోషిస్తాయి.

మొదటిది	:	కల్చర్ ట్యాంక్. ఇది చేపల పెంచే ప్రధాన నీటి ట్యాంకు. ఇక్కడే పెంపకం జరుగుతుంది.
రెండోది	:	మెకానికల్ ఫిల్టర్. నీటి నుంచి తుప్పు, చెత్త వంటి ఘనపదార్థాలను తొలగిస్తుంది.
మూడోది	:	బయో ఫిల్టర్. మంచినీటి జీవక్రియ ద్వారా విషకర నైట్రోజన్ పదార్థాలను తొలగిస్తుంది.
నాలుగోది	:	యువి లేదా ఓజోన్ యూనిట్. నీటిలో క్రిములు, బ్యాక్టీరియా, వైరస్‌లను నశింపజేస్తుంది.
ఐదోది	:	సంప్ ట్యాంక్. నీటి ఫిల్టర్ అయిన తర్వాత తాత్కాలికంగా నీటిని నిల్వచేసే ట్యాంక్.
ఆరోది	:	పంప్. పంపు నీటిని తిరిగి ట్యాంకుకు పంపిస్తుంది.
ఏడోది	:	ఎయిరేషన్ వ్యవస్థ. ఆక్సిజన్‌ను నీటిలో కలిపి చేపలకు జీవనాయువును అందించేదే ఎయిరేషన్ వ్యవస్థ.

ఈ విధంగా ఆర్ఎఎస్‌లో ప్రతి భాగమూ కలిసి పనిచేస్తూ, ఒక సురక్షితమైన పర్యావరణ మిత్రమైన చేపల పెంపక పద్ధతిని అందిస్తాయి.



చేపలు.. కల్చర్ ట్యాంకులో పెరుగుతాయి. వాటి ద్వారా నీటిలో మలినాలు ఏర్పడతాయి. ఈ నీరు ముందుగా మెకానికల్ ఫిల్టర్ ద్వారా వెళ్తుంది. చెత్తను తొలగిస్తుంది. ఆ తర్వాత ఈ నీరు బయో ఫిల్టర్‌లోకి ప్రవహిస్తుంది. ఈ నీటిలో ఉన్న అమ్మోనియా, నైట్రేట్ వంటి విష తుల్యమైన నైట్రోజన్‌ను ఖచ్చితంగా తొలగిస్తుంది. తర్వాత యువి లేదా ఓజోన్ యూనిట్‌కు నీరు వెళ్తుంది. ఇక్కడ నీటిలో ఉన్న సూక్ష్మ జీవులు, బ్యాక్టీరియా వంటివి నశిస్తాయి. ఇలా శుద్ధి అయిన నీరు సంప్ ట్యాంక్‌కు చేరుతుంది. అక్కడి నుంచి పంప్ సాయంతో మళ్లీ కల్చర్ ట్యాంకుకు నీరు వెళ్తుంది. ఈ మొత్తం వ్యవస్థలో ఎయిరేటర్ ద్వారా నీటిలోకి ఆక్సిజన్ కూడా అందజేయబడుతుంది. ఇది చేపల ఆరోగ్యానికి కీలకం.

ఆధునిక టెక్నాలజీ

ఇప్పటి వరకు చేపల సాగు మాదిరిగా ఇది సాంప్రదాయి పద్ధతిలో చేపల పెంపకం కాదు. ఆధునిక సాంకేతికతతో కూడిన స్మార్ట్ వ్యవస్థను వాడుకునే పద్ధతి ఇది. రీసర్క్యులేటరీ ఆక్వా కల్చర్‌లో ఇప్పుడు ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ (ఐఓటీ) సెన్సార్లు ఉపయోగించి, నీటి గుణ, నిల్వలపై కంట్రోల్ పెరుగుతుంది. అంటే, మొబైల్ ఫోన్ ద్వారా పిహెచ్, ఆక్సిజన్, టెంపరేచర్ వంటివి మనం చెరువులకు దూరంగా ఉండి కూడా సులువుగా తెలుసుకోవచ్చు.

ఆర్ఎఎస్‌లో పెంచతగిన చేపల జాతులు:

1. తిలాపియా 2. ఫంగాషియాస్
3. సీబాస్ (పండుగప్ప)
4. మారెల్ 5. ట్రౌట్.

ఆర్ఎస్ చేపల సాగులో ప్రధాన నీటి ప్రమాణాలు:

1. నీట కరిగిన ఆక్సిజన్ (డిజాల్వ్‌డ్ ఆక్సిజన్). చేపలు పెరిగే ట్యాంకులో లీటరు నీటికి 5 మిల్లీ గ్రాముల కన్నా ఎక్కువగా ఉండాలి. ఇది చేపల శ్వాసకు అవసరం.



2. ఉష్ణోగ్రత: 25 నుంచి 30 డిగ్రీల సెల్సియస్ వరకు మెయింటెయిన్ చేస్తూ ఉండాలి.

3. ఉదజని సూచిక (పిహెచ్): 6.5 నుంచి 8.5 మధ్యలో ఉండాలి.

4. అమ్మోనియా: ఇది లీటరు నీటికి 0.02 మిల్లీగ్రాముల కన్నా తక్కువగా ఉండాలి.

5. నైట్రైట్: ఇది బాగా తక్కువగా ఉండాలి. అంటే, లీటరు నీటికి 0.1 మిల్లీ గ్రాము కంటే తక్కువగా ఉండాలి.

6. టోటల్ సస్పెండెడ్ సాలిడ్స్ (టిఎస్ఎస్): ఇది 50 మిల్లీ గ్రాముల కంటే చాలా తక్కువగా ఉండాలి.

7. కార్బన్ డయాక్సయిడ్: ఇది 10 నుంచి 15 మిల్లీగ్రాముల కంటే తక్కువగా ఉండాలి.

ఇవన్నీ సమానంగా మెయింటెయిన్ చేసుకుంటూ ఉంటే ఆర్ఎఎస్ సిస్టం సక్రమంగా నడుస్తుంది.

ఆర్ఎఎస్ ఉపయోగాలు:

ఆర్ఎఎస్ చేపల సాగు అంటే సాంకేతికతతో కూడిన భద్రతా వ్యవస్థ. ఇందులో నీటి వాడకం తక్కువగా ఉండటం వలన, అదే నీటిని మళ్లీ మళ్లీ వాడటం వల్ల నీరు పొదుపు అవుతుంది. తక్కువ వనరులతో అధిక ఉత్పాదకత సాధించవచ్చు. అంటే, తక్కువ స్థలంలో ఎక్కువ దిగుబడి. వాతావరణంపై అంతగా ఆధారపడదు. కాబట్టి, ఏ కాలంలో అయినా మనం ఆర్ఎఎస్ సాగు చేసుకోవచ్చు. వ్యాధుల నియంత్రణ చాలా సులభంగా చేసుకోవచ్చు. ఎందుకంటే, నీటి నాణ్యతా యాజమాన్యం అంతా మన చేతిలోనే ఉంటుంది. మురుగు నీరు బయటకు పోదు. ఆ విధంగా ఆర్ఎఎస్ అనేది పర్యావరణాన్ని కాపాడుతుంది. ఇది భవిష్యత్తులో మరింత విస్తరించే చేపల సాగు వ్యవస్థ.

కనీస పెట్టబడి రూ. 15 లక్షలు

ఒక చిన్న స్థాయి ఆర్ఎఎస్ చేపల సాగు యూనిట్‌ను ఏర్పాటు చేసుకోవాలంటే ముఖ్యంగా గమనించాల్సిన అంశాలు ఇవి..

● 5 టన్నుల సామర్థ్యంతో ఆర్ఎఎస్ యూనిట్‌ను ఏర్పాటు చేయాలంటే దాదాపు రూ. 15 నుంచి 25 లక్షల వరకు పెట్టుబడి పెట్టాల్సి ఉంటుంది ● నిత్యం అయ్యే నిర్వహణ ఖర్చులు, చేపల ఆహారం, విద్యుత్తు, కూలి ఖర్చులు.. ఇలాంటివి ఉంటాయి ● సరైన నిర్వహణ ఉంటే ఈ వ్యవస్థ ద్వారా సంవత్సరానికి రూ. 6 నుంచి 8 లక్షల ఆదాయం పొందవచ్చు. అంతేకాకుండా ఈ పెట్టుబడిని మూడు నుంచి ఆరు సంవత్సరాల లోపే తిరిగి పొందగలుగుతారు ● తిలాయిపియా, ఫంగాసియస్, ముర్రెల్, సీబాస్ వంటి చేపలను ఇందులో పెంచుకోవచ్చు. వీటికి మార్కెట్‌లో మంచి గిరాకీ ఉంది. ప్రభుత్వ మద్దతుతో గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు కొత్త వెలుగుగా మారింది.

ఆర్ఎఎస్‌కు ఎదురవుతున్న సవాళ్లు:

1. ప్రారంభ పెట్టుబడి ఎక్కువగా ఉంటుంది. చిన్న రైతులకు ఇది చాలా పెద్ద పెట్టుబడి అవుతుంది.

2. ఈ వ్యవస్థ నడిపించడానికి నిపుణుల అవసరం ఉంది. అంటే, శిక్షణ పొందిన వ్యక్తుల అవసరం చాలా ఎక్కువగానే ఉంది.

3. ఈ వ్యవస్థ ఎక్కువ విద్యుత్తును వినియోగిస్తుంది. ముఖ్యంగా నీటి శుద్ధి, ఆక్సిజన్ సరఫరా కోసం విద్యుత్తు కావాలి.

4. సిస్టమ్ ఫెయిల్యూర్ రిస్క్ ఎక్కువ. పంపులు, ఫిల్టర్‌లు పనిచేయకపోతే సిస్టమ్‌లు ఫెయిల్యూర్ అవ్వటం వల్ల రిస్క్ చాలా ఎక్కువగా ఉంటుంది. అంటే, చిన్న పొరపాటుకు పెద్ద నష్టం జరుగుతుందన్న మాట. కాబట్టి, ఆర్ఎఎస్ చేపల సాగు ప్రారంభించే ముందు అన్ని అంశాలనూ పరిశీలించాలి.

40%-60% వరకు కేంద్ర ప్రభుత్వ సబ్సిడీ

ఆర్ఎఎస్ చేపల సాగు తీరప్రాంతాల రైతులకు ఇప్పుడు ఉత్తమ అవకాశంగా మారింది. ఎందుకంటే, తీర ప్రాంతపు మట్టి (అంటే లావా మట్టి) ఆర్ఎఎస్ స్థాపించడానికి చాలా అనుకూలంగా ఉంటాయి. ఇంకా ఫిష్ ఫీడ్ అందుబాటులో ఉండటం, నిపుణుల సహాయం అందుబాటులో ఉండటం వల్ల ఈ సాగు మరింత లాభదాయకంగా మారుతుంది. పిఎంఎంఎస్‌వై అనే కేంద్ర ప్రభుత్వ పథకం ద్వారా రైతులకు ప్రోత్సాహకాలు, శిక్షణ, మార్గదర్శకత అందుతున్నాయి. పెట్టుబడులపై సబ్సిడీలు 40 శాతం నుంచి 60% వరకు లభిస్తున్నాయి. ఇది యువతకు, మహిళలకు, కొత్త రైతులకు గొప్ప అవకాశం. ఈ విధంగా ఆర్ఎఎస్ సాగు తీరప్రాంతాల్లో పరిశ్రమలతో సమానంగా అభివృద్ధి చెందుతోంది. ఇది జీవనోపాధికి, ఆర్థిక అభివృద్ధికి నూతన మార్గాలు చూపుతోంది.

చేపలతో పాటు కూరగాయలు

ఇంకా ఆక్వాపోనిక్స్ ద్వారా చేపల ఉత్పత్తితో పాటు కూరగాయల సాగు కూడా ఈ వ్యవస్థలో జరుగుతోంది. ఇదొక స్మార్ట్ వ్యవస్థ. దీంట్లో తక్కువ ఖర్చుతో ఎక్కువ దిగుబడి సాధ్యమవుతుంది. ఇది ఎగుమతులకు మార్గం వేస్తుంది. మహిళలు, యువత ఆర్ఎఎస్ సాగును సులభంగానే చేపట్టి మంచి ఉపాధి పొందగలుగుతున్నారు.

ఆర్ఎఎస్ కేవలం ఆధునిక చేపల చెరువు మాత్రమే కాదు. శుభ్రమైన, స్థిరమైన చేపల పెంపకానికి సంబంధించిన భవిష్యత్తు గల రంగం ఇది. నీటి పొదుపుగా వాడటం, ఆరోగ్యకరమైన చేపలను పెంచటం, ఎక్కువ దిగుబడి పొందటం.. వంటి ప్రయోజనాల రీత్యా పూర్తిగా పర్యావరణ అనుకూలమైన ఆక్వా సాగుగా ఆర్ఎఎస్ చేపల సాగును అభివర్ణించవచ్చు. ●

టమాటోలు, మిరప తోటల్లో కొన్ని మొక్కలు వాడిపోయి, రంగు మారి ఉంటాయి. ఇతర మొక్కలు బాగున్నా ఇవి పసుపుపచ్చగా వడలినట్లు ఉంటాయి. అవి కొన్నాళ్లకు చనిపోతాయి. వాటిని పీకి చూస్తే వాటి వేర్లపై బుడిపెల మాదిరిగా ఉంటాయి. అలా ఉండటానికి కారణం నెమటోడ్లు.

నెమటోడ్లు అంటే?

మట్టిలో ఉండే నెమటోడ్లు భయంకరమైన సూక్ష్మక్రిములు. అన్ని రకాల మట్టిలో, వివిధ పంటల వేర్లలో, కలుపులో దాగివుండి కూరగాయలు, మిరప తోటలను నాశనం చేస్తుంటాయి. వీటిని నియంత్రించటం కంటే నివారించటమెంతో సులభం. రసాయనిక పురుగుమందులు వాడటం వల్ల ప్రయోజనం కన్నా కీడు ఎక్కువ జరుగుతుంది. అందుకని వాటి నివారణ ఎలాగో తెలుసుకోవటం అవసరం. వేరుముళ్ల నెమటోడ్లు వేర్లలోకి దూరి బుడిపెలను కలిగిస్తాయి. మొక్కల వేర్ల ద్వారా పోషకాలను పీల్చుకుంటూ జీవనం సాగిస్తాయి. దీంతో నెమటోడ్లు సోకిన మొక్కలు పోషకాలు అందక మొక్క వాడిపోయి, ఎండిపోయి, క్రమంగా చనిపోతుంది. నెమటోడ్లు భూమిలో ఎలా ఎదుగుతాయి? నెమటోడ్లు పలు మొక్కల వేర్లలోను, మట్టిలోను జీవిస్తాయి. వీటిని సూక్ష్మదర్శిని లో మాత్రమే చూడగలం. వేర్ల పక్కనే ఆడ నెమటోడ్ వెయ్యి గుడ్ల వరకు

కూరగాయ పంటల్లో నెమటోడ్ల నిర్వహణ ఎలా?

పెడుతుంది. గుడ్లు చాలా చిన్నవిగా ఉంటాయి. గుడ్ల పక్కన ఉన్న వేర్ల నుంచి అనుకూల సూచనలు రాగానే గుడ్ల నుంచి పిల్లలు బయటకు వస్తాయి. వేర్లను చుట్టుకుంటాయి. ఈ చిన్న పురుగులు వేర్లను పొడిచి లోపలికి చేరి, వాటిని తిని కడుపు నింపుకుంటాయి. ఈ క్రమంలో వేర్లకు బుడిపెలు ఏర్పడతాయి. ఆ తర్వాత ఇక మొక్కలకు ఈ వేర్ల ద్వారా పోషకాలు అందవు. దాంతో మొక్కలు కళతప్పి, వాడిపోయి, ఎండి చనిపోతాయి. నెమటోడ్లు అన్ని రకాల మట్టిలోనూ పెరుగుతాయి.





మిరప, కూరగాయ మొక్కల నారును తెచ్చి నాట్లు వేసే ముందు వాటి వేర్లకు ఏమైనా బుడిపెలు ఉన్నాయా అని పరీక్షించాలి. బుడిపెలు ఉన్న మొక్కల్ని నాటకూడదు. మీ పొలం పరిసరాల్లో మొక్కలకు బుడిపెలు ఉన్నాయేమో చూసి, ఉంటే వాటిని నాశనం చెయ్యండి. మొక్కలు నాటడానికి భూమిని సిద్ధం చేసినప్పుడే పాత మొక్కల వేర్లు పూర్తిగా ఏరేసి, మట్టిని ఎండబెట్టాలి. పోయిన ఏడాది మొక్కలకు నెమటోడ్లు సోకిన చోటే పొలంలో తగలబెట్టే అలవాటు కొన్ని ప్రాంతాల రైతుల్లో ఉంది.

నెమటోడ్లను తట్టుకునే ఉపాయాలేమిటి?

నెమటోడ్లు సోకిన టొమాటో, మిరప, కూరగాయ పొలాల్లో పంట మార్పిడి చెయ్యటం మంచిది. ఉల్లి, తోటకూర, తులసి, నిమ్మగడ్డి, కర్రపెండలం, పశుగ్రాస పంటలకు నెమటోడ్లు సోకవని చెబుతున్నారు. కాబట్టి, ఈ పంటలు సాగు చేయవచ్చు. ఆరోగ్యకరమైన నారు పెంచుకోవటం. చేనులో, వాటి దరిదాపుల్లో నెమటోడ్ల మూలాన్ని గుర్తించి నాశనం చెయ్యటం మేలు. నెమటోడ్ నిరోధక శక్తి కలిగిన మొక్కలను తెచ్చి నాటుకొని పండించటం ఉత్తమం. ఇతర చేలల్లో నుంచి నెమటోడ్లతో కూడిన మట్టిని, మొక్కల్ని తేకుండా జాగ్రత్తపడటం అవసరం. నెమటోడ్లతో కూడిన మట్టి నాగళ్లు, ట్రాక్టర్లు, పరికరాలు, కూలీల పాదాలకు, వారి చెప్పులకు కూడా అంటుకొని ఒక పొలం నుంచి వేరే పొలంలోకి వ్యాపిస్తాయి. అందుకని శుభ్రం చేసుకున్న తర్వాతే వారిని పొలాల్లో కి రానివ్వాలి. నెమటోడ్ల నిరోధకత కలిగిన నారును, విత్తనాలను వాడాలి. నెమటోడ్లు సోకిన పొలంలో మొక్కలు పీకేసి, వాటి వేర్లన్నిటినీ ఏరి, కాల్చివేయాలి. మట్టిని తిరగేసి బాగా ఎండనివ్వాలి. ఆ తర్వాతే వేరే పంట వేసుకోవాలి. ప్రవహించే నీటి ద్వారా చేనులోకి నెమటోడ్లు రాకుండా ఉండేలా చేను సరిహద్దుల్లో నిమ్మగడ్డిని కంచె పంటగా పెంచుకోవటం మేలట. ఈ విషయాలను దక్షిణ బెనిన్ రైతుల అనుభవాలను ఉటంకిస్తూ యాక్సెస్ అగ్రికల్చర్ అనే డిజిటల్ అగ్రికల్చర్ విస్తరణ సంస్థ వీడియోను విడుదల చేసింది. ●

బిజినెస్ రీల్

అమెరికన్ సంస్థల్లో కోవాసెంట్ విలీనం



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: హైదరాబాదీ ఏజెంటిక్ ఏఐ సంస్థ కోవాసెంట్ టెక్నాలజీస్ తాజాగా అమెరికాకు చెందిన కోనాఏఐ, డీక్యూబ్ డేటా సైన్సెస్‌లో విలీనమైంది. ఎంటర్‌ప్రైజ్ రిస్క్ మేనేజ్‌మెంట్, సైబర్ సెక్యూరిటీ తదితర విభాగాల్లో ఏజెంటిక్ ఏఐ వినియోగాన్ని మరింతగా పెంచేందుకు ఈ వ్యూహాత్మక విలీనం దోహదపడగలదని కోవాసెంట్ టెక్నాలజీస్ సీఎండీ సీవీ సుబ్రమణ్యం తెలిపారు. ఏఐ ఆధారిత సర్వీసెస్ యాజ్ సాఫ్ట్‌వేర్ విభాగంలో అగ్రగామిగా ఎదిగేందుకు ఉపయోగపడుతుందని వివరించారు. ఇకపై కోవాసెంట్‌కి అనిల్ కోనా సీవోవో, ఎగ్జిక్యూటివ్ డైరెక్టరుగా వ్యవహరిస్తారు. కోనాఏఐ, డీక్యూబ్ వ్యవస్థాపకుడు అయిన అనిల్‌కి ఫోరెన్సిక్ అనలిటిక్స్.. సైబర్ సెక్యూరిటీలో అపార అనుభవం ఉంది.

ఆహార భద్రత నిబంధనలు పాటించకుంటే కఠిన చర్యలు

ఈ-కామర్స్ సంస్థలకు ఎఫ్ఎస్ఎస్ఏఐ హెచ్చరిక



న్యూఢిల్లీ: ఆహార భద్రత ప్రొటోకాల్స్‌ను పాటించడంలో విఫలమైతే తీవ్రంగా పరిగణించాల్సి ఉంటుందని ఈ-కామర్స్ సంస్థలను నియంత్రణ సంస్థ ఎఫ్ఎస్ఎస్ఏఐ హెచ్చరించింది. ఉల్లంఘనల విషయంలో కఠిన చర్యలు ఎదుర్కొనాల్సి ఉంటుందని స్పష్టం చేసింది. ఈ-కామర్స్ ప్లాట్‌ఫాంలకు చెందిన 70 మందికి పైగా ప్రతినిధులతో సమావేశమైన సందర్భంగా ఎఫ్ఎస్ఎస్ఏఐ సీఈవో జి. కమల వర్ధన రావు ఈ విషయాలు తెలిపారు. ఈ-కామర్స్ సంస్థలన్నీ వినియోగదారులకు ఇచ్చే ప్రతి రసీదు, ఇన్‌వాయిస్‌లలో తమ ఎఫ్ఎస్ఎస్ఏఐ లైసెన్సు/రిజిస్ట్రేషన్ నంబర్లను స్పష్టంగా ముద్రించాలని ఆయన ఆదేశించారు. గిడ్డంగులు, స్టోరేజ్ కేంద్రాల్లో పరిశుభ్రత, ఆహార భద్రత ప్రొటోకాల్స్ పాటించాలని రావు సూచించినట్లు ఎఫ్ఎస్ఎస్ఏఐ తెలిపింది.

ప్లాట్ కొనుగోలుకూ రుణం

న్యూఢిల్లీ: ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్ ప్లాట్ కొనుగోలుకు సైతం రుణాలు ఇవ్వనున్నట్లు ప్రకటించింది. కొనుగోలు చేసిన ప్లాట్‌లో తర్వాత ఇల్లు కట్టే ప్రణాళికతో ఉన్న వ్యక్తుల కోసం దీన్ని తీసుకొచ్చినట్లు బ్యాంక్ తెలిపింది.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

9-7-2025

విశాఖ	540-00
చిత్తూరు	633-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	515-00
విజయవాడ	550-00
రిటైల్ ధర (డజను)	78.00
హైదరాబాద్	540-00
వరంగల్	542-00
రిటైల్ ధర	6.00

నిఫ్టీ 50

టాప్ 5 గెయినర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
KOTAKBANK	2,223.90	3.45
ETERNAL	263.65	1.97
ASIANPAINT	2,487.90	1.85
NTPC	342.95	1.63
GRASIM	2,814.60	1.28

నిఫ్టీ 50

టాప్ 5 లూజర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
TITAN	3,440.00	-5.88
DRREDDY	1,284.00	-2.02
BAJAJ-AUTO	8,342.00	-1.44
CIPLA	1,490.00	-1.36
TRENT	5,440.00	-1.07

స్టాక్ మార్కెట్ డేటా

	టర్నోవర్ (రూ. కోట్లలో)
బీఎస్ఈ	8,504
ఎన్ఎస్ఈ	91,044
ఎన్ఎస్ఈ(డెరివేటివ్స్)	1,15,101
ఎఫ్ఐఐ	+ 1,357
డీఐఐ	- 588

ముడిచమురు... (బ్యారల్)

నైమెక్స్ లైట్ స్వీట్	68.33	$ 67.93
బ్రెంట్	70.13	$ 69.58

బడ్జెట్ ధరలో మోటో జీ96 5జీ



ప్రారంభ ధర రూ.17,999

ముంబై: ప్రముఖ మొబైల్ ఫోన్ల తయారీ సంస్థ మోటోరొలా బడ్జెట్ ధరలో 'మోటో జీ96' 5జీ స్మార్ట్‌ఫోన్‌ను లాంచ్ చేసింది. 144 హెచ్‌జెడ్ 3డీ కర్వ్‌డ్ పీఓఎల్ఈడీ డిస్‌ప్లే, గొరిల్లా గ్లాస్ 5 ప్రొటెక్షన్ ఉంది. స్నాప్‌డ్రాగన్ 7ఎస్ జెన్ 2 ప్రాసెసర్‌ని వాడారు. వెనుక 50 ఎంపీ సోనీ ఎల్‌వైటీ-700సీ కెమెరా ఉంది. 5,500 ఎంఏహెచ్ బ్యాటరీతో వస్తుంది. 8 జీబీ ర్యామ్, 256 జీబీ స్టోరేజ్, 8 జీబీ ర్యామ్ + 128బీజీ స్టోరేజ్‌లతో 2 వేరియంట్లు ఉన్నాయి. ప్రారంభ ధర రూ.17,999గా ఉంది. ఈ జూలై 16 నుంచి ఫ్లిప్‌కార్ట్, మోటోరొలా వెబ్‌సైట్లతో పాటు రిటైల్ షాపుల్లో అమ్మకాలు ప్రారంభవుతాయి.

మహీంద్రా నుంచి రెవ్ఎక్స్ సిరీస్ ఎస్‌యూవీలు



ముంబై: మహీంద్రా అండ్ మహీంద్రా కొత్తగా ఎక్స్‌యూవీ 3ఎక్స్‌వో రెవ్ఎక్స్ సిరీస్ ఎస్‌యూవీలను ఆవిష్కరించింది. ఈ వాహనాల ధర రూ. 8.94 లక్షల నుంచి ప్రారంభమవుతుంది. రూ. 10 లక్షల లోపు సీ-ఎస్‌యూవీ సెగ్మెంట్‌లో లెదరెట్ సీట్లు, సన్‌రూఫ్, ప్రీమియం ఇంటీరియర్స్‌తో దీన్ని ఆకర్షణీయంగా తీర్చిదిద్దినట్లు సంస్థ తెలిపింది. కేవలం ఏడాది వ్యవధిలోనే ఎక్స్‌యూవీ 3ఎక్స్‌వో అమ్మకాలు ఒక లక్ష మైలురాయిని దాటినట్లు వివరించింది. ఇది మూడు వేరియంట్స్‌లో లభిస్తుంది.

ఐపీవో స్ట్రీట్

6 కంపెనీలకు ఓకే

- ప్రతిపాదనలకు సెబీ ఆమోదం
- జాబితాలో రైట్ వాటర్, వీడా క్లినికల్
- ఎల్‌సీసీ ప్రాజెక్ట్స్, శ్రింగార్ హౌస్, సీడ్‌వర్క్స్
- వియ్ వర్క్ ఇండియాకు సైతం గ్రీన్‌సిగ్నల్



న్యూఢిల్లీ: క్యాపిటల్ మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీ తాజాగా ఐదు కంపెనీల లిస్టింగ్ సన్నాహాలకు ఓకే చెప్పింది. జాబితాలో రైట్ వాటర్ సొల్యూషన్స్(ఇండియా), వీడా క్లినికల్ రీసెర్చ్, ఎల్‌సీసీ ప్రాజెక్ట్స్, శ్రింగార్ హౌస్ ఆఫ్ మంగళసూత్ర, సీడ్‌వర్క్స్ ఇంటర్నేషనల్ చేరాయి. ఈ ఐదు కంపెనీలు ఐపీవో చేపట్టేందుకు వీలుగా 2025 జనవరి-ఫిబ్రవరి మధ్య సెబీకి ముసాయిదా ప్రాస్పెక్టస్ దాఖలు చేశాయి. మరోపక్క ఈ ఏడాది మార్చిలో వియ్ వర్క్ ఇండియా మేనేజ్‌మెంట్ ఇష్యూపై నిర్ణయాన్ని పక్కనపెట్టిన సెబీ తాజాగా గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. వెరసి ఆరు కంపెనీల నిధుల సమీకరణకు లైన్ క్లియరైంది. వివరాలు చూద్దాం..

ఎంబసీ గ్రూప్ దన్ను



ప్రీమియం, ఫ్లెక్సిబుల్ కార్యాలయాల నిర్వహణ సంస్థ వియ్ వర్క్ ఇండియా మేనేజ్‌మెంట్ పబ్లిక్ ఇష్యూకి అనుమతి లభించింది. ఎంబసీ గ్రూప్ ప్రమోట్ చేసిన కంపెనీ ఐపీవోలో భాగంగా 4.37 కోట్ల ఈక్విటీ షేర్లను విక్రయానికి ఉంచనుంది. సంస్థలో ఇప్పటికే ఇన్వెస్ట్ చేసిన వాటాదారులు వీటిని ఆఫర్ చేయనున్నారు.

క్లీన్ టెక్ కంపెనీ

వాటర్ యాక్సెస్ యాక్సెలరేషన్ ఫండ్ ఎస్ఎల్‌పీకి పెట్టుబడులున్న క్లీన్ టెక్ సంస్థ రైట్ వాటర్ సొల్యూషన్స్ పబ్లిక్ ఇష్యూకి రానుంది. దీనిలో భాగంగా రూ. 300 కోట్ల విలువైన ఈక్విటీని తాజాగా జారీ చేయనుంది. వీటికి అదనంగా ప్రమోటర్లు, ప్రస్తుత వాటాదారులు రూ. 445 కోట్ల విలువైన షేర్లను విక్రయానికి ఉంచనున్నారు. తద్వారా కంపెనీ మొత్తం రూ. 745 కోట్లు సమీకరించాలని చూస్తోంది. ఈక్విటీ జారీ నిధుల్లో రూ. 225 కోట్లు వర్కింగ్ క్యాపిటల్, కార్పొరేట్ అవసరాలకు వెచ్చించనుంది.

ఆభరణాల తయారీ





జ్యువెలరీ తయారీ కంపెనీ శ్రింగార్ హౌస్ ఆఫ్ మంగళ సూత్ర ఐపీవోకు సెబీ అనుమతించడంతో 2.43 కోట్ల ఈక్విటీ షేర్లను తాజాగా జారీ చేయనుంది. ఇష్యూ నిధుల్లో రూ. 250 కోట్లు వర్కింగ్ క్యాపిటల్, సాధారణ కార్పొరేట్ అవసరాలకు వెచ్చించనుంది. ఈ బాటలో సీడ్‌వర్క్స్ ఇంటర్నేషనల్ సైతం లిస్టింగ్ సన్నాహాలు ప్రారంభించనుంది. దీనిలో భాగంగా కంపెనీలో ప్రస్తుత ఇన్వెస్టర్లు 5.19 కోట్ల ఈక్విటీ షేర్లను విక్రయానికి ఉంచనున్నారు. ఈ కంపెనీలన్నీ ఐపీవో ద్వారా బీఎస్ఈ, ఎన్ఎస్ఈలలో లిస్టయ్యే యోచనలో ఉన్నాయి.

ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ సేవలు

ఈపీసీ కంపెనీ ఎల్‌సీసీ ప్రాజెక్ట్స్ పబ్లిక్ ఇష్యూకి సెబీ అనుమతించడంతో లిస్టింగ్ ప్రణాళికల్లో ఉంది. ఇందుకు అనుగుణంగా రూ. 320 కోట్ల విలువైన ఈక్విటీ షేర్లను తాజాగా జారీ చేయనుంది. వీటికి జతగా ప్రమోటర్లు సైతం 2.29 కోట్ల షేర్లను ఆఫర్ చేయనున్నారు. ఈక్విటీ జారీ నిధులను పరికరాల కొనుగోలు, రుణ చెల్లింపులు, సాధారణ కార్పొరేట్ అవసరాలకు వినియోగించనుంది.

క్లినికల్ రీసెర్చ్ సంస్థ

ప్రధానంగా క్లినికల్ రీసెర్చ్ కార్యకలాపాలు సమకూర్చే గుజరాత్ కంపెనీ వీడా క్లినికల్ రీసెర్చ్ ఐపీవోకు రెడీ అవుతోంది. ఇందుకు వీలుగా రూ. 185 కోట్ల విలువైన ఈక్విటీని కొత్తగా జారీ చేయనుంది. అంతేకాకుండా మరో 1.3 కోట్ల షేర్లను ప్రమోటర్, ఇతర వాటాదారులు ఆఫర్ చేస్తారు. ఈక్విటీ జారీ నిధులను మెషినరీ కొనుగోలుతోపాటు రుణ చెల్లింపులకు వినియోగించనుంది.

2024లోనే జేన్ స్ట్రీట్‌పై సెబీ దృష్టి

మాజీ చైర్‌పర్సన్ మాధవీ పురీ బచ్ స్పష్టీకరణ



ముంబై: ఎఫ్అండ్‌వోలో జేన్ స్ట్రీట్ అవకతవకలకు పాల్పడినట్లు 2024 ఏప్రిల్‌లోనే సెబీ గుర్తించినట్లు క్యాపిటల్ మార్కెట్ల నియంత్రణ సంస్థ మాజీ చైర్‌పర్సన్ మాధవీ పురీ బచ్ తాజాగా స్పష్టం చేశారు. ఈ అంశంలో సెబీ విఫలమైనట్లు కొన్ని మీడియా సంస్థలు పేర్కొనడం దురదృష్టకరమని వ్యాఖ్యానించారు. బచ్ ఈ ఏడాది మార్చిలో పదవీ విరమణ చేసిన సంగతి తెలిసిందే. మార్కెట్ మ్యానిప్యులేషన్ ద్వారా జేన్ స్ట్రీట్ రూ. 4,800 కోట్లమేర లాభపడినట్లు సెబీ ఇటీవల ప్రకటించిన అంశాన్ని ఈ సందర్భంగా రాతపూర్వక ప్రకటనలో ప్రస్తావించారు. ఈ విషయంలో కొన్ని మీడియా వర్గాలు వాస్తవాలను గుర్తించకుండా తప్పుడు వ్యాఖ్యానాలు చేయడం అత్యంత దురదృష్టకరమని వ్యాఖ్యానించారు. ఇండెక్స్ మ్యానిప్యులేషన్ గుర్తింపు, సర్క్యులర్ల జారీ, జేన్ స్ట్రీట్‌కు హెచ్చరికల లేఖ తదితర ప్రత్యేక చర్యలను సెబీ తీసుకున్నట్లు వివరించారు. అంతేకాకుండా 2024 అక్టోబర్‌లో విధానపరమైన చర్యలకు సైతం తెరతీసినట్లు తెలియజేశారు. చివరిగా 2025 ఫిబ్రవరిలో జేన్ స్ట్రీట్‌పై సీజ్, నిలుపుదల చర్యలు చేపట్టవలసిందిగా ఎన్ఎస్ఈని ఆదేశించినట్లు పేర్కొన్నారు.

క్రిటికల్ మినరల్స్‌పై జాతీయ విధానం అవసరం



- కేంద్రానికి ఆటో విడిభాగాల పరిశ్రమ వినతి
- స్వయం సమృద్ధి సాధించడంపై దృష్టి పెడుతున్నట్లు వెల్లడి

న్యూఢిల్లీ: దేశీయంగా ఎలక్ట్రిక్ వాహనాల ఉత్పత్తికి ఆటంకాలు ఏర్పడకుండా క్రిటికల్ మినరల్స్ విషయంలో జాతీయ విధానాన్ని రూపొందించాలని ఆటో విడిభాగాల పరిశ్రమ సమాఖ్య ఏసీఎంఏ కేంద్ర ప్రభుత్వాన్ని కోరింది. ప్రధాన సరఫరాదారైన చైనా ఆంక్షల వల్ల రేర్ ఎర్త్ మ్యాగ్నెట్ల కొరత ఏర్పడటం ఆందోళనకర విషయమని, ఈ నేపథ్యంలో ప్రత్యామ్నాయ మార్గాలను పరిశ్రమ అన్వేషిస్తోందని ఏసీఎంఏ ప్రెసిడెంట్ శ్రద్ధ సూరి మార్వా తెలిపారు. రాబోయే రోజుల్లో మళ్లీ ఇలాంటి పరిస్థితుల్లో చిక్కుకోకుండా కీలకమైన ఖనిజాలకు సంబంధించి పరిశ్రమ స్వయం సమృద్ధి సాధించాల్సిన అవసరం ఉందని ఆమె పేర్కొన్నారు. దీర్ఘకాలిక పరిష్కారాలు ఉన్నప్పటికీ, తక్షణ సమస్యను అధిగమించేందుకు మార్గాలను అన్వేషిస్తున్నట్లు వివరించారు. రేర్ ఎర్త్ మ్యాగ్నెట్ ధర తక్కువే అయినప్పటికీ ఆటోమొబైల్స్, గృహోపకరణాలు తదితర రంగాలకు ఇది చాలా ముఖ్యమైన విడిభాగం. దీని ప్రాసెసింగ్‌లో 90 శాతం వాటా చైనాదే ఉంటోంది. దాంతో అంతర్జాతీయంగా వాణిజ్య ఉద్రిక్తతల వల్ల రేర్ ఎర్త్ మ్యాగ్నెట్ల ఎగుమతులపై ఆంక్షలు విధించడం, పరిశ్రమలకు సమస్యాత్మకంగా మారింది. ఏప్రిల్ నుంచి వీటి దిగుమతులు నిల్చిపోయాయని, ప్రస్తుతానికైతే దగ్గరున్న నిల్వలతో పరిశ్రమ నెట్టుకొస్తోందని ఏసీఎంఏ డైరెక్టర్ జనరల్ విన్నీ మెహతా తెలిపారు. ఈ నేపథ్యంలో దీర్ఘకాలంలో స్వయం సమృద్ధి సాధించడం ఒక్కటే పరిశ్రమకు ఉన్న ఆప్షన్ అని, దానిపైనే మరింతగా కసరత్తు చేస్తోందని వివరించారు. సవాళ్లెన్ని ఉన్నప్పటికీ ప్రస్తు ఆర్థిక సంవత్సరంలోను పరిశ్రమ స్థిరంగా వృద్ధి చెందగలదని మార్వా ధీమా వ్యక్తం చేశారు. భౌగోళిక-రాజకీయ, సరఫరా వ్యవస్థపరమైన సవాళ్లు అనేకం నెలకొన్నప్పటికీ గత ఆర్థిక సంవత్సరంలో దాదాపు 10 శాతం వృద్ధితో 80.2 బిలియన్ డాలర్ల టర్నోవరు (సుమారు రూ. 6.73 లక్షల కోట్లు) నమోదు చేసిందన్నారు.

కొనుగోళ్లతో మెరిసిన పుత్తడి

- ఢిల్లీలో రూ.99,120కు చేరిక
- 10 గ్రాములకు రూ.550 పెరుగుదల

న్యూఢిల్లీ: కొనుగోళ్ల మద్దతుతో పసిడి మరోసారి మెరిసింది. ఢిల్లీ మార్కెట్లో 99.9 శాతం స్వచ్ఛత బంగారం 10 గ్రాములకు మంగళవారం రూ.550 లాభపడింది. రూ.99,120 స్థాయికి చేరుకుంది. స్టాకిస్టులు కొనుగోళ్లకు ఆసక్తి చూపించినట్లు ఆల్ ఇండియా సరాఫా అసోసియేషన్ తెలిపింది. 99.5 శాతం స్వచ్ఛత బంగారం సైతం 10 గ్రాములకు రూ.500 లాభపడి రూ.98,600 స్థాయిని తాకింది. వెండి ధర మాత్రం స్థిరంగా కిలోకి రూ.1,04,800 వద్ద ఉంది. మరోవైపు అంతర్జాతీయ మార్కెట్లో మాత్రం పసిడి ధర ఔన్స్‌కు 3,338 డాలర్ల స్థాయిలో స్థిరంగా ట్రేడయ్యింది. ''వాణిజ్య యుద్ధం తిరిగి ప్రారంభమవుతుందన్న ఆందోళనల నడుమ క్రితం రోజు నష్టాలను పసిడి భర్తీ చేసుకుని, గరిష్ట స్థాయిలో ట్రేడయ్యింది. జపాన్, దక్షిణ కొరియా నుంచి వచ్చే దిగుమతులపై 25 శాతం టారిఫ్ విధిస్తున్నట్లు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించడంతో సెంటిమెంట్‌లో మార్పు వచ్చింది. మార్కెట్లో అనిశ్చితి పెరిగింది'' అని హెచ్‌డీఎఫ్‌సీ సెక్యూరిటీస్ కమొడిటీస్ సీనియర్ అనలిస్ట్ సౌమిల్ గాంధీ తెలిపారు.




జట్టు కట్టిన వెంటివ్, మ్యారియట్

7 హోటళ్లు, 1,548 గదులపై ఒప్పందం



ముంబై: ఆతిథ్య రంగ సంస్థలు వెంటివ్ హాస్పిటాలిటీ, మ్యారియట్ ఇంటర్నేషనల్ తాజాగా చేతులు కలిపాయి. భారత్‌సహా శ్రీలంకలో ఏర్పాటు చేయనున్న 7 విలాసవంత హోటళ్ల నిర్వహణకు కాంట్రాక్టులు కుదుర్చుకున్నాయి. 1,548 గదులతో కూడిన లగ్జరీ, అప్పర్ స్కేల్, అప్‌స్కేల్ హోటళ్లు భాగస్వామ్యంలోకి రానున్నాయి. 4-5 ఏళ్లలో వీటి కార్యకలాపాలు ప్రారంభమయ్యే అవకాశముంది. ఒప్పందం ప్రకారం శ్రీలంక, వారణాసి(ఉత్తర ప్రదేశ్), పుణే, నవీ ముంబై(మహారాష్ట్ర), ముంద్రా(గుజరాత్) తదితర కీలక ప్రాంతాలలో పలు బ్రాండ్లను ప్రవేశ పెట్టనున్నాయి. మరోపక్క ముంద్రాలో తన అధీనంలోగల లీజ్ భూమిలో హోటల్ అభివృద్ధికి ప్రణాళికలు వేసినట్లు వెంటివ్ హాస్పిటాలిటీ పేర్కొంది. లిస్టింగ్ తదుపరి తొలి ఆర్థిక సంవత్సరం(2025-26) ఉత్సాహంగా ప్రారంభమైనట్లు వెంటివ్ హాస్పిటాలిటీ చైర్మన్, ఈడీ అతుల్ చార్డియా పేర్కొన్నారు. మ్యారియట్‌కుగల గ్లోబల్ నైపుణ్యాలు, రియల్టీలో తమకుగల లోతైన అవగాహనను వినియోగించుకోవడం ద్వారా పుణే, బెంగళూరు, మాల్దీవ్స్‌కు ఆవల విస్తరించనున్నట్లు తెలియజేశారు. ఇప్పటికే వారణాసి, బెంగళూరు, పుణేలలో ప్రాజెక్టులకు శ్రీకారం చుట్టినట్లు వెల్లడించారు. రానున్న రెండు త్రైమాసికాలలో మరికొన్నిటికి తెరతీయనున్నట్లు తెలియజేశారు. మ్యారియట్ ఇంటర్నేషనల్‌తో జత కట్టడం ద్వారా రానున్న 4-5 ఏళ్లలో పోర్ట్‌ఫోలియోను రెట్టింపునకు పెంచుకోనున్నట్లు పేర్కొన్నారు. ప్రస్తుత 11 హోటళ్ల ద్వారా నిర్వహిస్తున్న 2,000 గదులను 4,000కు విస్తరించనున్నట్లు తెలియజేశారు.

కిర్గిజ్‌స్తాన్‌లో డెక్కన్ గోల్డ్ మైన్స్ ప్రాజెక్టు పనులు వేగవంతం



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: కిర్గిజ్‌స్తాన్‌లోని ఆల్టిన్ టోర్ గోల్డ్ ప్రాజెక్ట్ నిర్మాణంలో కీలక మైలురాళ్లను అధిగమించినట్లు డెక్కన్ గోల్డ్ మైన్స్ వెల్లడించింది. దీనితో ఈ ఏడాది ద్వితీయార్థంలో క్రషింగ్, మిల్లింగ్ సర్క్యూట్‌ను ప్రారంభించే దిశగా పనులు వేగవంతంగా సాగుతున్నట్లు సంస్థ ఎండీ హనుమ ప్రసాద్ మొదలి తెలిపారు. ఇరు దేశాలకు ప్రయోజనం చేకూర్చేలా నైతిక మైనింగ్, సీమాంతర సహకారం తదితర అంశాల్లో కొత్త ప్రమాణాలను నెలకొల్పేందుకు కట్టుబడి ఉన్నామని ఆయన వివరించారు. ప్రస్తుతం సైటులో 50 మంది పైగా నిపుణులైన వర్కర్లు ఉన్నారని పేర్కొన్నారు. 150 మంది పైగా స్థానిక వర్కర్లను తీసుకున్నట్లు హనుమ ప్రసాద్ చెప్పారు. గని జీవితకాలాన్ని పదేళ్ల పాటు పెంచేందుకు, పసిడి నిక్షేపాల వెలికితీత సామర్థ్యాలను మెరుగుపర్చుకునేందుకు ఈ ప్రోగ్రాం తోడ్పడుతుంది. అవెలమ్ పార్ట్‌నర్స్ నిర్వహిస్తున్న ఈ ప్రాజెక్టులో డెక్కన్ గోల్డ్ మైన్స్‌కి 60 శాతం వాటాలు ఉన్నాయి.


చైనా టెకీలు వెళ్లిపోయినా భారత్‌లో ఐఫోన్ 17 తయారీ యథాతథం



న్యూఢిల్లీ: యాపిల్ వెండార్ల ప్లాంట్లలో పని చేసే చైనా టెకీలు స్వదేశాలకు వెళ్లిపోయినా భారత్‌లో ఐఫోన్ 17 ఫోన్ల ఉత్పత్తి ప్రణాళికలు యథాతథంగానే కొనసాగుతాయని సంబంధిత వర్గాలు తెలిపాయి. చైనా నుంచి, ఐఫోన్ల తయారీలో కీలకమైన యంత్రపరికరాల దిగుమతులు ఇటీవలి కాలంలో మెరుగుపడ్డట్లు వివరించాయి. భారత్‌లో ఫాక్స్‌కాన్, టాటా ఎలక్ట్రానిక్స్ సంస్థలు యాపిల్ ఫోన్లను తయారు చేస్తున్నాయి. గత రెండు నెలలుగా ఫాక్స్‌కాన్ ఇండియా యూనిట్లలో పని చేస్తున్న వందలకొద్దీ చైనా నిపుణులు స్వదేశానికి వెళ్లిపోయినట్లు సమాచారం. వీరంతా అసెంబ్లీ లైన్స్, ఫ్యాక్టరీ డిజైన్, ఇతరత్రా సిబ్బందికి శిక్షణనిచ్చే విధులు నిర్వర్తించేవారు. దీనితో ఐఫోన్ల తయారీపై ప్రతికూల ప్రభావం పడొచ్చన్న అంచనాలు నెలకొన్నాయి. కానీ, భారత్‌లో ఐఫోన్ల ఉత్పత్తిని 3.5-4 కోట్ల స్థాయి నుంచి ఈ ఏడాది 6 కోట్లకు పెంచుకోవాలన్న యాపిల్ టార్గెట్‌లో ఎలాంటి మార్పు లేదని సంబంధిత వర్గాలు వివరించాయి.

ఈఎల్ఐ స్కీమ్‌కు పటిష్ట వ్యవస్థ

కేంద్ర కార్మిక శాఖ మంత్రి మాండవీయ వెల్లడి



న్యూఢిల్లీ: ఉపాధి కల్పన లక్ష్యాల్లో భాగంగా ప్రకటించిన రూ. 1.07 లక్షల కోట్ల ఉద్యోగాల ఆధారిత ప్రోత్సాహక (ఈఎల్ఐ) స్కీమ్ అమలు కోసం డిజిటల్ సాధనాలతో పటిష్టమైన వ్యవస్థను కార్మిక శాఖ రూపొందించింది. ఉద్యోగుల భవిష్య నిధి ఈపీఎఫ్‌వో నిర్వహించే సామాజిక భద్రత స్కీముల ద్వారా దీన్ని అమలు చేయనుంది. ఇటు ఉద్యోగులు, అటు సంస్థలకు ప్రయోజనం చేకూర్చే విధంగా ఈఎల్ఐ స్కీమును తీర్చిదిద్దినట్లు కార్మిక శాఖ మన్‌సుఖ్ మాండవీయ తెలిపారు. ప్రయోజనాలను నేరుగా ఖాతాలకు బదిలీ చేసే విధంగా ఇది ఉంటుందని వివరించారు.

ఆత్మనిర్భర్ భారత్ రోజ్‌గార్ యోజన (ఏబీఆర్‌వై) అమల్లో అవినీతి, ఫేక్ క్లెయిమ్‌ల ఆరోపణలు వచ్చిన నేపథ్యంలో, మళ్లీ అలాంటి ఉదంతాలు చోటు చేసుకోకుండా ఈ స్కీమును పటిష్టంగా తీర్చిదిద్దినట్లు మంత్రి పేర్కొన్నారు. తయారీ రంగంపై ప్రత్యేక దృష్టితో, వివిధ రంగాల్లో ఉద్యోగాల కల్పన, ఉద్యోగయోగ్యత, సామాజిక భద్రతను పెంపొందించడం ఈఎల్ఐ స్కీము ప్రధాన ఉద్దేశం. దీనితో వచ్చే రెండేళ్లలో 3.5 కోట్లకు ఉద్యోగాల కల్పనను ప్రోత్సహించాలన్నది ప్రభుత్వ లక్ష్యం. తొలిసారి ఉద్యోగంలో చేరిన వారికి ఒక నెల వేతనం (రూ. 15,000 వరకు) ఈ స్కీము కింద లభిస్తుంది. అదనంగా ఉద్యోగాలను కల్పించినందుకు అటు వ్యాపార సంస్థలకు రెండేళ్ల పాటు ప్రోత్సాహకాలు లభిస్తాయి. తయారీ రంగానికి మరో రెండేళ్లు అదనంగా ప్రయోజనాలు అందుతాయి. 2025 ఆగస్టు 1 నుంచి 2027 జూలై 31 వరకు కల్పించే ఉద్యోగాలకు ఈ పథకం వర్తిస్తుంది.

ఈపీఎఫ్ వడ్డీ జమ... ఈవారమే

ఉద్యోగుల భవిష్యనిధి సంస్థ (ఈపీఎఫ్‌వో) సభ్యుల ఖాతాల్లో పొదుపు నిధిపై.. 2024-25 సంవత్సరానికి 8.25 శాతం వడ్డీ జమను ఈ వారంలోనే పూర్తి చేయనున్నట్లు కేంద్ర కార్మిక మంత్రి మన్‌సుఖ్ మాండవీయ తెలిపారు. ''33.56 కోట్ల సభ్యులకు సంబంధించిన 13.88 లక్షల సంస్థల వార్షిక అకౌంట్ అప్‌డేషన్ పూర్తయింది. జూలై 8 నాటికి 13.86 లక్షల సంస్థలకు చెందిన 32.39 కోట్ల సభ్యుల ఖాతాల్లో వడ్డీ జమ చేయడం ముగిసింది. అంటే ఇప్పటికే 96.51 సభ్యుల ఖాతాలకు వడ్డీ జమైంది'' అని మంత్రి వివరించారు. గత ఆర్థిక సంవత్సరానికి సంబంధించి సభ్యుల నిధిపై, అంతకుముందు ఆర్థిక సంవత్సరం మాదిరే 8.25% వడ్డీ రేటును ఇవ్వాలని ఈపీఎఫ్‌వో ఫిబ్రవరి 28న నిర్ణయించగా.. కేంద్ర ప్రభుత్వం మే 22న ఆమోదం తెలపడం గమనార్హం. దీంతో జూన్ 6 నుంచే వార్షిక ఖాతాల అప్‌డేషన్ మొదలైనట్లు తెలిపారు. 2023-24 సంవత్సరానికి సంబంధించి ఆగస్ట్-డిసెంబర్‌లో వడ్డీ జమ జరిగింది.



ఆర్‌సీబీ విలువ రూ.2306 కోట్లు!

అమాంతం ఎగిసిన ఐపీఎల్ చాంపియన్

ముంబై: ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్)లో 17 సీజన్ల పాటు ఒక్కసారి టైటిల్ సాధించకపోయినా సరే రాయల్ చాలెంజర్స్ బెంగళూరు (ఆర్‌సీబీ) జట్టుకు అభిమానుల్లో మంచి క్రేజ్ కొనసాగింది. 2025 సీజన్‌లో తొలిసారి విజేతగా నిలవడంతో ఇప్పుడు వాణిజ్యపరంగా కూడా ఆ జట్టు విలువ అమాంతం పెరిగిపోయింది. ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంక్ హూలీహాన్ లోకీ నివేదిక ప్రకారం ప్రస్తుతం ఆర్‌సీబీ టీమ్ విలువ అక్షరాలా 269 మిలియన్ డాలర్లు (సుమారు రూ. 2306 కోట్లు). ఈ జాబితాలో ఇప్పటి వరకు అగ్రస్థానంలో చెన్నై సూపర్ కింగ్స్ (సీఎస్‌కే) టీమ్‌ను వెనక్కి నెట్టిన ఆర్‌సీబీ టాప్‌కు చేరడం విశేషం. ఈ సీజన్‌లో చెత్త ప్రదర్శనతో చివరి స్థానంలో నిలిచిన సీఎస్‌కే 235 మిలియన్ డాలర్లు (రూ. 2014 కోట్లు) విలువతో మూడో స్థానానికి పడిపోయింది. ముంబై ఇండియన్స్ విలువను 242 మిలియన్ డాలర్లు (రూ. 2074 కోట్లు)గా బ్యాంక్ హూలీహాన్ లెక్కగట్టింది. ఇతర ఐపీఎల్ జట్లలో కోల్‌కతా నైట్‌రైడర్స్ (రూ. 1946 కోట్లు), సన్‌రైజర్స్ హైదరాబాద్ (రూ. 1320 కోట్లు), పంజాబ్ కింగ్స్ (రూ. 1209 కోట్లు) విలువ కలిగి ఉన్నాయి. మరో వైపు ఐపీఎల్ విలువ కూడా 13.8 శాతం పెరిగి 3.9 బిలియన్ డాలర్ల (సుమారు రూ. 33 వేల కోట్లు)కు చేరింది.

యశ్ దయాళ్‌పై కేసు నమోదు

ఘజియాబాద్: రాయల్ చాలెంజర్స్ బెంగళూరు (ఆర్‌సీబీ) క్రికెటర్ యశ్ దయాళ్‌పై కేసు నమోదైంది. 27 ఏళ్ల ఈ సీమర్ ఈ ఏడాది ఆర్‌సీబీ టైటిల్ గెలుపొందడంలో కీలకపాత్ర పోషించాడు. అయితే అతను లైంగిక వేధింపులకు పాల్పడినట్లు ఘజియాబాద్‌కు చెందిన ఓ యువతి ఇటీవల పోలీసులకు ఫిర్యాదు చేసింది. యశ్‌తో ఐదేళ్లపాటు రిలేషన్‌షిప్‌లో ఉన్నానని, తనను పెళ్లిచేసుకుంటానని చెప్పి మోసం చేశాడని... పెళ్లి ప్రస్తావన తెస్తే శారీరకంగా, మానసికంగా వేధించాడని ఆరోపిస్తూ గత నెల సీఎం గ్రీవెన్స్ పోర్టల్‌లో చేసిన ఫిర్యాదులో పేర్కొంది. ప్రాథమిక విచారణ అనంతరం ఇందిరాపురం పోలీసు స్టేషన్‌లో భారత న్యాయ సంహిత (బీఎన్‌ఎస్) సెక్షన్ 69 కింద పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. కాగా ఈ ఆరోపణలు, కేసు విషయమై యశ్ దయాళ్ స్పందనకు ప్రయత్నించగా అతను అందుబాటులో లేడు.

రైజింగ్ 'గ్రాండ్' స్టార్

టెన్నిస్ రాకెట్ చేతపట్టిన ప్రతి ప్లేయర్ గ్రాండ్‌స్లామ్ ఆడాలనే కలలు కంటాడు. అందులోనూ 148 ఏళ్ల ఘన చరిత్ర కలిగిన వింబుల్డన్ కోర్టులో అడుగు పెట్టాలని అందరికీ ఉంటుంది. కానీ దాన్ని కొందరు మాత్రమే నిజం చేసుకుంటారు. నాలుగు గ్రాండ్‌స్లామ్ టోర్నీలలో వింబుల్డన్‌కు ఉన్న క్రేజే వేరు. నిగనిగలాడే పచ్చిక కోర్టులు...
ఎంత గొప్ప ప్లేయర్లయినా తెలుపు రంగు దుస్తులతోనే ఆడాలన్న నిబంధన... దీనిని ప్రతి ఒక్కరూ పాటించడం... ఇదొక అనిర్వచనీయ అనుభూతి. లండన్‌లోని ఆల్ ఇంగ్లండ్ క్లబ్‌లో నిర్వహించే ఈ ప్రతిష్టాత్మక టోర్నీలో ఈసారి మన హైదరాబాద్ ప్లేయర్ బొల్లిపల్లి రిత్విక్ చౌదరీ బరిలోకి దిగాడు. తొలి అడ్డంకిని దాటి రెండో రౌండ్‌కు చేరిన రిత్విక్... భవిష్యత్తుపై భరోసా పెంచుతున్నాడు. ఇప్పటి వరకు ముగ్గురు భారతీయులు మాత్రమే వింబుల్డన్ డబుల్స్ విభాగంలో విజేతలుగా నిలవగా... ఎప్పటికైనా ఇక్కడ చాంపియన్‌గా నిలవడమే తన జీవిత లక్ష్యమని రిత్విక్ అంటున్నాడు.

– సాక్షి క్రీడావిభాగం

- వరుసగా మూడో గ్రాండ్‌స్లామ్ టోర్నీ ఆడిన రిత్విక్
- వింబుల్డన్ టోర్నీ పురుషుల డబుల్స్‌లో ఆకట్టుకున్న వైనం
- నాలుగేళ్లుగా ఏటీపీ టూర్‌లో నిలకడగా ఫలితాలు
- డేవిస్‌కప్ టోర్నమెంట్‌లో భారత జట్టుకు ప్రాతినిధ్యం
- 24 ఏళ్లకే డబుల్స్ స్పెషలిస్ట్‌గా గుర్తింపు



వింబుల్డన్ ఆవరణలో తల్లిదండ్రులు లక్ష్మీ, ప్రతాప్‌తో రిత్విక్

అంతర్జాతీయ స్థాయిలో పేరు ప్రఖ్యాతలు సాధించాలని చిన్నప్పటి నుంచి కలలు కన్న బొల్లిపల్లి రిత్విక్ చౌదరీ కెరీర్‌లో రెండు ఏటీపీ–250 టోర్నీ డబుల్స్ టైటిల్స్ గెలిచాడు. అధిక శాతం ఆటగాళ్లు కెరీర్ తొలినాళ్లలో సింగిల్స్‌పై దృష్టి పెట్టి... ఇక చాలు అనుకుంటున్న దశలో డబుల్స్‌కు మారడం పరిపాటి. అయితే రిత్విక్ మాత్రం అందుకు భిన్నంగా కెరీర్ ఆరంభంలోనే తన లక్ష్యాలపై స్పష్టత ఏర్పరచుకున్నాడు. తన ఆటతీరుకు డబుల్స్ అనుకూలంగా ఉంటుందని భావించిన రిత్విక్ సరైన సమయంలో సరైన నిర్ణయం తీసుకున్నాడు. ఫలితంగా 24 ఏళ్ల వయసులోనే రెండు ఏటీపీ–250 టైటిల్స్ అతడి ఖాతాలో చేరాయి. ఏటీపీ డబుల్స్ ర్యాంకింగ్స్‌లో ప్రస్తుతం ప్రపంచ 79వ ర్యాంక్‌లో ఉన్న ఈ హైదరాబాదీ... ఈ ఏడాది వరుసగా మూడు గ్రాండ్‌స్లామ్ టోర్నమెంట్‌లలోనూ బరిలోకి దిగి నిలకడ కనబర్చాడు. ఆస్ట్రేలియా ఓపెన్, ఫ్రెంచ్ ఓపెన్‌లలో తొలి రౌండ్‌లోనే వెనుదిరిగిన రిత్విక్ వింబుల్డన్‌లో మాత్రం రెండో రౌండ్‌కు చేరుకున్నాడు. తొలిసారి వింబుల్డన్ బరిలోకి దిగడం చాలా ఆనందంగా ఉందన్న రిత్విక్... దీని వెనక తన తల్లిదండ్రులు ప్రతాప్, లక్ష్మీ త్యాగాలు ఎన్నో ఉన్నాయని పేర్కొన్నాడు. ప్రపంచంలో అత్యుత్తమ టోర్నమెంట్‌లో తల్లిదండ్రుల సమక్షంలో మ్యాచ్ నెగ్గడం మరిచిపోలేని అనుభూతి అని అన్నాడు.

డ్యాన్సింగ్, డ్రాయింగ్ కాదని...

క్రికెట్‌ను మతంలా భావించే మన దేశంలో... అందరిలాగే రిత్విక్ కూడా పెద్దయ్యాక ప్రొఫెషనల్ క్రికెటర్‌గా మారాలనుకున్నాడు. ఏక కాలంలో అనేక అంశాలపై ఆసక్తి కనబరిచే పిల్లల్లాగే రిత్విక్ పసితనంలో అన్నీ చేస్తూ హైపర్ యాక్టివ్‌గా ఉండేవాడు. డ్యాన్సింగ్, డ్రాయింగ్ ఇలా అన్నీట్లో ముందుండేవాడు. దీంతో అతడిని ఏదైనా ఆటలో శిక్షణ ఇప్పించాలని తల్లిదండ్రులు భావించారు. క్రికెట్ నేర్పించాలని అనుకున్నా... రిత్విక్ వయసు మరీ చిన్నది కావడంతో బంతితో దెబ్బలు తగులుతాయేమోననే భయంతో తల్లిదండ్రులు అతడిని ఇంటికి సమీపంలోని టెన్నిస్ కోచింగ్ సెంటర్‌లో చేర్పించారు. సికింద్రాబాద్‌లోని రైల్వే రిక్రియేషన్ క్లబ్ మైదానం సమీపంలోని 'ద స్కూల్ ఆఫ్ పవర్ టెన్నిస్' సెంటర్‌లో కోచ్ సీవీ నాగరాజ్ వద్ద ఓనమాలు నేర్చుకున్న రిత్విక్ అండర్–12, అండర్–16 స్థాయిలో జాతీయ నంబర్‌వన్‌గా నిలిచాడు. ఒలింపియన్, భారత డేవిస్‌కప్ జట్టు మాజీ సభ్యుడు, వింబుల్డన్ గ్రాండ్‌స్లామ్ టోర్నీలో ఆడిన విష్ణువర్ధన్, ఆసియా క్రీడల్లో, డేవిస్‌కప్‌లో, గ్రాండ్‌స్లామ్ టోర్నీల్లో ఆడిన సాకేత్ మైనేని కూడా ఒకప్పుడు 'ద స్కూల్ ఆఫ్ పవర్ టెన్నిస్' సెంటర్‌లోనే శిక్షణ తీసుకున్నారు. కోచ్ నాగరాజ్ వద్ద క్రమం తప్పకుండా తన ఆటకు మెరుగులు దిద్దుకున్న రిత్విక్ అంచలంచెలుగా ఎదిగి ఈ స్థాయికి చేరుకున్నాడు. ప్రపంచంలో ఎన్ని టెన్నిస్ టోర్నీలు ఉన్నా వింబుల్డన్ మాత్రం ప్రత్యేకమని రిత్విక్ తల్లి లక్ష్మి వెల్లడించారు. వింబుల్డన్ అధికారిక వెబ్‌సైట్ నిర్వహించిన ప్రత్యేక ఇంటర్వ్యూలో లక్ష్మి... రిత్విక్ ప్రయాణాన్ని గుర్తు చేసుకున్నారు. స్టెఫీ గ్రాఫ్, పీట్ సంప్రాస్, లియాండర్ పేస్, మహేశ్ భూపతి, సానియా మీర్జా వంటి దిగ్గజ ఆటగాళ్లు విజేతలుగా నిలిచిన చోట తమ కుమారుడు కూడా ఆడటం మాటల్లో వర్ణించలేని అనుభూతి అని ఆమె అన్నారు.


విష్ణువర్ధన్, సాకేత్ మైనేనితో రిత్విక్


అల్మాటి ఓపెన్ ఏటీపీ-250 టైటిల్‌తో...


చిలీ ఓపెన్ ఏటీపీ-250 టైటిల్‌తో...

ఆర్థిక ఇబ్బందులకు ఎదురొడ్డి...

టెన్నిస్ బాగా ఖర్చుతో కూడుకున్న క్రీడ కావడంతో ఒక దశలో రిత్విక్ శిక్షణకు ఆర్థిక ఇబ్బందులు ఎదురయ్యాయి. అయితే తమ కుమారుడి కెరీర్‌కన్నా తమకు ఏదీ ఎక్కువ కాదనుకున్న ఆ తల్లిదండ్రులు... రిత్విక్ లక్ష్యం కోసం అన్నీ వదిలేసుకున్నారు. ఎదుగుతున్న క్రమంలో అతడి ఆటతీరు ఆ నమ్మకాన్నివ్వగా... ఒక్కసారి ప్రొఫెషనల్ కెరీర్ ప్రారంభించాక ఇక వెనుదిరిగి చూడాల్సిన అవసరం లేకుండా పోయింది. 'వింబుల్డన్ ఆడుతున్నానని తెలిసినప్పుడు నా కన్నా మా అమ్మానాన్నే ఎక్కువగా సంతోషించారు. చిన్నప్పటి నుంచి ఇక్కడ ఆడాలని ఎన్నో కలలు కన్నా. ఇప్పటికి అది సాధ్యపడింది. దీని వెనక మా కుటుంబం మొత్తం కృషి ఉంది. ఈ విజయం నా ఒక్కడిది కాదు ఇందులో మా అమ్మ, నాన్న, అమ్మమ్మ పాత్ర ఎంతో ఉంది' అని తొలి రౌండ్ విజయానంతరం రిత్విక్ అన్నాడు. కొలంబియాకు చెందిన నికోలస్ బరియెంటోస్‌తో కలిసి పురుషుల డబుల్స్ బరిలోకి దిగిన రిత్విక్... రెండో రౌండ్‌లో ఆరో సీడ్ జోడీ జో సాలిస్‌బరీ–నీల్ స్కప్‌స్కీ (బ్రిటన్) చేతిలో పోరాడి ఓడిపోయారు.

> రిత్విక్ వింబుల్డన్ మెయిన్ 'డ్రా'కు అర్హత సాధించడంతో... చిన్నప్పటి నుంచి కన్న కల నిజమైనట్లు అనిపించింది. ప్రపంచంలో ఎన్ని టోర్నమెంట్‌లు ఉన్నా... వింబుల్డన్ అంటే వింబుల్డనే. ఆటలో హుందాతనానికి ఇది గొప్ప నిదర్శనం. ప్రపంచంలోని అత్యుత్తమ టోర్నీలో రిత్విక్ ఆడతాడని కలలో కూడా ఊహించలేదు. అందుకే లండన్‌లో అడుగు పెట్టిన మూడు రోజుల తర్వాత కూడా నమ్మశక్యంగా అనిపించలేదు. సంప్రాస్, స్టెఫీ గ్రాఫ్ వంటి దిగ్గజాలు ఆడిన చోట రిత్విక్ బరిలోకి దిగడం నాకెంతో గర్వంగా ఉంది.
>
> – లక్ష్మి, రిత్విక్ తల్లి

రిత్విక్ ప్రొఫైల్

- **పుట్టిన తేదీ, స్థలం:** 17-1-2001 : హైదరాబాద్
- **ఎత్తు:** 6 అడుగుల 2 అంగుళాలు
- **బరువు:** 85 కేజీలు
- **ప్రొఫెషనల్‌గా మారిన ఏడాది:** 2022
- **డబుల్స్‌లో కెరీర్ బెస్ట్ ర్యాంక్:** 65 (మార్చి:2025లో)
- **ఏటీపీ టూర్‌లో నెగ్గిన డబుల్స్ టైటిల్స్:** 2 (అల్మాటీ ఓపెన్-250 టోర్నీ; చిలీ ఓపెన్ ఏటీపీ-250 టోర్నీ)
- **ఏటీపీ చాలెంజర్ టూర్ టైటిల్స్:** 5
- **ఐటీఎఫ్ సర్క్యూట్‌లో నెగ్గిన టైటిల్స్:** 6

శ్రీలంకదే వన్డే సిరీస్



- మూడో మ్యాచ్‌లో 99 పరుగులతో బంగ్లాదేశ్ పరాజయం
- కుశాల్ మెండిస్ సూపర్ సెంచరీ

పల్లెకెలె: ఆల్‌రౌండ్ ప్రదర్శనతో అదరగొట్టిన శ్రీలంక జట్టు... బంగ్లాదేశ్‌పై వన్డే సిరీస్ కైవసం చేసుకుంది. మూడు మ్యాచ్‌ల సిరీస్‌లో భాగంగా మంగళవారం జరిగిన చివరి వన్డేలో శ్రీలంక 99 పరుగుల తేడాతో గెలుపొందింది. తద్వారా 2–1తో సిరీస్ చేజిక్కించుకుంది. అంతకుముందు రెండు మ్యాచ్‌ల టెస్టు సిరీస్‌ను సైతం ఆతిథ్య లంక జట్టు 1–0తో గెలుచుకుంది. మూడో వన్డేలో టాస్ గెలిచి మొదట బ్యాటింగ్‌కు దిగిన శ్రీలంక నిర్ణీత 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 285 పరుగులు చేసింది. వికెట్ కీపర్ కుశాల్ మెండిస్ (114 బంతుల్లో 124; 18 ఫోర్లు) సెంచరీతో కదంతొక్కగా... కెప్టెన్ అసలంక (68 బంతుల్లో 58; 9 ఫోర్లు) అర్ధశతకంతో రాణించాడు. ఓపెనర్ పాథుమ్ నిసాంక (35) ఫర్వాలేదనిపించాడు. బంగ్లాదేశ్ బౌలర్లలో తస్కీన్ అహ్మద్, మెహదీ హసన్ మిరాజ్ చెరో 2 వికెట్లు పడగొట్టారు. అనంతరం లక్ష్యఛేదనలో బంగ్లాదేశ్ 39.4 ఓవర్లలో 186 పరుగులకు ఆలౌటైంది. తౌహిద్ హృదయ్ (78 బంతుల్లో 51; 3 ఫోర్లు, 1 సిక్స్) అర్ధశతకంతో పోరాడగా... కెప్టెన్ మెహదీ హసన్ మిరాజ్ (28), పర్వేజ్ (28), జాకీర్ అలీ (27) మెరుగైన ఆరంభాలను వృథా చేసుకున్నారు. శ్రీలంక బౌలర్లలో అశిత ఫెర్నాండో, దుష్మంత చమీరా చెరో 3 వికెట్లు పడగొట్టగా... దునిత్ వెల్లలాగె, వనిందు హసరంగా రెండేసి వికెట్లు తీశారు. ఈ సిరీస్‌లో మూడు మ్యాచ్‌ల్లోనూ మొదట బ్యాటింగ్ చేసిన జట్లే గెలుపొందాయి. కుశాల్ మెండిస్‌కు 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్', 'ప్లేయర్ ఆఫ్ ద సిరీస్' అవార్డులు దక్కాయి. ఇరు జట్ల మధ్య గురువారం తొలి టి20 జరగనుంది.

రీతిక హుడాపై తాత్కాలిక నిషేధం

డోపింగ్‌లో దొరికిన రెజ్లర్



న్యూఢిల్లీ: రెండేళ్ల క్రితం అండర్–23 విభాగంలో ప్రపంచ చాంపియన్‌గా నిలిచిన భారత రెజ్లర్ రీతిక హుడా డోపింగ్‌లో పట్టుబడింది. ఆమెపై తాత్కాలిక నిషేధం విధిస్తున్నట్లు జాతీయ డోపింగ్ నిరోధక సంస్థ (నాడా) ప్రకటించింది. పూర్తి స్థాయి విచారణ అనంతరం ఆమెను నాలుగేళ్ల పాటు నిషేధించే అవకాశం కూడా ఉంది. 76 కేజీల హెవీవెయిట్ కేటగిరీలో పారిస్ ఒలింపిక్స్‌కు అర్హత సాధించిన తొలి భారత రెజ్లర్‌గా 22 ఏళ్ల రీతిక గుర్తింపు పొందింది. గత మార్చిలో ఆసియా చాంపియన్‌షిప్ సెలక్షన్ ట్రయల్స్ సందర్భంగా ఆమె డోపింగ్ పరీక్షకు హాజరైంది. రీతిక శాంపిల్స్‌లో నిషేధిత ఉత్ప్రేరకం ఎస్1.1 అనబాలిక్ ఆండ్రోజెన్ స్టెరాయిడ్స్ ఉన్నట్లుగా తేలింది. అయితే తాను ఎలాంటి తప్పూ చేయలేదని, డోపింగ్‌లో ఇంకా తుది ఫలితం రాలేదని రీతిక స్పష్టం చేసింది. 'నాడా' అధికారులకు విచారణలో పూర్తిగా సహకరిస్తానన్న ఆమె... తదుపరి పరీక్షల కోసం 'బి' శాంపిల్ ఇచ్చేందుకు సిద్ధమవుతోంది. అండర్–23 స్థాయిలో సత్తా చాటిన అనంతరం సీనియర్ స్థాయిలో వరుస విజయాలతో రీతిక ఇప్పుడిప్పుడే ఎదుగుతోంది. పారిస్ ఒలింపిక్స్ తర్వాత ఆమె ఆసియా చాంపియన్‌షిప్‌లో రజతం, యూడబ్ల్యూడబ్ల్యూ ర్యాంకింగ్ సిరీస్ ఈవెంట్‌లో స్వర్ణం గెలుచుకుంది. ఈ ఏడాది మూడు టోర్నీల్లో కలిపి ఒకే ఒక బౌట్‌లో ఓడిన రీతికపై త్వరలో జరిగే వరల్డ్ చాంపియన్‌షిప్‌లో పతకం సాధించడంపై భారీ అంచనాలు ఉన్న నేపథ్యంలో తాజా వివాదం వెలుగులోకి వచ్చింది.

ముగిస్తారా... ఆఖరిదాకా లాక్కొస్తారా?

నేడు భారత్, ఇంగ్లండ్ మహిళల మధ్య నాలుగో టి20

- రాత్రి 11 గంటల నుంచి సోనీ స్పోర్ట్స్‌లో ప్రత్యక్ష ప్రసారం

మాంచెస్టర్: వరుస విజయాలతో జోరు మీదున్న భారత మహిళల జట్టుకు గత మ్యాచ్‌లో అనూహ్యంగా ఆతిథ్య ఇంగ్లండ్ బ్రేకులేసింది. దీంతో మూడో టి20 ఓటమితో 'వాయిదా' పడిన సిరీస్ విజయాన్ని మాంచెస్టర్‌లో రాబట్టాలని హర్మన్‌ప్రీత్ బృందం పట్టుదలతో ఉంది. మరోవైపు 'హ్యాట్రిక్' విజయాన్ని అడ్డుకున్న ఇంగ్లండ్ అదే ఊపుతో ఇప్పుడు సిరీస్‌ను సమం చేయాలనే లక్ష్యంతో ఉంది. ఈ నేపథ్యంలో ఇరు జట్ల మధ్య బుధవారం జరిగే నాలుగో టి20 ఆసక్తికరంగా జరుగనుంది. బర్మింగ్‌హామ్ (12న ఐదో టి20) దాకా సాగదీయకుండా ఎలాగైనా ఇక్కడే సిరీస్‌ను చేజిక్కించుకోవాలని అమ్మాయిల జట్టు ఆశిస్తోంది. ఓపెనర్ స్మృతి మంధాన సూపర్‌ఫామ్, తెలుగమ్మాయి శ్రీచరణి స్పిన్ మాయాజాలంతో ఇంగ్లండ్ కంటే ఓ మెట్టుపైనే ఉన్న భారత్‌కు ఈ మ్యాచ్, సిరీస్ విజయం ఏమంత కష్టం కానేకాదు.

హర్మన్‌ప్రీత్ రాణిస్తే...

పొట్టి సిరీస్‌లో ఎవరైనా ప్రదర్శన పరంగా బాకీ పడ్డారంటే అది కెప్టెన్ హర్మన్‌ప్రీతే! తొలి మ్యాచ్‌కు గైర్హాజరైన సారథి తర్వాత మ్యాచ్‌లాడినా... ఏమాత్రం ప్రభావం చూపలేకపోయింది. మూడో టి20లో హర్మన్ తన స్థాయికి తగ్గ ఆటతీరు కనబరిచి ఉంటే ఇదివరకే సిరీస్ దక్కేది. కేవలం 5 పరుగుల తేడాతో ఇంగ్లండ్ గడ్డపై 'హ్యాట్రిక్' విజయం దూరమవగా... సిరీస్ కోసం ఇంకా పోరాడాల్సి వస్తోంది. మిగతా వారిలో గత మ్యాచ్‌లో ఓపెనర్ షఫాలీ వర్మ ఫామ్‌లోకి రావడం సానుకూలాంశం. ఓపెనర్లతో పాటు జెమీమా రోడ్రిగ్స్, హర్మన్‌లు కూడా రాణిస్తే... రిచా ఘోష్ తన హిట్టింగ్‌తో ఆదరగొట్టేందుకు అవకాశముంటుంది. ఈ సిరీస్‌లో శ్రీచరణి అత్యంత నిలకడగా స్పిన్నేస్తోంది. అరుంధతి రెడ్డి, దీప్తి శర్మలు కూడా ప్రత్యర్థి బ్యాటర్లను ఇబ్బంది పెడుతున్నారు. ఎలా చూసినా కూడా భారత బౌలింగ్ దళం మెరుగ్గానే ఉంది.

సమం కోసమే సమరం

ఈ సిరీస్‌లోనే నిలకడలేమి ఆటతీరుతో అగచాట్లు పడుతున్న ఇంగ్లండ్ గత మ్యాచ్ గెలిచిందంటే ఓపెనర్లే కారణం. సోఫియా డంక్లీ, డానీ వ్యాట్‌లు తొలి రెండు మ్యాచ్‌ల్లోనూ చేతులెత్తేశారు. కానీ గెలిచి నిలవాల్సిన మ్యాచ్‌లో నిలబెట్టారు. మిగతా బ్యాటర్లను భారత బౌలర్లు తెలివిగానే బోల్తాకొట్టించారు. ఈ నేపథ్యంలో బ్యూమోంట్ సేన అందివచ్చిన అవకాశాన్ని జారవిడువకుండా వరుసగా ఈ మ్యాచ్‌లోనూ పుంజుకొంటే సిరీస్ రేసులో పడొచ్చని భావిస్తోంది. పటిష్టమైన భారత బృందాన్ని ఎదుర్కోవాలంటే ఒకరిద్దరు రాణిస్తే సరిపోదని సమష్టి బాధ్యత తీసుకోవాలని అనుకుంటుంది.

తుదిజట్లు (అంచనా)

భారత్: హర్మన్‌ప్రీత్ (కెప్టెన్), స్మృతి మంధాన, షఫాలీ వర్మ, జెమీమా, రిచా ఘోష్, అమన్‌జోత్, దీప్తిశర్మ, రాధా యాదవ్, అరుంధతీ, స్నేహ్ రాణా, శ్రీచరణి.

ఇంగ్లండ్: టామీ బ్యూమోంట్ (కెప్టెన్), సోఫియా డంక్లీ, డానీ వ్యాట్, అలైస్ క్యాప్సీ, స్కాలిఫీల్డ్, అమీ జోన్స్, సోఫీ ఎకిల్‌స్టోన్, ఇసీ వాంగ్, చార్లీ డీన్, లారెన్ ఫిలెర్, లారెన్ బెల్.





ఫ్రాన్స్ దక్షిణ ప్రాంతం మార్సెయిల్ సమీపంలోని పెన్స్-మిరాబ్యూ ప్రాంతం వద్ద కార్చిచ్చు కారణంగా దట్టంగా అలుముకున్న పొగ



రష్యాలో ఎండలు మండిపోతున్నాయి. రాజధాని మాస్కోలో మంగళవారం ఫౌంటెయిన్ వద్ద సేదతీరుతున్న ఓ బాలుడు



స్పెయిన్‌లోని గ్రామీణ టర్రాగొనా ప్రావిన్స్‌కు చెందిన పాల్స్ అటవీ ప్రాంతంలో మంగళవారం చెలరేగుతున్న కార్చిచ్చు

కచ్చితమైన ఓటరు జాబితా బలమైన ప్రజాస్వామ్యానికి కీలకం

సీఈసీ జ్ఞానేశ్ కుమార్ వ్యాఖ్యలు

న్యూఢిల్లీ: దేశంలో ప్రజాస్వామ్య వ్యవస్థ బలోపేతానికి కచ్చితమైన ఓటరు జాబితా అత్యంత కీలకమైనదని ప్రధాన ఎన్నికల కమిషనర్(సీఈసీ) జ్ఞానేశ్ కుమార్ పేర్కొన్నారు. మంగళవారం ఆయన బూత్ లెవెల్ అధికారుల శిక్షణ కార్యక్రమంలో మాట్లాడారు. బిహార్‌లో చేపట్టిన ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణతో కోట్లాది మంది ఓటు హక్కుకు దూరమవుతారంటూ ఆరోపిస్తున్న ప్రతిపక్షాలు సుప్రీంకోర్టులో పిటిషన్లు వేసిన వేళ ఆయన వ్యాఖ్యలు చేయడం గమనార్హం. ఈ పిటిషన్లపై 10న సుప్రీం విచారణ జరపనుంది. బిహార్‌లో 22 ఏళ్ల తర్వాత చేపడుతున్న సవరణ కార్యక్రమం ద్వారా అనర్హులైన వారిని, నకిలీ పేర్లను తొలగించి, చట్ట ప్రకారం అర్హులైన వారిని చేరుస్తామని ఈసీ అంటోంది. ఓటరు జాబితా రివిజన్ ద్వారా బిహార్‌లోని ఓటర్ల సంఖ్య ప్రస్తుతమున్న 7.69 కోట్ల నుంచి 7.89 కోట్లకు చేరుకోనుందని పేర్కొంది. రివిజన్‌లో భాగంగా బూత్ లెవెల్ అధికారులు ప్రతి ఇంటిని మూడుసార్లు సందర్శించి, నింపిన ఎన్యుమరేషన్ ఫాంలను సేకరిస్తారని, అర్హులైన ఏ ఒక్కరికీ అన్యాయం జరగదని ఈసీ మంగళవారం స్పష్టం చేసింది. ఇప్పటికే అధికారులు ఒకసారి ఇళ్లకు వెళ్లడం పూర్తయిందని, రెండోసారి కూడా సందర్శిస్తున్నారని పేర్కొంది. ముసాయిదా ఓటరు జాబితాను ఆగస్టు ఒకటో తేదీన వెల్లడిస్తామంది.

రద్దీలో 9వ స్థానంలో ఢిల్లీ ఎయిర్‌పోర్ట్

న్యూఢిల్లీ: అత్యంత రద్దీగా ఉండే విమానాశ్రయాల్లో ఢిల్లీలోని అంతర్జాతీయ విమానాశ్రయం ప్రపంచంలోనే 9వ స్థానంలో నిలిచింది. 2024లో ఢిల్లీ విమానాశ్రయం ద్వారా 7.7 కోట్ల మంది ప్రయాణికులు రాకపోకలు సాగించారు. ఎయిర్‌పోర్ట్స్ కౌన్సిల్ ఇంటర్నేషనల్(ఏసీఐ) తాజాగా ప్రపంచంలోనే అత్యంత రద్దీగా ఉండే టాప్–20 విమానాశ్రయాల జాబితాను విడుదల చేసింది. ఇందులో అమెరికాలోని అట్లాంటా ఎయిర్‌పోర్టు అగ్రభాగాన నిలిచింది. ఈ విమానాశ్రయం ద్వారా 2024లో ఏకంగా 10,80,67,766 మంది ప్రయాణికులు రాకపోకలు సాగించారు. ఆ తర్వాత దుబాయ్ ఎయిర్‌పోర్టు (9,23,31,506 మంది ప్రయాణికులు), మూడో స్థానంలో అమెరికాలోని డాలస్ ఎయిర్‌పోర్టు(8,78,17,864 మంది ప్రయాణికులు) నిలిచాయి.

లాయర్లు బార్ కౌన్సిల్ ఉద్యోగులు కారు

బాంబే హైకోర్టు వ్యాఖ్యలు

ముంబై: న్యాయవాదులు బార్ కౌన్సిళ్లలో పనిచేసే ఉద్యోగులు కారని బాంబే హైకోర్టు పేర్కొంది. బార్ కౌన్సిళ్లు, లాయర్లు మధ్య ఉన్నది యజమాని–ఉద్యోగి సంబంధం కాదని స్పష్టం చేసింది. యజమాని- ఉద్యోగి సంబంధం ఉన్న చోట మాత్రమే అంతర్గత ఫిర్యాదుల కమిటీ(ఐసీసీ)ల ఏర్పాటుకు పోష్ (పని ప్రదేశాల్లో లైంగిక వేధింపుల నివారణ) చట్టం–2013 వీలు కల్పించిందని పేర్కొంది. ప్రాక్టీస్ చేసే న్యాయవాదులతో అటువంటి సంబంధం లేనందున బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా(బీసీఐ), బార్ కౌన్సిల్ ఆఫ్ మహారాష్ట్ర అండ్ గోవా(బీసీఎంజీ)లు ఐసీసీలు ఏర్పాటు చేయడం కుదరదని తేల్చి చెప్పింది. తోటి లాయర్లపై నమోదయ్యే ఫిర్యాదులపై విచారణకు పోష్ చట్టం వర్తింపజేయలేమని తెలిపింది. వేధింపుల వంటి వృత్తిపరమైన అనుచిత ప్రవర్తనలకు పాల్పడిన వారిపై అడ్వొకేట్స్ చట్టం కింద తగు చర్యలు తీసుకునేందుకు అవకాశముందని కూడా ఈ సందర్భంగా పేర్కొంది. ప్రధాన న్యాయమూర్తి అలోక్ అరాధె, జస్టిస్ సందీప్ మర్నెల ధర్మాసనం ఈ మేరకు సోమవారం తీర్పు వెలువరించింది.

డీకేఎస్ సీఎం కావాలని కోరుకుంటున్నారు

కర్ణాటక కాంగ్రెస్ ఎమ్మెల్యే యోగేశ్వర్ వ్యాఖ్యలు

బెంగళూరు: కర్ణాటకలో సీఎం సిద్ధరామయ్య, డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ మధ్య అధికారం కోసం తెరవెనుక సాగుతున్న పోరు మరోసారి తెరపైకి వచ్చింది. సీఎం పీఠంపై డీకే శివకుమార్ కూర్చోవాలని పార్టీ మెజారిటీ ఎమ్మెల్యేలు, తన నియోజకవర్గంలోని ప్రజలు కోరుకుంటున్నారని అధికార కాంగ్రెస్‌కు చెందిన ఎమ్మెల్యే సీపీ యోగేశ్వర్ వ్యాఖ్యానించారు. 'ముఖ్యమంత్రి పీఠంపై డీకే శివకుమార్ కూర్చోవాలనే విషయంలో ఎమ్మెల్యేలంతా ఐక్యంగా ఉన్నారు. ఈ విషయంలో ఎవరికీ మరో అభిప్రాయం లేదు. మా జిల్లా ప్రజలు, ఎమ్మెల్యేలు సైతం ఇదే కోరుకుంటున్నారు' అని ఆయన పేర్కొన్నారు. అంతిమ నిర్ణయం మాత్రం పార్టీ కేంద్ర నాయకత్వానిదేనన్నారు.

విమాన ప్రమాదంపై పార్లమెంటరీ కమిటీ ఆరా

న్యూఢిల్లీ: అహ్మదాబాద్‌లో జూన్ 12న సంభవించిన ఘోర విమాన ప్రమాద ఘటనపై పార్లమెంటరీ కమిటీ చర్చించింది. మంగళవారం కాంగ్రెస్ సీనియర్ నేత కేసీ వేణుగోపాల్ సారథ్యంలోని ప్రజాపద్దుల కమిటీ పౌర విమానయాన శాఖ ఉన్నతాధికారులు, విమానయాన సంస్థలు, విమానాశ్రయాల ప్రతినిధులతో సమావేశం ఏర్పాటు చేసింది. ఎయిరిండియా విమాన ప్రమాదంపై ఏర్పాటైన ఉన్నత స్థాయి కమిటీ నివేదిక ఎప్పటిలోగా అందుతుందని కమిటీ ప్రశ్నించిందని అధికార వర్గాలు వెల్లడించాయి.విమానం బ్లాక్‌బాక్సుల విశ్లేషణను ఎప్పటిలోగా పూర్తి చేస్తారని ఓ సభ్యుడు అడిగారు. బ్యూరో ఆఫ్ సివిల్ ఏవియేషన్ సెక్యూరిటీ(బీసీఏఎస్) ఆడిట్ నివేదికను అందజేయాలని కూడా కొందరు సభ్యులు కోరినట్లు సమాచారం. అదే సమయంలో, ఏప్రిల్‌లో పహల్గాం ఉగ్రదాడి అనంతరం శ్రీనగర్‌కు విమాన చార్జీలను అకస్మాత్తుగా పెంచడంపై ఆందోళన వ్యక్తం చేసింది.

రాజకీయ నాయకులు రాజుల్లా ప్రవర్తిస్తున్నారు

మాజీ మంత్రిపై మద్రాస్ హైకోర్టు ఆగ్రహం

చెన్నై: అవమానకర వ్యాఖ్యలు చేసిన డీఎంకే మాజీ మంత్రి కె పొన్ముడిపై మద్రాస్ హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. వైష్ణవులు, శైవులు, మహిళలు సహా హిందూ వర్గాలపై పొన్ముడి చేసిన వ్యాఖ్యలను కోర్టు ఖండించింది. రాజకీయ నాయకులు ఆర్టికల్ 19 హక్కులను దుర్వినియోగం చేస్తున్నారని, రాజుల్లా ప్రవర్తిస్తున్నారని పేర్కొంది. తమిళనాడు పోలీసులు అతనిపై చర్య తీసుకోకపోతే సీబీఐ దర్యాప్తునకు ఆదేశించవచ్చని హెచ్చరించింది. ఏప్రిల్‌లో జరిగిన ఒక కార్యక్రమంలో పొన్ముడి అభ్యంతరకమైన జోక్ చేశారు. వైష్ణవులు, శైవులు నుదిటిపై ధరించే నామాలను శృంగార భంగిమలతో పోలుస్తూ వ్యాఖ్యలు చేశారు. ఆ వీడియో వైరల్ అయ్యింది. దీనిపై సుమోటో రిట్ పిటిషన్ దాఖలైంది. పిటిషన్‌ను విచారించిన జస్టిస్ వెల్మురుగన్.. 'ఈ రోజుల్లో రాజకీయ నాయకులు ఆర్టికల్ 19 ప్రకారం ఆకాశమే హద్దు అని భావిస్తున్నారు. మనం కేవలం ప్రేక్షకులుగా ఉండలేం. మనం అనేక సమాజాలు ఉన్న ప్రజాస్వామ్యంలో జీవిస్తున్నాం. రాజకీయ నాయకులు ప్రజలను ఉద్దేశించి ప్రసంగించేటప్పుడు, అందరూ ఉంటున్న దేశంలో నివసిస్తున్నామని గుర్తుంచుకోవాలి. ప్రతి ఒక్కరూ తాము ప్రజల మధ్య జీవిస్తున్నామని గ్రహించాలి. ప్రతి ఒక్కరూ మైక్ తీసుకుని తామే రాజు అన్నట్లుగా చాలా మాట్లాడుతున్నారు. రాజుకు వ్యతిరేకంగా ఎవరూ ఏమీ చేయలేరన్నట్లుగా ఉన్నారు. కోర్టు ఇదంతా చూస్తూ సహించదు' అని వ్యాఖ్యానించారు.

గాజాలో పేలిన మందుపాతర ఐదుగురు ఇజ్రాయెల్ సైనికులు మృతి

టెల్ అవీవ్: గాజాలో మిలటరీ ఆపరేషన్ సాగిస్తున్న ఇజ్రాయెల్‌కు మంగళవారం గట్టి ఎదురుదెబ్బ తగిలింది. గాజా ఉత్తర ప్రాంతంలోని బెయిట్ హనూన్‌లో హమాస్ అమర్చిన మందుపాతర పేలి ఐదుగురు ఇజ్రాయెల్ సైనికులు మృతి చెందారు. మృతదేహాలను తరలించేందుకు ప్రయత్నించిన సైనికుల పైనా హమాస్ శ్రేణులు కాల్పులకు దిగాయి. ఈ ఘటనలో 14 మంది సైనికులు గాయపడ్డారు. వీరిలో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు ఇజ్రాయెల్ ఆర్మీ తెలిపింది. యుద్ధం ఆపేయాలంటూ ప్రభుత్వంపై ఒత్తిడి పెరగడంతోపాటు, ప్రధాని నెతన్యాహూ అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌తో చర్చలు జరిపేందుకు వెళ్లిన వేళ ఈ ఘటన జరగడం గమనార్హం. 2023లో హమాస్‌తో యుద్ధం మొదలైన నాటి నుంచి ఇప్పటి వరకు 888 మంది సైనికులు చనిపోయారని ఆర్మీ పేర్కొంది.

మరో 18 మంది పాలస్తీనియన్లు...

గాజా దక్షిణాన ఉన్న ఖాన్‌యూనిస్‌లో శరణార్థుల టెంట్లపై ఇజ్రాయెల్ ఆర్మీ జరిపిన వైమానిక దాడుల్లో నలుగురు చనిపోయినట్లు నాస్సెర్ ఆస్పత్రి వర్గాలు తెలిపాయి. ఇక్కడే జరిగిన మరో దాడిలో దంపతులు, వారి ఇద్దరు పిల్లలు మృత్యువాతపడ్డారు. నుసెయిరత్ ప్రాంతంలో జరిగిన దాడుల్లో 10 మంది ప్రాణాలు కోల్పోగా 72 మంది గాయాలపాలయ్యారని ఔదా ఆస్పత్రి వర్గాలు వెల్లడించాయి.

రాష్ట్రపతి ముర్మాజీ... మాజీ రాష్ట్రపతి కోవిడ్

చత్తీస్‌గఢ్ సభలో మల్లికార్జున ఖర్గే వ్యాఖ్యలు

రాయ్‌పూర్: కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే తప్పులో కాలేశారు. రాష్ట్రపతి, మాజీ రాష్ట్రపతి పేర్లను అభ్యంతరకరంగా పలికారు. ఆయన మంగళవారం చత్తీస్‌గఢ్‌లోని రాయ్‌పూర్‌లో ఓ కార్యక్రమంలో ప్రసంగించారు. రాష్ట్రపతి ద్రౌపది ముర్మును 'ముర్మాజీ' అని సంబోధించారు. కొద్ది క్షణాల్లో తన పొరపాటును సరిదిద్దుకున్నారు. 'ముర్ము' అన్నారు. కొన్ని సెకండ్ల వ్యవధిలోనే మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్‌ను ప్రస్తావిస్తూ.. 'కోవిడ్' అనేశారు. చత్తీస్‌గఢ్‌లో బీజేపీ పాలనలో అడవులను ధ్వంసం చేస్తున్నారని, బీజేపీ నేతల మిత్రులు భూములు కబ్జా చేస్తున్నారని ఖర్గే ఆరోపించారు. జల్, జంగ్, జమీన్ కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. ద్రౌపది మర్ము, రామ్‌నాథ్ కోవింద్‌ను రాష్ట్రపతులను చేశామని బీజేపీ ఘనంగా చెప్పుకుంటోందని, సహజ వనరులను మాత్రం పారిశ్రామికవేత్తలకు కట్టబెడుతోందని మండిపడ్డారు. ఇదిలా ఉండగా, ముర్మాజీ, కోవిడ్ అంటూ ఖర్గే చేసిన వ్యాఖ్యల పట్ల బీజేపీ అధికార ప్రతినిధి గౌరవ్ భాటియా నిప్పులు చెరిగారు. ఖర్గే దళిత వ్యతిరేకి, గిరిజన వ్యతిరేకి, మహిళా వ్యతిరేకి అని ఆరోపించారు.

గంజితో గట్టి మేలు

న్యూఢిల్లీ: ఉరుకులు పరుగుల జీవితంలో నఖశిఖపర్యంతం మనిషికి ఎన్నో ఆరోగ్య సమస్యలు. అన్ని ఆరోగ్య సమస్యలు అవతలి వాళ్లకు చూడగానే కనిపించవు. కానీ జుట్టు సరిగాలేకపోయినా, జుట్టు ఊడిపోయినా ఎదుటి వాళ్లు ఇట్టే కనిపెడతారు. జుట్టు రాలిపోయే సమస్యకు ఇప్పుడు ఎంతో మంది వందల రూపాయలు ఖర్చుపెట్టి ఎన్నో రకాల ఖరీదైన షాంపూలు ఉపయోగిస్తున్నారు. అయితే ప్రత్యేకంగా ఎలాంటి ఖర్చుపెట్టకుండానే జుట్టు రాలే సమస్యను గంజితో పరిష్కరించుకోవచ్చని పలువురు నిపుణులు చెబుతున్నారు. చైనా, జపాన్‌లలో శతాబ్దాలుగా గంజిని జుట్టు పోషణ కోసం విరివిగా ఉపయోగిస్తున్నా భారత్‌లో గంజి వినియోగం అంతంతే. ఈ నేపథ్యంలో గంజిని వృథాగా పారబోయకుండా ఒత్తయిన జుట్టు కోసం సద్వినియోగం చేసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు. జుట్టు కుదుళ్లు బలంగా ఉండేందుకు జపాన్, చైనాలో గంజిని ఉపయోగిస్తారు. గంజి వాడకంతో జుట్టు ఆరోగ్యం మెరుగుపడటంతోపాటు వెంట్రుకల కొనలు పగిలిపోవడంలాంటివి బాగా తగ్గుతాయి. గంజి వినియోగంతో జుట్టు మరింతగా మెరుస్తూ, పొడవు పెరుగుతుందని నిపుణులు చెబుతున్నారు. గంజిలో బి–విటమిన్, ఇ–విటమిన్‌తోపాటు ఐనోసైటోల్, నియాసినమైడ్ వంటి కీలకమైన అమ్లాలు ఉంటాయి. ఇవన్నీ జుట్టు పోషణకు ఎంతో మేలుచేకూరుస్తాయి. పాడైన జుట్టును రిపేర్ చేయడంలో ఐనోసైటోల్, నియాసినమైడ్‌లు కీలకపాత్ర పోషిస్తాయి.

శతాబ్దాలుగా వినియోగం

గంజితోపాటు చాలా సేపు బియ్యాన్ని నానబెట్టడం ద్వారా వచ్చే నీరు కూడా జుట్టుకు ఎంతో మేలుచేస్తుంది. బియ్యాన్ని ఉడకబెట్టాక గిన్నెలోకి వొంపే గంజిలో అత్యావశ్యకమైన ప్రోటీన్లు, విటమిన్లు, ఖనిజ లవణాలు, కొంతమేర అమైనో ఆమ్లాలు ఉంటాయి. ఈ గంజిని జుట్టుకు పట్టిస్తే కేశనాళికలు బలంగా మారతాయి. అమైనో యాసిడ్‌లు, ప్రోటీన్ల కారణంగా జుట్టు బలంగా తయారవుతుంది. జుట్టు పట్టులాగా మృదువుగా మారుతుంది. జుట్టు రాలడం తగ్గిపోతుంది. వెంట్రుక మందం సైతం పెరుగుతుంది. గంజిలో ఉండే ఐనోసైటోల్ అనే కార్బోహైడ్రేడ్ ఇందుకు చాలా దోహదంచేస్తుంది. ఐనోసైటోల్ కారణంగా కేశాలు మరింత దృఢంగా మారతాయి. కేశాల మరమ్మతు, పెరుగుదలకు ఐనోసైటోల్ బాగా పనికొస్తుంది. గంజిలోని సిసీటిన్, మిథియోనైన్‌లు జుట్టును బలంగాచేస్తాయి. దాంతో జుట్టు అంత త్వరగా కొనలు విరిగిపోవు. చిట్లిపోవడం వంటి సమస్యలు బాగా తగ్గుతాయి. ఆరోగ్యవంతమైన, అందమైన జుట్టుకు ఈ అమైనా యాసిడ్‌లు భరోసా ఇస్తాయి. ప్రాచీన జపాన్‌లోనూ మహిళలు గంజిని విరివిగా ఉపయోగించారని తెలుస్తోంది. చైనాలోని హువాంగ్లూ గ్రామంలో యావో మహిళల జుట్టు పొడవుగా, బలంగా, అందంగా ఉంటుంది. గంజితో జుట్టును శుభ్రం చేసుకోవడం వల్లే తమ కేశాలు ఇలా ఆరోగ్యంగా ఉన్నాయని వాళ్లు చెప్పారు. గంజిలోని గొప్పదనాన్ని ఇప్పటికే కనిపెట్టిన కొన్ని బహుళజాతి సంస్థలు తమ ఉత్పత్తులను గంజి ఆధారంగా తయారుచేసి మార్కెట్లోకి తెస్తున్నాయి. హెయిర్ మాస్కులు, కండీషనర్లు ఇలా కేశ సంబంధ ఉత్పత్తుల్లో ఇప్పుడు ప్రధాన సరుకు గంజే.

గంజిని ఎలా వాడాలి?

రోజూ వంటలోకి వండుకున్నట్లే బియ్యాన్ని ఏమాత్రం దుమ్ము, ధూళి, మట్టిలేకుండా చక్కగా జల్లెడ పట్టుకున్నాక నీళ్లుపోసి బియ్యాన్ని ఉడకబెట్టుకోవాలి. చిక్కని గంజిని తర్వాత గిన్నెలోకి ఒంపుకోవాలి. ఈ గంజిని వెంటనే జుట్టుకు పట్టించకూడదు. గది ఉష్ణోగ్రత వద్ద కనీసం 24 నుంచి 48 గంటలపాటు అలాగే పాత్రలోనే ఉంచాలి. పాత్రపై మూత బదులు వస్త్రంతో కప్పి కొనల వెంట రబ్బర్‌తో చుట్టాలి. ఇలా ఒకటి, రెండు రోజులు పులియబెట్టాక నేరుగా జుట్టుకు పట్టించండి. నెమ్మదిగా కుదుళ్ల వద్ద మసాజ్ చేయండి. దీంతో గంజి జుట్టుకు సమంగా అంటుకుంటుంది. రక్తప్రసరణ సైతం సరిగా అవుతుంది. తలస్నానం చేశాక కూడా జుట్టు ఆరిన తర్వాత ఇలా గంజి పట్టించవచ్చు. ఒక 20 లేదా 30 నిమిషాల తర్వాత సాధారణ నీటితో జుట్టు కడుక్కుంటే సరిపోతుంది. వారానికి కనీసం రెండు సార్లు ఇలా చేస్తే చక్కటి ఫలితం ఉంటుంది. అతిగా వాడితే మాత్రం దురద వంటి కొత్త సమస్యలు ఉత్పన్నమవుతాయి. అలాంటప్పుడు వైద్యుల సలహాతో ఈ చిట్కాను కొనసాగించవచ్చు.

నింగిలోకి 166 మంది అస్థికలు

- మళ్లీ తిరిగొస్తూ సముద్రంలో కూలిన స్పేస్ క్యాప్సూల్
- విషాదాంతమైన వినూత్న ప్రయోగం

న్యూయార్క్: అంతరిక్షం అంచులను చూడాలని ఎంతో మంది కలలుకంటారు. అంతరిక్షంలోకి వెళ్లాలంటే కోట్ల రూపాయల ఖర్చు అవుతుంది. పైగా అంతరిక్షయానం చేసేందుకు తగ్గ మానసిక, శారీరక దారుఢ్యం తప్పనిసరి. అయితే తాము వెళ్లలేకపోయినా తమ వారి అస్థికలనైనా పంపించి వారికి శాశ్వతత్వం ప్రసాదిద్దామని కొందరు అనూహ్య నిర్ణయం తీసుకున్నారు. ఒక స్పేస్‌క్యాప్సూల్ ద్వారా అస్థికలను కొద్దిసేపైనా అంతరిక్షంలోకి పంపిస్తే బాగుంటుందన్న వారి ఆశకు జర్మనీలోని ఒక అంతరిక్షసంస్థ ఆచరణలో పెట్టింది. అయితే చివరి నిమిషంలో ఆ క్యాప్సూల్ నియంత్రణ కోల్పోయి సముద్రంలో కూలిపోయింది. ఇలా ఈ వినూత్న ప్రయోగం తొలుత విజయవంతంగా తుదకు విషాదాంతంగా ముగిసింది.

మిషన్ పాజిబుల్‌తో మొదలై..

జర్మనీకి చెందిన అంకుర సంస్థ అయిన ' ది ఎక్స్‌ప్లోరేషన్ కంపెనీ'ని పలువురు వ్యక్తులు సంప్రతించారు. తమ బంధువులు, కుటుంబసభ్యుల అస్థికలను నింగిలోకి తీసుకెళ్లి, మళ్లీ తీసుకురావాలని కోరారు. అందుకే సంస్థ కొత్తగా ఎన్‌వైఎక్స్ అనే స్పేస్ క్యాప్సూల్‌ను తయారుచేసింది. అందులో 166 మంది అస్థికలు, గంజాయి మొక్క భాగాలు, విత్తనాలు, ఇతర జ్ఞాపకాలను ఉంచి నింగిలోకి తీసుకెళ్లాలని నిర్ణయించింది. ఈ 'మిషన్ పాజిబుల్' ప్రాజెక్ట్ కోసం అమెరికాలోని టెక్సాస్ కేంద్రంగా పనిచేస్తున్న సెలెస్టిస్ అనే మరో సంస్థతో జట్టుకట్టింది. నింగిలోకి అస్థికలను తీసుకెళ్లే పనిలో సెలెస్టిస్ సంస్థ కొంత అనుభవం గడించింది. రెండూ కలిసి జూన్ 23వ తేదీన అస్థికలున్న వ్యోమనౌకను నింగిలోకి ప్రయోగించాయి. విజయవంతంగా నింగిలోకి దూసుకెళ్లిన ఎన్‌వైఎక్స్ క్యాప్సూల్ రెండు సార్లు భూమి చుట్టూ చక్కర్లు కొట్టింది. 550 కిలోమీటర్ల ఎత్తులో రెండు సార్లు తిరిగాక నెమ్మదిగా భూమి వైపునకు వచ్చింది. భూ ఉపరితలానికి 26 కిలోమీటర్ల ఎత్తులో ఉండగా క్యాప్సూల్ పారాచూట్‌లు తెరచుకోలేదు. దాంతో అది స్వేచ్ఛగా, వేగంగా కిందకు దూసుకొచ్చి పసిఫిక్ మహాసముద్రంలో పడిపోయింది. వేగంగా పడటంతో అది నీటిలో మునిగి అందులోని 166 మందికి చెందిన అస్థికలన్నీ సముద్రజలాల్లో కలిసిపోయాయి. ఈ ఘటనపై ది ఎక్స్‌ప్లోరేషన్ సంస్థ తీవ్ర విచారం వ్యక్తంచేస్తూ బంధువులకు క్షమాపణలు చెప్పింది. ఈ సందర్భంగా ఒక ప్రకటన విడుదలచేసింది. '' తొలుత ప్రయోగం విజయవంతమైంది. లాంఛర్ నుంచి పేలోడ్‌లు సవ్యంగా విడిపోయి కక్ష్యలో కుదురుకున్నాయి. రెండు సార్లు చక్కర్లు కొట్టాక భూకేంద్రం నుంచి కమ్యూనికేషన్ సంబంధాలు తెగిపోయాయి. దాంతో అది ప్యారచూట్ తెరచుకోక జలసమాధి అయ్యింది. దీనికి కారణాలపై అంతర్గత దర్యాప్తుచేస్తున్నాం. అసంపూర్ణంగానైనా విజయం దక్కింది. అయితే మమ్మల్ని నమ్మిన వాళ్ల నమ్మకాన్ని వమ్ముచేసినందుకు బాధ్యతగా క్షమాపణలు చెబుతున్నాం. అయితే చరిత్రాత్మకమైన యాత్రలో తమ వాళ్లు భాగస్వాములయ్యారన్న పాక్షిక సంతృప్తి మాత్రం బంధువులు, స్నేహితులకు దక్కింది'' అని ది ఎక్స్‌ప్లోరేషన్ కంపెనీ సీఈవో హెలెన్ హబీ వ్యాఖ్యానించారు.

రైలు బాత్రూమ్‌లో నవజాత శిశువు

- బ్యాగులో కుక్కేసి వదిలించుకున్న కుటుంబం
- సిమ్‌కార్డ్‌తో తీగలాగిన పోలీసులు
- కామాంధుడైన తండ్రి దారుణోదంతం వెలుగులోకి

న్యూఢిల్లీ: కామాంధుడైన తండ్రి ఒడిగట్టిన దారుణానికి బలైన ఒక మైనర్ బాలిక రైలులో బిడ్డను ప్రసవించింది. భయంతో బిడ్డను బ్యాగులో కుక్కేసి పారిపోయిన ఆ కుటుంబాన్ని ఒక సిమ్‌కార్డ్ పట్టించిన ఉదంతం ఉత్తర ప్రదేశ్‌లో వెలుగుచూసింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఉత్తరప్రదేశ్‌కు చెందిన ఒక కుటుంబం జూన్ 22వ తేదీన పట్నా–చండీగఢ్ సమ్మర్ స్పెషల్ రైలులో ఢిల్లీకి బయల్దేరింది. ఆ కుటుంబంలోని మైనర్ బాలికను ఢిల్లీలో ఆస్పత్రిలో చూపించేందుకు కుటుంబసభ్యులంతా కలిసి వెళ్తున్నారు. గర్భంతో ఉన్న ఆ బాలిక మార్గమధ్యంలో రైలు వారణాసి సమీపానికి వచ్చినప్పుడు రైలులోనే ప్రసవించింది. దీంతో భయపడిపోయిన తండ్రి వెంటనే పసిగుడ్డును ఒక చిన్న బ్యాగులో పెట్టి ఆ బ్యాగును వేరే రైలు బాత్రూమ్‌లో పడేసి వెళ్లిపోయారు. అందరూ ఇంటికి చేరుకున్నారు. అయితే రైలు ఉత్తరప్రదేశ్‌లోని మొరాదాబాద్ రైల్వేస్టేషన్‌కు చేరుకున్నాక కొందరు చిరు వ్యాపారులు బాత్రూమ్ నుంచి చిన్నారి గుక్కపెట్టి ఏడుస్తున్న శబ్దం విని బాత్రూమ్‌లోకి వెళ్లి చూశారు. బాత్రూమ్‌లో బ్యాగులో బొడ్డుతాడు కూడా తెంపని అప్పుడే పుట్టిన పిల్లాడిని చూసి అవాక్కయ్యారు. వెంటనే గవర్నమెంట్ రైల్వే పోలీస్(ఆర్‌జీపీ)కి సమాచారం అందించారు. వెంటనే రంగంలోకి దిగిన రైల్వే పోలీసులు ఆ పసిబిడ్డను స్వాధీనంచేసుకున్నారు. చిన్నారిని హుటాహుటిన ఆస్పత్రికి తరలించి బాగోగులు చూసుకున్నారు. అయితే చిన్నారిని కుక్కిపెట్టిన అదే బ్యాగులో ఒక సిమ్‌కార్డ్ కనిపించింది. ఇది బిహార్‌లో రీచార్జ్ చేసి వాడుతున్నట్లు దర్యాప్తులో తేలింది. సిమ్‌కార్డ్ కోణంలో దర్యాప్తు ముమ్మరం చేశారు. తమ బంధువుల అమ్మాయి ఒకరు బిడ్డను కని రైలులో వదిలేసి వచ్చిందని అసలు విషయం చెప్పాడు. అలా బిహార్‌లోని ఛాప్రాలో ఉంటున్న మైనర్ కుటుంబం జాడను పోలీసులు కనిపెట్టారు. పసిబిడ్డ తల్లి అయిన మైనర్‌ను, ఆ మైనర్ తండ్రిని రప్పించారు. మైనర్ బాలికను కోర్టులో ప్రవేశపెట్టగా ఆ అమ్మాయి అసలు విషయం బహిర్గతంచేసింది. తాగుడుకు బానిస అయిన తన కన్నతండ్రే గత ఏడాదికాలంగా తనను పలుమార్లు అత్యాచారంచేశాడని, ఆ కారణంగానే గర్భం దాల్చానని చెప్పడంతో అంతా హుతాశులయ్యారు. వెంటనే తండ్రిని పలు సెక్షన్ల కింద పోలీసులు అరెస్ట్‌చేశారు. తదుపరి దర్యాప్తు కోసం రైల్వే పోలీసులు, స్థానిక యంత్రాగం బిహార్‌కు వెళ్లారు. పసిపిల్లాడిని కేంద్ర మహిళా, శిశు అభివృద్ధి మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో నిరంతరం పనిచేసే చైల్డ్‌లైన్ కేంద్రంలో చేర్పించారు. పిల్లాడిని పెంచేంత ఆర్థికస్తోమత తమకు లేదని మైనర్ బాలిక చెప్పింది. దీంతో ప్రస్తుతానికి పిల్లాడి బాధ్యతను తాము చూసుకుంటామని మొరాదాబాద్ శిశు సంరక్షణ కమిటీ తెలిపింది.

విమానం టేకాఫ్‌కు తేనెటీగల అడ్డు

న్యూఢిల్లీ/ఇండోర్: వరుస ప్రమాదాలతో ఇటీవలి కాలంలో విమాన ప్రయాణం అంటేనే భయపడాల్సి వస్తోంది. ఎప్పుడు ఏ సాంకేతిక లోపం వస్తుందో తెలియని పరిస్థితి నెలకొంది. ఎప్పుడూ సాంకేతికమేనా.. సహజ విపత్తులను కలిగిద్దాం అనుకున్నాయేమో.. సూరత్ నుంచి జైపూర్ వెళ్లే ఇండిగో విమాన ప్రయాణాన్ని తేనెటీగలు ఆలస్యం చేశాయి. విమానంలో ప్రయాణికులందరూ ఎక్కారు. లగేజీ ఎక్కించగానే.. విమానం బయల్దేరాల్సి ఉంది. ఈలోపే ఈ విచిత్రమైన సంఘటన జరిగింది. ప్రయాణికుల బ్యాగులను పెట్టేందుకు సిబ్బంది లగేజ్ కేబిన్ డోర్ తెరవగానే తేనెటీగలు ఎగబడ్డాయి. వాటిని చెదరగొట్టడానికి పొగ పెట్టారు. అయినా సరే తేనెటీగలు విమానం దిగలేదు. వాటిని ఎలా దించాలో విమానాశ్రయ సిబ్బంది తలలుపట్టుకున్నారు. చివరకు అగ్నిమాపక శాఖను అప్రమత్తం చేశారు. అగ్నిమాపక యంత్రం రన్‌వే వద్దకు చేరుకుని లగేజీ తలుపుపై నీరు చల్లింది. అప్పటివరకు పట్టువదలని విక్రమార్కుల్లా ఉన్న ఉన్న తేనెటీగలు చివరికి విమానాన్ని వదిలి వెళ్లాయి. ఈ తతంగమంతా అయ్యేవరకు ఓగంట సమయం పట్టింది. అలా విమానం గంటల ఆలస్యంగా బయలుదేరింది.

తిరిగొచ్చిన ఇండిగో విమానం..

ఇండోర్ నుంచి రాయ్‌పూర్ వెళ్తున్న ఇండిగో విమానం ఒకటి టేకాఫ్ అయిన కొద్దిసేపటికే విమానాశ్రయానికి తిరిగి వచ్చింది. ఇండిగో ఎయిర్‌లైన్స్ విమానం 6ఈ–7295 మంగళవారం ఉదయం 6.35 గంటలకు 51 మంది ప్రయాణికులతో బయలుదేరింది. కొద్ది నిమిషాల్లోనే సాంకేతిక లోపం వచ్చిందని పైలట్ గ్రహించారు. వెంటనే ఏటీసీకి సమాచారం అందించారు. వెంటనే విమానాన్ని వెనక్కి తిప్పి.. దేవి అహల్యాబాయి హోల్కర్ విమానాశ్రయంలో సురక్షితంగా ల్యాండింగ్ చేశారు.

జూన్‌లో ఎండ ప్రచండమే

గత నెలలో ప్రపంచవ్యాప్తంగా భారీ ఉష్ణోగ్రతలు

- 12 దేశాల్లో నమోదైన కొత్త రికార్డ్



నైజీరియా నుంచి జపాన్ దాకా.. పాకిస్తాన్ నుంచి స్పెయిన్ దాకా గత నెలలో ప్రపంచవ్యాప్తంగా భారీగా ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. 12 దేశాల్లో కొత్త రికార్డులు సృష్టించాయి. మరో 26 దేశాల్లో బాగా వేడి నెలగా జూన్ రికార్డుకెక్కింది. యూరోపియన్ మానిటర్ కోపర్నికస్ సంస్థకు చెందిన ఏఎఫ్‌పీ విశ్లేషణ ఈ విషయం వెల్లడించింది. యూరప్, ఆసియా, ఆఫ్రికాలో గత నెలలో 79 కోట్ల మంది వేడి ముప్పును ఎదుర్కొన్నారు. బ్రిటన్, చైనా, ఫ్రాన్స్, డెమొక్రటిక్ రిపబ్లిక్ ఆఫ్ కాంగో, ఇథియోపియా తదితర 26 దేశాల్లో రెండో అత్యంత వేడి నెలగా జూన్ రికార్డు సృష్టించింది. కాలుష్యం, వాతావరణ మార్పుల కారణంగానే ఉష్ణోగ్రతలు అనూహ్యంగా పెరిగిపోతున్నట్లు నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

- యూరప్‌లో గత నెలలో సాధారణం కంటే 3 డిగ్రీల సెల్సియస్ అధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. పారిస్, బెల్జియం, నెదర్లాండ్స్ వంటి దేశాల్లో జనం అల్లాడిపోయారు. స్విట్జర్లాండ్, ఇటలీ, స్పెయిన్, బోస్నియా, మాంటెనిగ్రోలోనూ ఇదే పరిస్థితి.
- ఆసియా–పసిఫిక్ ప్రాంతంలో సాధారణంగా ఎక్కువ ఉష్ణోగ్రతలు రికార్డయ్యాయి. కోస్తా తీర ప్రాంతాల్లో 1.2 డిగ్రీలు అధికంగా నమోదయ్యాయి. జపాన్ ప్రజలు హాటెస్ట్ జూన్‌ను చవిచూశారు. దేశంలో 126 ఏళ్ల క్రితం ఉష్ణోగ్రతలను నమోదు చేయడం మొదలైంది. అప్పటి నుంచి అత్యంత వేడి జూన్ నెల ఇదే కావడం గమనార్హం.
- ఉభయ కొరియా దేశాల్లోనూ సాధారణం కంటే 2 డిగ్రీల ఎక్కువ ఉష్ణోగ్రత నమోదయ్యింది. హాటెస్ట్ జూన్‌గా నిలిచిపోయింది.
- చైనాలో 40 డిగ్రీల కంటే ఎక్కువ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. జూన్‌లో ఈ స్థాయిలో సూర్యప్రతాపం కనిపించడం ఇదే మొదటిసారి.
- ఆసియాలోని పాకిస్తాన్, తజకిస్తాన్, ఇరాన్, అఫ్గానిస్తాన్, ఉజ్బెకిస్తాన్, కిర్గిజిస్తాన్‌లోనూ జూన్ నెల అత్యంత వేడి వసంత కాలంగా నిలిచింది.
- నైజీరియాలో రికార్డ్–బ్రేకింగ్ స్థాయి ఉష్ణోగ్రతలు రికార్డయ్యాయి. సెంట్రల్ ఆఫ్రికన్ రిపబ్లిక్, దక్షిణ సూడాన్, కామెరూన్, కాంగో, ఇథియోపియాలోనూ ఇలాంటి పరిణామమే ఎదురయ్యింది.

\- సాక్షి, నేషనల్ డెస్క్

ఆరో తరగతిలోనూ ఎక్కాలు రావు!

కేంద్ర విద్యా శాఖ సర్వేలో వెల్లడి

న్యూఢిల్లీ: దేశంలో విద్యా వ్యవస్థ ఎంత నాసిరకంగా ఉందో కేంద్ర విద్యాశాఖ సర్వేలో తేటతెల్లమయ్యింది. మూడో తరగతి చదువుకున్న విద్యార్థుల్లో 55 శాతం మంది మాత్రమే ఒకటి నుంచి 99 వరకు అంకెలను ఆరోహణ, అవరోహణ క్రమంలో అమర్చగలరు. ఆరో తరగతి చదువుతున్న వారిలో కేవలం 53 శాతం మందికే ఒకటి నుంచి పది దాకా ఎక్కాలు వచ్చు. గత ఏడాది డిసెంబర్ 4న ఈ సర్వే నిర్వహించారు. 36 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలకు సంబంధించిన 781 జిల్లాల్లో 74,229 ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో 21.15 లక్షల మంది విద్యార్థులను ప్రశ్నించారు. వీరిలో మూడు, ఆరు, తొమ్మిదో తరగతి చదువుతున్న విద్యార్థులున్నారు. మూడో తరగతి విద్యార్థుల్లో 58 శాతం మంది కూడికలు, తీసివేతలు చేయగలరని తేలింది. మూడో తరగతి, ఆరో తరగతిలో గణితం సబ్జెక్టులో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు బాగా వెనుకబడి ఉన్నట్లు వెల్లడయ్యింది. కేంద్ర ప్రభుత్వ పాఠశాలల్లో తొమ్మిదో తరగతి చదువుతున్న విద్యార్థులు దాదాపు అన్ని సబ్జెక్టుల్లో రాణిస్తున్నట్లు సర్వేలో గుర్తించారు. అలాగే అన్ని తరగతుల విద్యార్థులు లాంగ్వేజ్(భాష)లో ఎక్కువ, గణితంలో అతి తక్కువ మార్కులు సాధిస్తున్నారు. విద్యార్జన విషయంలో రూరల్–అర్బన్ అనే వ్యత్యాసం కూడా కనిపిస్తోంది. గ్రామాల్లోని మూడో తరగతి విద్యార్థులు మ్యాథ్స్, లాంగ్వేజ్‌లో పట్టణాల్లోని విద్యార్థుల కంటే ఎక్కువగా రాణిస్తున్నారు. పట్టణాల్లోని ఆరు, తొమ్మిది తరగతి విద్యార్థులు దాదాపు అన్ని సబ్జెక్టుల్లో పల్లెల్లోని విద్యార్థుల కంటే మిన్నగా చదువుతున్నారు.

వివాహ పన్ను రద్దు చేసిన తొలి విజయనగర రాజు?

మూడు శతాబ్దాల పాటు దక్షిణాపథ చరిత్రలో హిందూ సంస్కృతిని సముద్ధరించడంలో పేరొందిన చివరి హిందూ రాజ్యంగా విజయనగర సామ్రాజ్యం ప్రసిద్ధి చెందింది. భారతీయ సంస్కృతికి పునరుజ్జీవనం కల్పించింది. విజయనగర రాజులతో బహమనీ సుల్తాన్లు నిరంతరం యుద్ధాలు చేయడం వల్ల వారు ఉత్తర భారతదేశం వైపు దృష్టి సారించలేకపోయారు..

సివిల్స్, గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం
జనరల్ స్టడీస్
భారతదేశ చరిత్ర

విజయనగర సామ్రాజ్యం

సంగమ వంశానికి చెందిన హరిహర, బుక్కరాయలు క్రీ.శ. 1336లో తుంగభద్రానదీ తీరంలో మాధవ విద్యారణ్య స్వామి సహకారంతో విజయనగర సామ్రాజ్యాన్ని స్థాపించారు. సోదరులైన వీరిద్దరూ ప్రారంభంలో కాకతీయ ప్రతాపరుద్రుడి కొలువులో సేనానులుగా ఉండేవారు. క్రీ.శ. 1323లో కాకతీయ రాజ్యాన్ని మహమ్మద్ బిన్ తుగ్లక్ ఆక్రమించడంతో హరిహర, బుక్కరాయలు కర్ణాటకలో 'కంపిలి' రాజ్యానికి వలస వెళ్లారు. తర్వాత ఢిల్లీ సుల్తాన్ మహ్మద్ బిన్ తుగ్లక్ వీరిని ఇస్లాం మతంలోకి మార్చి ఆనెగొంది, కంపిలి ప్రాంతాలకు పాలకులుగా నియమించాడు. కాలక్రమంలో 1336–1340 మధ్య వీరు ఢిల్లీ సుల్తాన్‌లను ధిక్కరించి స్వతంత్రంగా విజయనగర రాజ్యాన్ని స్థాపించారు. ముస్లిం రాజులపై విజయ సూచకంగా 'విజయనగరం'గా, విద్యా విషయంలో సాధించిన అభివృద్ధి కారణంగా 'విద్యానగరం'గా ఇది చరిత్రలో పేరు పొందింది.

విజయనగర సామ్రాజ్య స్థాపన విషయంలో చరిత్రకారుల్లో భిన్నాభిప్రాయాలున్నాయి. విజయనగర రాజ్య నిర్మాత హోయసాల రాజు మూడో వీరభల్లాలుడని ఫెరిస్తా రచన ఆధారంగా రెవరెండ్ ఫాదర్ హెరాస్ పేర్కొన్నారు. ఈ రాజ్య నిర్మాత హరిహర బుక్కరాయలేనని, 'విస్మృత సామ్రాజ్యం' (ది ఫర్గాటెన్ ఎంపైర్) గ్రంథ రచయిత రాబర్ట్ సీవెల్ నిర్ధారించారు. అధికమంది చరిత్రకారులు ఈయన అభిప్రాయంతో ఏకీభవిస్తున్నారు. హరిహరుడు కన్నడవారా, తెలుగువారా అనే విషయంలోనూ వివాదం ఉంది. స్థానిక చరిత్రలు, బదౌనీ, న్యూనిజ్ రచనల ఆధారంగా హరిహరరాయలు తెలుగు వారేనని ప్రసిద్ధ చరిత్రకారుడు డాక్టర్ నేలటూరి వెంకట రమణయ్య నిర్ధారించారు. స్థానిక చరిత్రల ఆధారంగా హరిహర, బుక్కరాయలు కాకతీయ ప్రతాపరుద్రుని సేనానులని, మంగళ నిలయ వాసియైన 'సంగముని' కుమారులని చరిత్రకారులు పేర్కొన్నారు. 1336-40 మధ్య కాలంలో హరిహర, బుక్కరాయలు రాజధానిని 'ఆనగొంది' నుంచి హంపీ విజయనగరానికి మార్చారు.

ఆధారాలు

మాధవ విద్యారణ్యుని 'కాలజ్ఞానం'లో విజయనగర పాలకుల వివరాలు, విద్యారణ్యుని వృత్తాంతం, రాజ్యస్థాపన వివరాలున్నాయి. ఒకటో రాజనాథ డిండిముడు రచించిన సాళువాభ్యుదయం, రెండో రాజనాథ డిండిముడు రచించిన అచ్యుత రామాభ్యుదయం, అరుణగిరినాథ డిండిముడు రచించిన సోమవల్లీ యోగానంద ప్రహసనం, రామభద్రాంబిక రాసిన రఘునాథాభ్యుదయం, స్థానాపతి తెలుగులో రచించిన రాయవాచకం, కంపిలి రాయచరిత్ర, కృష్ణరాయవిజయం, తిరుమాలాంబిక రచించిన చారిత్రక గ్రంథాలు విజయనగర సామ్రాజ్య చరిత్రకు ప్రధాన ఆధారాలుగా ఉన్నాయి. మాధవ సాయన మంత్రి చేసిన వ్యాఖ్యానాల ద్వారా సంగమ వంశ వివరాలు తెలుస్తున్నాయి. రెండో బుక్కరాయల ఆస్థాన వైద్యుడు రాసిన 'వైద్యరాజ్యవల్లభం' లాంటి ఆయుర్వేద గ్రంథం, లక్ష్మీ నారాయణుడు రచించిన సంగీత సూర్యోదయం, కళింగ గజపతి ప్రతాపరుద్రుడి సరస్వతీ విలాసం, శ్రీకృష్ణదేవరాయలు రాసిన తెలుగులో పంచకావ్యమైన ఆముక్తమాల్యద (విష్ణుచిత్తీయం), అల్లసాని పెద్దన 'మనుచరిత్ర' లాంటి గ్రంథాలు నాటి రాజకీయ, మత, సాంఘిక పరిస్థితులను వివరిస్తున్నాయి.

విదేశీ యాత్రికుల కథనాలు:

- మొరాకో (ఆఫ్రికా) దేశస్థుడైన ఇబన్ బటూటా అనే యాత్రికుడు మొదటి హరిహరుని కాలం నాటి విజయనగర పరిస్థితులను వివరించాడు.
- వెనీస్ (ఇటలీ) యాత్రికుడైన నికోలా డీ కోంటీ మొదటి దేవరాయల రాజ్యాన్ని సందర్శించి రాజ్య విస్తరణ, నాటి సాంఘిక పరిస్థితులను వివరించాడు.
- పారశీక (పర్షియా) యాత్రికుడు అబ్దుల్ రజాక్ రెండో దేవరాయల కాలం నాటి పరిస్థితులను వర్ణించాడు.
- డొమింగో పయస్ (పోర్చుగీసు) అనే యాత్రికుడు శ్రీకృష్ణదేవరాయల వ్యక్తిత్వం, రాజ్యపాలనా స్వరూపం, నాటి సంపద, రక్తతర్పణాలు, ఆచార వ్యవహారాల గురించి వివరించాడు.
- పోర్చుగీసు యాత్రికుడైన న్యూనిజ్ కృష్ణదేవరాయలు, అచ్యుతదేవరాయల కాలం నాటి పరిస్థితులను గ్రంథస్థం చేశాడు.
- కృష్ణదేవరాయల కాలంలో వచ్చిన మరో పోర్చుగీసు యాత్రికుడు 'ఎడ్వర్డో బార్బోసా' నాటి పాలనా విధానాన్ని వర్ణించాడు.
- రష్యా వ్యాపారస్థుడు అస్తినాసియస్ నికితిన్ 1470లో దక్కన్ బహమనీ రాజ్యాన్ని సందర్శించి, నాటి న్యాయస్థానాలు, సైన్యం, ప్రజల స్థితిగతులను వివరించాడు.
- ఎడోవికో-డి-వర్తెమా (ఇటలీ దేశస్థుడు) గోవా, కాలికట్ ఓడరేవులు, విజయనగర రాజ్య పరిస్థితులను వివరించాడు.

శాసనాధారాలు:

- మొదటి హరిహరరాయలు వేయించిన 'బాగపల్లెసి' తామ్ర శాసనం ఆయన విజయాలను తెలియజేస్తోంది.
- కంపన కుమారుడు రెండో సంగముడు వేయించిన బిట్రగుంట దాన శాసనం 'అయిదుగురు సంగమ సోదరుల' వంశావళిని విశదీకరిస్తోంది.
- రెండో హరిహరరాయల చెన్నరాయ పట్టణ శాసనంలో ఒకటో బుక్కరాయలు జయించిన ప్రాంతాల గురించి వివరిస్తోంది.
- శ్రీరంగ పట్టణం తామ్ర శాసనం రెండో దేవరాయల విజయాల గురించి తెలుపుతోంది.
- ఇమ్మడి నరసింహారాయల 'దేవులపల్లి' రాగి శాసనం సాళువ రాజుల వంశావళిని విశదీకరిస్తోంది.

నాణేలు: విజయనగర రాజులు అధిక సంఖ్యలో బంగారు నాణేలు ముద్రించారు. వీటిని వరహాలు, పగోడాలు, ఫణాలని పిలిచేవారు. వీటిలో కొన్ని పూర్తి వరహాలు, అర్ధ వరహాలుగా ముద్రించారు. నాణేల వెనుకభాగంలో దేవతలు, నంది, ఏనుగు, గండభేరుండ, బాలకృష్ణ, లక్ష్మీదేవి, వేంకటేశ్వరుడి బొమ్మలు ముద్రించారు. నాణేనికి ఒకవైపు దేవనాగరి లిపి, మరోవైపు వైష్ణవ సంప్రదాయ బొమ్మలు ముద్రించారు. కొన్ని నాణేలపై కన్నడ లిపి కూడా కనిపిస్తోంది. ఈ నాణేల ద్వారా నాటి రాజకీయ చరిత్ర, మత విశ్వాసాలు, ఆర్థిక పరిస్థితులు తెలుస్తున్నాయి.

రాజవంశాలు

సంగమ వంశం: క్రీ.శ. 1336 నుంచి 1676 వరకు విజయనగర సామ్రాజ్యాన్ని సంగమ, సాళువ, తుళువ, ఆరవీటి వంశాల వారు అవిచ్ఛిన్నంగా పాలించారు. తొలి రాజవంశం సంగమ వంశ సామ్రాజ్య స్థాపకులైన హరిహర, బుక్క సోదరులు సంగముడి కుమారులు కావడంతో సంగమ వంశమని పేరొచ్చింది. ఈ వంశంలో మొదటి హరిహర రాయలు 1336 నుంచి 1356 వరకు పాలించారు. 1339 నాటికి తూర్పున బంగాళాఖాతం నుంచి పశ్చిమాన అరేబియా సముద్రం వరకు రాజ్యాన్ని విస్తరించారు. ఈయనకు 'పూర్వ, పశ్చిమ సముద్రాధిపతి' అనే బిరుదు ఉంది. దక్కన్ బహమనీ విజయనగర రాజుల మధ్య సంఘర్షణ మొదటి హరిహరుని కాలంలోనే ప్రారంభమైంది. కృష్ణా – తుంగభద్ర నదుల 'అంతర్వేది భూమి' ఈ సంఘర్షణలకు మూల కారణం. దీన్నే 'రాయచూర్ దోబ్' అంటారు. ఈయన కాలంలో మొరాకో (ఆఫ్రికా) యాత్రికుడు 'ఇబన్ బటూటా' విజయనగర సామ్రాజ్యాన్ని సందర్శించాడు.



మొదటి హరిహర రాయల మరణానంతరం ఆయన సోదరుడు మొదటి బుక్కరాయలు 1356 నుంచి 1377 వరకు పాలించాడు. ఈయన కాలంలోనే 'పెనుగొండ దుర్గం' నిర్మించారు. ఈయన కాలంలో జరిగిన మధుర (తమిళదేశం) ఆక్రమణ ముఖ్యమైంది. ఈయన కుమారుడు కుమార కంపన మధురను జయించి, విజయనగర రాజ్యంలో విలీనం చేశారు. మొదటి బుక్కరాయలు 1374లో చైనాకు రాయబారిని పంపినట్లు మింగ్ వంశ చరిత్ర ద్వారా తెలుస్తోంది. బుక్కరాయలు శైవ మతాన్ని, సంస్కృత, ఆంధ్ర భాషలను ఆదరించారు. సాయన, మాధవులు అనే కవులు ఈయన ఆస్థానంలో వేదాలకు భాష్యాలు రాశారు. నాచన సోమనాథుడు ఈయన ఆస్థానంలోని వారే. మొదటి బుక్కరాయలు, మహ్మద్‌షా మధ్య 'ముద్గల్' కోట కోసం జరిగిన యుద్ధంలో బహమనీ సుల్తాన్లు మొదటిసారిగా ఫిరంగులను వాడారు. భారతదేశంలో ఫిరంగిదళాలను ఉపయోగించిన తొలి యుద్ధం ఇదే.

మొదటి బుక్కరాయలు తర్వాత రెండో హరిహర రాయలు 1377 నుంచి 1404 వరకు పాలించారు. ఈయన కొండవీటి రెడ్లు, రేచర్ల పద్మనాయకులతో యుద్ధాలు చేశారు. పానగల్లు కోటను ఆక్రమించారు. సింహాసనంపై దాడిచేసిన మొదటి విజయనగర రాజు ఈయనే.

విజయనగర సామ్రాజ్యాన్ని విస్తరించడంలో ప్రధాన పాత్ర వహించిన సంగమ వంశ రాజుల్లో మొదటి దేవరాయలు ముఖ్యులు. ఈయన 1406 నుంచి 1422 వరకు పాలించారు. రెడ్డిరాజుల నుంచి ఉదయగిరి, మోటుపల్లి ప్రాంతాలను ఆక్రమించారు. మొదటి దేవరాయలు తుంగభద్రానదికి ఆనకట్ట వేయించి, 15 మైళ్ల పొడవు కొండ ప్రాంతాన్ని తొలిపించి, కాలువల ద్వారా విజయనగరానికి నీటి సౌకర్యం కల్పించారు. ఈయన కాలంలోనే ఇటలీ యాత్రికుడు నికోలా డీ కోంటీ విజయనగరాన్ని సందర్శించాడు.

సంగమ వంశ విజయనగర రాజుల్లో సుప్రసిద్ధుడు రెండో దేవరాయలు. ఈయననే ప్రౌఢ దేవరాయలుగా పిలుస్తారు. ఈయన ఏనుగుల వేటలో నేర్పరి. ఈయనకు 'గజబేంతకార' బిరుదున్నట్లు శాసనాల ద్వారా తెలుస్తోంది. రెండో దేవరాయల పాలనా కాలం 1422 – 1446.

సైన్యాన్ని పటిష్ఠం చేయడానికి అధిక సంఖ్యలో ముస్లింలను సైన్యంలో చేర్చుకున్నారు. వ్యవసాయాభివృద్ధికి హరిద్రా ఆనకట్టను బాగు చేయించారు. బహమనీలతో రెండుసార్లు యుద్ధం చేశారు. రాజ్యాన్ని ఉత్తరాన గుల్బర్గా నుంచి దక్షిణాన సింహళం వరకు, తూర్పున బెంగాల్ నుంచి పశ్చిమాన మలబార్ వరకు విస్తరించారు. ఈయన శైవ మతాభిమాని. ముస్లింలకు మత స్వేచ్ఛనిచ్చి, మసీదులు నిర్మించారు. కన్యాశుల్కాన్ని నిరుత్సాహపరిచి, కన్యాదాన సంప్రదాయాన్ని ప్రోత్సహించారు. పారశీక రాయబారి 'అబ్దుల్ రజాక్' ఈయన ఆస్థానాన్ని సందర్శించాడు.

రెండో దేవరాయలు స్వయంగా కవి, పండితుడు సంస్కృత భాషలో మహానాటక సుధానిధి, వృత్తి అనే గ్రంథాలు రచించారు. 'వృత్తి' బ్రహ్మసూత్రాలపై వ్యాఖ్యానం. ఈయన కొలువులోని సంస్కృత కవి అరుణగిరినాథ డిండిముని ఓడించి, శ్రీనాథుడు కనకాభిషేకం పొందారు. 'ప్రభులింగలీల' కన్నడ రచయిత చామరసు ఈయన ఆస్థానంలోని వారే. రెండో దేవరాయలు 'ముత్యాలశాల' పేరుతో సాహిత్య సమావేశాలను నిర్వహించేవారు.

దేవరాయల తర్వాత ఆయన కుమారుడు రెండో విజయరాయలు, ఆ తర్వాత రెండో విజయరాయల కుమారుడు మల్లికార్జునుడు 1447 వరకు పాలించారు. ఈ కాలంలో శత్రు రాజులైన బహమనీలు, ఒరిస్సా గజపతులు తిరిగి విజయనగరంపై దాడులు ప్రారంభించారు.

సాళువ వంశం (క్రీ.శ. 1486–1505): సాళువ వంశస్థులు కర్ణాటకలోని కల్యాణి ప్రాంతానికి చెందినవారు. ఈ వంశానికి చెందిన మంగరాజుకు 'సాళువ' అనే బిరుదు ఉంది. ఈయన తర్వాత గుండరాజు రాజ ప్రతినిధి అయ్యారు. గుండరాజు కుమారుడు సాళువ నరసింహరాయలు. ఈయన విరూపాక్షరాయల కాలంలో సామంతుడిగా పనిచేశారు. ఈయన 1485లో సంగమ వంశం చివరి రాజైన ప్రౌఢరాయల నుంచి విజయనగర రాజ్యాన్ని ఆక్రమించారు. కొన్నాళ్లు చంద్రగిరికి సామంతరాజుగా పనిచేశారు. ఈయన ఆస్థానంలో సాళువాభ్యుదయం రాసిన రాజనాథ డిండిముడు, తెలుగులో శృంగారశాకుంతలం, జైమినీ భారతం రాసిన పిల్లలమర్రి పినవీరభద్రుడు ప్రముఖులుగా వెలుగొందారు. సాళువ నరసింహరాయలకు 'రాయమహారసు' అనే బిరుదు ఉంది. ప్రసిద్ధ వాగ్గేయకారుడు, పదకీర్తనా సంకీర్తనాచార్యుడైన తాళ్లపాక అన్నమాచార్యుడు ఈయన సమకాలికులే. సాళువ నరసింహరాయలను విజయనగర రాజ్య దురాక్రమణదారునిగా కొందరు వర్ణించారు. ఈయన తర్వాత తిమ్మరాయడు, ఇమ్మడి నరసింహుడు పాలించారు. ఇమ్మడి నరసింహుడు రాజైనప్పటికీ, అధికారమంతా తన సైన్యాధ్యక్షుడైన తుళువ నరసనాయకుడి చేతిలో ఉండేది. 1503లో తుళువ నరసనాయకుడు మరణించిన తర్వాత 1505లో ఆయన కుమారుడు వీర నరసింహుడు ఇమ్మడి నరసింహుని వధించి, సింహాసనాన్ని అధిష్ఠించి తుళువ వంశాన్ని స్థాపించారు.

తుళువ వంశం (1505–1576): విజయనగర సామ్రాజ్యాన్ని పాలించిన మూడో రాజవంశం తుళువ వంశం. దీన్ని వీర నరసింహరాయలు 1505లో స్థాపించారు. ఈయన 1509 వరకు రాజ్యమేలారు. పాలించిన అయిదేళ్లూ యుద్ధాలతోనే సరిపోయింది. మైసూరులోని తుళవనాడు వీరి జన్మస్థలం. అందుకే తుళువ వంశమని పేరొచ్చింది. వీరనరసింహరాయలు వివాహ పన్నును రద్దు చేసిన తొలి విజయనగర రాజుగా ప్రసిద్ధి పొందారు. ఉమ్మెత్తూర్ పాలకులను అణచివేసే ప్రయత్నంలో 1509లో మరణించారు. తర్వాత ఈయన సవతి తమ్ముడు శ్రీకృష్ణదేవరాయలు మంత్రి తిమ్మరసు సహాయంతో సింహాసనం అధిష్ఠించారు. తుళువ వంశంలో ఈయన అగ్రగణ్యులు. బీజాపూర్ సుల్తాన్ ఆదిల్‌షాను వధించి, కోవిల కొండను జయించారు. బీదర్‌లో మంత్రి బరీద్‌కు బందీయైన బహమనీ సుల్తాన్ మహ్మద్‌షాను విడిపించి ఆయనకు సింహాసనం అప్పగించి 'యవన రాజ్యస్థాపనాచార్య' బిరుదు పొందారు. ఉమ్మెత్తూర్, శివసముద్రం, పెనుగొండ దుర్గాలను జయించి 'దక్షిణ సముద్రాధీశ్వర' బిరుదు పొందారు. కొండపల్లి, రాజమహేంద్రి, కళింగలను జయించారు. విశాఖ జిల్లాలోని పొట్నూర్ వద్ద రాయలు విజయస్తంభాన్ని ప్రతిష్ఠించారు.

రెండు గదుల హృదయం గల జీవి?

వివిధ జంతువుల్లో రవాణా వ్యవస్థలు

వానపాము

- వానపాము రవాణా వ్యవస్థలో హృదయాలు, రక్తనాళాలు, రక్తం ఉంటాయి. శరీరంలో 8 జతల పార్శ్వ హృదయాలుంటాయి.
- రక్తనాళాలు మూసుకొని ఉండే గొట్టాలు, ఇవి హృదయంతో కలిసి ఉంటాయి. వీటిలో పృష్ఠ రక్తనాళం, ఉదర రక్తనాళం.. ఆహార నాళానికిపైన ఒకటి, కింద ఒకటి ఉంటాయి.
- పృష్ఠ రక్తనాళం ప్రతి ఖండితంలో వివిధ అవయవాల నుంచి రక్తాన్ని సేకరిస్తుంది. అందుకే ఇది ముఖ్య సిరగా పనిచేస్తుంది.
  ఉదర రక్తనాళం ప్రతి ఖండితంలో రక్తాన్ని వివిధ అవయవాలకు సరఫరా చేస్తుంది. ఇది ముఖ్య ధమనిగా పనిచేస్తుంది.
- పృష్ఠ రక్తనాళంలో రక్తం వెనుక నుంచి ముందుకు, ఉదర నాళంలో రక్తం ముందు నుంచి వెనుకకు ప్రయాణిస్తుంది.
- రక్తంలో ఆక్సిజన్‌ను తీసుకుపోయే ప్రొటీన్ ఉంటుంది. అందుకే రక్తం ఎర్రగా ఉంటుంది. ఎర్ర రక్తకణాలు ఉండవు. తెల్లరక్తకణాలే ఉంటాయి. రక్తంలో నీరు, లవణాలు ఉంటాయి.
- శరీర కుడ్యానికి, ఆహార నాళానికి మధ్య ఉన్న శరీర కుహరద్రవం కూడా పదార్థాల రవాణాలో ప్రముఖపాత్ర వహిస్తుంది.

బొద్దింక

- బొద్దింక రవాణా వ్యవస్థలో రక్తనాళాలు ఉండవు. రక్తం శరీర కుహరంలో కోటరాల్లో ప్రవహిస్తుంది. అందుకే దీన్ని స్వేచ్ఛాయుత రక్తప్రసరణ వ్యవస్థ అంటారు.
- బొద్దింక శరీరంలో హృదయావరణ కోటరం, పర్యాంతరంగ కోటరం, ఉదర కోటరం, తలలో శిరఃకోటరం ఉంటాయి.
- బొద్దింక హృదయంలో 13 గదులుంటాయి. ఆఖరి గది మూసుకొని ఉంటుంది. మొదటి గది మహాధమని ద్వారా శిరఃకోటరంలోనికి తెరుచుకుంటుంది.
- రక్తం పక్షాకార కండరాల వల్ల చలిస్తుంది.
- బొద్దింక రక్తం తెల్లగా ఉంటుంది. ఇది ఆక్సిజన్ రవాణాలో పాత్ర వహించదు.

ఉన్నతస్థాయి జీవులు రవాణా వ్యవస్థ

- శరీర భాగాల నుంచి ఆమ్లజని రహిత రక్తం శ్వాసేంద్రియాలకు ఆమ్లజనీకరణం కోసం వెళ్తుంది.
- తక్కువస్థాయి జీవుల్లో ఇక్కడ నుంచి శరీర భాగాలకు ప్రసరణం జరుగుతుంది.
  ఉదా: చేపలు.
- ఆంఫిబియా నుంచి క్షీరదాల వరకు రక్తం శ్వాసేంద్రియాల నుంచి తిరిగి గుండెకు వస్తుంది. గుండె నుంచి శరీర భాగాలకు చేరుతుంది.

చేపలు

- చేపల్లో 2 గదుల హృదయం ఉంటుంది. ఒక కర్ణిక, ఒక జఠరిక ఉంటాయి. శరీర భాగాల నుంచి చెడు రక్తం సిరాసరణి చేరి తర్వాత కర్ణిక చేరుతుంది. అక్కడ నుంచి జఠరిక, తర్వాత మొప్పలకు వెళ్తుంది. మొప్పల్లో ఆమ్లజనీకరణం తర్వాత నేరుగా శరీర భాగాలకు మంచి రక్తం చేరుతుంది.
- చేపల్లో రక్తం గుండె ద్వారా ఒక్కసారే ప్రవహిస్తుంది. అందుకే ఈ వ్యవస్థని ఏకవలయ రక్తప్రసరణ అంటారు.
- చేప హృదయాన్ని 'జలశ్వాస హృదయం' అంటారు. (హృదయం మొప్పలకు రక్తాన్ని పంపుతుంది కాబట్టి)



ఉభయచరాలు

- కప్ప వంటి ఉభయచరాల్లో హృదయం 3 గదులు కలిగి ఉంటుంది. రెండు కర్ణికలు, ఒక జఠరిక ఉంటాయి.
- శరీరం నుంచి మూడు మహాసిరల ద్వారా చెడు రక్తం సిరాసరణి (Sinus venosus) చేరుతుంది. సిరాసరణి నుంచి కుడి కర్ణికలోనికి వెళ్తుంది.
- పుపుస సిర ద్వారా ఆమ్లజని సహిత రక్తం ఎడమ కర్ణికకు చేరుతుంది.
- కర్ణికలు రెండూ ఒకే జఠరికలోనికి తెరుచుకుంటాయి. కాబట్టి ఆమ్లజని సహిత, ఆమ్లజని రహిత రక్తాలు జఠరికలో కలిసి మిశ్రమ రక్తంగా ఏర్పడతాయి.
- మిశ్రమ రక్తం మహాధమని ద్వారా శరీర భాగాలకు సరఫరా అవుతుంది.
- ఊపిరితిత్తులకు రక్తాన్ని సరఫరా చేస్తుంది కాబట్టి ఉభయచరాల గుండెను 'పుపుస హృదయం' అంటారు.
- ఉభయచరాల నుంచి అన్ని ఉన్నత స్థాయి జీవుల్లో (సరీసృపాలు, పక్షులు, క్షీరదాలు) రక్తం రెండుసార్లు హృదయాన్ని చేరుతుంది. కాబట్టి ఈ వ్యవస్థను 'ద్వివలయ రక్తప్రసరణ వ్యవస్థ' అంటారు.

> - చేపలు, ఉభయచరాలు, సరీసృపాలు, శీతల రక్త జంతువులు (Poikilothermic) రక్త ఉష్ణోగ్రత పరిసరాలను బట్టి మారుతుంది.
> - పక్షులు, క్షీరదాలు, ఉష్ణ రక్త జంతువుల (Homeothermic) ఉష్ణోగ్రత పరిసరాలను బట్టి మారకుండా స్థిరంగా ఉంటుంది.

సరీసృపాలు

- వీటిలో రెండు కర్ణికలు, ఒక అసంపూర్తిగా విభజన చెందిన జఠరిక కలిగిన హృదయం ఉంటుంది.
- ద్వివలయ ప్రసరణ, పుపుస హృదయం సరీసృపాల్లో కన్పిస్తుంది.

పక్షులు, క్షీరదాలు

- పూర్తిగా నాలుగు గదుల హృదయం ఉంటుంది. రెండు కర్ణికలు, రెండు జఠరికలుంటాయి. వీటిలో సిరాసరణి ఉండదు.
- మహాసిరలు ప్రత్యక్షంగా కుడి జఠరిక లోనికి తెరుచుకుంటాయి.
- పుపుస హృదయం, ద్వివలయ ప్రసరణ కలిగి ఉంటాయి.

గతంలో అడిగిన ప్రశ్నలు

1. వివిధ శరీర భాగాల నుంచి వచ్చిన రక్తంతో ప్రారంభించి క్షీరదాల హృదయంలోని నాలుగు గదుల్లో రక్తప్రసరణ సరైన క్రమం (డీఎస్సీ-2012)
   ఎ) ఎడమ కర్ణిక బి) కుడి కర్ణిక
   సి) ఎడమ జఠరిక డి) కుడి జఠరిక
   1) సి, ఎ, డి, బి 2) ఎ, డి, బి, సి
   3) బి, ఎ, డి, సి 4) బి, డి, ఎ, సి
2. సరిగా జతపరచని వాటిని గుర్తించండి? (డీఎస్సీ-2012)
   ఎ) సాలమండర్– 2 గదుల గుండె
   బి) కప్ప– 3 గదుల గుండె
   సి) కట్లకట్ల– 3 గదుల గుండె
   డి) పావురం – అసంపూర్తిగా విభజన చెందిన 4 గదుల గుండె
   1) ఎ, డి 2) ఎ, సి
   3) బి, సి 4) బి, డి
3. హిమోగ్లోబిన్‌లో ఉండేవి? డీఎస్సీ-2006
   1) వర్ణకం, ఐరన్, ఫోర్ఫైరిన్
   2) హీమ్, ఫోర్ఫైరిన్, వర్ణకం
   3) గ్లోబిన్, ఐరన్, హీమ్
   4) గ్లోబిన్, ఐరన్, ఫోర్ఫైరిన్
4. రెండు గదుల హృదయం గల జీవి? (డీఎస్సీ-2004)
   1) చేప 2) కప్ప
   3) బొద్దింక 4) వానపాము
5. కప్పలో సిరాసరణి దేనిలోకి తెరుచు కుంటుంది? (డీఎస్సీ-2004)
   1) కుడి జఠరిక 2) ఎడమ జఠరిక
   3) కుడి కర్ణిక 4) ఎడమ కర్ణిక
6. కిందివాటిలో సరైంది? (డీఎస్సీ-2004)
   1) పుపుసధమని ఆమ్లజని సహిత రక్తాన్ని ఊపిరితిత్తులకు తీసుకొని పోతుంది
   2) కుడి జఠరిక ఆమ్లజని సహిత రక్తాన్ని ఊపిరితిత్తులకు పంపుతుంది
   3) ఆమ్లజని రహిత రక్తం ఎడమ కర్ణికలోకి చేరుతుంది
   4) అన్ని శరీర భాగాల నుంచి ఆమ్లజని రహిత రక్తం కుడి కర్ణికలోనికి పంపుతుంది

సమాధానాలు

1) 4; 2) 1; 3) 4; 4) 1; 5) 3; 6) 4.

మాదిరి ప్రశ్నలు

1. బొద్దింకలో రక్తాన్ని హృదయంలోనికి పంపడానికి సహాయపడేవి?
   1) వాయునాళ కండరాలు
   2) పక్షాకార కండరాలు
   3) ఉరఃకుహర కండరాలు
   4) హృదయ కండరాలు
2. కిందివాటిలో ఏ రెండు ప్రవచనాలు సరికావు
   ఎ) కప్పలో 3 గదుల గుండె ఉంటుంది
   బి) పావురంలో 2 గదుల గుండె ఉంటుంది
   సి) కుక్కలో 4 గదుల గుండె ఉంటుంది
   డి) మొసలిలో 3 గదుల గుండె ఉంటుంది
   1) ఎ, బి 2) బి, సి
   3) బి, డి 4) ఎ, సి
3. ఉభయచరాల్లో మహాసిరలు కలిసి ఏర్పాటు చేసేది?
   1) కుడి కర్ణిక 2) ఎడమ కర్ణిక
   3) జఠరిక 4) సిరాసరణి
4. స్వేచ్ఛాయుత రక్తప్రసరణ వ్యవస్థలో ఏవి ఉంటాయి?
   1) రక్తనాళాలు, రక్తం 2) మొప్పలు, రక్తం
   3) కర్ణికలు, జఠరికలు
   4) గుండె, రక్త కోటరాలు
5. మెగాస్కోలెక్స్‌లో ఉండే పార్శ్వ హృదయాల సంఖ్య?
   1) 9 జతలు 2) 8 జతలు
   3) 7 జతలు 4) 6 జతలు
6. మిశ్రమ రక్తానికి సంబంధించి సరైన ప్రవచనం?
   1) చేప కర్ణిక, జఠరికల్లో మిశ్రమరక్తం ఉంటుంది
   2) పక్షుల సిరాసరణి ద్వారా మిశ్రమ రక్తం ప్రసారం అవుతుంది.
   3) ఉభయచరాల జఠరికలో మిశ్రమరక్తం ఏర్పడుతుంది.
   4) క్షీరదాల కర్ణికలో మిశ్రమరక్తం ఉంటుంది.
7. ద్వి ప్రసరణ రక్తప్రసరణ వ్యవస్థ కలిగిన జీవి?
   1) బొద్దింక 2) వానపాము
   3) కోతి 4) కోడి
8. వానపాములో సిరలు నిర్వహించే పనిని నిర్వర్తించే రక్తనాళం?
   1) పృష్ఠ రక్తనాళం 2) ఉదర రక్తనాళం
   3) మహాధమని 4) సిరాసరణి
9. కిందివాటిలో ఏ రెండు జతలు సరైనవి?
   ఎ) బొద్దింక – ఎరుపు రంగు రక్తం
   బి) మొసలి– 4 గదుల గుండె
   సి) సాలమండర్– సిరాసరణి
   డి) సరీసృపాలు– ఉష్ణరక్త జంతువులు
   1) ఎ, డి 2) బి, సి
   3) సి, డి 4) ఎ, బి
10. బొద్దింక రక్తప్రసరణను స్వేచ్ఛాయుత రక్తప్రసరణ వ్యవస్థగా పిలుస్తారు. ఎందుకంటే?
    1) రక్తం రక్తనాళాల్లో ప్రవహిస్తుంది
    2) ద్వి వలయ రక్తప్రసరణ జరుగుతుంది
    3) రక్తం శరీర కుహరంలో కోటరాల్లో ప్రవహిస్తుంది
    4) బొద్దింకలో గుండె భాగం ఉండదు
11. కిందివారిలో ఎవరు తెలిపిన ప్రవచనం సరికాదు?
    1) శ్రావణ్ – చేప గుండెను జలశ్వాస హృదయం అంటారు
    2) శ్రుతి – ఉభయచరాల్లో ఏక వలయ రక్తప్రసరణ ఉంటుంది
    3) శ్రేయ– పక్షులు ఉష్ణరక్త జంతువులు
    4) శ్రావ్య – వానపాములో తెల్లరక్తకణాలే ఉంటాయి
12. చేపల్లో ఏకవలయ రక్త ప్రసరణకు కారణం?
    1) 2 గదుల గుండె ఉండటం
    2) సిరాసరణి ఉండటం
    3) మొప్పల నుంచి రక్తం నేరుగా శరీర భాగాలకు వెళ్లడం
    4) చేపలు నీటిలో ఉండటం, శీతల రక్త జీవులు కావడం

సమాధానాలు

1) 2; 2) 3; 3) 4; 4) 4; 5) 2; 6) 3; 7) 3; 8) 1; 9) 2; 10) 3; 11) 2; 12) 3.

భారత విమానయాన పితామహుడెవరు?

వివిధ దేశాల మధ్య ప్రయాణించడానికి రోజులు, నెలల సమయం తీసుకునే పరిస్థితి నుంచి ప్రపంచంలోని ఏ సుదూర ప్రాంతానికైనా కేవలం ఒక రోజులోనే చేరగలగడాన్ని సుసాధ్యం చేసింది వాయు రవాణా. అమెరికాకు చెందిన రైట్ సోదరులు 1903లో తొలిసారిగా విమానాన్ని రూపొందించారు. ఈ విధంగా ప్రారంభమైన విమానయానం రవాణా వ్యవస్థ స్వరూపాన్నే పూర్తిగా మార్చేసింది.

గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

జాగ్రఫీ

భారతదేశం - వాయు రవాణా

ఆధునిక ప్రపంచంలో రవాణా వ్యవస్థలో వాయు రవాణా ప్రాముఖ పాత్ర పోషిస్తోంది. ఒక ప్రదేశం నుంచి మరొక ప్రదేశానికి తక్కువ సమయంలో ప్రయాణించడానికి, సరకుల రవాణాకు విమానాలు ఎంతగానో ఉపయోగపడుతున్నాయి. పశ్చిమ దేశాల నుంచి తూర్పు దేశాలకు వెళ్లే విమాన మార్గాలన్నీ మనదేశం మీదుగా వెళ్తున్నాయి. భారతదేశ శీతోష్ణస్థితి విమానయానానికి అనుకూలం.

భారతదేశంలో మొట్టమొదటి ఎయిర్ మెయిల్ సర్వీస్ 1911లో అలహాబాద్ - నైనిటాల్ మధ్య ప్రారంభమైంది. ఈ రెండు ప్రదేశాల మధ్య దూరం 10 కి.మీ. ఈ విమానాన్ని హెన్రీ ఫికిట్ నడిపాడు. మన దేశంలో 1911లోనే విమాన రవాణా ప్రారంభమైనప్పటికీ అది వ్యవస్థీకృతం కాలేదు. 1920లో 'టాటా సన్స్' సంస్థ కొన్ని ఎయిర్ డ్రోమ్‌లను ప్రారంభించింది. అప్పట్నుంచి మనదేశంలో విమాన రవాణా వ్యవస్థీకృతమైంది.

1932లో జె.ఆర్.డి.టాటా కరాచీ - ముంబై నగరాల మధ్య మొదటి విమానాన్ని నడిపారు. జె.ఆర్.డి.టాటాను భారతదేశ విమానయాన పితామహుడిగా వ్యవహరిస్తారు.

భారతదేశంలో విమాన సర్వీసుల ఏర్పాటు కోసం 1950లో 'రాజాధ్యక్ష' కమిటీని భారత ప్రభుత్వం నియమించింది. ఈ కమిటీ సూచనల ప్రకారం 1953లో వాయు రవాణాను జాతీయం చేశారు. 1953లో రెండు ఎయిర్ కార్పొరేషన్లను ప్రభుత్వం ఏర్పాటు చేసింది.

అవి:

1. ఎయిర్ ఇండియా (విదేశీ సర్వీసుల కోసం)
2. ఇండియన్ ఎయిర్‌లైన్స్ (స్వదేశీ సర్వీసుల కోసం)

మన దేశంలో 'వాయుదూత్' సర్వీసులను 1981లో ప్రవేశపెట్టారు. ప్రస్తుతం దేశంలోని వాయు రవాణాను కేంద్రప్రభుత్వ ఆధ్వర్యంలో, ప్రైవేటు సంస్థల భాగస్వామ్యంతో నిర్వహిస్తున్నారు. 1990 ఏప్రిల్‌లో దేశ విమాన రవాణాలో ప్రైవేట్ వైమానిక సంస్థలను అనుమతించడానికి 'ఓపెన్ స్కై' పాలసీని ప్రవేశపెట్టారు.

ఎయిర్ ఇండియా: ఇది ఖండాంతర విమానయాన సర్వీసులను నడుపుతుంది. ఎయిర్ ఇండియా మస్కట్ 'మహారాజా' దీన్ని 'ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా' నిర్వహించేది. ఈ సంస్థ అన్ని ఖండాల్లోని దాదాపు 90 దేశాలతో ఒప్పందాలు కుదుర్చుకుంది. ముఖ్యంగా అమెరికా, కెనడా, యూరప్, రష్యా, గల్ఫ్, తూర్పు ఆసియా, పశ్చిమాసియా, ఆఫ్రికా, ఆస్ట్రేలియాలకు సర్వీసులు నడుపుతోంది. వీటిలో గల్ఫ్‌రూటు లాభదాయకం.

- భారతదేశంలో ఎక్కువ అంతర్జాతీయ విమానాశ్రయాలు కేరళలో ఉన్నాయి.



- దేశంలో విమానాశ్రయాలు గుజరాత్‌లో ఎక్కువగా ఉన్నాయి.

ఇండియన్ ఎయిర్‌లైన్స్: ఈ సంస్థ దేశంలోని వివిధ నగరాలు, పట్టణాలకు విమానాలను నడుపుతోంది. 19 పొరుగు దేశాలకు సర్వీసులను అందిస్తోంది. 2005లో ఇండియన్ ఎయిర్‌లైన్స్ తన బ్రాండ్ పేరును 'ఇండియన్'గా మార్చింది. దీని మస్కట్ కోణార్క్ సూర్య దేవాలయంలోని రథ చక్రం. దేశంలోని సాధారణ విమానాశ్రయాలను 'నేషనల్ ఎయిర్‌పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా' నిర్వహించేది.

వాయుదూత్: సరకుల రవాణా కోసం 1981 లో దీన్ని ప్రారంభించారు. ఇండియన్ ఎయిర్‌లైన్స్ విమానాలు నడవని ప్రాంతాలు, ముఖ్యంగా దట్టమైన అడవులున్న ఈశాన్య ప్రాంతాలకు ప్రయాణికుల కోసం ఈ సర్వీసులను ఉపయోగించారు. దీన్ని 1993లో ఇండియన్ ఎయిర్‌లైన్స్‌లో విలీనం చేశారు.

పవన్‌హన్స్ లిమిటెడ్: దీన్ని 1985 అక్టోబర్ 15న స్థాపించారు. దీని కేంద్ర కార్యాలయం ఢిల్లీలో ఉంది. పెట్రోలియం స్థావరాలకు సహాయం కోసం ఇది ఏర్పాటైంది. తర్వాతి కాలంలో కొండ ప్రాంతాలు, మారుమూల ప్రాంతాలు, ఎన్టీపీసీ, గెయిల్, బీఎస్ఎఫ్ లాంటి సంస్థలకు సేవలందించేందుకు విస్తరించారు.

- ఇందిరా గాంధీ రాష్ట్రీయ ఉడాన్ అకాడమీలో పైలట్లకు శిక్షణ ఇస్తారు. ఇది ఉత్తర ప్రదేశ్‌లోని ఫుర్‌సత్‌గంజ్‌లో ఉంది. మినిస్ట్రీ ఆఫ్ సివిల్ ఏవియేషన్ ఆధ్వర్యంలో ఇది పనిచేస్తోంది.
- బెంగళూరులోని హిందుస్తాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్ సంస్థ విమానాల తయారీ, రిపేర్లను నిర్వహిస్తోంది.

ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా: నేషనల్ ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ, ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియాలను విలీనం చేసి ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియాను 1995 ఏప్రిల్ 1న ఏర్పాటు చేశారు.

- ప్రస్తుతం ఎయిర్ పోర్టు అథారిటీ ఆఫ్ ఇండియా(AAI) కింద మూడు సంస్థలు పనిచేస్తున్నాయి. అవి
  1. ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్ డివిజన్
  2. నేషనల్ ఎయిర్‌పోర్ట్ డివిజన్
  3. ఇంటర్నేషనల్ సివిల్ ఏవియేషన్ ఆర్గనైజేషన్
- 1990లో ప్రవేశపెట్టిన ఓపెన్ స్కై పాలసీ వల్ల ప్రైవేటు రంగంలో 8 ప్యాసింజర్ ఎయిర్‌వేస్ ప్రారంభమయ్యాయి. అవి
  1. జెట్ ఎయిర్‌వేస్
  2. కింగ్ ఫిషర్ ఎయిర్‌లైన్స్
  3. ఇండిగో ఎయిర్‌వేస్ 4. స్పైస్‌జెట్
  5. జెట్‌లైట్ 6. గో ఎయిర్‌వేస్
  7. పారామౌంట్ ఎయిర్‌వేస్
  8. దక్కన్ ఏవియేషన్

అంతర్జాతీయ విమానాశ్రయాలు

1. ఇందిరాగాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం (పాతపేరు పాలెం)	న్యూఢిల్లీ
2. నేతాజీ సుభాస్ చంద్రబోస్ అంతర్జాతీయ విమానాశ్రయం (పాతపేరు - డమ్‌డమ్)	కోల్‌కతా
3. ఛత్రపతి శివాజీ అంతర్జాతీయ విమానాశ్రయం (పాతపేరు శాంతాక్రాజ్, సహారా)	ముంబై (మహారాష్ట్ర)
4. అన్నాదురై అంతర్జాతీయ విమానాశ్రయం (పాతపేరు మీనంబాకం)	చెన్నై (తమిళనాడు)
5. నిడుంబస్సేరి అంతర్జాతీయ విమానాశ్రయం	తిరువనంతపురం (కేరళ)
6. గురురామ్‌దాస్‌జీ/రాజాసాన్సీ అంతర్జాతీయ విమానాశ్రయం	అమృత్‌సర్ (పంజాబ్)
7. రాజీవ్‌గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం	శంషాబాద్ (హైదరాబాద్)
8. లోకప్రియ గోపీనాథ్ బర్డోలియా అంతర్జాతీయ విమానాశ్రయం	గువాహటి (అసోం)
9. సర్దార్ వల్లభభాయ్ పటేల్ అంతర్జాతీయ విమానాశ్రయం	అహ్మదాబాద్(గుజరాత్)
10. వీర సావర్కర్ అంతర్జాతీయ విమానాశ్రయం	పోర్ట్‌బ్లెయిర్ (అండమాన్ నికోబార్ దీవులు)
11. దేవి అహల్యాబాయి అంతర్జాతీయ విమానాశ్రయం	ఇండోర్ (మధ్యప్రదేశ్)
12. డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ అంతర్జాతీయ విమానాశ్రయం	నాగపూర్ (మహారాష్ట్ర)
13. గయా అంతర్జాతీయ విమానాశ్రయం	గయ (బీహార్)
14. బెంగళూరు/ దేవనహళ్లి అంతర్జాతీయ విమానాశ్రయం	బెంగళూరు (కర్ణాటక)
15. రాజాభోజ్ అంతర్జాతీయ విమానాశ్రయం	భోపాల్ (మధ్యప్రదేశ్)
16. జైపూర్ అంతర్జాతీయ విమానాశ్రయం	జైపూర్ (రాజస్థాన్)
17. వాస్కోడగామా అంతర్జాతీయ విమానాశ్రయం	పనాజి (గోవా)

మాదిరి ప్రశ్నలు

1. ఇందిరా గాంధీ రాష్ట్రీయ ఉడాన్ అకాడమీ ఎక్కడ ఉంది?
   1) ఢిల్లీ 2) ఝాన్సీ
   3) చిత్తరంజన్ 4) ఫుర్‌సత్‌గంజ్
2. పవన్‌హన్స్ లిమిటెడ్ హెలికాప్టర్ సర్వీసుల్ని ఎప్పుడు ప్రారంభించారు?
   1) 1953 2) 1985
   3) 1990 4) 1995
3. అన్నాదురై అంతర్జాతీయ విమానాశ్రయం ఎక్కడ ఉంది?
   1) న్యూఢిల్లీ 2) కొచ్చిన్
   3) చెన్నై 4) కోల్‌కతా
4. భారత ప్రభుత్వం వాయు రవాణాను ఏ సంవత్సరంలో జాతీయం చేసింది?
   1) 1953 2) 1948
   3) 1969 4) 1990
5. దేవి అహల్యాబాయి అంతర్జాతీయ విమానాశ్రయం ఎక్కడ ఉంది?
   1) ఇండోర్ 2) పోర్ట్‌బ్లెయిర్
   3) అమృత్‌సర్ 4) గౌహతి
6. కింది వాటిలో ఏ అంతర్జాతీయ విమానాశ్రయానికి డమ్‌డమ్ అనే పేరుండేది?
   1) ఇందిరా గాంధీ
   2) నేతాజీ సుభాష్ చంద్రబోస్
   3) ఛత్రపతి శివాజీ
   4) రాజీవ్ గాంధీ
7. వాయు రవాణాలో ఓపెన్ స్కై పాలసీని ప్రవేశపెట్టిన సంవత్సరం?
   1) 1985 2) 1953
   3) 1990 4) 1995
8. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ అంతర్జాతీయ విమానాశ్రయం ఏ నగరంలో ఉంది?
   1) ముంబై 2) నాగపూర్
   3) జైపూర్ 4) పుణే
9. ఎయిర్‌పోర్టు అథారిటీ ఆఫ్ ఇండియాను ఏ సంవత్సరంలో ఏర్పాటు చేశారు?
   1) 1990 2) 1985
   3) 1981 4) 1995

సమాధానాలు

1) 4 2) 2 3) 3 4) 1
5) 1 6) 2 7) 3 8) 2
9) 4

గతంలో అడిగిన ప్రశ్నలు

1. హైదరాబాద్‌లోని నూతన అంతర్జాతీయ విమానాశ్రయానికి ఎవరి పేరు పెట్టారు? **(Police Constables-2009)**
   1) ఇందిరా గాంధీ
   2) మహాత్మా గాంధీ
   3) రాజీవ్ గాంధీ
   4) జవహర్‌లాల్ నెహ్రూ
2. ఛత్రపతి శివాజీ అంతర్జాతీయ విమానాశ్రయం ఉన్న నగరం? **(Prohibition & Excise Constable-2013)**
   1) ముంబై 2) చెన్నై
   3) పుణే 4) అహ్మదాబాద్
3. **జతపరచండి. (S.I.-2011)**

పట్టిక-1 విమానాశ్రయం	పట్టిక-2 స్థలం
ఎ. మీనంబాకం	1. ఢిల్లీ
బి. సాంతాక్రజ్	2. కోల్‌కతా
సి. ఇందిరాగాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం	3. చెన్నై
డి. డమ్‌డమ్	4. ముంబై

కోడ్‌లు:

	ఎ	బి	సి	డి
1)	1	4	3	2
2)	3	4	1	2
3)	3	2	1	4
4)	2	3	4	1
5)	1	2	4	3

4. కిందివాటిలో ఏ రాష్ట్రంలో ఎక్కువ డొమెస్టిక్ ఎయిర్‌పోర్ట్‌లు ఉన్నాయి? **(Deputy Jailors-2012)**
   1) కర్ణాటక 2) తమిళనాడు
   3) ఆంధ్రప్రదేశ్ 4) గుజరాత్

సమాధానాలు

1) 3; 2) 1; 3) 2; 4) 4

Idea of group discussion is..

BANK EXAMS

ENGLISH



Directions (Q.No. 1 - 5): Read each sentence to find out whether there is any grammatical mistake/ error in it. The error, if any, will be in one part of the sentence. Mark the number of that part with error as your answer. If there is 'No error', mark (5) as your answer.

1. Any misinterpretation of a message (1)/ leads to communication breakdown (2)/ and creates confusion (3)/ and misunderstanding. (4)/ No error (5)
2. Organizational competent (1)/ is the ability (2)/ to organize information (3)/ in a logical and structured way. (4)/ No error (5)
3. In jet propulsion engines, (1)/ gas turbines are used (2)/ only to provide the work requires (3)/ for the compressor of the engine. (4)/ No error (5)
4. When you do use (1)/ the remote control for a long time, (2)/ take out the batteries (3)/ and store them in a cool, dry place. (4)/ No error (5)
5. He has submitted (1)/ the report (2)/ before he received (3)/ the memo. (4)/ No error (5)

Directions (Q.No. 6 - 10): Which of the phrases (1), (2), (3), and (4) given below each sentence should replace the phrase underlined in the sentence to make it grammatically correct? If there is no error mark (5) No correction required as your answer.

6. Ionic compounds can be separate into their constituent ions with little effort.
   1) sieved 2) segregated
   3) filtered 4) dissociated
   5) no correction required
7. Some of the more powerful microcomputers have all or most of the quality of earlier minicomputers.
   1) resemblances
   2) characteristics 3) features
   4) properties
   5) no correction required
8. A compound microscope is a device that is used to produce very large enlarged appearance.
   1) ramification 2) upshot
   3) magnifications 4) disclosure
   5) no correction required
9. The Space Age began on October 4, 1957, when Russia started Sputnik I into orbit.
   1) experimented 2) launched
   3) send 4) devised
   5) no correction required
10. X-rays are high energy photons, which can knock an atom outside of a molecule.
    1) out 2) along 3) inside 4) within
    5) no correction required

Directions (Q.No. 11 - 15): Rearrange the following six sentences (A), (B), (C), (D), (E) and (F) in a proper sequence to form a meaningful paragraph and then answer the questions given below.

A) Crude oil is a mixture of different compounds that boil at different temperatures.
B) The remaining and heaviest fraction is the residue, which supplies waxes, asphalts and some fuel oils.
C) The fraction obtained by boiling between about 140 degrees and 320 degrees C is termed kerosene.
D) The next fraction, normally refined into gasoline, boils between about 30 degrees and 200 degrees C.
E) The lightest fraction consists of gases that boil below atmospheric temperature.
F) The fraction boiling above about 320 degrees C is commonly refined into heating, diesel and lubricating oils.

11. What is the SECOND sentence after rearrangement?
    1) A 2) B 3) C 4) D 5) E
12. What is the THIRD sentence after rearrangement?
    1) A 2) B 3) D 4) F 5) E
13. What is the FIFTH sentence after rearrangement?
    1) A 2) B 3) D 4) E 5) F
14. What is the FIRST sentence after rearrangement?
    1) B 2) A 3) C 4) D 5) E
15. What is the LAST sentence after rearrangement?
    1) A 2) B 3) C 4) D 5) F

Directions (Q. No. 16 - 25): Each question below has a blank/ two blanks, each blank indicating that something has been omitted. Choose the word/ set of words from the five options for each blank that best fits the meaning of the sentence as a whole.

16. In a huge ____ to the government and political parties in Tamil Nadu, the Supreme Court stayed the centre's ______ to holding of Jallikattu during Pongal.
    1) setback, decision
    2) decision, proposal
    3) opposition, recession
    4) retention, argument
    5) format, demand
17. The _____ attempted to storm the mission building during the attack.
    1) assailants 2) goon
    3) attacker 4) janitors
    5) scrutinizers
18. I was ____ to start a production house of my own, but the project never ____ because astrologers advised me not to go ahead with production.
    1) possibly, started
    2) Supposed, took off
    3) probably, crashed
    4) thought, worked
    5) naturally, rendered
19. Through telephone lines, an engineer with a personal computer can ____ data in the memory of other computers all ____ the world.
    1) access, over 2) possess, across
    3) acquire, along
    4) pertain, among
    5) grab, between
20. The warehouse supervisor can likewise use a personal computer with an _____ program to keep personal records, and those in the large computer's memory, _____.
    1) record, record
    2) inventory, updated
    3) list, recorded
    4) register, stored
    5) check, retrieved
21. Aeroplanes have the ___ of being dangerous and even the hardened travelers are _____ by them.
    1) probability, confused
    2) remark, sick
    3) reputation, intimidated
    4) statement, rescued
    5) possibility, sad
22. The very idea of group discussion is _____ on the concept of cooperation, where all members are _____ to work as a team.
    1) revolving, accepting
    2) based, expected
    3) rotating, accepted
    4) producing, entered
    5) removed, ejected
23. Air pollution has been a major _____ not only to the quality of environment but also to the human health.
    1) problem 2) concern
    3) disaster 4) threat
    5) coincidence
24. We could complete the assignment if it _____ not so late.
    1) had 2) was
    3) would 4) were
    5) have
25. Having just eaten his dinner, he _____ to have even a soft drink.
    1) was ready 2) wasn't
    3) not supposed
    4) was not ready
    5) almost ready

Directions (Q.No. 26 - 30): Read the following passage carefully and answer the questions given below it. Certain words have been printed in **bold** to help you locate them while answering some of the questions.

It was through Jimmy John that I discovered that a vocabulary is an outgrowth of experience. As fast as he learned some activity, he acquired without effort the vocabulary that went with it. From the pony he learned saddle, bridle, stirrup, blacksmith and so on, although to begin with he had **hidden** from our pet in terror, with absolutely no words to describe anything about him. After a summer of sailing he unconsciously acquired nautical terms as a matter of course. But when we tried to increase his vocabulary by making him memorize words **arbitrarily**, he became confused and mixed them all up and misused them amusingly. The first time he saw a funeral procession he asked, "What's that" and someone said, "It's a hearse". Now it happened that Jimmy had not been looking at the hearse when this was said. His attention was focused on an Army officer in the procession. Sometime later he announced that there was a hearse in front of our house and when we peered out, rather **alarmed**, we saw a soldier standing there talking calmly to someone. No hearse anywhere. I than realized that you can't make a child merely memorize words; he has to live them, and therefore many experiences are vital to the growth of a child's vocabulary. Jimmy John educated me more than I ever educated him!

26. Which of the two statements is true according to the passage?
    a) A child with a poor vocabulary is not very intelligent.
    b) Children's vocabulary comes from experience - they have to live the words they learn.
    1) only a 2) only b
    3) both a & b 4) neither a nor b
    5) either a or b
27. Identify the false statement:
    1) Children's vocabulary comes from experience.
    2) A child with poor vocabulary will not pass aptitude tests.
    3) Children educate their parents more often than the other way round.
    4) When we try to increase a child's vocabulary by making him memorize words, he becomes confused.
    5) Vocabulary is an outgrowth of experience.
28. The antonym of **hidden** is
    1) conceal 2) veil 3) secret
    4) divulge 5) expect
29. The antonym of **arbitrarily** is
    1) subjectively 2) personally
    3) individually
    4) instinctively 5) logically
30. The synonym of **alarmed** is
    1) startled 2) stirrup
    3) sensitized 4) scrutinized
    5) overwhelmed

Directions (Q. No. 31 - 40): In the following passage there are blanks, each of which has been numbered. These numbers are printed below the passage and against each, five words/ phrases are suggested, one of which fits the blank appropriately. Find out the appropriate word/ phrase in each case and mark your answer.

Seeing is a complex act ____ (31) the optical system of the eye takes light ____ (32) from the object and forms an ____ (33) on a light sensitive layer, the retina. This ____ (34) energy ____ (35) a photochemical process is transformed into nerve energy and ____ (36) through the visual pathways to the brain. In the ____ (37) sense seeing is not complete until what is seen is interpreted ____ (38) the observer. This ____ (39) is based on past experience; hence, to a considerable ____ (40) seeing is a learned skill.

31. 1) wherein 2) where
    3) where in 4) where upon
    5) where on
32. 1) originate 2) emanating
    3) derive 4) radiate
    5) emit
33. 1) copy 2) picture
    3) image 4) icon
    5) figure
34. 1) beam 2) glow
    3) brightness 4) light
    5) darkness
35. 1) during 2) thorough
    3) throw 4) trough
    5) through
36. 1) passes 2) pass
    3) is passing 4) passed
    5) passes by
37. 1) broad 2) broadest
    3) wide 4) large
    5) broader
38. 1) through 2) with 3) by
    4) near 5) next
39. 1) construal 2) reading
    3) version 4) interpretation
    5) elucidation
40. 1) size 2) area
    3) coverage 4) degrees
    5) extent

KEY

1) 5; 2) 1; 3) 3; 4) 1; 5) 1;
6) 4; 7) 3; 8) 3; 9) 2; 10) 1;
11) 5; 12) 3; 13) 5; 14) 2; 15) 2;
16) 1; 17) 1; 18) 2; 19) 1; 20) 2;
21) 3; 22) 2; 23) 2; 24) 4; 25) 4;
26) 2; 27) 2; 28) 4; 29) 5; 30) 1;
31) 1; 32) 2; 33) 3; 34) 4; 35) 5;
36) 1; 37) 2; 38) 3; 39) 4; 40) 5..